సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 44

మంగళవారం 6-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



పురుషులకు సరోగసీ హక్కు ఉండదా?

అమ్మా.. నాన్నా.. అని పిలిపించుకోవాలని ఉవ్విళ్లూరని వాళ్లెవరు? కానీ మన దేశంలోని సరోగసీ యాక్ట్ -2021 అందరికీ ఆ అవకాశా న్నివ్వట్లేదు. విడాకులు తీసుకున్న పురుషులకు, ట్రాన్స్‌పీపుల్‌కి సరోగసీ ద్వారా పేరెంట్ అయ్యే చాన్స్‌కి నో అంటోంది! - ||లో



పేరెంట్‌హుడ్‌ని ఆస్వాదించని వారెవరు? అమ్మా.. నాన్నా.. అని పిలిపించుకోవాలని ఉవ్విళ్లూరని వాళ్లెవరు?
కానీ మన దేశంలోని సరోగసీ యాక్ట్ -2021 అందరికీ ఆ అవకాశాన్నివ్వట్లేదు.
విడాకులు తీసుకున్న పురుషులకు, ట్రాన్స్‌పీపుల్‌కి సరోగసీ ద్వారా పేరెంట్ అయ్యే చాన్స్‌కి నో అంటోంది!
దీన్నే సవాలు చేస్తూ కర్ణాటకకు చెందిన 45 ఏళ్ల డెంటల్ సర్జన్..
సరోగసీ ద్వారా ఒంటరి పురుషులకూ తండ్రి అయ్యే భాగ్యం కల్పించమంటూ
సుప్రీంకోర్ట్‌లో దావా వేశాడు. ఇప్పుడది చర్చగా మారింది..
అడ్వకేట్లు, జెండర్ రైట్స్ కోసం పనిచేస్తున్న యాక్టివిస్ట్‌లూ దీనిమీద తమ అభిప్రాయాలను చెబుతున్నారు.

పురుషులకు సరోగసీ హక్కు ఉండద్దా!

సరోగసీ.. గర్భంలో బిడ్డను మోసే ఆరోగ్యపరిస్థితులు లేని వాళ్లకు ఆధునిక వైద్యశాస్త్రం అందించిన వరం! ఇది ఒంటరి పురుషులు, ట్రాన్స్ పీపుల్‌కీ పేరెంట్ అయ్యే అదృష్టాన్ని కలిగిస్తోంది. అలా బాలీవుడ్‌లో ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్ పెళ్లి చేసుకోకుండానే కవల పిల్లలకు తండ్రి అయ్యాడు. అలాగే నటుడు తుషార్ కపూర్ కూడా ఓ బిడ్డను కన్నాడు. అయితే అది 2021కి ముందు. ఈ చట్టం వచ్చాక పురుషులకు ఆ వెసులుబాటును తీసేసింది. ఒంటరి మహిళలు (విడాకులు పొందిన వారు, అలాగే వితంతువులు), స్త్రీ పురుషులు మాత్రమే పెళ్లి చేసుకున్న జంటలకూ మాత్రమే ఈ చట్టం పేరెంట్స్ అయ్యే అవకాశాన్ని కల్పిస్తోంది. దీనిమీద సమాజంలోని పురుషులు సహా ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీలోనూ అసంతృప్తి ఉంది. విడాకులు పొందిన స్త్రీకి సరోగసీ ద్వారా తల్లి అయ్యే హక్కు ఉన్నప్పుడు, విడాకులు పొందిన పురుషుడికి ఎందుకు ఉండకూడదు? ఇది చట్టం చూపిస్తున్న వివక్ష తప్ప ఇంకోటి కాదని కర్ణాటక డెంటల్ సర్జన్ వాదన. పిల్లల్ని కనాలా వద్దా అనే చాయిస్ స్త్రీకెప్పుడూ ఇవ్వని ఈ సమాజంలో.. ఒంటరి పురుషులు, ట్రాన్స్ పీపుల్‌ని అనుమతించడం లేదు సరికదా... పురుషుడు సంపాదించాలి, స్త్రీ ఇంటిని చూసుకోవాలనే లింగవివక్షను ప్రేరేపించే మూస ధోరణిని ప్రోత్సహిస్తోందని జెండర్ యాక్టివిస్ట్‌ల అభిప్రాయం. కారా (సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ) నివేదికలను బట్టి ఒంటరి పురుషులకు దత్తత తీసుకునేందుకు అనుమతించినవీ, అలాగే.. మగవాళ్లు కూడా పిల్లల్ని పెంచగలరని నిరూపించిన ఉదాహరణలున్నాయి. కాబట్టి డెంటల్ సర్జన్ పిటిషన్‌లో న్యాయం ఉందని అంటున్నారు యాక్టివిస్ట్‌లు. అంతేకాదు అతని ఈ పోరాటం ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీకి ఒక ఊతమవుతుందని.. లింగ అసమానతలను రూపుమాపే ప్రయత్నానికీ ఒక అడుగు పడుతుందనే ఆశనూ వ్యక్తం చేస్తున్నారు.

– సరస్వతి రమ

వివక్ష చూపిస్తోంది

డైవర్స్ తీసుకున్న మగవారికి, ఒంటరి పురుషులకు, స్వలింగ సంపర్కులకు, ట్రాన్స్ జెండర్స్‌కి సరోగసి పద్ధతిలో పిల్లలని కనడాన్ని సరోగసీ చట్టం నిషేధించింది. ఈ చట్టంలోని సెక్షన్ ...లు ఈ నిబంధన విధించాయి. ఈ చట్టం ప్రకారం కేవలం విడాకులు పొందిన లేదా వితంతువులకు, హెటిరో సెక్సువల్ దంపతులకు మాత్రమే సరోగసీ ద్వారా పిల్లలని కనే హక్కు ఉంది. ఒంటరి పురుషుడికి ఆడపిల్లను దత్తత తీసుకునే వీలు లేనప్పటికీ, జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 57, హిందూ అడాప్షన్ – మెయింటెనెన్స్ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం ఒంటరి/విడాకులు తీసుకున్న పురుషుడికి కూడా పిల్లలను దత్తత తీసుకునే హక్కు ఉన్నది. సరోగసీ చట్టం ఇందుకు భిన్నంగా ఉండటం రాజ్యాంగం కల్పించిన సమానత్వం, జీవించే స్వేచ్ఛ హక్కుల స్ఫూర్తికి వ్యతిరేకమే! ఇతర దేశాలు చాలామటుకు స్త్రీ పురుషుల మధ్య సరోగసీ పద్ధతిలో పిల్లల్ని కనటం పై సమాన హక్కులే కల్పించాయి.



–శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

ఆ అవకాశం, వాతావరణం ఉన్నాయా?

ప్రతి ఒక్కరికీ పేరెంట్‌హుడ్‌ను ఆస్వాదించే హక్కు ఉంది. ఆ హక్కు కోసం కర్ణాటక డెంటల్ సర్జన్ న్యాయ పోరాటంలో తప్పులేదు. సపోర్ట్ కూడా చేస్తాను. అయితే వ్యక్తిగతంగా మాత్రం అందులో నాకు భిన్నమైన అభిప్రాయం ఉంది. అడుగడుగునా అసమానతలు, వివక్ష, అభద్రతలున్న ఈ సమాజంలో పుట్టబోయే పిల్లలను భద్రంగా కాపాడుకోగలమా? మనముందున్న సెక్సువల్ ఐడెంటిటీలనే గుర్తించి, గౌరవించడానికి సిద్ధంగా లేము. ఈ నేపథ్యంలో పుట్టబోయే పిల్లల భవిష్యత్ ఏంటీ? వాళ్లు చక్కగా పెరిగే అవకాశం, వాతావరణం ఉన్నాయా అనే విషయంలోనే నా భయం, ఆందోళన అంతా!



– బోయపాటి విష్ణు తేజ,
చైల్డ్ రైట్స్ యాక్టివిస్ట్

స్టీరియోటైప్స్‌ని బలపరుస్తోంది..



పేరెంట్‌హుడ్ అనేది ఒక జెండర్‌కి మాత్రమే పరిమితమైనది కాదు. పేరెంట్ అవ్వాలని ఆశపడే వాళ్లందరూ ఆ హక్కును వినియోగించుకునే అవకాశం ఉండాలి. కొంతమంది మగవాళ్లు పేరెంట్ కావాలనుకున్నా ఇలాంటి చట్టాల వల్ల పేరెంట్‌హుడ్ చాయిస్‌ని కోల్పోతున్నారు. స్టీరియోటైప్స్ కొన్నిటిని ఈ చట్టం బలపరుస్తోంది. సింగిల్‌గా ఉన్న ఆడవాళ్లకు, హెటరో సెక్సువల్ ఫ్యామిలీస్‌కి మాత్రమే వెసులుబాటు కల్పిస్తూ! సింగిల్ ఉమెన్‌కి ఎందుకిచ్చిందంటే కేర్ గివింగ్ అనే లక్షణం సహజంగానే వాళ్లకుంటుంది కాబట్టి అనే. అంటే ఈ రెండు స్టీరియోటైప్స్‌ని ఆ చట్టం బలపరుస్తున్నట్టే కదా! వివక్షే కాకుండా స్టీరియోటైప్స్‌నీ బలపరుస్తున్నట్టున్న ఈ చట్టాన్ని చాలెంజ్ చేయడం మంచిదే! పురుషుడు సంపాదిస్తాడు, స్త్రీ ఇల్లు చూసుకుంటుంది లాంటి జెండర్ రోల్స్‌ను ఈ చట్టం బలపరుస్తోంది. ఈ చట్టం వల్ల ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీస్‌కీ నష్టమే! ఏమైనా ఈ చట్టంలో మార్పులు రావాలి. ఎక్స్‌ప్లాయిటేషన్‌ను ఆపేలా చట్టాలుండాలి కానీ.. పేరెంట్‌హుడ్ కావాలనుకునే వారిని నిరుత్సాహపరచేలా కాదు.

– దీప్తి సిర్ల,
దళిత్ అండ్ జెండర్ యాక్టివిస్ట్





పిల్లలకు ట్రంప్, మస్క్, జుకర్‌బర్గ్ ఎవరో తెలుసు.
ఆవాలు, గసగసాలు, మిరియాలు కూడా తెలియాలి.
అబ్బాయిలు, అమ్మాయిలు
వంట గదిలోకి రాకుండా
చదువుకోవాలని భావించడం మంచిదేకాని
ఉప్పుకూ చక్కెరకూ తేడా తెలియకపోతే కష్టం.
12 ఏళ్లు వచ్చే సరికి తల్లికి వంటలో
సాయం చేయడమే కాదు వంట గది రాజ్యాంగం
పిల్లలకు పరిచయం కావాలి.
పదహారేళ్లకు రొట్టెలు, అన్నం, రెండు రకాల
కూరలు చేయడం వస్తే పిల్లలు ఎక్కడైనా
ఆహార నిర్భర్‌గా ఉండగలరు.
ఈ వేసవిలో కిచెన్ క్లాసెస్ మొదలుపెట్టండి.

కిచెన్‌లో ఒక రోజు

'కన్నా... ఫ్రిజ్‌లో నుంచి ఎగ్స్ తీసుకురా' అన్నప్పటి నుంచి పాఠం మొదలవుతుంది. ఎగ్స్‌ను ఫ్రిజ్ నుంచి తెచ్చి పగలకుండా కిచెన్ ప్లాట్‌ఫామ్ మీద పెడితే పరీక్ష పాసైనట్టే. 'రవ్వ ఏ డబ్బాలో ఉందో చూడు' అన్నప్పుడు చిన్న స్టూల్ వేసుకుని కప్‌బోర్డ్ తెరిచి అన్ని డబ్బాలు పరీక్షించాల్సిందే. ఒకదానిలో తెల్లగా పొడి ఉంటుంది. అది గోధుమ పిండి. ఒకదానిలో లేత పసుపురంగు పొడి ఉంటుంది. అది శనగ పిండి. ఒకటి తెరవగానే అమ్మో.. అది కారప్పొడి. చివరకు రవ్వ దొరుకుతుంది. బరకగా ఉండే ఆ రవ్వతో ఏం చేస్తారో పిల్లలకు తెలుసు. ఎలా చేయాలో తెలియాలంటే ఈ వేసవిలో అప్పుడప్పుడు కిచెన్‌లో గడపనివ్వండి.



'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు ఎన్ని ర్యాంకులు తెచ్చినా డొనేషన్ లేని సీట్లు తెచ్చినా క్యాంపస్ సెలక్షన్ భారీ జీతానికి కుదిరినా అంతిమంగా తినాల్సింది అన్నమే. అది వండుకోవడం రావాలి ఫస్టు. ఎసట్లో అన్నం వండటానికి ఓపిక లేనప్పుడు రైస్ కుక్కర్‌లో ఎంత బియ్యం, ఎన్ని నీళ్లతో ఎలా పెట్టాలో తెలిస్తే చాలు జీవితాంతం సగం చింత తీరినట్టే. మిగిలిన సగం.. బయట నుంచి కర్రీ తెచ్చుకోవచ్చుగా. పెద్దలు ఏం చెప్తారంటే రెండు కూరలు చేయడం నేర్చుకుంటే చాలు నిశ్చింతగా బతకొచ్చు అని. నిజం. వంట తెలిసిన వారు ఆకలైతే ఇంట్లో ఉంటారు. లేదంటే బజార్లో పడతారు. బజారు తిండి తింటారు.

వంట కూడా ఒక శాస్త్రమా? అవును వంటంతా మేథమెటిక్సే. ఎన్ని గ్లాసుల బియ్యం, ఎన్ని చెమ్చాల నూనె, ఎంతమందికి ఎన్ని వంకాయలు కోయాలి, ఎన్ని బెండకాయలు సిద్ధం చేసుకోవాలి, ఎన్ని పదార్థాలు వండితే కడుపు నిండుతుంది... లెక్కలే లెక్కలు. 'ఉప్పు తగినంత'... అనే మాట 'పై'ను డిఫైన్ చేయడంతో సమానం. 'తగినంత ఉప్పు' వేయడం తెలిస్తే మొత్తం గణితాన్ని జయించినట్టే.

వంట చేయడం పిల్లలకు నేర్పిస్తే వంట వారికి ఓర్పు నేర్పిస్తుంది. వైనం నేర్పిస్తుంది. వొండిన వంట ఎంత కష్టపడితే తినడానికి రెడీ అవుతుందో తెలిసి అన్నం, కూరలు వృథా చేయరు. ఎదుటివారు వండిన దానికి వంకలు పట్టరు. వంటలో బయాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్సు ఉంటాయి. నిలువు కోతలు, అడ్డుకోతలు తెలుస్తాయి. విడగొట్టి కలపడమూ అందుకు కేటలిస్టులను వాడడమూ తెలుస్తుంది. వంట ఏకాగ్రతను నేర్పిస్తుంది. మంట హై ఎప్పుడు పెట్టాలి, లో ఎప్పుడు పెట్టాలి... ఇవి తెలిస్తే నిజ జీవితంలో ఉద్వేగాలు కూడా హై, లో తెలుస్తాయి.

పిల్లలు వంట నేర్చే సమయంలో పెద్దలు కచ్చితంగా ఉండాలి. వారు చేస్తూ ఉండగా మాటసాయం అందిస్తూ ఉండాలి. వంట చేస్తూ కబుర్లాడుకుంటే పిల్లల గురించి పెద్దలకు పెద్దల గురించి పిల్లలకు తెలుస్తుంది. బంధంలో రుచి వస్తుంది. జీవితం రుచి తెలుస్తుంది.

వేసవి సెలవులు వచ్చేది పిల్లల అరుపులు, కేరింతలకే కాదు... వారి చేతి గరిట చప్పుళ్ల కోసం కూడా.

నలబాల పాకం ఇవాళ రెడీ చేసుకుని తినండి.

– కె

సాగుబడి

భరణి కార్తె: మే 10 వరకు
కృత్తిక కార్తె: 11 నుంచి

- జన్యు సవరణ (జీనోమ్ - ఎడిటింగ్) సాంకేతికతతో తొలి రెండు వరి వంగడాలను ఆవిష్కరించిన ఐసిఎఆర్
- 30% అధికంగా ధాన్యం దిగుబడినిచ్చే సత్తా.. కరువు, చౌడులను తట్టుకునే శక్తి ఈ రకాలకు ఉంది

తొలి 'జన్యు సవరణ' వరి!



జన్యు సవరణ (జీనోమ్ – ఎడిటింగ్) సాంకేతికతతో ఐసిఎఆర్ అభివృద్ధి చేసిన తొలి రెండు వరి వంగడాలను న్యూఢిల్లీలో ఆదివారం ఆవిష్కరిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్న భూతాపాన్ని తట్టుకుంటూ 30% అధిక దిగుబడిని ఇవ్వగలిగిన రెండు సరికొత్త జన్యుసవరణ వరి రకాలను ప్రపంచంలోనే తొట్టతొలిగా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) శాస్త్రవేత్తలు రూపొందించారు. క్రిస్పర్- కాస్9 అనే సరికొత్త జీనోమ్-ఎడిటింగ్(జిఇ) టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చేసిన రెండు వరి వంగడాలను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం ఆవిష్కరించారు.

భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్)కి చెందిన పూసాలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఎఆర్ఐ) పూసా రైస్ డిఎస్‌టి1 అనే రకం కరువును, చౌడును తట్టుకొని అధిక దిగుబడినిస్తుంది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) పరిశోధకులు అభివృద్ధి చేసిన డిఆర్ఆర్ ధన్ 100 (కమల) అనే వరి అధిక దిగుబడినిస్తుంది.

మన దేశంలో ఇప్పటి వరకు అధికారికంగా సాగులో ఉన్న జన్యుమార్పిడి పంట పత్తి ఒక్కటి మాత్రమే. జన్యుసవరణకు ఇదే ప్రారంభం. గతంలో సంక్లిష్టమైన 'జన్యుమార్పిడి'లో భాగంగానే 'జన్యుసవరణ'ను కూడా చూసేవారు. అయితే, 2022లో జన్యుసవరణను కఠినమైన నియంత్రణ ప్రక్రియ నుంచి మినహాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ తర్వాత జన్యు సవరణ పరిశోధనలకు రూ. 500 కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలోనే జన్యుసవరణ తొలి వరి రకాలను ఇప్పుడు ఆవిష్కరించారు.

ఈ రెండు వంగడాల పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సత్కరించారు. పూసా డిఎస్‌టి రైస్ 1 పై కృషి చేసిన డాక్టర్ విశ్వనాథన్ సి, డాక్టర్ గోపాల్ కృష్ణన్ ఎస్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ శివానీ నగర్, డాక్టర్ అర్చన వాట్స్, డాక్టర్ సోహం రే, డాక్టర్ అశోక్ కుమార్ సింగ్, డాక్టర్ ప్రాంజల్ యాదవ్‌లను సత్కరించారు. డిఆర్ఆర్ రైస్ 100 (కమల) అభివృద్ధికి కృషి చేసిన ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సత్యేంద్ర కుమార్ మంగథియా, డాక్టర్ ఆర్.ఎం. సుందరం, డా. అబ్దుల్ ఫియాజ్, డా. సి.ఎన్. నీరజ, డా. ఎస్వీ సాయి ప్రసాద్‌లను సత్కరించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది మాట్లాడుతూ, ఈ సాంకేతికత దేశీయంగా అభివృద్ధి చేసినది కావటం వల్ల ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ప్రయత్నాల ద్వారా రైతులకు త్వరగా అందించవచ్చని అన్నారు.

10కి పైగా పంటలకు జన్యు సవరణ

ఐసిఎఆర్ డైరెక్టర్ డాక్టర్ జనరల్ మంగిలాల్ జాట్ ప్రసంగిస్తూ ఈ రెండు వంగడాల ఆవిష్కరణ భారత వ్యవసాయంలో ఒక చారిత్రాత్మక సంఘటనగా అభివర్ణించారు. రాబోయే సంవత్సరాల్లో అనేక ఇతర పంటలకు సంబంధించి జన్యు సవరణ పంట రకాలను విడుదల చేస్తామని అన్నారు. 'కొత్త వ్యవసాయ విధానాలు కొత్త పద్ధతులకు అనుగుణంగా ఉండాలి. మారిన వాతావరణ పరిస్థితుల్లో పాత పద్ధతులు పనిచేయవు' అని ఆయన అన్నారు. దేశంలోని బహుళ జాతి సంస్థలు, విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం పప్పుధాన్యాలు, ఆవాలు, గోధుమ, పొగాకు, పత్తి, అరటి, టమోటా, నూనెగింజలు వంటి 10కి పైగా పంటలకు సంబంధించి జన్యు-సవరణపై పరిశోధనలు చేస్తున్నాయని ఆయన వెల్లడించారు.

ఆస్ట్రేలియాలోని ముర్డోక్ విశ్వవిద్యాలయంలోని ఇంటర్నేషనల్ చైర్ ఆఫ్ అగ్రికల్చర్ – ఫుడ్ సెక్యూరిటీ, సెంటర్ ఫర్ క్రాప్ అండ్ ఫుడ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ రాజీవ్ వర్షిణి మాట్లాడుతూ, ఈ ఆవిష్కరణలు వ్యవసాయ జీవ సాంకేతికతలో ఒక మైలురాయన్నారు. ప్రత్యేకంగా చిన్న-సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరుస్తాయని, ప్రపంచ పురోగతికి ప్రేరణనిస్తాయని అన్నారు.

జన్యుభద్రతా పరీక్షల గణాంకాలను కూడా ప్రకటించాలి



ఐసిఎఆర్ మొట్టమొదటి జన్యు సవరణ వరి రకాలను విడుదల చేసింది. అధిక దిగుబడినిస్తూ, కరువును తట్టుకోవటం కోసం సరికొత్త క్రిస్పర్-కాస్9 టెక్నాలజీని వినియోగించి ఈ రకాలను అభివృద్ధి చేశారు. వీటికి సంబంధించిన జన్యుభద్రతా పరీక్షల గణాంకాలను సైతం బహిరంగంగా ప్రకటిస్తే ఈ సరికొత్త వరి బియ్యం తినటంలో భద్రత గురించి కూడా ప్రజలు తెలుసుకుంటారు.


– డాక్టర్ సుమన్ సహాయ్,
స్వతంత్ర శాస్త్రవేత్త, జీన్‌క్యాంపెయిన్ వ్యవస్థాపకులు


ఐసిఎఆర్ శాస్త్రవేత్తల అసాధారణ విజయాలు

వ్యవసాయ సవాళ్లను అధిగమించడానికి ఆధునిక పద్ధతులను అవలంభించాలని ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఆయన మాటల నుంచి ప్రేరణ పొందిన ఐసిఎఆర్ శాస్త్రవేత్తలు ఈ కొత్త రకాలను సృష్టించడం ద్వారా వ్యవసాయ రంగంలో అసాధారణ విజయాలు సాధించారు. వరిలో ఈ కొత్త పంటలు ధాన్యం ఉత్పత్తిని పెంచడమే కాకుండా పర్యావరణ పరంగా సానుకూల ఫలితాలను ఇస్తాయి. సాగు నీరు ఆదా అవుతుంది. కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. తద్వారా పర్యావరణంపై ఒత్తిడి తగ్గుతుంది. మొత్తంగా వరి సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల హెక్టార్లు తగ్గించాలి. ధాన్యం ఉత్పత్తిని కోటి టన్నులు పెంచాలి. ఈ 50 లక్షల హెక్టార్ల భూముల్లో అదనంగా పప్పుధాన్యాలు, నూనెగింజలను సాగు చెయ్యాలి.

– శివరాజ్ సింగ్ చౌహాన్,
కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి

ఈ రెండు జన్యు సవరణ వంగడాలను వాణిజ్య స్థాయిలో విత్తనోత్పత్తి చేసి రైతులకు అందించడానికి మరో నాలుగైదు సంవత్సరాలు పట్టొచ్చు.





కరువు, చౌడును అధిగమించి..

ఎంటియు1010 వరి వంగడానికి జన్యు సవరణ చేసి 'పూసా రైస్ డిఎస్‌టి 1' వంగడాన్ని పూసాలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఎఆర్ఐ) అభివృద్ధి చేసింది. ఒత్తిడి నిరోధకతను అణిచివేసే జన్యువును తొలగించడం ద్వారా శాస్త్రవేత్తలు ఈ వంగడాన్ని రూపొందించారు. పత్ర రంధ్రాల సాంద్రతను తగ్గించటం ద్వారా తక్కువ నీటితో పంట పండేలా మార్పు చేశారు. చౌడును తట్టుకొని ఎక్కువ పిలకలు వచ్చేలా చేయటం ద్వారా అధికంగా ధాన్యం దిగుబడి వచ్చేలా చేశారు. క్షేత్రస్థాయి పరీక్షల్లో ఎంటియు 1010 రకంతో పోలిస్తే కరువు, చౌడు వత్తిళ్లను తట్టుకొని గణనీయంగా అధిక దిగుబడిని చూపించాయని ఐఎఆర్ఐ తెలిపింది.

సాంబ మసూరికి కొత్త రూపు

దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొంది, విస్తారంగా సాగవుతున్న సాంబ మసూరి (బిపిటి-5204) వంగడానికి జన్యుసవరణ చేసి 'డిఆర్ఆర్ ధన్ 100 (కమల)' రకాన్ని అభివృద్ధి చేశారు. రాజేంద్రనగర్‌లోని 30% అధిక దిగుబడిని ఇస్తుంది. 20 రోజులు ముందే కోతకు వస్తుంది. 'క్రిస్పర్'ను ఉపయోగించి సాంబ మసూరిలోని సైటోకినిన్ ఆక్సిడేస్ జన్యువుకు తగిన విధంగా సవరణ చేశారు. ఫలితంగా ధాన్యం దిగుబడిలో 19% పెరుగుదల, 20 రోజుల వరకు ముందస్తు పరిపక్వతతో పాటు తక్కువ ఎరువుల వినియోగం, కరువు పరిస్థితులలో మెరుగైన పనితీరు వంటి గుణాలతో 'డిఆర్ఆర్ ధన్ 100 (కమల)' రకం రూపుదాల్చింది.

తోడు-నీడ పంటగా మొక్కజొన్న!


అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ఈ వేసవి రోజుల్లో కూరగాయ పంటలను సన్‌బర్న్ నుంచి కాపాడుకోవటానికి ఓ సేంద్రియ రైతు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఫొటోలో పొలాన్ని చూడండి.. మొక్కజొన్న తోటలాగా ఉంది కదా! కానీ, నిజానికి అది టొమాటో తోట!!

టొమాటో మొక్కలకు తోడు- నీడ కోసం పక్కనే మొక్కజొన్న విత్తారు. ప్రచండమైన ఎండల నుంచి టొమాటో తోటను కాపాడుకోవటానికి రైతు రంగప్రసాద్ ఈ వినూత్న ఉపాయాన్ని ఆలోచించి ఆచరణలో పెట్టారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్నతోద్యోగిగా పనిచేసిన రంగప్రసాద్ నాలుగేళ్ల క్రితం సేంద్రియ సేద్యం చేపట్టారు. నాగర్‌కర్నూలు జిల్లా చారుగొండ మండలం జూపల్లిలో 70 ఎకరాల భూమి తీసుకొని ఐఫామ్స్‌ను స్థాపించారు. రకరకాల పండ్ల చెట్లు, కూరగాయలు, నాటు కోళ్లు, మేకలు.. పెంచుతున్నారు. గచ్చిబౌలిలో సొంతంగా స్టోర్ తెరచి ఆహారోత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఈ ఏడాది టొమాటో, క్యాబేజీ, బ్రకోలి, లెట్యూస్ వంటి పంటలు సాగుచేస్తున్న అన్ని మడుల్లోనూ పక్కన మొక్కజొన్నను కూడా ఉత్తర – దక్షిణ వరుసలుగా విత్తుతున్నారు. 3-3.5 అడుగులకో వరుస చొప్పున మొక్కజొన్న విత్తుతున్నారు. 'ప్రతి 30 రోజులకో సారి కొత్త కూరగాయల ప్లాట్‌లో మొక్కలు నాటుతూ ఏడాది పొడవునా కూరగాయలు పండిస్తున్నాం. అవి నాటేటప్పుడే మొక్కజొన్న విత్తనాలను కూడా వరుసల మధ్య విత్తుతున్నాం. అవసరమైతే, ఈ వరుసల మధ్యలో 15 రోజులకోసారి మొక్కజొన్న విత్తుతాం. అందువల్ల, ఎప్పుడు చూసినా అనేక ఎత్తుల్లో మొక్కజొన్న మొక్కలు పచ్చగా పెరుగుతూ ఉంటాయి. పక్కన ఉన్న ప్రధాన కూరగాయ మొక్కలకు నీడను, చల్లదనాన్ని ఇవి అందిస్తుండటంతో ఎండను తట్టుకొనే శక్తి వస్తోంద'న్నారు.



మొక్కజొన్నే ఎందుకు? అంటే.. 'మొక్కజొన్న వేగంగా పెరుగుతుంది. ఆకులు వెడల్పుగా, ఎత్తుగా పెరుగుతాయి. దీంతో తోట వత్తుగా మొక్కలతో నిండి ఉంటుంది. నీడ పడుతుంది. మొక్కజొన్నను తోడు-నీడ పంటగా నాటిన కూరగాయ తోటలో 3 డిగ్రీల సెల్షియస్ మేరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. బేబీ కార్న్/కండెలను అమ్ముతున్నాం. చొప్పను ఆవులకు మేపుతున్నాం..' అన్నారు రంగప్రసాద్ (98851 22544).


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు
ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 44

మంగళవారం 6-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ అవుట్
ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ రద్దు. ప్లే ఆఫ్స్‌కు దూరమైన హైదరాబాద్
-12లో



ఆర్‌బీఐలో పసిడి మెరుపులు
2024–25లో 57 టన్నుల కొనుగోలు..
మొత్తం నిల్వలు 879 టన్నులు
-13లో



జస్టిస్ గవాయ్ బెంచ్‌కు 'వక్ఫ్'
'వక్ఫ్' పిటిషన్లపై విచారణ బాధ్యతను కాబోయే సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనానికి అప్పగించారు.
వివరాలు 6లో ▸



రక్షణ సైట్లపై పాక్ దాడులు
భారత రక్షణ రంగానికి సంబంధించిన వెబ్‌సైట్లపై పాకిస్తాన్ సైబర్ దాడుల ఉధృతి ఎక్కువైంది.
వివరాలు 6లో ▸



గాజా హస్తగతం!
హమాస్ మిలిటెంట్ సంస్థను సమూలంగా నాశనం చేసి, గాజా స్ట్రిప్‌ను హస్తగతం చేసుకొనే దిశగా ఇజ్రాయెల్ అడుగులు వేస్తోంది.
వివరాలు 6లో ▸



సినిమాలకూ ట్రంప్ సెగ
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు విదేశీ సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు.
వివరాలు 6లో ▸

ఎవరిపై మీ సమరం?

ఉద్యోగాలిచ్చి జీతాలిస్తున్న ప్రజలపై యుద్ధం ప్రకటిస్తారా?

ఉద్యోగ సంఘాల నాయకులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

- తనను కోసినా రూపాయి రాదని.. ఎక్కడా అప్పు పుట్టడం లేదని స్పష్టీకరణ
- బయట ఎవడూ మనల్ని నమ్మడం లేదని.. పూర్తిగా దివాలా తీశామని కుండబద్దలు
- నన్ను కోసుకొని వండుకొని తింటారా అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- అప్పుల కుప్పచేసి ఫామ్‌హౌస్‌లో దుప్పటి కప్పుకొని పడుకున్నాడని కేసీఆర్‌పై విమర్శలు
- ఉద్యోగుల సమ్మె ప్రకటనలపై పోలీస్ అవార్డుల కార్యక్రమంలో విరుచుకుపడ్డ సీఎం
- పార్టీల ఉచ్చులో పడొద్దని హితవు.. చర్చలకొస్తే లెక్కలు చెప్తానని వెల్లడి
- శాంతిభద్రతలు బాగున్నందునే పెట్టుబడులొస్తున్నాయని పోలీసులకు కితాబు



ఈ సమయంలో సమరం కాదు.. సమయస్ఫూర్తి కావాలి. ప్రభుత్వ ఉద్యోగులందరికీ నేను మనవి చేస్తున్నా. మనమంతా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కోతుల గుంపునకు అప్పగించొద్దు. తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించుకుందాం

- సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

'ఎవరి మీద సమరం చేస్తారు? ఎవరిని నిందించదల్చుకున్నరు? ఎవరిని కొట్టదల్చుకున్నరు? ఉద్యోగాలిచ్చి జీతాలు ఇస్తున్న ప్రజలపైనా మీ యుద్ధం? ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారికి కష్టాలు వస్తే ఆదుకోవాల్సిన వాళ్లు.. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు సమరం ప్రకటిస్తున్నారు. ఆ సంఘాల నాయకులను అడుగుతున్నా. ప్రజలకు మంచి చేసేందుకే ఇక్కడ ఉన్నాం. సమరం చేయడానికి లేము. ప్రజలపై యుద్ధం చేసిన వాళ్లెవరూ బాగుపడలేదు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ సంఘాల నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ జీ అవార్డులు' కార్యక్రమానికి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 22 మంది పోలీస్ సిబ్బంది, అధికారులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

నన్ను కోసినా రూపాయి రాదు..

'ప్రభుత్వం అంటే నేను ఒక్కడినే కాదు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు అంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు..

మిగతా 3వ పేజీలో ▶

హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు రిమోట్ ద్వారా శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ. చిత్రంలో లక్ష్మణ్, పొన్నం, కోమటిరెడ్డి, కిషన్‌రెడ్డి, ఈటల



తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- పదిన్నరేళ్లలో జాతీయ రహదారులను రెట్టింపు చేశాం
- ఇండోర్–హైదరాబాద్ కారిడార్ దాదాపు పూర్తయ్యింది
- రీజినల్ రింగ్ రోడ్డు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం

అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి గడ్కరీ

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రూ.330 కోట్లతో నిర్మించిన గోల్నాక–అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గడ్కరీ మాట్లాడుతూ అందరికీ నమస్కారం.. బాగున్నారా అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రసంగ వివరాలు ఆయన మాటల్లోనే.. ''కొన్ని అనివార్య కారణాల వల్ల ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి కాలేదు. అక్కడి సమస్యలను కిషన్‌రెడ్డి నా దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో పదేళ్లలో 5 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు వేశాం. ఇండోర్– హైదరాబాద్ కారిడార్ దాదాపు పూర్తయ్యింది. రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్–విజయవాడ రహదారి ఆరులైన్లుగా విస్తరిస్తాం. నాగ్‌పూర్‌లో డబుల్ డెక్కర్ ఎయిర్‌బస్‌ను అందుబాటులోకి తెచ్చాం. హైదరాబాద్ రింగ్ రోడ్డుపై ఈ ఎయిర్ బస్ నడిపించాలని మంత్రులు కోరుతున్నారు.''

జాతీయ రహదారులు రెట్టింపు చేశాం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడకు వెళ్లినా జాతీయ

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్



తక్కువ ఖర్చుతో మన దేశంలోనే చికిత్సలు జరుగుతున్న నేపథ్యంలో.. వైద్యం కోసం విదేశాల నుంచి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వీరిలో 30 నుంచి 40% దాకా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నారు.

- వివరాలు 3లో▶

పగలు ఎండ.. సాయంత్రం వాన



వేసవి సీజన్‌లో విచిత్ర వాతావరణ పరిస్థితి ఉంది. పగటిపూట ఎండలు, ఉక్కపోత ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే సాయంత్రాలు హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు మొదలు వడగళ్ల వానలతో వాతావరణం చల్లబడుతోంది.

- వివరాలు 14లో▶

సంస్థాగత ఎన్నికలను త్వరగా పూర్తి చేయండి



తెలంగాణ సహా మిగతా రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు.

- వివరాలు 2లో▶


రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌కు గవర్నర్ ఆమోదం



రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్‌ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

- వివరాలు 14లో▶

10.26 టీఎంసీలు కేటాయించండి



జూలై వరకు నీటి కేటాయింపులపై కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీకి రాష్ట్రం వినతి

- ఇప్పటికే ఏపీ కోటాకు మించి జలాలు వాడుకుందని ఫిర్యాదు
- ఇకపై సాగర్, శ్రీశైలం నుంచి నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్
- శ్రీశైలం, సాగర్‌లో మిగిలిన నిల్వలు తమవేనని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్

ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో మిగిలి ఉన్న నిల్వల నుంచి వేసవి తాగునీటి అవసరాల కోసం జూలై నెలాఖరు వరకు 10.26 టీఎంసీలను కేటాయించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) త్రిసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 88 రోజులపాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు 300 క్యూసెక్కులు, హైదరాబాద్ జంట నగరాలు, శివారు ప్రాంతాల తాగునీటి అవసరాలకు సాగర్ నుంచి ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ద్వారా 750 క్యూసెక్కులు, సాగర్ ఎడమ కాల్వ ద్వారా ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాలకు 300 క్యూసెక్కులు కలుపుకుని మొత్తం 10.26 టీఎంసీలను కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. వేసవి తాగునీటి అవసరాల కోసం ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ చేసేందుకు సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్‌ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశమైంది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి, త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం రాయిపూరే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో తెలంగాణ తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ హాజరయ్యారు. ఏపీ మాత్రం ఈ సమావేశానికి గైర్హాజరైంది. కమిటీ సమావేశాన్ని వాయిదా వేయాలని బోర్డుకు ఏపీ లేఖ రాసినట్లు తెలిసింది. ఇకపై బోర్డు సమావేశాలను విజయవాడలో నిర్వహించాలని ఏపీ కోరుతోంది.

కోటాకు మించి ఏపీ వాడుకుంది..

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో కనీస నీటి మట్టం (ఎండీడీఎల్)కు ఎగువన ఉన్న 15 టీఎంసీల్లో ఆవిరి నష్టంగా 4.28 టీఎంసీలు పోగా కేవలం 10.81 టీఎంసీలే మిగులుతాయని తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. అందులో తమకు 10.26 టీఎంసీలు

మిగతా 5వ పేజీలో ▶

అక్కడక్కడా భూప్రకంపనలు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జనం పరుగులు
- భీమారంలో కూలిన ఇంటి పైకప్పు
- పులికంటలో భూకంప తీవ్రత 3.8గా రిక్టర్ స్కేల్‌పై నమోదు
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో పలుచోట్ల... సిద్దిపేట జిల్లా రాజక్కపేట, దుబ్బాకలోనూ...

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం భూమి స్వల్పంగా కంపించింది. 6.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో భయంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. జగిత్యాల జిల్లాలో సుమారు మూడు సెకన్ల నుంచి ఆరు సెకన్ల పాటు భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో మూడు నుంచి నాలుగు సెకన్లు కంపించింది. ఇళ్లలోని వస్తువులు కింద పడడంతో ముందుగా ఉరుములతోనని అనుకున్న ప్రజలు.. భూకంపమని తెలుసుకొని ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. జగిత్యాల జిల్లా భీమారం మండలంలో రాజుకు చెందిన పెంకుటిళ్ల పైకప్పు భూకంపం ధాటికి కూలిపోయింది.



➤ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పులికుంట కేంద్రంగా సాయంత్రం 6.50 గంటలకు

మిగతా 3వ పేజీలో ▶

పాక్ పీచమణచేందుకు ముహూర్తం ఖరారు!



వారాంతంలోపే భారీ ఆపరేషన్

- బుధవారం రాష్ట్రాల్లో మాక్‌డ్రిల్స్
- పౌరులను అప్రమత్తం చేయండి
- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు
- చివరిసారిగా 1971లో జరిగిన వైనం
- అప్పుడూ పాక్‌తో యుద్ధమే కారణం
- వైమానిక సైరన్లు, ఖాళీ చేయించే చర్యలు
- స్వీయరక్షణలో పౌరులు, విద్యార్థులకు శిక్షణ
- దాడులు జరిగితే ఎలా ఎదుర్కోవాలో డ్రిల్స్
- రక్షణ సన్నద్ధతపై ప్రధాని వరుస భేటీలు
- మాపై ఏ క్షణమైనా దాడి: పాక్ రక్షణ మంత్రి

6లో



భారత్‌కే మా మద్దతు

- ఉగ్ర పోరాటంలో అండగా ఉంటాం
- పహల్గాం దాడిని ఖండిస్తున్నాం
- రష్యా అధినేత పుతిన్ స్పష్టీకరణ
- ప్రధాని మోదీతో ఫోన్‌లో మాటామంతి

6లో





సారీ సార్! యుద్ధమొస్తే నేనూ వెళ్లిపోతా...

కాస్ట్లీ కాంటెస్ట్

మిస్ వరల్డ్ పోటీల లావాదేవీల మొత్తం విలువ
▼
రూ. 700 కోట్లు ?

- స్పాన్సర్లు, ఒప్పందాలు, ప్రసార హక్కుల ద్వారా అధిక ఆదాయం
- హైదరాబాద్‌లో పోటీల నిర్వహణ వ్యయం రూ. 57 కోట్లు
- అందులో సగం భరించనున్న మిస్ వరల్డ్ సంస్థ
- ఈసారి విజేతకు రూ.12 కోట్ల ప్రైజ్ మనీ?



ప్రపంచ సుందరి విజేతకు వజ్రాలు పొదిగిన కిరీటాన్ని ధరింపచేస్తారు. గతేడాది ముంబైలోజరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన చెక్

విజేతకు వజ్రాల కిరీటం..

రిపబ్లిక్ సుందరి క్రిస్టీనా పిజ్కోవాకు అందించిన కిరీటం విలువ రూ. 6.21 కోట్లని తెలుస్తోంది. ఈసారి విజేతకు ప్రైజ్‌మనీగా రూ. 12 కోట్ల నుంచి రూ. 15 కోట్ల మొత్తాన్ని చెల్లించనున్నట్లు సమాచారం.

సాక్షి, హైదరాబాద్

భాగ్యనగరం వేదికగా ఈ నెల 10 నుంచి నెలాఖరు వరకు జరగనున్న ప్రపంచ సుందరి అందాల పోటీల మొత్తం విలువ రూ.700 కోట్లపైనే ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బడా వాణిజ్య, వ్యాపార, ఉత్పత్తి సంస్థలతో ఒప్పందాల ద్వారా మిస్ వరల్డ్ నిర్వహణ సంస్థకు రూ. 400–500 కోట్ల మేర ఆదాయం వస్తుందనేది అనధికార అంచనా. పోటీల నిర్వహణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సగం భరిస్తున్నప్పటికీ స్పాన్సర్‌షిప్ ఆదాయంలో మాత్రం 90 శాతానికిపైగా ఆదాయం మిస్ వరల్డ్ సంస్థకే చెందనుంది.

రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 25 కోట్లు

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు రూ. 57 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం, మిస్ వరల్డ్ లిమిటెడ్ చెరి సగం చొప్పున భరిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా భారం పడకుండా స్పాన్సర్‌షిప్స్ ద్వారా ఆ మొత్తాన్ని రికవరీ చేసుకుంటామని.. కేవలం రూ. 2 కోట్ల వరకే ఖజానాపై భారం పడుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గతంలో పేర్కొన్నారు. ఈ లెక్కన

మిగతా 2వ పేజీలో ▶

ఐటీ పార్కు @ గోపన్‌పల్లి..

- హెచ్‌సీయూ భూములపై వివాదం నేపథ్యంలో ప్రత్యామ్నాయం
- 439.15 ఎకరాల భూసేకరణకు సన్నాహాలు
- కలెక్టర్ ఆదేశాలతో ప్రతిపాదిత సర్వే నంబర్లు నిషేధిత జాబితాలో..!
- త్వరలో భూసేకరణ నోటిఫికేషన్?



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలి భూముల్లో ఐటీ పార్కు అభివృద్ధి ప్రణాళికలు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కంచ గచ్చిబౌలికి సమీపంలోని శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో భూసేకరణ కోసం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తెలంగాణ పారిశ్రామిక మౌలికవసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) ఏర్పాటు చేసే ఐటీ పార్కుతోపాటు సంబంధిత రంగాల కోసం పార్కులను ఏర్పాటు చేసేందుకు భూసేకరణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు రెండ్రోజుల క్రితమే భూసేకరణ ప్రక్రియ సన్నాహాలు ప్రారంభించారు. భూసేకరణకు అవసరమైన సర్వే నంబర్లను రెవెన్యూ రికార్డుల్లో నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శేరిలింగంపల్లి ఆర్డీవోకు

మిగతా 5వ పేజీలో ▶

రైలు బండి... ఇక పొగ రాదండీ



డీజిల్‌కు స్వస్తి పలికిన రైల్వే

- దక్షిణ మధ్య రైల్వేలో 100% విద్యుదీకరణ
- అక్కన్నపేట–మెదక్ పనుల పూర్తితో సాధన
- దక్షిణ మధ్య రైల్వే, వాల్తేరు డివిజన్లో పూర్తి
- తెలుగు రాష్ట్రాల్లో విద్యుదీకరణ సంపూర్ణం
- రైల్వేకు తగ్గిన 'చేతి చమురు'
- కి.మీ.కు రూ.270 చొప్పున ఆదా
- తగ్గిన వ్యయం, పర్యావరణ ప్రియం

తెలుగు రాష్ట్రాల్లో పొగ బండిని ఇక పొగరాని బండి అని పిలవాలి. ఎందుకంటే.. దేశంలో డీజిల్ రైలింజిన్లకు స్వస్తి చెబుతూ కేవలం కరెంటు ఇంజిన్లతోనే రైళ్లు నడపాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని దక్షిణ మధ్య రైల్వే విజయవంతంగా ఆచరణలోకి తెచ్చింది. 2025 మార్చి నాటికి 100% లైన్లను విద్యుదీకరించాలన్న లక్ష్యాన్ని సాధించింది. దేశ వ్యాప్తంగా 97% సాధించగా, దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా సాధించి చూపింది. మరో పక్క వాల్తేర్ డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాల్లోనూ ఇప్పటికే విద్యుదీకరణ పూర్తయింది.

తెలుగు రాష్ట్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎలక్ట్రిక్ ఇంజిన్లతోనే రైళ్లను నడిపే పరిస్థితి ఏర్పడింది. దీన్ని రైల్వేలో భారీ విజయంగా భావిస్తున్నారు. డీజిల్ ఇంజిన్ల వల్ల రైల్వే శాఖకు భారీగా చేతి'చమురు'వదులుతోంది. లైన్ల విద్యుదీకరణ ద్వారా, డీజిల్ భారాన్ని తగ్గించుకుని ఆ మొత్తాన్ని రైల్వేల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఖర్చు చేస్తోంది. దేశవ్యాప్తంగా 97% విద్యుదీకరణ సాధించగా, దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా సాధించి చూపింది. కర్ణాటక (96%), తమిళ నాడు (96%), రాజస్తాన్ (98%) వంటి రాష్ట్రాల్లో ఇంకా పూర్తి కాలేదు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు విద్యుదీకరణ పూర్తయిన రైల్వే ట్రాక్ నిడివి 68,730 కిలోమీటర్లు. ఇందులో గత పదేళ్లలో పూర్తయింది 46,928 కిలోమీటర్లు. - సాక్షి, హైదరాబాద్

జోన్‌పరిధిలో ఇలా..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 6,609 రూట్ కి.మీ. మేర రైలు మార్గాలున్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రం పరిధిలో 2,015 రూట్ కి.మీ.ల ట్రాక్ ఉంది. వాల్తేర్ డివిజన్ పరిధిలో సుమారు 1,075 రూట్ కి.మీ. మేర ఉంటే.. ఇందులో ఏపీ పరిధిలో దాదాపు 545 కి.మీ.ల ట్రాక్ ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో అక్కన్నపేట–మెదక్ మధ్య 17 కి.మీ. మేర పనులు అసంపూర్తిగా ఉండి పోయాయి. వాటిని వేగంగా నిర్వహించి విద్యుత్తు రైళ్లు నడపడం ప్రారంభించారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం లోనే యావత్ దక్షిణ మధ్య రైల్వేలో విద్యుదీకరణ పూర్తయినట్టు తేల్చారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1,280 విద్యుత్తు లోకోమోటివ్‌లు వినియోగిస్తున్నారు. వీటిలో 291 ఇంజిన్లను ప్రయాణికుల రైళ్లకు వాడుతుండగా, మిగతావాటిని సరుకు రవాణా రైళ్లకు వినియోగిస్తు న్నారు. ఇక జోన్‌పరిధిలోనే ఉన్నప్పటికీ, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్–గుల్బర్గా పరిధిలోకి వచ్చే ఖానాపూర్–కమలాపూర్–నందగావ్ మార్గం లో కొంతమేర పని మిగిలి ఉంది. అయితే, దాన్ని నిర్వహించే బాధ్యత దక్షిణ మధ్య రైల్వే సరిహద్దుతో ఉన్న సెంట్రల్ రైల్వేది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే రికార్డు సమయంలో లక్ష్యాన్ని సాధించినట్టయింది.

ఇంకా డీజిల్ ఇంజిన్లు.. ఎందుకంటే?

వంద శాతం విద్యుదీకరణ జరిగినప్పటికీ, దక్షిణ మధ్య రైల్వే జోన్‌పరిధిలో ఇప్పటికీ 395 డీజిల్ ఇంజిన్లను నిర్వహిస్తున్నారు. వీటిలో 245 ఇంజిన్లను సరుకు రవాణా రైళ్లకు వాడుతున్నారు. అలాగే వాల్తేర్ డివిజన్లో మొత్తం 387 ఇంజిన్లు ఉంటే అందులో డీజిల్ ఇంజిన్లు 162. భవిష్యత్తులో రైళ్లు ఢీకొనటం, వరదలు లాంటి విపత్తులతో విద్యుత్తు సరఫరా వ్యవస్థ దెబ్బతిని కరెంటు ఇంజిన్లు వాడలేని పరిస్థితి ఎదురైతే, అత్యవసర సేవల కోసం ఈ డీజిల్ ఇంజిన్లతో రైళ్లు నడుపుతారు. ఆ సమయంలో డీజిల్ ఇంజిన్లు ఫిట్‌గా ఉండాలంటే వాటిని నిరంతరం వాడాలి.

ఇక మిగిలిందదే..

తెలంగాణ పరిధిలో ప్రస్తుతం ఒకే ఒక్క కొత్త రైలు మార్గం పనులు జరుగుతున్నాయి. మేడ్చల్ సమీపంలోని మనోహరాబాద్ నుంచి మొదలై కరీంనగర్ శివారులో కొత్తపల్లి వరకు సాగే లైను. ఇందులో సిద్దిపేట వరకు ట్రాక్ ఏర్పాటు పూర్తి కావటంతో రైలు సేవలు కూడా మొదలయ్యాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల మీదుగా పైకి కొనసాగాల్సి ఉంది. ఈ పనులు 2026 నాటికి పూర్తవుతాయి. ఇంతకాలం కొత్త లైన్ల నిర్మాణాన్ని ముందు చేపట్టి, భవిష్యత్తులో కుదిరినప్పుడు మార్గాన్ని విద్యుదీకరించేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పి, కొత్త లైన్ల పనులు జరుగుతున్న సమయంలోనే సమాంతరంగా విద్యుదీకరణ పనులూ నిర్వహిస్తున్నారు. ఈమేరకు మనోహరాబాద్–కొత్తపల్లి మార్గాన్ని కూడా విద్యుదీకరించాలని నిర్ణయించింది. 2026 జూన్‌నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పనులు జరుగుతున్న ప్రాజెక్టు కావడంతో దీన్ని విద్యుదీకరణ జాబితాలో చేర్చలేదు. అసంపూర్తి ప్రాజెక్టు కావటంతో దీన్ని విద్యుదీకరణ జరగని ప్రాజెక్టుగా తేల్చలేదు. ఫలితంగా వంద శాతం విద్యుదీకరణ సాధించిన జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే జోన్‌ను రైల్వే శాఖ ప్రకటించింది.

డీజిల్‌తో రూ.400 కరెంటుతో రూ.130 మాత్రమే



డీజిల్ ఇంజిన్‌నడపడం వల్ల రైల్వేకు ఒక కి.మీ.కు అయ్యే వ్యయం సగటున రూ.400. అదే కరెంటు ఇంజిన్‌కి.మీ.కు 20 యూనిట్ల కరెంటును ఖర్చు చేస్తుంది. ఈ రూపంలో అయ్యే వ్యయం సగటున రూ.130 మాత్రమే. సరుకు రవాణా రైలు నిర్వహణలో డీజిల్‌తో పోలిస్తే కరెంటు ఇంజిన్‌కు మూడో వంతు వ్యయం, ప్రయాణికుల రైలుకు నాలుగో వంతు వ్యయం అవుతుందని అంచనా.

రైల్వే శాఖ లెక్కల ప్రకారం.. 2018–19లో రైల్వే శాఖ డీజిల్ రూపంలో చేసిన ఖర్చు రూ.18,587 కోట్లు. విద్యుదీకరణతో ఏటా రూ.1,000 కోట్లకు పైగా మొత్తాన్ని ఆదా చేస్తోంది. గత పదేళ్లలో విద్యుదీకరణ వల్ల దాదాపు 640 కోట్ల లీటర్ల డీజిల్‌ను ఆదా చేసిందని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల 400 కోట్ల కేజీల కర్బన ఉద్గారాల విడుదలను నివారించగలిగాం.

క్లుప్తంగా...

డీడీ, చలాన్ రూపంలోనే కాంపౌండింగ్ ఫీజు

నగదు రూపంలో వసూళ్లు చేస్తే చర్యలు: తూనికలు, కొలతల శాఖ

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: తూకం మోసాలు, నిబంధనల ఉల్లంఘనలపై చట్టపరమైన ప్రాసిక్యూషన్‌కు బదులుగా విధించే కాంపౌండింగ్ (జరిమానా) రుసుం చలాన్, డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో మాత్రమే వసూలు చేయాలని రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ ఆదేశాలు జారీ చేసింది. గత నెల 8న 'సాక్షి'దినపత్రికలో 'రెన్యువల్‌కూ ఒక రేటుంది'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి తూనికలు కొలతల శాఖ స్పందించింది. ఇక నుంచి ఏ రకమైన కాంపౌండింగ్ రుసుం కూడా నగదు రూపంలో వసూలు చేయరాదని, వసూలు చేస్తే మాత్రం తీవ్రంగా పరిగణించి సీసీఏ నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ రాష్ట్ర కంట్రోలర్ స్పష్టం చేశారు. ఇటీవల గద్వాల జిల్లా అలంపూర్‌లో ఒక పెట్రోల్ బంక్‌లో డిస్పెన్సర్ మెషీన్ల స్టాంపింగ్ రెన్యువల్ కోసం వెళ్లిన తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో నగదు రూపంలో జరిమానా వసూలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో కాంపౌండింగ్ ఫీజు చలాన్, డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో మాత్రమే వసూలు చేయాలని సర్క్యులర్ మెమో జారీ చేసింది.

20న సింగరేణిలో సమ్మె

సీఎండీకి నోటీసు అందజేసిన కార్మిక సంఘాల జేఏసీ

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న సమ్మె చేస్తున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్. బలరామ్‌కు జేఏసీ నాయకులు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొగ్గు పరిశ్రమ రక్షణ, నూతన బొగ్గు గనులు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, రూ.26 వేల కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం తదితర 17 డిమాండ్ల అమలుకు సమ్మె చేస్తున్నామని వివరించారు. బొగ్గు బ్లాకుల అమ్మకానికి కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఇందుకు కొన్ని కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలుపుతున్నాయని ఆరోపించారు. సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం కార్మిక శాఖ సహాయ కమిషనర్ డి.శ్రీనివాసులుకు కూడా నోటీసు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, జీఎల్‌బీకేఎస్ జనరల్ సెక్రటరీ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని ఆస్తులపై ఏసీబీ ఫోకస్

నాలుగోరోజూ హరిరామ్‌ను ప్రశ్నించిన ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్ అక్రమార్జనపై ఏసీబీ అధికారులు ఫోకస్ పెంచారు. ఇప్పటికే సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న ఆస్తిపత్రాలతోపాటు హరిరామ్ మరికొన్ని ఆస్తులు కూడబెట్టి ఉండొచ్చని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. హరిరామ్ ఎవరెవరి పేరిట ఆస్తులు కూడబెట్టారని కూడా ఆరా తీస్తున్నారు. కస్టడీలో భాగంగా హరిరామ్‌ను నాలుగోరోజైన సోమవారం సైతం ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఇప్పటికే సేకరించిన సమాచారం, ఆస్తుల పత్రాలు, సోదాల్లో భాగంగా ఏసీబీ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న రికార్డుల ఆధారంగా పలు ప్రశ్నలను సంధించినట్టు తెలిసింది. గత మూడు రోజులుగా ముక్తసరి సమాధానాలకే పరిమితమైన హరిరామ్‌ను ఏసీబీ అధికారులు సోమవారం పలు కీలక పత్రాలను ముందుంచి మరింత లోతుగా ప్రశ్నించినట్టు తెలిసింది.

అందం.. సామాజిక బంధం

ప్రపంచానికి ప్రేరణగా నిలుస్తున్న మిస్ వరల్డ్ అందాల భామలు



నందినీ గుప్తా (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడనున్న సుందరీమణులు సౌందర్యోపాసనకే పరిమితం కావడంలేదు. భావి ప్రపంచానికి ప్రేరణగా నిలుస్తున్నారు. వారిలో ఎందరో వైద్యులు, దౌత్యవేత్తలు, డిజైనర్లు, పైలట్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఎంచుకున్న రంగంలో బిజీగా ఉంటూనే మిస్ వరల్డ్ కిరీటం సొంతం చేసుకోవడానికి పోటీ పడుతున్నారు. మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ కోసం హైదరాబాద్ వస్తున్న 110 దేశాల సుందరీమణులు వృత్తి–ప్రవృత్తి పరంగా భిన్న రంగాల్లో ప్రావీణ్యం సాధిస్తూ ముందుకు సాగుతున్నారు.

సమాజానికి మంచి చేసేందుకు..

- పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందినీ గుప్తా బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చదువుతోంది. రాజస్తాన్‌లోని కోటా నగరానికి చెందిన ఆమె 2023లో ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ టైటిల్ గెలుచుకుంది. భవిష్యత్తు వాణిజ్య సామ్రాజ్యంలో తన కంటూ ప్రత్యేక స్థానం ఉండాలని తపిస్తూనే 'ప్రాజెక్ట్ ఏకతా'ద్వారా వికలాంగులకు మంచి జీవితం అందించేందుకు కృషి చేస్తోంది.
- మిస్ నమీబియా సెల్మా కమన్య ఓ ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త. నమీబియాలో మెరుగైన సమాజాన్ని ఆవిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తోంది.
- టర్కీ సుందరీమణి ఇడిల్ బిల్గెన్, ఉక్రెయిన్‌లో యుద్ధ బాధితులకు చికిత్స చేస్తూ సామాజిక సేవారంగంలో ముందుకు సాగుతున్నారు.
- ఫ్రాన్స్ సుందరి అగాథే కాయెట్, నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన హన్నా జాన్సన్, గయానాకు చెందిన జలికా సామ్యూల్స్ వైద్యులకు అండగా ఆసుపత్రుల్లో రోగులకు సేవలందిస్తున్నారు.
- నేపాల్ భామ శ్రీచ్చా ప్రధాన్ పర్యావరణం మెరుగుపరిచేందుకు పనిచేస్తోంది.
- కిర్గిజ్‌స్తాన్‌కు చెందిన ఐజాన్ చనచేవా, సెర్బియా సుందరి అలెగ్జాండ్రా రుటోవిక్ హోటల్ మేనేజర్లుగా పనిచేస్తున్నారు.
- మిస్ కొలంబియా కాటలినా క్వింటెరో వ్యాపారంపై దృష్టి పెట్టింది.
- అంగోలాకు చెందిన నూరియా అస్సిస్, వ్యాపారం, మార్కెటింగ్‌లో డిగ్రీలు కలిగిన పాప్ స్టార్ గాయని. బీట్‌లను బోర్డ్ రూమ్‌లతో మిళితం చేస్తూ ముందుకు సాగుతున్నారు.
- ఫిన్లాండ్ నుంచి పోటీలో నిలిచిన సోఫియా సింగ్ పీఆర్, మార్కెటింగ్ నిపుణురాలు.
- మిస్ హంగరీ ఆండ్రియా కాట్జెన్‌బాచ్ మార్కెటింగ్ క్యాంపెయిన్‌లను నైపుణ్యంతో సమన్వయం చేస్తున్నారు.
- గ్రీస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టెల్లా మిచైలిడౌ, హైతీకి చెందిన క్రిస్టీ గురాండ్, మిస్ వియత్నాం హుయిన్ ట్రాన్‌యినీ భవిష్యత్తులో గొప్ప వ్యాపార సంస్థలకు సీఈఓలు అయ్యేందుకు బాటలు వేసుకుంటున్నారు.
- దక్షిణాఫ్రికాకు చెందిన జోలైజ్ జాన్సెన్ వాన్ రెనబర్గ్ కేవలం 18 ఏళ్ల వయసులోనే డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా ప్రొఫెషనల్ ప్రపంచంలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు.
- థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాట, గ్లోబల్ అఫైర్స్ గ్రాడ్యుయేట్. ఆగ్నేయాసియా దేశాల మధ్య సంబంధాలపై అధ్యయనం చేస్తున్నారు.
- మిస్ శ్రీలంక అనుది గుణసేకర, మిస్ కొరియా మిన్ జంగ్, పనామాకు చెందిన కరోల్ రోడ్రిగెజ్‌లు కూడా అంతర్జాతీయ దౌత్య సంబంధాలపై అధ్యయనంలో బిజీగా ఉన్నారు.
- కేమన్ ఐలాండ్స్‌కు చెందిన జాడా రమూన్ తన స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్‌తో కలిసి పనిచేస్తున్నారు.
- గ్వాడెలూప్‌నకు చెందిన నోమీ మిల్నే వైద్యురాలిగా రాణిస్తూనే రచయిత్రిగా కూడా ప్రతిభ చాటుకుంటున్నారు.
- వేల్స్‌కు చెందిన మిల్లీ–మే ఆడమ్స్, బోస్నియాకు చెందిన ఎనా అడ్రోవిక్ వైద్యవిద్య అభ్యసిస్తున్నారు.
- ప్యూర్టోరికోకు చెందిన వలేరియా పెరెజ్ మెడికల్ టెక్నాలజీలో మాస్టర్స్ గ్రాడ్యుయేట్.
- బెల్జియంకు చెందిన కరెన్ జాన్సెన్, గ్వాటెమాలా నుంచి పోటీపడుతున్న జైమీ ఎస్కోబెడో, లెబనాన్‌కు చెందిన నాదా కౌస్సా, మలేసియాకు చెందిన సరూప్ రోషి, పోలాండ్‌కు చెందిన మాజా క్లాజ్డాలు మానసిక వైద్యులుగా ఎదిగేందుకు కసరత్తు చేస్తున్నారు.
- ఇంగ్లాండ్‌కు చెందిన మిల్లా మాగీ లైఫ్ గార్డ్, సీపీఆర్ ప్రచారకర్త.
- బ్రెజిల్‌కు చెందిన జెస్సికా పెడ్రోసో, అర్జెంటీనాకు చెందిన గ్వాడలూపే అలోమర్, ఆస్ట్రేలియా ప్రతినిధి జాస్మిన్ స్ట్రింగర్‌లు ఉపాధ్యాయ వృత్తిలో ముందుకు సాగుతున్నారు.
- మెక్సికో భామ మేరిలీ లీల్ విద్యా కార్యక్రమాలను నడుపుతున్నారు.
- చిలీకి చెందిన ఫ్రాన్సిస్కా లవాండెరో కమర్షియల్ పైలట్‌గా రాణిస్తుండగా సొమాలియాకు చెందిన జైనబ్ జమా ఏవియేషన్ అధ్యయనంలో ఉన్నారు.
- అర్మేనియా సుందరి అడ్రిన్ అట్లిమ్యాన్ అర్మేనియా టీవీలో ప్రసారమయ్యే అత్యధిక రేటింగ్ టీవీ సిరీస్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న నటి.
- అమెరికా తరఫున పోటీలో ఉన్న అథెన్నా క్రాస్బీ టీవీ తెరను ఏలుతోంది.
- డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మైరా డెల్గాడో స్వదేశంతోపాటు అమెరికా, ఇతర లాటిన్ అమెరికన్ దేశాల్లో యూనివిజన్ కోసం రిపోర్టర్‌గా పనిచేస్తోంది.
- ఎస్టోనియాకు చెందిన ఎలీస్ రాండ్‌మా సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎదుగుతోంది.

కాస్ట్‌లీ కాంటెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

స్పాన్సర్‌షిప్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 25 కోట్ల మేర సమకూరుతోందన్నది దాని సారాంశం.

ప్రసార హక్కులు, టికెట్ల విక్రయాలతోనూ..

మిస్ వరల్డ్ అందాల పోటీలను 150కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. వాటి ప్రసార హక్కుల కోసం పలు చానళ్లు ఇప్పటికే మిస్ వరల్డ్ సంస్థతో ఒప్పందం చేసుకోవడంతో ఈ రూపంలోనూ ఆ సంస్థకు భారీ మొత్తం సమకూరనుంది. అలాగే పోటీలను ప్రత్యక్షంగా తిలకించేందుకు ఉండే టికెట్ల (హైదరాబాద్ పోటీల విషయంలో ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు) విక్రయాల రూపంలో సైతం ఆ సంస్థకు ఆదాయం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో ఉండే ఒప్పందం మేరకు ఇందులో వాటా ఇస్తుంది.

డిజిటల్, సోషల్ మీడియా హక్కులు

ప్రధాన మీడియా చానళ్లలోనే కాకుండా కొన్ని డిజిటల్, సోషల్ మీడియా చానళ్లలోనూ మిస్ వరల్డ్ పోటీల ప్రత్యక్ష ప్రసారం జరగనుంది. అలాంటి సంస్థలకు కూడా హక్కులు విక్రయించడం ద్వారా మిస్ వరల్డ్ సంస్థ ఆదాయం పొందనుంది. యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వాణిజ్య ప్రకటనల ప్రసారం ద్వారా కూడా ఆదాయంలో మిస్ వరల్డ్ సంస్థ వాటా పొందుతున్నట్లు సమాచారం.

ఆదాయ వివరాల్లో గోప్యత..

ప్రపంచ సుందరి పోటీల నిర్వహణకు సంబంధించిన ఖర్చు వివరాలు మాత్రమే వెల్లడవుతుండగా ఆదాయ వివరాలను మాత్రం మిస్ వరల్డ్ సంస్థ గోప్యంగా ఉంచుతోంది. ఇతర అంతర్జాతీయ కార్యక్రమాలు, క్రీడా పోటీల ద్వారా స్పాన్సర్‌షిప్స్ ఆదాయంపై కొంత స్పష్టత ఉంటున్నా అందాల పోటీల విషయంలో మాత్రం సంపూర్ణ గోప్యతే కొనసాగుతోంది. పోటీల నిర్వహణకు అయ్యే ఖర్చుతో పోలిస్తే 10 నుంచి 15 రెట్ల ఆదాయం ఉంటుందని తెలుస్తోంది.

భారత్‌లోనే ఖర్చు తక్కువ..

2023లో మిస్ వరల్డ్ పోటీలకు తొలుత యూఏఈని ఎంపిక చేశారు. ఆ సమయంలో పోటీల నిర్వహణ బడ్జెట్‌ను రూ. 250 కోట్లుగా అంచనా వేశారు. కానీ అనివార్య కారణాలతో పోటీలు ముంబైకి మారాయి. ముంబైలో పోటీలకు చేసిన ఖర్చు, యూఏఈ అంచనాలో కేవలం 35 శాతంగా ఉన్నట్లు సమాచారం. రూ. 100 కోట్లలోపు ఖర్చుతోనే పోటీలను ముగించారు. ఇప్పుడు హైదరాబాద్‌లో అంతకంటే తక్కువ మొత్తాన్నే ఖర్చు చేస్తున్నారు. అయితే నగర సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చు దీనికి అదనం. ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. అయితే స్పాన్సర్‌షిప్స్, ఇతర రూపాల్లో వచ్చే ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి మిస్ వరల్డ్ సంస్థ చెల్లించనుందని సమాచారం. కానీ ఇందులో స్పష్టత లేదు.

15న పోచంపల్లికి మిస్ వరల్డ్ పోటీదారులు

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీదారులు ఈనెల 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నారు. దీంతో భారత దేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇక్కత్‌పై ప్రపంచ దృష్టి పడనుంది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి గ్రామం సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతుల ద్వారా అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో 'ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామం'గా గుర్తించింది. ఈ గ్రామం చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కడి నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన ఐకానిక్ టెలియా రుమాల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చరిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

చిన్నలోపం కూడా ఉండొద్దు

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు జూపల్లి, పొంగులేటి, వేం నరేందర్‌రెడ్డి, డీజీపీ

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలను చిన్నపాటి లోటుపాట్లు కూడా లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మే 10 నుంచి 31 వరకు జరిగే ప్రపంచస్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు ఉపకరించే ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. పోటీదారులతోపాటు దేశ, విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3 వేల మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలన్నారు. మిస్‌వరల్డ్– 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం సమీక్షించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతోపాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. పోటీల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ఉండాలని సీఎం సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రారంభోత్సవం నుంచి... 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. చార్మినార్, లాడ్‌బజార్, సచివాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు, భద్రత కల్పించాలన్నారు.

అనుకోని అవాంతరాలు ఎదురైతే..

అనుకోని అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా, వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతోపాటు ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతోపాటు గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సచివాలయ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతోపాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు.

సంస్థాగత ఎన్నికలను త్వరగా పూర్తి చేయండి



- పార్టీ ప్రధాన కార్యదర్శులకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశం
- ఢిల్లీలో బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్ తదితరులతో నడ్డా భేటీ
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపైనా చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా మిగతా రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జీలను ఆదేశించారు. పార్టీ జిల్లా, మండల అధ్యక్షుల ఎంపిక పూర్తయిన రాష్ట్రాల్లో సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. సోమవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్, తరుణ్‌ఛుగ్, అరుణ్ సింగ్, వినోద్ తావ్డే, శివప్రకాశ్ తదితరులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సునీల్ బన్సల్ ఇటీవల తెలంగాణలో తన పర్యటన, సంస్థాగత నిర్మాణంపై రాష్ట్ర నేతలకు చేసిన సూచనల గురించి వివరించారు. తెలంగాణలో ఈనెల 15వ తేదీ నాటికి జిల్లా, మండల అధ్యక్షుల ఎంపికను పూర్తి చేయాల్సిందిగా ఆదేశించిన విషయాన్ని చెప్పారు. ఇదే సమయంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న నేతలు, పార్టీ సీనియర్‌ల అభిప్రాయాలపైనా ఈ భేటీలో చర్చ జరిగింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్‌లతో సహా మరో మూడు పేర్లపై ఈ భేటీలో నేతలు చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర నాయకుల నుంచి మరోమారు అభిప్రాయ సేకరణ జరిపిన అనంతరం రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై తుది నిర్ణయానికి రావాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రానున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ ప్రచార కార్యక్రమాలు, గెలుపు వ్యూహాలను సిద్ధం చేసే అంశాలపై జేపీ నడ్డా.. ప్రధాన కార్యదర్శులకు సూచనలు చేసినట్లు తెలిసింది. కులగణన గురించి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించే విషయంలో కూడా జేపీ నడ్డా నాయకులకు మార్గనిర్దేశం చేసినట్లు తెలిసింది.



శ్రీతేజను పరామర్శిస్తున్న అల్లు అరవింద్, బన్నీ వాసు

శ్రీతేజ కోసం మా కుటుంబం మొత్తం ఎదురుచూస్తోంది: అల్లు అరవింద్

రాంగోపాల్‌పేట్: పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ కోలుకుని బయటకు రావాలని తమ కుటుంబం మొత్తం ఎదురుచూస్తోందని సినీ నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. శ్రీతేజను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి నుంచి పాత సన్‌షైన్ ఆస్పత్రి ప్రాంతంలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించిన సంగతి తెలిసిందే. సోమవారం అల్లు అరవింద్ రిహాబిలిటేషన్ కేంద్రంలోని శ్రీతేజను పరామర్శించి అతని గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ చికిత్సకు సహకరిస్తున్నారని వైద్యులు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీతేజ రోజురోజుకూ కోలుకుంటున్నాడని తెలియడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. త్వరలోనే శ్రీతేజ అందరి మధ్య సాధారణ పిల్లోడిలా ఉంటాడనే ఆశాభావం అరవింద్ వ్యక్తంచేశారు. ఆయన వెంట బన్నీ వాసు ఉన్నారు.

అందాల పోటీపై ఉన్న శ్రద్ధ.. అన్నదాతలపై లేదు: హరీశ్‌రావు



సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు


సాక్షి, సిద్దిపేట: సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీల గురించి సమీక్షలు, ఢిల్లీకి వెళ్లడంపై ఉన్న శ్రద్ధ.. అన్నదాతలపై లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఐదుగురు రైతులు మరణించారని, ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని మంత్రి తుమ్మల చెప్పిన మాటలు ఉత్తమాటలేనని విమర్శించారు. ఇప్పటివరకు రూ.6,200 కోట్ల ధాన్యం కొనుగోలు చేస్తే.. రూ.3 వేల కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. పత్తి కొనుగోళ్లలో రూ.3 వేల కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్ ఏమైందని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఒక వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

విదేశీ హెల్త్ టూరిస్టుల రాక పదేళ్లలో రెండింతలు

2024లో భారత్‌కు వచ్చిన రోగులు 4.64 లక్షల మంది.. అందులో 1.51 లక్షల మంది భాగ్య నగరానికే..

విదేశీ హెల్త్ టూరిస్టుల రాక ఇలా...
2014లో **75,171**
2024లో **1,55,313**



బైపాస్ సర్జరీ మొదలుకొని..మోకాలి చిప్పల మార్పిడి వరకు తక్కువ ఖర్చుతో మన దేశంలోనే చికిత్సలు జరుగుతున్న నేపథ్యంలో.. వైద్యం కోసం ఇక్కడకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాల నుంచి లక్షలాది మంది రోగులు ప్రతి సంవత్సరం భారత్‌కు వైద్య చికిత్సల కోసం వస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వీరిలో హైదరాబాద్‌ను వైద్యం కోసం ఎంచుకొంటున్న వారి సంఖ్య 30 నుంచి 40 శాతం కావడం గమనార్హం. 2024లో వైద్యసేవల కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులు 4.64 లక్షలు అయితే, వారిలో 1.51 లక్షల మంది హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రుల్లోనే చికిత్స పొందారు. అంటే దేశంలో మెడికల్ టూరిజంలో హైదరాబాద్ వాటా దాదాపు 30 శాతంపైనే.

- సాక్షి, హైదరాబాద్

అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే తెలంగాణలో చికిత్స ఖర్చులు 60–80% తక్కువ. దాదాపు శతాబ్ద కాలంగా వైద్య సేవలు అందిస్తున్న ఉస్మానియా ఆస్పత్రితోపాటు నిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి మొదలు పలు కార్పొరేట్ ఆస్పత్రులు అధునాతన సాంకేతికతతో కూడిన రోబోటిక్ సర్జరీ, టెలీ మెడిసిన్లతో పాటు కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, కేన్సర్, కాస్మెటిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫెర్టిలిటీ చికిత్సలు (ఐవీఎఫ్), అవయవ మార్పిడి వంటి చికిత్సలను నిపుణులైన వైద్యులతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి.

తక్కువ ఖర్చు...అధునాతన చికిత్సలు

- ➜ వైద్య ఖర్చుల విషయంలో అమెరికా తదితర పాశ్చాత్య దేశాల్లో బైపాస్ సర్జరీ తక్కువలో తక్కువగా ఒక లక్ష డాలర్లు (రూ. 87 లక్షలు) అవుతుండగా హైదరాబాద్‌లో మాత్రం కేవలం 5 వేల డాలర్ల నుంచి10 వేల డాలర్లు (రూ.4.50 లక్షల నుంచి రూ. 9 లక్షల వరకు) మాత్రమే ఖర్చు అవుతోంది.
- ➜ మోకాలు రీప్లేస్‌మెంట్ సర్జరీకి పాశ్చాత్య దేశాల్లో 40 వేల నుంచి 60 వేల డాలర్లు అవుతుండగా, హైదరాబాద్‌లో ఐదు వేల డాలర్ల లోపే అవుతున్నాయి.
- ➜ డెంటల్ సమస్యలకు విదేశాల్లో ఐదు వేల డాలర్లు అవుతుండగా, మన దగ్గర వెయ్యి డాలర్ల లోపే. దీంతో విదేశాల నుంచి వైద్య అవసరాలకు హైదరాబాద్ వస్తున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది.

భాష నుంచి వీసా వరకు సౌకర్యవంతంగా

హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో నైపుణ్యం గల డాక్టర్లతోపాటు విదేశీయులతో ఇబ్బంది లేకుండా ఇంగ్లిష్, ఉర్దూ మాట్లాడే డాక్టర్లు, సిబ్బంది ఉండటంతో మధ్య ప్రాచ్య దేశాలతోపాటు యూరప్, రష్యా, ఆఫ్రికా దేశాల నుంచి రోగులు ఆసక్తి చూపుతున్నారు. బంగ్లాదేశ్, ఇరాక్, కెన్యా, ఉజ్బెకిస్తాన్, సూడాన్ దేశాల నుంచి హైదరాబాద్‌లో చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. వైద్య వీసా (ఇ–వీసా), రాష్ట్ర ప్రభుత్వ మద్దతు నేపథ్యంలో విదేశీ రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడం తెలంగాణలో మెడికల్ టూరిజం వేగంగా అభివృద్ధి చెందుతోంది.

రెండు రెట్లు పెరిగిన విదేశీ హెల్త్ టూరిస్టులు

2014 సంవత్సరంలో 75 ,171 మంది విదేశీ హెల్త్ టూరిస్టులు హైదరాబాద్‌లో వైద్య సేవల కోసం రాగా, 2024లో 1,55,313 మంది విదేశీయులు వచ్చినట్టు గణాంకాలు చెపుతున్నాయి. అదే సమయంలో 2024 సంవత్సరంలో 8.82 కోట్ల మంది రోగులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య సేవల కోసం తెలంగాణకు వచ్చారు.

మెడికల్ టూరిజం ఆదాయంలో హైదరాబాద్‌దే కీలక వాటా

భారత్ మొత్తం మెడికల్ టూరిజం ఆదాయం 2025లో 8.7 బిలియన్ డాలర్లు వస్తుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేయగా, అందులో హైదరాబాద్‌దే ప్రధాన వాటా అని నిపుణులు చెబుతున్నారు. హెల్త్ టెక్నాలజీ, రీసెర్చ్, సంప్రదాయ వైద్య విధానాలను కలగలిపిన ఈ నగరం.. త్వరలోనే ఆసియా వైద్య గమ్యస్థానాల్లో ఒకటిగా పేరొందే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. హైదరాబాద్ తోపాటు చెన్నై, ముంబై, ఢిల్లీ కూడా మెడికల్ టూరిజంలో కీలకంగా మారాయి.

క్లుప్తంగా...

అమెరికాలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ

- జూన్ 1న డల్లాస్ సభకు ముఖ్యఅతిథిగా కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభను జూన్ ఒకటో తేదీన అమెరికాలో నిర్వహిస్తున్నట్లు పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం ప్రకటించింది. డల్లాస్‌లో జరిగే ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. డల్లాస్‌లోని డీఆర్ అప్పర్ అరేనాలో ఈ సభ నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగం అంతర్జాతీయ సమన్వయకర్త మహేశ్ బిగాల, బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్ సంయుక్త ప్రకటన చేశారు. డల్లాస్ సభకు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు కూడా హాజరు కానున్నారు. ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభకు దీటుగా అమెరికాలో సభను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. ఏడాది పాటు వివిధ దేశాల్లో రజతోత్సవ వేడుకలు నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగం సన్నాహాలు చేస్తోంది. ఎల్కతుర్తి రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నారని స్పష్టమైందని మహేశ్ బిగాల ప్రకటించారు. అమెరికాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్‌ఆర్‌ఐలు హాజరయ్యే సభలో తెలంగాణ కళాకారుల బృందం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

కుల సర్వే, కులగణనకు తేడా ఏంటో చెప్పాలి

- కిషన్‌రెడ్డికి ఆది శ్రీనివాస్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వానిది కుల సర్వే, కేంద్ర ప్రభుత్వానిది కులగణన అని చెబుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కులసర్వేకు, కులగణనకు తేడా ఏంటో చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డి లాజిక్కు లేకుండా మాట్లాడుతున్నారని, సర్వే చేసినప్పుడు ఒక కులం పేరు చెప్పిన వాళ్లు గణన జరిగినప్పుడు ఇంకో కులం పేరు చెపుతారా అని ఎద్దేవా చేశారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో కులసర్వే విజయవంతం కావడంతో బీజేపీ కళ్లు తెరిచిందని అన్నారు. కులగణన పేరుతో బీజేపీ కుయుక్తులకు పాల్పడుతోందని, అయినా దాన్ని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. బీసీల కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, బీసీల గురించి ఆలోచించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. బీఆర్‌ఎస్‌లో బావ, బావమరిది మధ్య కుర్చీ పంచాయితీ జరుగుతోందని, చాలా కాలంగా జరుగుతున్న ఈ గొడవకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని చెప్పారు. వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు హరీశ్ ప్రయత్నించారని, ఇప్పుడు కూడా ఎవరైనా తమ పార్టీలోకి రావాలనుకుంటే అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు, కేసీఆర్‌లే మాట్లాడారని, దీంతోనే ఆ పార్టీలో సామాజిక న్యాయం ఏంటో తేలిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు.

టీచర్లు, గ్రాడ్యుయేట్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రభుత్వానికి బీజేపీ ఎమ్మెల్సీల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, సి.అంజిరెడ్డి డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా వీరికిచ్చిన హామీల్లో ఒక్కటికూడా నెరవేర్చలేదని విమర్శించారు. సోమవారం అంజిరెడ్డితో కలిసి కొమురయ్య మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం దగ్గర ఉండిపోయిన రిటైర్డ్ ఉద్యోగుల సొమ్ము వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్వశిక్షా అభియాన్ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, కాంట్రాక్ట్ బేసిస్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఏడాదిన్నర అవుతున్నా ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించలేదని, ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని అంజిరెడ్డి విమర్శించారు.

పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏలను జీపీవోలుగా నియమించాలి

ప్రభుత్వానికి టీజీఆర్‌ఎస్‌ఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసిన అనుభవం ఉన్న పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏలను ఎలాంటి షరతులు, విద్యార్హతలతో సంబంధం లేకుండా గ్రామ పాలనాధికారులు (జీపీవో)గా నియమించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ) ప్రభుత్వాన్ని కోరింది. భూ పరిపాలనపై వారికి అవగాహన ఉన్న నేపథ్యంలో జీపీవోలుగా నియమిస్తే అంకిత భావంతో పని చేస్తారని, భూభారతి చట్టం అమలుకు సమర్థవంతంగా కృషి చేస్తారని తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షంలు సోమవారం గౌరవాధ్యక్షుడు వి.లచ్చిరెడ్డితో కలిసి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీసీఎల్‌ఏ కార్యదర్శి మంద మకరంద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీపీవోల నియామకంలో ఉన్న సమస్యలు, ఇబ్బందుల గురించి వారితో చర్చించారు. విద్యార్హతలు, ఐదేళ్ల అనుభవం అనే నిబంధనలను తీసేయాలని, వీఆర్వోలకు రెవెన్యూ శాఖతో ఉన్న పరిచయం ఆధారంగా నియామకాలు చేయాలని కోరారు. కాగా, తమ విజ్ఞప్తికి ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని రాంరెడ్డి, భిక్షంలు వెల్లడించారు.

తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

▶ మొదటి పేజీ తరువాయి

రహదారులు, ఫ్లైఓవర్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో 65 ఏళ్లలో 2,500 కి.మీ జాతీయ రహదారులు నిర్మిస్తే, ఈ పదిన్నరేళ్లలో మోదీ ప్రభుత్వం కొత్తగా మరో 2,600 కి.మీ నిర్మించింది. రూ.1.25 లక్షల కోట్లు జాతీయ రహదారులపై ఖర్చు చేసింది. నితిన్ గడ్కరీని ఫ్లైఓవర్ మంత్రి అంటారు. ఆయన పేరు మారుమూల ప్రాంతాల్లోనూ మారుమోగుతోంది'అని తెలిపారు.

చౌటుప్పల్ – సంగారెడ్డి వరకు పనులను కేంద్రమే చేపట్టాలి : కోమటిరెడ్డి

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..'రీజినల్ రింగ్ రోడ్డు నార్త్ సైడ్ 95 శాతం భూ సేకరణ అయ్యింది. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు పనులను కేంద్రమే చేపట్టాలి. అంబర్‌పేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి సంబంధించి పరిహారం రాలేదని నాకు ఫిర్యాదు అందింది. వారందరికీ నెల రోజుల్లోపు సమస్యను పరిష్కరిస్తాం'అన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, అర్వింద్, లక్ష్మణ్, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, సూర్యనారాయణ, నగేశ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి జాతికి అంకితం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన సభావేదికపై నుంచి జాతీయ రహదారులను జాతికి అంకితం చేయడంతోపాటు



ఎన్‌హెచ్ 363ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క తదితరులు

రూ.3,900 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఆదిలాబాద్, పెద్దపల్లి ఎంపీలు గోడం నగేశ్, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యేలు హరీశ్‌బాబు, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుపటేల్, రామారావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఫ్లైఓవర్ ప్రారంభం

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలో రూ.138 కోట్ల వ్యయంతో నిర్మించిన భెల్ ఫ్లైఓవర్‌ను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఇక్రిశాట్ ప్రాంగణానికి హెలికాప్టర్ ద్వారా చేరుకున్న ఆయనకు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ ఎం.రఘునందన్‌రావు, కలెక్టర్ క్రాంతి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీఎస్ రామకృష్ణారావు, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

గడ్కరీని కలిసిన మంత్రి తుమ్మల

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం రాత్రి బేగంపేట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ధంసలాపురం నుంచి ఖమ్మం కలెక్టరేట్ వరకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. జగ్గయ్యపేట నుంచి వైరా మీదుగా కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నుంచి కురవి అమరావతి నుంచి నాగపూర్ జాతీయ రహదారి వరకు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.

అశ్రునయనాల మధ్య జస్టిస్ ప్రియదర్శిని అంత్యక్రియలు



జస్టిస్ ప్రియదర్శిని పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రాయదుర్గం: అశ్రునయనాల మధ్య సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజాప్రియదర్శిని (61) అంత్యక్రియలను నిర్వహించారు. ఆమె కుటుంబ సభ్యులు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రాయదుర్గంలోని వైకుంఠ మహా ప్రస్థానంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. హఫీజ్‌పేట్ ప్రాంతంలోని నివాసం నుంచి ప్రత్యేక వాహనంలో ఆమె పార్థివదేహాన్ని రాయదుర్గంలోని మహాప్రస్థానానికి తీసుకొచ్చారు. అక్కడ శాస్త్రయుక్తంగా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశంతో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించారు. హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు న్యాయవాదులు, బంధువులు, స్నేహితులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ

కేంద్ర మంత్రికి పలు విజ్ఞప్తులు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్‌రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి బేగంపేట విమానాశ్రయంలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించారు. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించిన ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి వీలయినంత త్వరగా ఫైనాన్షియల్, కేబినెట్ ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని ఏకకాలంలో పూర్తి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ 765లోని హైదరాబాద్– శ్రీశైలం సెక్షన్‌కు సంబంధించి మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను కలిపే రేడియల్ రోడ్ల అభివృద్ధి ఆవశ్యకతను ఈ సందర్భంగా సీఎం వివరించారు. హైదరాబాద్-డిండి- మన్ననూర్, హైదరాబాద్- మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ హైవే, ఓఆర్ఆర్ నుంచి మన్నెగూడ వరకు రేడియల్ రోడ్ అభివృద్ధి పనులకు సంబంధించి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని గడ్కరీని కోరారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, సలహాదారుడు హర్కర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నక్సల్స్ తుపాకీ వదిలి లొంగిపోవాల్సిందే..

- కేంద్ర మంత్రి బండి సంజయ్



జ్యోతినగర్ (రామగుండం): నక్సల్స్‌పై నిషేధం విధించిన కాంగ్రెస్.. వారితో చర్చలు జరపాలని డిమాండ్ చేయడం ఆ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపేవారిని సామాజిక కోణంతో చూడాలనడం బాధాకరమన్నారు. సోమవారం ఆయన ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్ వెళ్తూ మధ్యలో రామగుండం ఎన్టీపీసీ జ్యోతి భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నక్సల్స్ తుపాకీ వీడి లొంగిపోవాల్సిందేనని, జనజీవన స్రవంతిలో కలవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో హరగోపాల్, వరవరరావు సహా పౌరహక్కుల సంఘం నేతలే నక్సల్స్‌కు నచ్చజెప్పాలని సూచించారు. పదేళ్లు పాలించిన కేసీఆర్‌కు, ఇప్పుడున్న కాంగ్రెస్‌కు నక్సల్స్‌పై నిషేధాన్ని ఎత్తివేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయనేలేదన్నారు.

అక్కడక్కడా భూప్రకంపనలు

▶ మొదటి పేజీ తరువాయి

భూమి కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని లక్ష్మణచాంద, పెంబి, ఖానాపూర్, దస్తురాబాద్, జన్నారం, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల్లోనూ ప్రకంపనలు వచ్చాయి. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలో నుంచి ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. టేబుల్‌పై ఉన్న గ్లాసు కింద పడిందని జన్నారం మండలం పొనకల్ శ్రీలంక కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు జాడి రాజన్న తెలిపారు. తపాలపూర్‌లో అంట్ల స్టాండ్ నుంచి గ్లాసులు కింద పడినట్టు విజయధర్మ తెలిపారు.

- ➤ సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటతోపాటు దుబ్బాక పట్టణంలో సాయంత్రం 6.45 నిమిషాల నుంచి 7 గంటల మధ్యలో స్వల్పంగా భూమి కంపించినట్టు గ్రామస్తులు తెలిపారు.

ఎవరిపై మీ సమరం?

▶ మొదటి పేజీ తరువాయి

సేవకులం. రాజకీయ పార్టీల చేతుల్లో పావులుగా మారవద్దని ఉద్యోగులకు నేను విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని.. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని.. ప్రభుత్వం సాఫీగా నడవొద్దని కొన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఉంటది. మీరు వాళ్ల ఉచ్చులో పడి వాళ్ల చేతుల్లో పావులుగా మారొద్దు. రాజకీయ నాయకుల చేతుల్లో చురకత్తుల్లా మారి ప్రజల గుండెల్లో గుచ్చితే అది గాయంగా మారుతుంది తప్ప ప్రయోజనం ఉండదు. నన్ను కోసినా ఒక్క రూపాయి కూడా రాదు. నెలకు రూ. 18,500 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం లేదు. వాస్తవ పరిస్థితి ఇది. మరి నన్ను ఏం చేస్తరు? నన్ను కోసుకొని వండుకొని తింటరా?'అని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

దుబారా తగ్గిస్తున్నా..: 'ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు ప్రతి నెలా రూ. 22,500 కోట్లు కావాలి. ప్రభుత్వానికి వస్తున్న రూ. 18,500 కోట్లలో ప్రతి నెలా అప్పులకు రూ. 7 వేల కోట్లు, ఉద్యోగుల వేతనాలు, పింఛన్లకు రూ. 5,500 కోట్లు పోను నా దగ్గర మిగిలేవి రూ. 6 వేల కోట్లు. అవకాశం ఉన్న ప్రతి దగ్గర ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నా. సీఎం హోదాలో ఎక్కడికి పోయినా ప్రత్యేక విమా నం తీసుకెళ్లే వెలుసుబాటు ఉన్నా మామూలు విమానాల్లో ఎకానమీ క్లాస్‌లో సాధారణ ప్రయాణికులతో కలిసే వెళ్తున్నా. దుబారా తగ్గిస్తున్నా'అని సీఎం పేర్కొన్నారు.

ఏది ఆపమంటారో మీరే ప్రజలకు చెప్పండి..

'మీ కోరికలు తీర్చాలంటే ఏం చేయాలి? కావాలంటే నేనే బహిరంగ సభ ఏర్పాటు చేస్తా. 10 లక్షల మందిని కూడా తీసుకొస్తా. ఇట్లా చేస్తే బాగుంటదని సభలో మీ ఉద్యోగుల సంఘాల నాయకులే మాట్లాడండి. ఏ పథకం ఆపాలో మీరే ప్రజలకు చెప్పండి. ఫలానా పథకం ఆపేసి మేం జీతాలు పెంచుకుంటాం. బోనస్‌లు తీసుకుంటాం. మేం తిన్నాక మిగిలిందే మీకు ఇస్తామని ప్రజలకు చెప్పండి. లేదంటే రూ. 100 ఉన్న పెట్రోల్ రూ. 200 చేద్దామా? బియ్యం, పప్పు, ఉప్పు, చింతపండు ధరలు రెండింతలు చేద్దామా? మీరే చెప్పండి. ధరలు పెంచకుండా ఉన్న పథకాలను ఆపకుండా కొత్త కోరికలు నెరవేరవు. నిరసనలు, ధర్నాలు, బంద్‌లు చేస్తే ఉన్న వ్యవస్థ కూడా కుప్పకూలుతుంది. నాకు పోయేది కూడా ఏమీ లేదు. చిన్న గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడమే ప్రజలు నాకిచ్చిన గొప్ప గౌరవం అనుకుంటా. ఆ గౌరవం బతికి ఉన్నంత కాలం ఈ గౌరవం నిలబెట్టేందుకు పనిచేస్తా'అని సీఎం రేవంత్ చెప్పారు.



రాష్ట్ర గీతం ఆలపిస్తుండగా వేదికపై నిల్చున్న సీఎం రేవంత్, జితేందర్, పొన్నం, రామకృష్ణారావు, రవి గుప్తా, సీపీ ఆనంద్

అప్పంతా బకాయిలకే..: 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో తెచ్చిన అప్పు రూ. 1.58 లక్షల కోట్లు. అందులో రూ. 1.52 లక్షల కోట్లు పాత అప్పులు, అసలు, మిత్తికి చెల్లించాం. గత ప్రభుత్వం మొత్తం రూ. 8.29 లక్షల కోట్ల బకాయిలు పెట్టిపోయింది. మేం తెచ్చిన అప్పులో సొమ్మంతా పాత బకాయిలకు పోయింది తప్ప ఏ సంక్షేమ కార్యక్రమాలు చేయలేక పోయాం. ఈ 16 నెలల్లో సరాసరిన నెలకు రూ. 9 వేల కోట్లు చెల్లించుకుంటూ వస్తున్నా. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వాల్సి వస్తుందనే గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసు మూడేళ్లు పెంచింది. ఇప్పుడు రిటైరవుతున్న వాళ్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ల కింద రూ. 8,500 కోట్ల బకాయిలు చెల్లించాలి. వాటిని ఒకవైపు క్రమబద్ధీకరిస్తూనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం. అదనంగా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ. 500 బోనస్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు, పేదల ఇళ్లకు 250 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 16 నెలల్లో కేవలం రైతులకే రూ. 30 వేల కోట్లను వాళ్ల ఖాతాల్లోకి బదిలీ చేశా'అని సీఎం పేర్కొన్నారు.

బ్యాంకర్లను కలిసేందుకు వెళ్తే దొంగల్లా చూస్తున్నరు..

'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు. అప్పు పుడతలేదు. బ్యాంకర్లను కలిసేందుకు వెళ్తే తెలంగాణవారిని దొంగల్లా చూస్తున్నరు. ఢిల్లీకి పోతే అపాయింట్‌మెంట్ కూడా ఇస్తలేరు. దేశం ముందు తెలంగాణది ఆ పరిస్థితి ఉంది. కుటుంబ పరువు తీయొద్దని కుటుంబ పెద్దగా నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నా'అని సీఎం ఉద్యోగ సంఘాల నేతలకు సూచించారు.

కేసీఆర్‌ది పైశాచిక ఆనందం :'డైలీ ఫైనాన్స్‌లో రూ. 10 మిత్తికి తెచ్చుకొనే వాడికంటే అధ్వానంగా అప్పులు తెచ్చిపెట్టిండు ఆయన (మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి). రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి మీ సావు మీరు సావండని హ్యాపీగా ఫాంహౌస్‌లో దుప్పటి కప్పుకొని పడుకుండు. మూడు నెలలకొకసారి బయటికి వచ్చి అది ఫెయిల్.. ఇది ఫెయిల్ అని తిడతడు. ఇదేం పైశాచిక ఆనందం?'అని సీఎం రేవంత్ మండిపడ్డారు.

నిమిషం నిర్లక్ష్యంగా ఉన్నా పోలీస్ శాఖకు చెడ్డపేరు..

'శాంతిభద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం. శాంతిభద్రతలు బాగున్నందునే 16 నెలల్లో రూ. 2.28 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించగలిగాం. దీనంతటికీ కారణం పోలీస్ శాఖ అని నేను గర్వంగా చెబుతున్నా. ఈ శాఖకు అవసరమైన పూర్తి సహకారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం, సీఎస్ రామకృష్ణారావు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ ఆనంద్, పలువురు ఐపీఎస్‌లు పాల్గొన్నారు.





ఇతరులకు నచ్చినట్లుగా ఉండటానికి మనం మనలోని మూడొంతుల భాగాన్ని కోల్పోతాం.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 6 మే 2025

మితవాదానికి మరో ఓటమి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గమనించుకుంటున్నారో లేదో గానీ ప్రపంచంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆయన చర్చనీయాంశం అవుతున్నారు. గెలుపోటముల్ని ప్రభావితం చేస్తున్నారు. ఇటీవల కెనడా ఎన్నికల్లో ట్రంప్ పట్ల మెతకగా వ్యవహరించిన కన్సర్వేటివ్‌లు ఓటమిపాలై, ఊహించని రీతిలో అధికార లిబరల్ పార్టీ గెలుపొందింది. ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అదే జరిగింది. అచ్చం ట్రంప్ విధానాలనే అనుకరిస్తూ ఆస్ట్రేలియా ఎన్నికల్లో తిరుగులేని గెలుపు సాధించాలనుకున్న విపక్ష కన్సర్వేటివ్ పార్టీ అపజయాన్ని మూటకట్టుకోవటమే కాదు... ఆ పార్టీ గెలిస్తే ప్రధాని అవుతారనుకున్న నాయకుడు పీటర్ డటన్ సైతం ఓటమి పాలయ్యారు. 2004 తర్వాత వరసగా రెండోసారి కూడా అధికారం నిలబెట్టుకున్న పార్టీగా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ చరిత్ర సృష్టించింది. ఇక సింగపూర్‌లో ఎప్పటిలా పద్నాలుగోసారి సైతం అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) తిరిగి అధికారంలోకి రావటం వింతేమీ కాదుగానీ... ఆ పార్టీ నేత, ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రచారసభల్లో ట్రంప్‌పై రణభేరి మోగించారు. అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించారు. అసలు అమెరికాకు సింగపూర్ నుంచి ఎగుమతులు చేసేదే లేదని స్పష్టం చేశారు. 97 స్థానాలున్న సభలో ఆ పార్టీ 87 స్థానాలు గెల్చుకోవటం గతంలో కూడా జరిగినా ఈసారి వోటు శాతాన్ని సైతం 66.57కి పెంచుకుని చరిత్ర సృష్టించింది. ఇక రుమేనియాలో మాత్రం ట్రంప్‌ను తలకెత్తుకున్న తీవ్ర మితవాదపక్షం అలయెన్స్ ఫర్ ది యూనిటీ ఆఫ్ రుమేనియన్స్ (ఏయూఆర్) నాయకుడు జార్జి సైమన్ తొలి రౌండ్‌లో గెలుపొందారు. ఈ నెల 18న జరగబోయే రెండో రౌండ్ ఎన్నికల్లో సైతం ఆయనదే విజయమన్న అంచనాలున్నాయి. వచ్చే సెప్టెంబర్‌లో ఎన్నికలు జరగబోయే నార్వేలో కూడా ట్రంప్ ప్రభావం కనబడుతోంది. అక్కడి అధికార లేబర్ పార్టీకి ఓటమి తప్పదని జనవరిలో వివిధ సర్వేలు ప్రకటించగా, ఆ మరుసటి నెలకల్లా అంతా మారిపోయింది. ఇప్పుడు లేబర్ పార్టీయే గెలుపుగుర్రంగా కనబడుతోంది.

కరోనా దాపురించినప్పటి నుంచీ ఆస్ట్రేలియా ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కాదు. ముఖ్యంగా మూడేళ్లుగా ఆ దేశంలో ఉత్పాదకత తీవ్రంగా దెబ్బతింది. ద్రవ్యోల్బణం పెరిగింది. దాన్ని తగ్గించటానికి ఆస్ట్రేలియా రిజర్వ్‌బ్యాంక్ 13 సార్లు వడ్డీరేట్లు పెంచింది. ఫలితం లేకపోగా అధిక ధరల కారణంగా కొనుగోళ్లు ఆగిపోయి గృహనిర్మాణ రంగం పడకేసింది. వీటన్నిటి వల్ల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఇవన్నీ చూసి తదుపరి ఎన్నికల్లో తమదే విజయమని కన్సర్వేటివ్ పార్టీ కలలుగంది. అమెరికాలో ట్రంప్‌కు పెరుగుతున్న మద్దతు చూసి అదే తరహా ప్రకటనలు చేసి ఆ పార్టీ నాయకుడు డటన్ మొదట్లో వోటర్ల మెప్పు పొందినమాట వాస్తవం. ప్రభుత్వ రంగంలో 40,000 ఉద్యోగాలు రద్దుచేస్తామని, వలసల విషయంలో కఠినంగా వుంటామని, ఉదారవాద విధానాలైన భిన్నత్వం, అందరినీ కలుపుకొనిపోవటం వగైరాలకు కాలం చెల్లిందని ఆయన పదే పదే ప్రకటించారు. ఆస్ట్రేలియా మొదటి నుంచీ అమెరికా మిత్ర దేశమే. అయినా ట్రంప్ ఏమాత్రం కనికరించలేదు. అందరితోపాటు ఆస్ట్రేలియాపైనా భారీయెత్తున సుంకాలు పెంచుతామని ప్రకటించారు. ఇవింకా అమల్లోకి రాకపోయినా అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం కారణంగా అసలే అంతంతమాత్రంగా వున్న ఆర్థిక వ్యవస్థ మరింత అనిశ్చితిలోకి పోయింది. ఈ దశలో డటన్ తనకు ట్రంప్‌తో వున్న వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థను సునాయాసంగా గట్టెక్కిస్తానని హామీ ఇచ్చారు. కానీ ట్రంప్ దూకుడు కారణంగా స్టాక్ మార్కెట్లన్నీ బోల్తా కొట్టడంతో డటన్‌కు దిక్కుతోచలేదు. దాంతో ట్రంప్ ప్రస్తావన మానుకున్నారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. జనం లేబర్ పార్టీకే వోటేయాలన్న నిర్ణయానికొచ్చారు.

సింగపూర్ సైతం ఆర్థిక అస్థిరతలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వాణిజ్యం దెబ్బతిని వుండగా ట్రంప్ అధిక సుంకాల ప్రకటన మరింత దెబ్బ తీసింది. ఆస్ట్రేలియా మాదిరే ఆ దేశంలోనూ పౌరులకు సొంతిళ్లు సమకూర్చుకోవటం సమస్యగా మారింది. పెరిగిన ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, ఉద్యోగాలు కోల్పోతామన్న భయాందోళనలు ప్రజల్ని వణికిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంచనాల కన్నా జీడీపీ చాలా తగ్గి 3.8 శాతానికొచ్చింది. వచ్చే త్రైమాసికంలో అది 2 శాతం మించకపోవచ్చు. ట్రంప్ సుంకాల బెదిరింపు సరేసరి. అందుకే ఈ అనిశ్చితిలో పాలకపక్షాన్నే మరోసారి గెలిపించటం ఉత్తమమన్న నిర్ణయానికొచ్చారు. కనుకనే పీఏపీ వోట్ల శాతం 61.2 నుంచి 65.67కి పెరిగింది. సింగపూర్ ఎన్నికల్ని విదేశీ మదుపుదార్లు, అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల ప్రభుత్వాలు శ్రద్ధగా గమనించాయి. ఈ అయిదేళ్లూ సింగపూర్ ఎదుర్కొన్న సమస్యలు అలాంటివి మరి.

ఏతావతా ఇప్పటికి ఒక్క రుమేనియా మినహాయించి ట్రంప్‌ను చూసి వాతలు పెట్టుకుంటున్న నాయకులంతా ఊహించని ఓటమితో ఖంగుతింటున్నారు. నిరుడంతా మితవాద పక్షాలు ఎక్కడికక్కడ విజయం సాధించగా, ప్రస్తుతం ఆ పక్షాలకు ఎదురుగాలి వీస్తోంది. అయితే గెలిచిన పక్షాలు చుట్టుముడుతున్న ఆర్థిక సంక్షోభాలకు ఎదురీదటం, జనం మెప్పు పొందటం అంత సులభమేమీ కాదు. ప్రపంచంతోపాటే మనమూ అని ఈ సంక్షోభాల్ని సరిపెట్టుకునే పరిస్థితుల్లో వారు లేరు. కనుక సమస్యలకు దీటైన పరిష్కారాలు కనుగొనటానికి గద్దెనెక్కిన నాయకులు ప్రయత్నించాల్సి వుంది. వారి మాటెలావున్నా ప్రపంచమంతటా తన కారణంగా మితవాద పక్షాలు బోల్తా కొట్టడాన్ని చూసైనా ట్రంప్ తన విధానాలను మార్చుకుంటారా, లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ఉగ్రబుద్ధిపై వక్రభాష్యం!

అభిప్రాయం



బర్ఖా దత్

పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రోజు నేను అమెరికాలో ఉన్నాను. సాధారణంగా నేను టెలివిజన్ వార్తలు చూడను, కానీ ఈ మారణహోమం మాతృభూమిలో జరుగుతున్నప్పుడు వేల మైళ్ల దూరంలో ఉండవలసి వచ్చింది. మూడు దశాబ్దాలుగా నా రిపోర్టింగ్ బీట్ కూడా ఇదే. ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్న 26 మంది కశ్మీర్ పర్యాటకులను ఘోరంగా చంపిన ఘటనపై ఆదుర్దాతో నేను హోటల్‌లో టీవీ ఛానెళ్లు, వార్తాపత్రికలు వెతికాను.

‘ఘర్షణ’గా మాత్రమే చూపారు!

నిజానికి ఈ అనాగరిక దాడి జరిగిన రోజు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ భారతదేశంలోనే ఉన్నారు కాబట్టి దాడిపై అమెరికన్ మీడియా ఆసక్తి చూపించాల్సి ఉంది. పైగా, ఉగ్రవాదులు తమ ప్రణాళికను వాన్స్ రాకకు ముందే ముగించారు. వారి ఆ కార్యాచరణను 25 ఏళ్ల నాటి పూర్వఘటన నుండి తీసుకున్నారు. 2000లో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఢిల్లీలో అడుగు పెట్టినప్పుడు కశ్మీర్ లోయలోని చిట్టిసింగ్‌పురా గ్రామంలో 36 మంది సిక్కులను ఉగ్రవాదులు ఊచకోత కోశారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా, కశ్మీర్ సమస్యపై మరింతగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించడం ఉగ్రవాదుల లక్ష్యం. కానీ ఆ సమయంలోనే జరిగిన ఒక ప్రముఖ ఘటన కారణంగా భారత్‌లో ఉగ్రదాడిపై అమెరికా దృష్టి దాదాపుగా కనుమరుగై పోయింది. ఆశ్చర్యకరంగా, అమెరికా నెట్‌వర్క్‌లలో అందుబాటులో ఉన్నదంతా పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం గురించి గంటల తరబడి కార్యక్రమాలు మాత్రమే. కొన్ని వార్తా పత్రికలలో ఉగ్రదాడిపై నివేదికలు లోపలి పేజీలలో క్లుప్తంగా ఉన్నాయి. ఈ దాడి ఘటనను అమెరికన్ మీడియా దాదాపుగా ఒక సాధారణ భద్రతకు సంబంధించిన ‘ఘర్షణ’గా మాత్రమే చూపింది.

పశ్చిమాన లోపించిన ప్రస్తావన

నేను భారతదేశానికి తిరిగి రావాలని త్వరపడుతున్నాను. జరిగిన దాడి భారత్ నుండి తీవ్రమైన సైనిక ప్రతిస్పందనకు దారి తీయవచ్చని, నేను కలిసిన వారికి వివరించాను. ఇది యుద్ధ చర్య అని నొక్కి చెప్పాను. భారతదేశం తదనుగుణంగానే స్పందించవచ్చునని కూడా అనుకున్నాను. నేను ఇలా చెబుతున్నప్పుడు చాలామంది సహోద్యోగులు, స్నేహితులు నన్ను ప్రశ్నార్థకంగానే చూశారు. వారు చూస్తుండే టీవీ, ప్రింట్ లేదా డిజిటల్ మీడియాలలో పహల్గామ్ ఉగ్రవాద దాడి గురించి ప్రస్తావన చూడలేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ‘ప్రతిదాడి స్వభావం, లక్ష్యం, ప్రతిస్పందన సమయం’పై నిర్ణయం తీసుకోవడానికి సాయుధ దళాలకు ‘పూర్తి స్వేచ్ఛ’ ఇచ్చేశారు. దీంతో, భీతిల్లిపోయిన పాక్, తదుపరి 24–36 గంటల్లోనే భారత్ దాడి జరగవచ్చని ప్రకటించేంతవరకు వెళ్లింది. ఒక పాకిస్తాన్ మంత్రి బహిరంగంగానే బెదిరింపు ప్రకటన చేశారు. ‘‘అణ్వాయుధాలను అలంకరణ కోసం తయారు చేయలేదు’’ అని కఠినంగా అన్నారు.

‘సాయుధ దాడి..’ అని రాశారు!

ఇప్పటికైనా ప్రపంచ మీడియా అంతా ఈ దాడికి సంబంధించిన భౌగోళిక రాజకీయ ఫలితం గురించి ఆలోచిస్తుందని మీరు అనుకుంటారు కదా! కానీ అలాంటిదేమీ లేదు. ఉగ్రదాడిపై కవరేజ్ నామమాత్రంగానే ఉంది. ఇంకా దారుణంగా, ప్రారంభ రోజుల్లో ప్రచురితమైన కొన్ని వార్తా నివేదికలను చూస్తే, పాశ్చాత్య వార్తాపత్రికల లోపలి పేజీలలో ఈ దాడి ఘటనపై ఉపయోగించిన భాష వారి స్వంత కథను వినిపించింది. అదేమిటంటే – జరిగిన దాడి ఘటనకు ‘ఉగ్రవాదం’ అనే పదాన్ని ఉపయోగించడానికి తీవ్రంగా నిరాకరించడం! దానికి బదులుగా, సాయుధులు, తీవ్రవాదులు వంటి మూస పోత పదాలతో ఎప్పటిలాగే వర్ణించారు.

సైనిక దుస్తులు ధరించిన ఉగ్రవాదులు గుంపులోని పురుషులను ఒక్కొక్కరిగా చంపేశారు, కానీ వారు హిందువులా లేదా ముస్లింలా అని అడిగిన తర్వాత మాత్రమే చంపారని ప్రత్యక్ష సాక్షుల కథనాలు వెల్లడిస్తున్నాయి. ఉగ్రవాదులతో పోరాడి వారి తుపాకీని లాక్కోవడానికి ప్రయత్నించిన స్థానిక కశ్మీరీపై కూడా తూటాలు గుప్పించారు.

ఇది ‘ఉగ్రవాదం’ అనిపించలేదా?!

లష్కరే తోయిబాకి నీడలాగా ఉన్న ‘ది రెసిస్టెన్స్ ఫ్రంట్’ ఈ దాడికి తక్షణ బాధ్యత వహించింది. తరువాత, పాకిస్తాన్‌పై ఒత్తిడి పెరగడంతో వారు సైబర్ హ్యాక్ ద్వారా ఈ ప్రకటన జరిగిందని మాట మార్చారు! లష్కర్ తోయిబా ఇంతకు మునుపే అమెరికా అధికారికంగా విడుదల చేసిన ఉగ్రవాద సంస్థల జాబితాకెక్కింది. ముంబైలో జరిగిన 26/11 ఉగ్రవాద దాడిలో ఆరుగురు అమెరికన్లు మరణించారు. పాకిస్తాన్‌లో దాక్కున్న ప్రదేశం నుండి ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా బయటకు తీసుకెళ్తే అమెరికన్లు ఎలా భావిస్తారు? దీన్ని కూడా వారు సాయుధుల చర్య గానే వర్ణిస్తారా?

చివరికి ఇప్పుడు భారతదేశం ‘చర్యకు ప్రతి చర్య’ సూత్రం ప్రాతిపదికన ప్రతీకార చర్యకు సిద్ధమవుతుండగా, పశ్చిమ దేశాలు స్పందించడం ప్రారంభించాయి. వాషింగ్టన్ నుండి కొన్ని ప్రకటనలు సంఘీభావం ప్రకటించాయి. పహల్గామ్ ఘటనకు కారణమైన ఉగ్రవాదులను శిక్షించడంలో భారత్‌కు పాకిస్తాన్ సహకరించాలని వాన్స్ కోరుతూనే, భారతదేశం ‘పెద్ద ప్రాంతీయ సంఘర్షణ’కు దారితీయని విధంగా స్పందిస్తుందని కూడా ఆశాభావం వ్యక్తం చేశారు.

భారతదేశ సైనిక పరమైన చర్యల ఎంపికలకు అమెరికన్లు అడ్డంకులు కల్పించే అవకాశం లేదు. కానీ 2023 అక్టోబర్ 7 తర్వాత ఏ అమెరికన్ రాజకీయ నాయకుడూ ఇజ్రాయెల్‌తో ఇలా (ఉద్రిక్తతలు తలెత్తకుండా ఒకరికొకరు సహకరించుకోవాలని) చెప్పి ఉండకపోవచ్చు. యెమెన్‌లోని హౌతీలపై తాము నిరంతరం బాంబు దాడి చేస్తూ మరొకవైపు భారతదేశం సైనిక సంయమనం పాటించాలని అమెరికా నేతలు కోరటాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇప్పటికీ వారి తీరులో భారీ ద్వంద్వ వైఖరి ఉందనే చెప్పాలి.

కశ్మీర్ లోపల... కశ్మీర్ వెలుపలా..!

పహల్గామ్ ఉగ్రవాద దాడి స్థానికంగా జరిగిన ‘భద్రతా సంఘటన’ కాదనీ; అది భారత్, పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఏదో ఒక రకమైన ‘వివాదానికి’ సంబంధించిన మరొక అభివ్యక్తి కాదని ప్రపంచం ఇంకా అర్థం చేసుకోనే లేదు. కశ్మీర్‌లోనూ, కశ్మీర్ వెలుపల కూడా పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఆయుధంగా ఉపయోగించుకుంటోందని 26/11 ముంబై దాడులు గుర్తు చేస్తూనే ఉంటాయి.

ఈసారి మాత్రం ఒక నమూనా మార్పు జరిగింది. భారతదేశం పాకిస్తాన్ యుద్ధం అంచున ఉన్నాయి. కానీ ఈ సంఘర్షణ... అది తలెత్తిన రోజు నుండే పాశ్చాత్య మీడియా, పాశ్చాత్య ప్రభుత్వాల దృష్టి నుంచి తప్పిపోయింది. ఉగ్రదాడి గురించి వారు తప్పుగా నివేదించారు, తప్పుగా అర్థం చేసుకున్నారు.

వ్యాసకర్త జర్నలిస్టు, రచయిత్రి



అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ; పహల్గామ్ ఉగ్రదాడి బాధితులు

◆ పాక్ ఉగ్రవాద స్వభావాన్ని పశ్చిమ దేశాలు తప్పుగా అర్థం చేసుకుంటున్నాయి. అంతే కాకుండా, ప్రపంచానికి తప్పుగా అర్థం చేయిస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా పాకిస్తాన్ అవలంబించటాన్ని పశ్చిమ దేశాలు ఎంత తేలిగ్గా తీసుకుంటున్నాయో పహల్గామ్ ఉగ్రవాద దాడి పట్ల అమెరికా ప్రతిస్పందన తేటతెల్లం చేస్తోంది!

◆ పహల్గామ్ ఉగ్రవాద దాడి స్థానికంగా జరిగిన ‘భద్రతా సంబంధ ఘటన’ కాదనీ, లేదా భారతదేశం, పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ‘వివాదానికి’ అది మరొక వ్యక్తీకరణ కాదనీ ప్రపంచం ఇంకా అర్థం చేసుకోలేదు. ఇజ్రాయిల్ విషయంలో తమ వైఖరికి భిన్నంగా – భారతదేశ ప్రతిస్పందన ‘ప్రాంతీయ యుద్ధానికి’ దారితీయకూడదని జె.డి. వాన్స్ ఆశిస్తున్నారు. వాన్స్‌లోని రెండు నాలుకల ధోరణిని ఇది సూచిస్తోంది.

సోషల్ మీడియా

యుద్ధ మేఘాలు



భారత్ తన పరిణతితో, నిర్ణయాత్మకమైన సమయంలో యుద్ధాన్ని ఎంచుకుంటుంది. శత్రువుపై దాడి చేస్తుంది. అంతే తప్ప, మధ్యవర్తులు ఇచ్చే సలహాలకు తలొగ్గదు. రెచ్చగొట్టే వారిని సంతృప్తి పరచటం కోసం అనాలోచితమైన నిర్ణయం తీసుకోబోదు. – జై అనంత్ దెహద్రాయ్, సుప్రీంకోర్టు అడ్వొకేట్

ట్రంప్‌తో ఏం పని?!



నా పని ఆస్ట్రేలియా జాతీయ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించటం! కనుక నేను మొదట చేసే పని కాన్‌బెరా (రాజధాని)కి వెళ్లటం! అంతే కానీ, డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడేందుకు అమెరికా వెళ్లటం కాదు !! – ఆంథోనీ ఆల్బనీస్, ఆస్ట్రేలియా కొత్త ప్రధాని

నవ్వు ముఖాలు



బైసరన్ భయానకతను ఎదుర్కొంటూ కశ్మీర్ లోయను సందర్శించటానికి వచ్చిన తోటి మహారాష్ట్ర పర్యాటకుల నవ్వు ముఖాలను చూడటం ఎంతో బాగుంది. పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాద కర్మాగారాన్ని సవాలు చేయటానికి ఉత్తమమైన మార్గం... భయపడొద్దని చెప్పటమే! ఈ వేసవిలో మనలో ప్రతి ఒక్కరూ కశ్మీర్ లోయలో పర్యాటకులుగా ఒక వారం గడిపినట్లయితే, అది వారికి బలమైన సందేశాన్ని పంపుతుంది. జైహింద్! – రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్ట్

డిజిటల్ టెర్రరిజం



ఒక అమర వీరుడి భార్యను దూషించటం చాలా సిగ్గు చేటు. తనపై వస్తున్న ట్రోల్స్ పట్ల హిమాన్షీ నర్వాల్ (పహల్గామ్‌లో ఉగ్రవాదుల తూటాలకు బలైపోయిన నేవీ ఆఫీసర్ వినయ్ నర్వాల్ భార్య) చాలా ధైర్యంగా ఉండగలిగారు. అశ్విన్ వైష్ణవ్‌జీ (ఇన్ఫర్మేషన్ మినిస్టర్)... ఇది వాక్ స్వాతంత్ర్యం కాదు. డిజిటల్ టెర్రరిజం. ఆమెను ట్రోల్ చేస్తున్నవారికి కఠినంగా శిక్షించాలని మిమ్మల్ని కోరుతున్నాం. – రయీస్ షేక్, భివాండీ ఈస్ట్ ఎమ్మెల్యే

యుద్ధాల నుండి అభివృద్ధి వైపు...

అభిప్రాయం



కె. రామకృష్ణ

వియత్నాం పేరు వినగానే, ఒక గొప్ప పోరాట చరిత్ర మన కళ్లముందు మెదులుతుంది. ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు చూసిన, ఎంతో సహనాన్ని, త్యాగాన్ని నిలబెట్టుకున్న దేశం వియత్నాం మాత్రమే. ఇటీవలే ‘హో చి మిన్ సిటీ’లో జరిగిన వియత్నాం పునరేకీకరణ 50వ వార్షికోత్సవ కార్యక్రమానికి వియత్నాం ప్రభుత్వ ఆహ్వానంపై హాజరై వచ్చాను. అక్కడి అనుభవాలు, చరిత్ర, ప్రజల చైతన్యం నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ‘థు లామ్’ను మన భారతీయ సంప్రదాయం ప్రకారం సత్కరించే అవకాశం కలిగింది.

వియత్నాం చరిత్ర వలస పాలనలపై తిరుగుబాటు, స్వతంత్ర ఉద్యమాల విజయం, ప్రజా కేంద్రిత పాలన వికాసాన్ని చూపిస్తుంది. ఫ్రెంచ్ వలస పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత కొరియా, అమెరికాలతో మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన యుద్ధాలను ఎదుర్కొంది.

హో చి మిన్ సిటీలోని కుచ్ జిల్లాలో, సుమారు 250 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భూగర్భ సొరంగాలు మానవ శక్తి ఎంత దృఢంగా ఉండగలదో చూపిస్తున్నాయి. వీటిని గెరిల్లా యుద్ధ కేంద్రాలుగా, ఆయుధ నిల్వలుగా, ఆసుపత్రులుగా, వంట గదులుగా, పొలిటికల్ మీటింగ్ రూములుగా యుద్ధకాలంలో ఉపయోగించేవారు. 1940లో మొదట ఫ్రెంచ్ వలస పాలనకు ప్రతిఘటనగా తవ్విన టన్నెల్స్‌ను అమెరికాతో యుద్ధంలో మరింతగా పెంచి ఉపయోగించారు.

యుద్ధంలో అమెరికా ‘ఏజెంట్ ఆరంజ్’ లాంటి రసాయనాలు వాడి వియత్నాంను గెలవాలనుకుంది. అయినా వియత్నాం వీరులు వాటిని ఎదుర్కొన్నారు. వీటివల్ల 3 మిలియన్ల మంది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది.

1986లో ప్రారంభించిన ‘డోయ్‌మోయ్’ ఆర్థిక సంస్కరణల ద్వారా, వియత్నాం కేంద్ర ప్రణాళిక విధానాల నుంచి మార్కెట్ ఆధారిత విధానాల వైపు సాగింది. అయితే, ప్రజల అవసరాలే కేంద్ర బిందువుగా కొనసాగాయి. ఫలితంగా పేదరికం 70% నుంచి 1.9%కి తగ్గింది. వియత్నాంలో సైన్యానికి, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనబడింది. అందుకేనేమో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన దక్షిణ, ఉత్తర వియత్నాంల ఏకీకరణ 50వ వార్షికోత్సవంలో ఆర్మీ మేజర్ జనరల్ చాన్ నాక్ థు మాట్లాడగా... యువతరం తరఫున ఒక యువతి మాట్లాడారు.



హో చి మిన్ విగ్రహం

వియత్నాం విజయం సైనికమైనదేగాక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విజయవంతమైన ప్రయోగం. ప్రజల చిత్తశుద్ధి, నాయకత్వ నిబద్ధత, గణనీయమైన యువత పాత్ర, భాగస్వామ్య పాలన వంటి అంశాలు, భారత్ వంటి దేశాలు నేర్చుకోవాల్సినవి. ఈ ఉత్సవాలకు స్పెయిన్ నుండి వచ్చిన మహిళా ప్రతినిధి నా పక్కనే కూర్చుని ‘‘ఇక్కడ ప్రతిపక్షం లేకుండా ప్రజల అసంతృప్తి వంటివి ఉండవా?’’ అన్న చర్చ లేపారు. దానికి తానే సమాధానమిస్తూ, ‘ప్రజలను పాలనలో భాగస్వాములుగా చేసి వారికి అవసరమైనవి సమకూర్చగలిగితే వారిలో అసంతృప్తికి చోటుండదు. బహుళ పార్టీ వ్యవస్థతో వాళ్లకు పనీ లేదు’ అని పేర్కొన్నారు. ఇది వియత్నాం విజయ రహస్యానికి అద్భుతమైన వ్యాఖ్యానం.

వ్యాసకర్త రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ, ఆంధ్రప్రదేశ్

శాస్త్రీయ దృష్టే దేశానికి రక్ష!

ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని లక్ష్మీబాయి కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఒక ప్రయోగం చుట్టూ దేశ వ్యాప్తంగా చర్చలు వెల్లు వెత్తాయి. ఆవు పేడను శీతలీకరణ ద్రవ్యంగా ఉపయోగించేందుకు చేసిన ప్రయత్నం వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఈ చర్యపై తమ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇది శ్రమించి చేస్తున్న శాస్త్ర పరిశోధనల ద్వారా సంపాదించిన విజ్ఞానాన్ని దిగ జార్చే చర్యగా అభివర్ణించింది.

సంప్రదాయ భారతీయ వ్యవస్థలో ఆవుపేడను శుద్ధి, ఔషధ గుణాల కోసం ఉపయోగించే చరిత్ర ఉంది. అయితే శాస్త్రీయ ప్రమాణాలు, సాక్ష్యాలు లేకుండానే ప్రఖ్యాత విద్యా సంస్థలు సైతం ఇలా చేయడం శోచనీయమని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇది సైన్సును మూఢనమ్మకాలకు దాసోహం చేయించే ప్రయత్నమని భావిస్తున్నారు. ఆవుపేడ వంటి సంప్రదాయక వనరులను పరిశోధనలలో ఉపయోగించడాన్ని విమర్శించవలసిన అవసరం లేదు. కానీ శాస్త్రీయ ప్రక్రియలకు లోబడి నిరూపించని ప్రకటనలు విద్యార్థుల ఆలోచనా విధానాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది.

భారతదేశంలో ఇటువంటి అశాస్త్రీయ సంఘటనలు చోటు చేసుకోవడానికి శిక్షణ విధానం నుంచి రాజకీయ కారణాల వరకు, చైతన్య లోపం నుంచి సాంస్కృతిక తత్త్వాల దుర్వినియోగం వరకు ఎన్నో కారణాలు చూడవచ్చు. దేశంలో అనేక రకాల విద్యా విధానాలు అమలు చేశారు. నూతన, సరళీకృత ఆర్థిక విధానాలు అమలుకు పూనుకున్నప్పటి నుండి విద్యా వ్యవస్థలో సంస్కరణలు పాలకుల స్వభావాన్ని బట్టి అమలు చేసుకుంటూ వస్తున్నారు. అయితే 2015 నుండి అశాస్త్రీయ సంఘటనలు మరింత పెరుగుతున్నాయి. ప్రశ్నించే తత్త్వం తగ్గుతోంది. ఏది సైన్స్, ఏది నమ్మకం అనే దానిలో తేడా గుర్తించకపోవడంతో విమర్శనాత్మక ఆలోచనకు అవకాశాలు తగ్గిపోతున్నాయి.

‘ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్’ చైర్మన్లుగా ఉన్నవాళ్లు ఇతిహాసాలను చరిత్రగా చూపిస్తున్నారు. బాధ్యతాయుతమైన స్థానాలలో గలవారు సైన్సు కాంగ్రెస్‌లో చేసే ప్రసంగాలు మరింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. టెస్టు ట్యూబ్ బేబీలు, ప్లాస్టిక్ సర్జరీలు వేదకాలం నాటివేననేది వారి మాట. ప్లాస్టిక్ సర్జరీ, జెనెటిక్స్, విమానాలు వంటి వాటికి సంబంధించిన సకల శాస్త్రీయ విజ్ఞానం వేదాలలో ఉందని పాలకులలో ప్రముఖులే ప్రకటిస్తున్నారు.

‘బెనారస్’ యూనివర్సిటీలో భూతవైద్య కోర్సులను ప్రవేశపెట్టడం చూశాము. నూతన జాతీయ విద్యావిధానం పంచతంత్ర, జాతక, నిష్కామ కర్మ, ప్రాచీన సంప్రదాయాలు గురించి బోధించాలని చెబుతోంది. మన ప్రాచీన సంస్కృతి గురించి తెలియపరచాల్సిందే. కానీ, వాటి మాటున అశాస్త్రీయ భావజాల వ్యాప్తికి బలమైన వ్యవస్థను విస్తరింప చేసే ప్రచారాలు ముందుకు వస్తున్నాయనిపిస్తోంది. శాస్త్రాన్ని విశ్వాసాలతో మిళితం చేయడం అంటే అశాస్త్రీయతకు తలుపు తీయడమే! కొన్ని సంప్రదాయక అంశాలను శాస్త్రంగా మలచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వేదాల్లో అన్నీ ఉన్నాయని చెప్పడం, గణిత, భౌతిక శాస్త్రాలను హిందూత్వ దృష్టిలో చూపించడం ఇందులో భాగమే. అలాంటప్పుడు పరిశోధనలు, అన్వేషణలు, నూతన ఆవిష్కరణలకు శాస్త్రవేత్తలు ఎందుకు?

సామాజిక మాధ్యమాలలో సైన్సు విషయాల కంటే సెన్సేషనల్ అంశాలే ఎక్కువగా వైరల్ అవుతుంటాయి. ‘సైన్స్ ఫర్ సొసైటీ’ అనే ఆలోచన మొత్తం సమాజానికి కల్పించక పోవడం వల్ల ప్రజలు ఇటువంటి వాటికి ప్రభావితమవుతున్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తేనే సమాజంలో మార్పు వస్తుంది. కానీ అటువంటి చర్యలకు పాలకులే సుముఖంగా లేరు.

విజ్ఞానం, సైన్సు, అభివృద్ధి అంశాలలో పాలకులు తీసుకునే విధానాలే కీలకం. ముఖ్యంగా విద్య ద్వారా సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌ను భావి తరాలకు అందించాలి. ఇందుకు ప్రభుత్వ విధానాలే కీలకం. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యావ్యవస్థలో సూడో సైన్సును చొప్పించే ప్రయత్నం చేయడం విచారకరం.

గత దశాబ్ద కాలంగా విద్యావ్యవస్థలో సాంస్కృతిక దుర్వినియోగం, రాజకీయ విధానాలను చొప్పించడం, పరిశోధనల స్వేచ్ఛపై ఆంక్షలు, పరిమితులు, మూఢనమ్మకాలను అరికట్టక పోవడం, అక్షరాస్యతలో వెనుకబాటుతనం, విజ్ఞానంపై విశ్వాసాలను ఆపాదించడం, శాస్త్రం – విశ్వాసాల మధ్య పోరాటం వంటివే కనిపిస్తున్నాయి. ఈ ధోరణి మారాలి. విద్యా విధానంలో శాస్త్రీయతను ప్రోత్సహించడం ఒక్కటే ఈ దేశానికి రక్ష!

– కె. విజయ గౌరి, యు.టి.ఎఫ్ నాయకురాలు । 89853 83255



◆ సామాజిక మాధ్యమాలలో సైన్సు విషయాల కంటే సెన్సేషనల్ అంశాలే ఎక్కువగా వైరల్ అవుతుంటాయి. ‘సైన్స్ ఫర్ సొసైటీ’ అనే ఆలోచన మొత్తం సమాజానికి కల్పించక పోవడం వల్ల ప్రజలు ఇటువంటి వాటికి ప్రభావితమవుతున్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తేనే సమాజంలో మార్పు వస్తుంది.

విశ్వం శివ మయం

జ్యోతిర్మయం

హిమవత్పర్వతం మీద ఒక సుందర దివ్య ఉద్యానంలో శార్దూల చర్మధారి, విభూతి ధారి అయిన పరమేశ్వరుడు; దేవతలు, సిద్ధులు, మునిగణ, భూత గణాలతో కూడి ఉండగా ఆ సభలో నారదుడు కూడా చేరి, శివుని సేవిస్తూ ఉన్నాడు. అంతలో, పుణ్య నదులు, దిక్కులు స్త్రీ రూపాలు ధరించి వెంట రాగా, పార్వతి దేవి వచ్చి తన కరకమలాలతో పరమేశ్వరుని కళ్ళను విలాసంగా మూసింది. దానితో, సూర్య చంద్రుల కాంతి లోపించి, లోకమంతా కారు చీకటి వ్యాపించింది. లోకాలన్నీ భీతిల్లిపోయాయి. ఏం జరుగుతోందో ఎవరికీ తెలియలేదు. పార్వతీ దేవి కూడా భీతిల్లి పోయింది.

అప్పుడు పరమేశ్వరుడు తన మూడవ కంటి జ్వాలతో, లోకానికి వెలుగులు ప్రసాదించాడు. ఆ అగ్ని జ్వాలలు పర్వతాన్ని కప్పివేశాయి. శివుడు కరుణతో చూడగా, మంటలు చల్లారి, హిమవత్పర్వతం చల్లబడింది. పార్వతీ దేవి శివుని పాదాలకు ప్రణమిల్లి, శివుడు నొసటి కంటిని తెరవటానికి కారణం అడిగింది. అప్పుడు శివుడు ‘ఈ లోకాలన్నీ నా స్వరూపాలే. నాకేది కలిగితే లోకాలకు అదే కలుగుతుంది. నువ్వు విలాసంగా నా కన్నులు మూశావు. లోకాలలో చీకటి వ్యాపించింది. నీ చేతులు తొలగిస్తే నీవు కలత చెందుతావు. అందుకని, నీ చేతులు తొలగించకుండా ఈ లోకాల చీకటిని తొలగించటానికి నా ఫాలనేత్రం తెరవ వలసి వచ్చింది’ అని చెప్పాడు.

పార్వతీ దేవి ఎందుకు ఆ విధంగా శివుని కన్నులు మూసింది అంటే శంకరుని నేత్రాలు సమస్త లోకాలకు వెలుగు నిచ్చే దివ్య జ్యోతులని ఈ సమస్త విశ్వం శివ మయం అని తెలపటానికే! దేవతల చమత్కారాలు, విలాసాలు కూడా లోక కల్యాణానికే, పరమాత్మ తత్వాన్ని సులభంగా గ్రహించటానికే!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.నవమి ప.12.03 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: మఖ రా.6.58 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.6.31 నుండి 8.11 వరకు, తదుపరి రా.3.25 నుండి 5.07 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి రా.10.49 నుండి 11.33 వరకు, అమృత ఘడియలు: సా.4.02 నుండి 6.10 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.36, సూర్యాస్తమయం: 6.17.

క్లుప్తంగా...

పసుపు ధర @ రూ.13,852

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో కొద్దిరోజులుగా కొత్త పసుపు అమ్మకానికి వస్తోంది. సోమవారం క్వింటా పసుపు ధర అత్యధికంగా రూ.13,852 పలికింది. మార్కెట్‌కు 350 బస్తాల పసుపు రాగా.. కాడి రకం క్వింటాకు గరిష్ట ధర రూ.13,852, కనిష్ట ధర రూ.9,569, గోళా రకం క్వింటాకు గరిష్ట ధర రూ.12,051, కనిష్ట ధర రూ.8,659 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

వేతనాలు ఇస్తారా.. ఉరిపోసుకోమంటారా?

- గ్రీవెన్స్‌లో ప్రభుత్వ పాఠశాలల పార్ట్ టైం స్వీపర్ల గోడు

జనగామ రూరల్: 'పేరుకు పార్ట్ టైం.. పని మాత్రం ఫుల్ టైం చేస్తున్నాం. ఇచ్చేవి చాలీచాలని వేతనాలు. వాటి కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నాం. డబ్బులు లేక కుటుంబాలు గడవడం కష్టంగా మారింది' అంటూ జనగామ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైం స్వీపర్లు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సోమవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. 'వేతనాలు ఇస్తారా? లేదంటే ఉరిపోసుకుని చావమంటారా?' అని వాపోయారు. జిల్లాలో 70 మంది పార్ట్ టైం స్వీపర్లు పని చేస్తున్నారు. 10 నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. కాగా, రసూల్ అనే ఉద్యోగి మాట్లాడుతూ, తనపై 10 మంది కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని, వేతనం రాక, సెలవు రోజుల్లో ఐస్ క్రీం అమ్ముకుంటూ, కూలీ పనులకు పోతూ నెట్టుకొస్తున్నానని చెప్పారు.

వచ్చే నెల 8న చేప ప్రసాదం పంపిణీ

చార్మినార్/దూద్‌బౌలి: ఏటా మాదిరిగానే మృగశిర కార్తె ప్రవేశం రోజైన జూన్ 8న ఆస్తమా రోగులకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు బత్తిని కుటుంబసభ్యులైన అమర్‌నాథ్ గౌడ్, అనిరుధ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆస్తమా రోగులకు పంపిణీ చేసే చేప ప్రసాదాన్ని దూద్‌బౌలిలోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి తయారు చేస్తామన్నారు. 7న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక వనమూలికలతో చేప ప్రసాదాన్ని తయారు చేస్తామని అనంతరం తమ కుటుంబ సభ్యులం, బంధువులం చేప ప్రసాదాన్ని సేవించి 11న ఉదయం ఎగ్జిబిషన్ మైదానానికి తరలించి అక్కడ చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తామని వివరించారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, హరియాణా, మహారాష్ట్ర, కర్ణాటక ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి ఈ చేప ప్రసాదం సేవించేందుకు వస్తున్నట్లు తెలిపారు. నకిలీ చేప ప్రసాదాన్ని పంపిణీ చేసే వారి పట్ల ఆస్తమా రోగులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

ఆటో కోసం కొడుకును విక్రయించిన తల్లి

లింగంపేట (ఎల్లారెడ్డి): కన్న తల్లే కొడుకుని విక్రయించిన కేసులో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బూస లావణ్యకు ఐదేళ్ల క్రితం నర్సింలు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, పాప జన్మించారు. కొంత కాలం క్రితం నర్సింలు మృతి చెందాడు. లావణ్య బట్టల దుకాణంలో పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో లింగంపేట మండలం పర్మళ్ల గ్రామానికి చెందిన చాకలి సాయిలుతో లావణ్యకు పరిచయం ఏర్పడింది. ఈ విషయం తెలిసిన సాయిలు భార్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సాయిలు కామారెడ్డిలో కూలి పనిచేస్తూ లావణ్యతో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి లావణ్య కుమారుడు నిఖిల్ (5)ను విక్రయించాలని, వచ్చిన డబ్బుతో ఆటో కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం బాలుడిని పర్మళ్ల గ్రామానికి చెందిన నసీమాకు రూ. 50 వేలకు విక్రయించారు. నసీమా బాలుడిని తన సోదరి షాహిదాకు ఇచ్చింది. షాహిదా బాలుడిని శేఖర్ అనే వ్యక్తికి రూ. లక్షకు విక్రయించింది. ఇది తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు బాబును బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. లావణ్యతోపాటు సాయిలు, నసీమా, షాహిదా, శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

ఐటీ పార్కు @ గోపన్‌పల్లి..

▶ మొదటి పేజీ తరువాయి

లేఖ రాశారు. దీంతో గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 127 నుంచి 173, 263 నుంచి 286 సర్వే నంబర్ల పరిధిలోని 439.15 ఎకరాలను ఆర్డీవో నిషేధిత జాబితాలో చేర్చారు. త్వరలోనే భూసేకరణకు సంబంధించి నోటిఫికేషన్ కూడా విడుదలయ్యే అవకాశమున్నట్లు సమాచారం. అయితే గోపన్‌పల్లిలో 439.15 ఎకరాల్లో ఐటీ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలపై టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డిని 'సాక్షి' సంప్రదించగా అలాంటి ప్రతిపాదన ఏదీ తమ వద్దని లేదని వివరణ ఇచ్చారు.



చేతిపంపు వద్ద బారులుదీరిన వలస ఆదివాసీలు

నడిస్తేనే.. దూప తీరేది

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన కుమురంభీం నగర్ వాసులు దాహార్తితో అల్లాడుతున్నారు. ఆవాసం ఏర్పడి ఇరవై ఏళ్లు గడుస్తున్నా శాశ్వత తాగునీటి వసతి లేకపోవడంతో వారు తండ్లాడుతున్నారు. ములకలపల్లి మండల కేంద్రానికి సమీపాన 23 వలస గొత్తికోయ కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ శివారులో ఐటీడీఏ ఆధ్వర్యంలో చేదబావి ఏర్పాటుచేసినా ఎండాకాలం నీరు అడుగంటింది. దీంతో సుమారు కి.మీ. కాలినడకన వెళ్లి పురాతన శివాలయం వద్ద చేతిపంపు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. కూలీ పనులకు వెళ్తేనే జీవనం సాగించే కుటుంబాలు కావడంతో చిన్నాపెద్ద అంతా గంటల తరబడి వేచి ఉండి నీళ్లు తెచ్చుకున్నాక పనులకు వెళ్లాల్సి వస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నాయకులు తాగునీటి వసతికి యత్నించినా అటవీ ప్రాంతం కావడంతో బోరు, మోటారు వసతి, చేతిపంపు ఏర్పాటు పనులు కార్యరూపం దాల్చలేదు.

సీతారామకు ఓకే.. కేంద్ర నిధులకు నో గ్యారంటీ

- టీఏసీ సమావేశ మినిట్స్‌లో కేంద్ర జలశక్తి శాఖ స్పష్టీకరణ
- పీఎంకేఎస్‌వై కింద నిధులకు హామీ లభించదు
- షరతులతో ప్రాజెక్టుకు టెక్నికల్ క్లియరెన్స్ జారీ
- గతంలో ప్రాజెక్టుకు పీఎంకేఎస్‌వై కింద నిధులు కోరిన రాష్ట్రం
- తాజా షరతులతో కేంద్ర నిధులు అనుమానమే..

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం–సీతమ్మ సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) అనుమతులిచ్చినా, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ప్రాజెక్టుకు నిధుల మంజూరు విషయంలో ఎలాంటి హామీ లభించదని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)తోపాటు, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్ఎంపీ), ఇతర శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల కింద నిధుల మంజూరుకు అర్హతల విషయంలో ఎలాంటి గ్యారంటీ ఉండదని తేల్చి చెప్పింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీముఖర్జీ అధ్యక్షతన గత నెల 24న జరిగిన 158వ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో సీతారామ ప్రాజెక్టుకు ఈ మేరకు పలు షరతులతో టెక్నికల్ క్లియరెన్స్ జారీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలతో కూడిన మినిట్స్ కాపీని సీడబ్ల్యూసీ సోమవారం రాష్ట్రానికి పంపించింది.

- ఇతర షరతుల విషయానికి వస్తే.. పర్యావరణ, అటవీ, వన్యప్రాణి, గిరిజన వ్యవహారాలు, పునరావాసం, పునర్నివాసం (ఆర్అండ్ఆర్) వంటి అన్ని రకాల అనుమతులు పొందాలని కోరింది.



- ప్రాజెక్టుతో పర్యావరణంపై పడనున్న ప్రభావాన్ని సాధ్యమైనంతగా తగ్గించే విషయంలో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేయాలని సూచించింది. పర్యావరణ అనుమతులకు సంబంధించిన అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని కోరింది. రాష్ట్ర ఆర్థికశాఖ నుంచి ప్రాజెక్టుకు అనుమతులు పొందాలని తెలిపింది.

డిజైన్ల పునః పరిశీలన తర్వాత..

సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఇప్పటికే సీడబ్ల్యూసీలోని డైరెక్టరేట్లన్నీ క్లియరెన్స్ ఇచ్చాయి. కేంద్ర జలశక్తి శాఖ గతంలో జారీ చేసిన 'ఫ్లో చార్ట్' ప్రకారం తాజాగా టీఏసీ క్లియరెన్స్ సైతం లభించింది. వాస్తవానికి గత ఫిబ్రవరి 11న జరిగిన 157వ టీఏసీ సమావేశంలో టెక్నికల్ క్లియరెన్స్‌ను కేంద్రం వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిన ఘటనకు డిజైన్ల వైఫల్యం కూడా ఒక కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తుది నివేదిక ఇచ్చిన నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు డిజైన్లను సీడబ్ల్యూసీతో పునఃపరిశీలన చేయించాలని అప్పట్లో ఆదేశించింది. ప్రాజెక్టు డిజైన్లతోపాటు హైడ్రో మెకానికల్ అంశాలను ఆ తర్వాత సీడబ్ల్యూసీ పరిశీలించి సరిగ్గానే ఉన్నట్టు నిర్ధారించింది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల జారీ ప్రక్రియ సైతం పురోగతిలో ఉందని 158వ టీఏసీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. ప్రాజెక్టు కింద ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహిస్తామని తెలియజేసింది. దీంతో ప్రాజెక్టుకు అనుమతి కోసం సిఫారసు చేయాలని టీఏసీ నిర్ణయించినట్టు మినిట్స్‌లో సీడబ్ల్యూసీ వెల్లడించింది. మినిట్స్ రాష్ట్రానికి అందడంతో టీఏసీ క్లియరెన్స్ అధికారికంగా లభించినట్టు అయ్యింది. పీఎంకేఎస్‌వై పథకం కింద ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ గతంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తాజాగా సీడబ్ల్యూసీ పెట్టిన షరతులు కేంద్ర నిధుల మంజూరుకు అడ్డంకిగా మారనున్నాయి.

67.05 టీఎంసీల గోదావరి జలాలపై హక్కు!

గత ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 18న రూ.7,926.14 కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులు ఇవ్వగా, ఆ తర్వాత 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు ద్వారా 67.05 టీఎంసీల గోదావరి జలాలను తరలించి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 7.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 757 మెగావాట్ల మోటార్ల సామర్థ్యంతో 11 పంప్‌హౌస్‌లు, 36.57 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్ బరాజ్‌ను నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే సాగర్, పాలేరు, వైరా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి కొరత సైతం తీరనుంది. ఇప్పటి వరకు రూ.11,320 కోట్ల వ్యయంతో 57 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పథకాన్ని 2026 నాటికి పూర్తి చేసి రబీ పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది.

పిల్లలకు ఉరేసి.. తండ్రి ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో ఘటన
- నాలుగు పేజీల సూసైడ్‌నోట్ లభ్యం



కుమారుడు, కూతురుతో తండ్రి సుభాష్ (ఫైల్)

కొండాపూర్ (సంగారెడ్డి): భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని అవమానంగా భావించిన భర్త, తన ఇద్దరు పిల్లలకు ఉరేసి, అనంతరం తానూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, ఇద్దరు పిల్లలతోపాటు తండ్రి విగతజీవిగా కనిపించాడు. ఈ విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ వెంకటేశ్ కథనం ప్రకారం... కొండాపూర్ మండలం గారకుర్తికి చెందిన సుభాష్.. భార్య మంజుల, కుమారుడు మరియన్ (13), కూతురు ఆరాధ్య (9)తో కలిసి మల్కాపూర్‌లోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సుభాష్ సదాశివపేట మండలం ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా భార్య మంజుల ప్రవర్తనలో మార్పు రావడంతో తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంజుల 5 రోజుల కిందట ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భార్య వివాహేతర సంబంధం పెట్టుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని భావించిన సుభాష్ అవమానభారం భరించలేకపోయాడని, దీంతో పిల్లకు ఉరి వేసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. సుమారు 5 రోజుల కిందటే వారు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. ఘటనా స్థలం వద్ద 4 పేజీల సూసైడ్ నోట్ లభ్యమైందని పోలీసులు తెలిపారు.

10.26 టీఎంసీలు కేటాయించండి

▶ మొదటి పేజీ తరువాయి

కేటాయిస్తే ఇక 0.55 టీఎంసీలే మిగులుతాయన్నారు. ఇప్పటికే ఏపీ కోటాకు మించి కృష్ణా జలాలను వాడుకుందని.. అందువల్ల ఆ రాష్ట్రం శ్రీశైలం నుంచి ముచ్చుమర్రి ద్వారా, నాగార్జునసాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వ ద్వారా నీళ్లు తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. రెండు జలాశయాల్లో మిగిలిన నిల్వలు తమవేనని స్పష్టం చేశారు. తెలంగాణకు ఏ ప్రాజెక్టు కింద ఎన్ని నీళ్లు అవసరమో ఇండెంట్ సమర్పించాలని కమిటీ కన్వీనర్ డీఎం రాయిపూరే సూచించారు.

ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు తథ్యం

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

బనశంకరి: కృష్ణా నదిపైనున్న ఆల్మట్టి డ్యాం ఎత్తును 524 మీటర్లకు పెంచుతామని కర్ణాటక ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. ఆనకట్ట ఎత్తును పెంచి తమ వాటా నీటిని వాడుకోవడానికి కట్టుబడి ఉందని ఆ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. సోమవారం బెంగళూరులో విధానసౌధలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కృష్ణా ట్రిబ్యునల్ గెజిట్ గురించి ఈనెల 7న ఢిల్లీలో జరిగే కేంద్ర జల వనరుల శాఖ సమావేశంలో తమ డిమాండ్ ప్రస్తావిస్తామని తెలిపారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఇప్పటికే భూస్వాధీన ప్రక్రియను ప్రారంభించిందని, నిధులు కూడా కేటాయించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు లాభమైనా, నష్టమైనా, ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచుతామని ఆయన స్పష్టం చేశారు.

కల్తీకల్లు దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: కల్తీ కల్లు తాగి కామారెడ్డి జిల్లాలో 83 మంది అస్వస్థతకు గురవడంతోపాటు నిజామాబాద్ రూరల్ పోలీసులు 1,086 గ్రాముల ఆల్ప్రాజోలం పట్టుకోవడం వంటి ఘటనలు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కల్తీ కల్లు విక్రయాలకు అడ్డుకట్ట వేసేలా కల్తీ కల్లు తాగితే ఎదురయ్యే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని టీజీఏఎన్‌బీ అధికారులు నిర్ణయించారు. కల్తీ కల్లు అంశంపై నిజామాబాద్ జిల్లాలోని 104 గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు 26 బృందాలను రంగంలోకి దింపుతున్నారు. అవగాహన కార్యక్రమాలకు వెళ్తున్న 26 బృందాలను టీజీఏఎన్‌బీ కార్యాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్‌శాండిల్య సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ బృందాలు ఈనెల 7 నుంచి అవగాహన కార్యక్రమాలు ప్రారంభిస్తాయి.

వీడియో కాల్ ద్వారా గర్భిణికి వైద్యం!

- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ నిర్వాకం
- రక్తస్రావంతో ఆస్పత్రిలో చేరిన బాధితురాలికి స్టాఫ్ నర్సు, ఆయాలతో వైద్యం చేయించిన వైనం
- చికిత్స వికటించి బయటపడిన గర్భసంచి సహా ఐదు నెలల కవల పిండాలు
- బంధువుల ఆందోళన.. ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఏడేళ్ల నిరీక్షణ తర్వాత గర్భం దాల్చిన ఓ ఇల్లాలి మాతృత్వపు కలను వైద్య నిర్లక్ష్యం విచ్ఛిన్నం చేసింది. గర్భస్థ పిండాల (మగ కవలలు) మృతికి కారణమై కాబోయే తల్లికి అంతులేని వేదనను మిగిల్చింది. తీవ్ర రక్తస్రావంతో ఆస్పత్రిలో చేరిన గర్భిణికి వాట్సాప్ వీడియో కాల్‌లో ఓ డాక్టర్ చేపట్టిన వైద్యం వికటించి ఐదు నెలల గర్భస్థ పిండాలు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. వైద్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధితురాలి బంధువులు ఆందోళనకు దిగడంతో స్పందించిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని ఆస్పత్రిని సీజ్ చేశారు.

పెళ్లయిన ఏడేళ్లకు ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చి..

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తికి చెందిన కీర్తికి ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడుకు చెందిన బుట్టి గణేశ్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటివరకు పిల్లలు పుట్టకపోవడంతో చంపాపేటలోని ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని సంప్రదించారు. అక్కడి చికిత్సలతో చివరకు ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతిలో ఐదు నెలల క్రితం కీర్తి గర్భం దాల్చింది. తొలి మూడు నెలలు చంపాపేట ఆస్పత్రిలోనే చికిత్స చేయించుకున్న ఆమె తరచూ అక్కడకు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారడంతో ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ అనూషరెడ్డిని సంప్రదించారు. దీంతో వైద్య పరీక్షలు నిర్వహించిన మహిళా డాక్టర్... కీర్తి గర్భసంచి వదులుగా ఉన్నట్లు గుర్తించి ఏప్రిల్ 6న కుట్లు వేసింది. అయితే అప్పటి నుంచే బాధితురాలికి రక్తస్రావం మొదలైంది. తరచూ ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు మందులు తీసుకొని ఇంటికి వెళ్తోంది.



ఆస్పత్రి వద్ద విలపిస్తున్న బాధితురాలు

ఇంటి నుంచే చికిత్స అందించడంతో..

ఆదివారం తెల్లవారుజామున కీర్తి రక్తస్రావంతోపాటు భరించలేని నొప్పులతో బాధపడుతుండటంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఉదయం 5:45 గంటలకు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆస్పత్రిలో డాక్టర్ అనూషరెడ్డి లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెకు సమాచారం అందించారు. అయినా వైద్యురాలు ఆస్పత్రికి రాకుండా ఇంటి నుంచే వాట్సాప్ వీడియో కాల్ ద్వారా స్టాఫ్‌నర్సు, ఆయాలతో చికిత్స ప్రారంభించింది. స్టాఫ్ నర్సు, ఆయాలకు అనుభవం లేకపోవడం, అప్పటికే పరిస్థితి విషమించడంతో గర్భ సంచి సహా గర్భంలోని కవల పిండాలు బయటకొచ్చేశాయి. వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం చోటుచేసుకుందంటూ బాధితురాలి బంధువులు సోమవారం ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలియగానే పోలీసులు, జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రికి చేరుకొని సీజ్ చేశారు. ఆస్పత్రిలోని ముగ్గురు బాలింతలను వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యురాలిని పోలీసులు అదుపులోకి తీసుకొని ఆ తర్వాత వదిలేశారు.

నిర్లక్ష్యం లేదన్న ఆస్పత్రి..

అధిక రక్త స్రావంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన తల్లి ప్రాణాలను కాపాడేందుకు అప్పటికే గర్భంలో మృతి చెందిన కవల పిండాలను అబార్షన్ ద్వారా తొలగించాల్సి వచ్చిందని.. ఇందులో ఎలాంటి వైద్య నిర్లక్ష్యం లేదని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. మానవతా దృక్పథంతో చికిత్స అందించామని.. ఆస్పత్రి బిల్లు చెల్లించడం ఇష్టంలేకే కుటుంబ సభ్యులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం.

కర్రిగుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్

- ఐఈడీ బాంబు పేలి జవాన్లకు గాయాలు!
- ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోలు మృతి?



బలగాలకు నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్న హెలికాప్టర్

వెంకటాపురం (కె): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రిగుట్టల్లో కేంద్ర భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. గుట్టలపై ఏర్పాటు చేసిన బేస్ క్యాంప్ ద్వారా భద్ర తా బలగాలు 14 రోజులు గా అడవుల్లో మావోయిస్టుల కోసం ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. వారికి అవసరమైన సామగ్రి, నీరు, సరుకులను వెంకటాపురం మండల కేంద్రం నుంచి హెలికాప్టర్ ద్వారా సరఫరా చేస్తున్నారు. కర్రిగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన మందు పాతరలు, ఐఈడీ బాంబులను తొలగించుకుంటూ బలగాలు ముందుకు సాగుతున్నాయి. కాగా, సోమవారం మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబు పేలి ముగ్గురు జవాన్లు గాయపడగా హెలికాప్టర్ ద్వారా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోలు మృతి చెందారని, వారి వద్ద నుంచి 303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయాలను అధికారులు ధ్రువీకరించలేదు.

ఛత్తీస్‌గఢ్ యాంటీ నక్సల్స్ దళాలకు అలవెన్సులో వివక్ష

పూర్తి వివరాలు : సాక్షి ప్లస్‌లో...

పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్‌పై దాడి

- వ్యక్తిపై కేసు నమోదు



మీడియాతో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

అబ్దుల్లాపూర్‌మెట్/సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్‌పై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ రవీందర్‌నాయక్ రోజు మాదిరిగానే సోమవారం విధులకు హాజరయ్యారు. ఈక్రమంలో మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో పెద్ద అంబర్‌పేటకు చెందిన పిల్లి శ్రీనివాస్ కార్యాలయానికి వచ్చి గత జనవరిలో రిజిస్ట్రేషన్ అయిన రెండు డాక్యుమెంట్లను (వివాదాస్పదమైనవిగా పేర్కొంటున్న) రద్దు చేయాలని కోరారు. డాక్యుమెంట్లు రద్దు చేసే అధికారం తనకు లేదని, జిల్లా రిజిస్ట్రార్ లేదా కోర్టు ఉత్తర్వు ద్వారా రద్దు చేయించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్ ఒక్కసారిగా సబ్‌రిజిస్ట్రార్‌పై చేయి చేసుకున్నాడు. పలుమార్లు చెంపపై కొట్టాడు. కార్యాలయ సిబ్బంది, స్థానికులు శ్రీనివాస్‌ను అక్కడి నుంచి బయటకు పంపించారు. అనంతరం బాధితుడు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిని ఖండించిన టీఎన్జీవో

సబ్ రిజిస్ట్రార్‌పై దాడిని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఖండించింది. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్ తదితరులు సోమవారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అదనపు ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకట రాజేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం డీజీపీని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

కృష్ణా ట్రిబ్యునల్-2 తీర్పుపై భేటీ వాయిదా

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్‌కుమా ర్ నేతృత్వంలో కృష్ణా ట్రిబ్యునల్–2 జారీ చేసిన తీర్పును అమ లు చేసే విషయంలో ఈ నెల 7న సంబంధిత రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నిర్వహించతలపెట్టిన సమావేశం వాయిదా పడింది. అనివార్య కారణాలతో ఈ సమావేశం వాయిదా పడిందని, సమావేశం తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామని కేంద్ర జలశక్తి శాఖ సోమవారం ఆయా రాష్ట్రాలకు లేఖ రాసింది. కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు విషయంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించడం ద్వారా తీర్పును అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. కృష్ణా జలాల పంపిణీ పై 2013 నవంబర్ 29న కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు జారీ చేయగా, ఉమ్మడి ఏపీ అభ్యర్థన మేరకు గతంలో సుప్రీంకోర్టు స్టే విధించింది. దీనిపై సుప్రీం కోర్టులో విచారణ పెండింగ్‌లో ఉంది.

అక్షయ తృతీయకు కిస్నా జ్యువెల్లరీలో అమ్మకాలు అదుర్స్

సాక్షి, హైదరాబాద్: అక్షయ తృతీయ సందర్భంగా కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెల్లరీ అమ్మకాల్లో సరికొత్త మైలురాయిని దాటింది. దేశవ్యాప్తంగా ఉన్న 80 షోరూంలలో కస్టమర్లతో జ్యువెల్లరీ కిక్కిరిసిపోయిందని ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో గతేడాది ఇదే సమయంలో 25 షోరూంలలో నమోదైన కొనుగోళ్ల కంటే ఈ అక్షయ తృతీయ సందర్భంగా 220 శాతం పెరుగుదల నమోదైందని పేర్కొంది. వేగవంతమైన విస్తరణతో కస్టమర్లకు నాణ్యమైన ఉత్పత్తులను అందజేస్తూ భారత్‌లోని జ్యువెల్లరీ మార్కెట్‌లో కిస్నా తన స్థానాన్ని పదిలం చేసుకుంటున్నట్లు తెలిపింది. అంతేకాదు కిస్నా జ్యువెల్లరీ ఎండీ ఘనశ్యామ్ ఢోలాకియా మూడు రాష్ట్రాల్లోని షోరూంలను చార్టర్డ్ ఫ్లైట్‌లో సందర్శించిన స్వయంగా కస్టమర్లకు జ్యువెల్లరీ అందజేశారు.

పాక్ పీచమణచేందుకు ముహూర్తం ఖరారు!

వారాంతంలోపే భారీ ఆపరేషన్

- బుధవారం రాష్ట్రాల్లో మాక్‌డ్రిల్స్
- పౌరులను అప్రమత్తం చేయండి
- రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు
- చివరిసారిగా 1971లో జరిగిన వైనం
- అప్పుడూ పాక్‌తో యుద్ధమే కారణం
- వైమానిక సైరన్లు, ఖాళీ చేయించే చర్యలు
- స్వీయరక్షణలో పౌరులు, విద్యార్థులకు శిక్షణ
- దాడులు జరిగితే ఎలా ఎదుర్కోవాలో డ్రిల్స్
- రక్షణ సన్నద్ధతపై ప్రధాని వరుస భేటీలు
- మాపై ఏ క్షణమైనా దాడి: పాక్ రక్షణ మంత్రి

న్యూఢిల్లీ/జమ్మూ/ఇస్లామాబాద్: సర్వం సిద్ధమవుతోంది. ముహూర్తం దాదాపుగా ఖరారైంది. సరిహద్దులకు ఆవలివైపు నుంచి ఉగ్ర దాడులను పనిగట్టుకుని ఎగదోస్తున్న దాయాదికి బుద్ధి చెప్పేందుకు రంగం సిద్ధమైంది. ఈ వారాంతంలోపు ఎప్పుడైనా పాక్‌పై భారీ స్థాయి 'ఆపరేషన్' జరగవచ్చని కేంద్ర ప్రభుత్వ అత్యున్నత వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో మోదీ సర్కార్ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధ సన్నద్ధతను సరిచూసుకునేందుకు బుధవారం పలురకాల మాక్ డ్రిల్స్ నిర్వహించాల్సిందిగా రాష్ట్రాలను ఆదేశించింది. 1971 తర్వాత ఇలాంటి డ్రిల్స్ జరగనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం! అప్పుడు కూడా పాక్‌తో యుద్ధం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నారు. డ్రిల్స్‌లో భాగంగా వాయుదాడుల సైరన్లు మోగించి అప్రమత్తం చేస్తారు. ప్రజలను ఉన్నపళంగా ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపడతారు. ఈ విషయమై ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రణాళికలను తక్షణం అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర హోం శాఖ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేసింది. డ్రిల్స్‌లో భాగంగా సమర్థమైన పౌర రక్షణ చర్యలు చేపట్టడంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. పహల్గాం ఉగ్ర దాడుల వంటివి జరిగితే దీటుగా ఎదుర్కోవడం ఎలాగో నేర్పిస్తారు. స్వీయరక్షణ చర్యలతో పాటు విద్యుత్ సరఫరా బ్లాకౌట్ వంటివి జరిగితే తక్షణం ఎలా స్పందించాలో, కీలక మౌలిక వసరుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తారు.

12వ రోజూ కాల్పులు

మరోవైపు పాక్ కవ్వింపు చర్యలు ఆగడం లేదు. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు వరుసగా 12వ రోజూ కొనసాగాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ జమ్మూ కశ్మీర్‌లో 8 సెక్టార్లలో పాక్ సైన్యం సోమవారం విచ్చలవిడి కాల్పులకు దిగింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ, మెంధార్, నౌషేరా, సుందర్బని, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ కవ్వింపుల చర్యలకు దీటుగా బదులిచ్చినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతి చర్యల్లో భాగంగా సింధూ జల ఒప్పందాన్ని పక్కన పెడుతూ ఏప్రిల్ 24న కేంద్రం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఆ వెంటనే నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం ఆగడాలు మొదలయ్యాయి.

మాక్‌డ్రిల్స్ ఇలా...

- ➤ వైమానిక దాడుల సైరన్లు మోగిస్తారు
- ➤ తక్షణం ప్రజలను ఖాళీ చేయిస్తారు. సంబంధిత అమల్లో ఉన్న ప్రణాళికలను అప్‌డేట్ చేసే చర్యలు చేపడతారు.
- ➤ దాడులు జరిగితే స్వీయ రక్షణతో పాటు తోటి వారిని కాపాడే చర్యలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు శిక్షణ
- ➤ బ్లాకౌట్ల వంటివి జరిగితే ఎదుర్కోవాల్సిన తీరు
- ➤ కీలక వనరులను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు





మాక్‌డ్రిల్ ప్రతీకాత్మక చిత్రాలు

భేటీలతో బిజీబిజీగా మోదీ

దేశ రక్షణకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం కీలక సమీక్షలు నిర్వహించారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతి చర్య ఎలా ఉండాలన్నదే వాటి ఏకైక ఎజెండా అని తెలుస్తోంది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్‌సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. సైనిక సన్నద్ధతకు సంబంధించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. కొద్ది రోజులుగా త్రివిధ దళాధిపతులతో ప్రధాని ఒక్కొక్కరుగా సమావేశం కావడం తెలిసిందే. పహల్గాంకు బదులు తీర్చుకునే పూర్తి బాధ్యతలను మోదీ వారికే అప్పగించారు.

యుద్ధం వద్దు: ఐరాస

- జనాక్రోశాన్ని అర్థం చేసుకోగలను
- దాడులు పరిష్కారం కాదు: గుటెరస్

ఐరాస: భారత్, పాక్ నడుమ ఉద్రిక్తతలు కొన్నేళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వెలిబుచ్చింది. వాటి కట్టడికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఇరు దేశాలకూ సూచించారు. అందుకు దన్నుగా నిలిచేందుకు ఐరాస సిద్ధమని తెలిపారు. సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదని హితవు పలికారు. సాయుధ ఘర్షణ మొదలైతే పరిస్థితి అదుపు తప్పుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ''పహల్గాం ఉగ్ర దాడి అనంతరం భారత్‌లో పెల్లుబుకుతున్న జనాగ్రహాన్ని, ఆక్రోశాన్ని అర్థం చేసుకోగలను. ఆ పాశవిక దాడిని మరోసారి ఖండిస్తున్నా. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఇలా పౌరులను లక్ష్యం చేసుకోవడం దారుణం. దీనికి పాల్పడ్డవారికి చట్టపరంగా కఠిన శిక్షపడాల్సిందే'' అన్నారు.

అణుయుద్ధం దిశగా పరిస్థితులు: పాక్

కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి తమపై భారత్ ఏ క్షణమైనా సైనిక దాడి చేయవచ్చని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆందోళన వెలిబుచ్చారు. ఈ మేరకు తమకు నివేదికలున్నట్టు చెప్పుకొచ్చారు. అదే జరిగితే దీటుగా బదులిస్తామన్నారు. మరోసారి 'అణు' పల్లవి వినిపించారు. మోదీ తన రాజకీయ ప్రయోజనాల కోసం దక్షిణాసియాను అణుయుద్ధం వైపు నెడుతున్నారని ఆక్షేపించారు. పాక్‌లోని ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా, బలూచిస్తాన్ ప్రావిన్సుల్లో భారత్ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. దీనికి, తమపై భారత్ పాల్పడుతున్న ఆర్థిక ఉగ్రవాదానికి 2016, 2017ల్లోనే ఐరాసకు అన్ని ఆధారాలూ సమర్పించామని ఆసిఫ్ చెప్పుకొచ్చారు. ''పహల్గాం ఉగ్ర దాడి కూడా భారత్ పనే. మా ప్రధాని షహబాజ్ షరీఫ్ సూచించినట్టు అంతర్జాతీయ దర్యాప్తు జరిగితే ఆ దాడి మోదీ సర్కారు పనా, లేక భారత్‌లోని ఏదైనా సంస్థ పనా అన్నది తేలిపోయేది'' అంటూ అతి తెలివి ప్రదర్శించారు.

పాక్ పార్లమెంటు భేటీ

పాక్ పార్లమెంటు సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. పహల్గాం దాడికి తమను నిందించడాన్ని తీవ్రంగా ఖండించింది. సింధూ జల ఒప్పందం నిలిపివేతను యుద్ధ చర్యగా పేర్కొంది. భారత ప్రతీకార చర్యలను నిరసించింది. కశ్మీరీల స్వయంప్రతిపత్తి పోరుకు మద్దతిస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు తీర్మానాలు చేసింది.



రాజ్‌నాథ్, నకటనీ కరచాలనం

భారత్‌కు మా సంపూర్ణ సహకారం: జపాన్

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందని భారత్, జపాన్ పేర్కొన్నాయి. భారత్ లక్ష్యంగా సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే పాకిస్తాన్ విధానాన్ని ఖండించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సోమవారం జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకటనీ ఢిల్లీలో సమావేశమయ్యారు. పాక్‌తో ఉద్రిక్తతలు ముదిరిన సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం. పహల్గాం ఉగ్ర ఘటన, తదనంతర పరిణామాలను సవివరంగా చర్చించారు. ఉగ్రవాదాన్ని రూపుమాపే విషయంలో భారత్‌కు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని నకటనీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రక్షణ రంగంలో సహకారం ప్రాంతీయ భద్రతకు సంబంధించిన అంశాలను చర్చించారు. సముద్రయానంతోపాటు యుద్ధ ట్యాంకుల ఇంజిన్లు, యుద్ధ విమానాల ఇంజిన్ల తయారీ రంగంలో సహకరించుకోవాలని నిర్ణయించారు.

ఫతాహ్ క్షిపణిని పరీక్షించిన పాక్

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్ర దాడి అనంతరం భారత్‌తో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాకిస్తాన్ సోమవారం ఫతాహ్ క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. భూమిపై నుంచి భూమిపైని లక్ష్యాలను ఛేదించే ఈ క్షిపణి సామర్థ్యం 120 కిలోమీటర్లు. 'ఇండస్' విన్యాసాల్లో భాగంగా ఫతాహ్ సిరీస్ ప్రయోగాలను ప్రారంభించినట్లు ఆర్మీ మీడియా విభాగం వెల్లడించింది. క్షిపణి నేవిగేషన్ వ్యవస్థలు, కచ్చితత్వాన్ని పరిశీలించేందుకు ఈ ప్రయోగం చేపట్టినట్లు తెలిపింది.

సరిహద్దుల్లో పాకిస్తానీ అరెస్ట్

గుర్‌దాస్‌పూర్: సరిహద్దులు దాటి భారత భూభాగంలోకి దొంగచాటుగా ప్రవేశించిన పాకిస్తాన్ జాతీయుడిని అరెస్ట్ చేసినట్లు బీఎస్ఎఫ్ అధికారులు సోమవారం తెలిపారు. అతడి నుంచి పాక్ కరెన్సీని, గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నారు. గుజ్రన్‌వాలాకు చెందిన మహ్మద్ హుస్సైన్‌గా గుర్తించిన అతడు ప్రస్తుతం పంజాబ్ పోలీసుల కస్టడీలో ఉన్నాడు. పహల్గాం ఘట న అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లిన వేళ ఈ పరిణామం చోటు చేసు కుంది.

భారత్‌కే మా మద్దతు

- పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- ముష్కరులను కఠినంగా శిక్షించాల్సిందే: పుతిన్
- ప్రధాని మోదీతో ఫోన్‌లో మాటామంతి
- ద్వైపాక్షిక సదస్సుకు మోదీ ఆహ్వానం ●అంగీకరించిన పుతిన్



న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టంచేశారు. పహల్గాంలో పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షించాల్సిందేనని తేల్చిచెప్పారు. అత్యంత హేయమైన ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబాలకు పుతిన్ సానుభూతి ప్రకటించారు. ఆయన సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాద దాడిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఇరువురు నేతలు ఈ సందర్భంగా నిర్ణయానికొచ్చారు. ఉగ్రవాదం ఎక్కడ, ఏ రూపంలో ఉన్నాసరే నామరూపాల్లేకుండా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. భారత్-రష్యా మధ్య ప్రత్యేక, విశేషమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని మోదీ, పుతిన్ పేర్కొన్నారు. రష్యా 'విక్టరీ డే' 80వ వార్షికోత్సవం సందర్భంగా పుతిన్‌తోపాటు రష్యా ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది జరగబోయే ఇండియా-రష్యా ద్వైపాక్షిక సదస్సుకు హాజరు కావాలని ప్రధానమంత్రి ఆహ్వానించగా, పుతిన్ అందుకు అంగీకరించారు.

ఉగ్ర పాక్‌కు నిధులు ఇవ్వొద్దు

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ను కోరిన భారత్



నిర్మలతో మసాటో

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడంపై దృష్టిపెట్టిన భారత్ ఆ దిశగా ప్రయత్నాలు ఉధృతంచేసింది. పాకిస్తాన్‌కు వందల కోట్ల రూపాయల రుణాలు, ఆర్థిక సాయం చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న అంతర్జాతీయ సంస్థలు ఆ యత్నాలను మానుకోవాలని భారత్ అభ్యర్థిస్తోంది. ఇందులోభాగంగా సోమవారం ఇటలీలోని మిలాన్ సిటీలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ) అధ్యక్షుడు మసాటో కందాతో భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ అయ్యారు. ఉగ్రవాదాన్ని ఎగదోసే పాకిస్తాన్‌కు ఆర్థికసాయం చేయడం మానుకోవాలని నిర్మల కోరారు. ఈ సందర్భంగా ఇటలీ ఆర్థిక మంత్రి జిన్‌కార్లో జార్జెట్టీతోనూ నిర్మల భేటీ అయ్యారు. నాలుగురోజులపాటు జరిగే ఏడీబీ 58వ వార్షిక సమావేశాలు ఆదివారం ఇటలీలో ప్రారంభమవడం తెల్సిందే. అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) సంస్థ వంటి బహుళజాతి సంఘాలు పాకిస్తాన్‌కు సాయంపై పునరాలోచన చేస్తే మంచిదని ఈ సందర్భంగా నిర్మల హితవు పలికారు. ప్రజాపనుల రుణాలు, సాంకేతిక సహకారానికి సంబంధించి మొత్తంగా 764 పనులకుగాను ఏకంగా 43.7 బిలియన్ డాలర్ల నిధులను పాక్‌కు ఇచ్చేందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిర్ణయించడం తెల్సిందే. ఇప్పటికే 9.13 బిలియన్ డాలర్ల రుణాలిచ్చింది. నాలుగు నెలల క్రితం ప్రపంచ బ్యాంక్ సైతం పాకిస్తాన్‌కు 20 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది. మరోవైపు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే జాబితాలోకి పాకిస్తాన్‌కు చేర్చడానికి భారత్ తీవ్రంగా శ్రమిస్తోంది.

ఆనకట్టల కట్టడి

బాగ్లిహార్, కిషన్‌గంగ, సలాల్ ప్రాజెక్టుల నుంచి నీటి నిలిపివేత

నిలిచిపోయిన ఆరు ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనుల పునరుద్ధరణ

సింధూ, దాని పరీవాహక నదుల నుంచి పాకిస్తాన్‌కు ఇకపై చుక్క నీరు కూడా వదిలేది లేదన్న భారత్, ఆ దిశగా పూర్తిస్థాయి కార్యాచరణకు రంగంలోకి దిగింది. ఆ నదులపై అన్ని జలాశయాల సామర్థ్యాలను పూర్తిస్థాయిలో పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. వాటిలో పేరుకుపోయిన మట్టి, ఇసుక తదితరాలను పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. తద్వారా అన్ని ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరేలా చూడాలని అధికారులకు సూచించింది. జమ్మూ కశ్మీర్‌లో చినాబ్ నదిపై ఉన్న కీలక బాగ్లిహార్, సలాల్ జల విద్యుత్కేంద్రాల్లో ఆ దిశగా గురువారం లాంఛనంగా మొదలైన పూడికతీత పనులు సోమవారం పూర్తిస్థాయికి చేరాయి. పనుల్లో భాగంగా రెండు డ్యాముల్లో అవసరమైన గేట్లను గురువారం నుంచి శనివారం దాకా పాక్షికంగా ఎత్తడంతో పాక్‌లోని సరిహద్దు ప్రాంతాలు నీటమునిగాయి. సింధూ జల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో ఈ విషయమై పాక్‌కు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. 1960ల్లో ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇలా జరగడం ఇదే తొలిసారి. ఒప్పందాన్ని బూచిగా చూపుతూ పూడిక పనులను పాక్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది. ఇప్పుడిక ఆ ప్రాజెక్టుల్లోని పూడిక మొత్తాన్నీ తొలగించి పూర్తిస్థాయిలో నీటిని నింపనున్నారు. అప్పటిదాకా చినాబ్ నదీజలాలు పాక్‌కు పూర్తిగా నిలిచిపోయినట్టే!. సింధూ ఒప్పందం ప్రకారం చినాబ్ జలాలు పాక్‌కే చెందుతాయి. వాటి ప్రవాహాన్ని భారత్ అడ్డుకోవడానికి వీల్లేదు.


మూడింటి నుంచి నీళ్లు బంద్

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, దాని పరీవాహక నదులపై ఆరుకు పైగా జలాశయాల్లో పూడికతీతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న ఆదేశాల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ విభాగాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయి. ప్రభుత్వరంగ ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ సారథ్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బాగ్లిహార్, సలాల్‌తో పాటు జీలం నది మీది కిషన్‌గంగ జలాశయాల నుంచి పాక్‌కు నీటి విడుదలను ఆదివారం నుంచి నిలిపేశారు. దాంతో పాక్‌లోని పంజాబ్ తదితర ప్రాంతాలకు సాగునీరు నిలిచిపోయింది. సలాల్ ప్రాజెక్టును 1987లో, బాగ్లిహార్‌ను 2008లో నిర్మించారు. అప్పటినుంచీ వాటిలో పూడికతీత చేపట్టడం ఇదే తొలిసారి. సలాల్ 690 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. బాగ్లిహార్ సామర్థ్యం 900 మెగావాట్లు. పూడిక నేపథ్యంలో వాటిలో విద్యుదుత్పాదన చాలాకాలంగా సామర్థ్యం కంటే తక్కువగా జరుగుతూ వస్తోంది.


10 వేల మెగావాట్ల విద్యుత్

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, ఉప నదులపై మొదలుపెట్టిన ఆరు ప్రాజెక్టులు పాక్ అభ్యంతరాల నేపథ్యంలో దాన్నాళ్లుగా నిలిచిపోయాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో వాటి నిర్మాణాన్ని తక్షణం పునఃప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. సవాల్‌కోట్ (1,856 మెగావాట్లు), కిర్థాయ్ 1, 2 (1,320 ఎంవీ), పాకాల్‌దుల్ (1,000 ఎంవీ)తో పాటు 2,224 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన మరో ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే ఏకంగా 10 వేల మెగావాట్ల అదనపు విద్యుత్‌తో పాటు సాగు, తాగునీటి అవసరాలకు మరిన్ని జలవనరులు అందుబాటులోకి వస్తాయి. సింధూ ఒప్పందం కింద ఇలాంటి పనులకు పాక్‌కు ఆర్నెల్ల నోటీసు ఇవ్వాల్సి ఉండేది. దాన్ని నిలిపివేసిన నేపథ్యంలో భారత్ తాజా చర్యలను అడ్డుకునేందుకు పాక్‌కు పెద్దగా మార్గాలేమీ లేవు. మధ్యవర్తి అయిన ప్రపంచబ్యాంకు కూడా పెద్దగా చేసేదేమీ లేదు. ఇరు దేశాలనూ చర్చలకు ప్రోత్సహించడం తప్ప ఒప్పందం అమలుకు ఆదేశించడం వంటి అధికారాలేవీ దానికి లేవు.

- సాక్షి, నేషనల్ డెస్క్



బాగ్లిహార్ డ్యామ్



సలాల్ డ్యామ్

ఈసారి 'జెడి' ట్రంప్!



వాషింగ్టన్: 'స్టార్‌వార్స్ డే' సందర్భంగా కృత్రిమ మేధతో రూపొందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో ఫొటోను అధ్యక్ష భవనం ఆదివారం విడుదల చేసింది. ఈసారి, హాలీవుడ్ సినిమా 'స్టార్ వార్స్ యూనివర్స్'లోని కండలు తిరిగిన 'జెడి' అవతారంలో ట్రంప్ దర్శనమిచ్చారు. రెండు రోజుల క్రితమే దివంగత పోప్ ఫ్రాన్సిస్ ఫొటోతో కనిపించిన ట్రంప్‌పై ఆన్‌లైన్‌లో తీవ్ర విమర్శలు వ్యక్తమవడం తెల్సిందే. తాజాగా, జెడి ఫొటోను సైతం జనం వదల్లేదు. చౌకబారు రాజకీయ ప్రచారంగా ఎత్తిపొడిచారు. ఆ సినిమాలో శత్రువుల దగ్గర మాత్రమే ఉండే ఎర్ర లైట్ సాబెర్‌ను ట్రంప్ పట్టుకోవడాన్ని తప్పుబట్టారు. గద్దలు, అమెరికా జెండాలు వెనుక కనిపిస్తుండగా జెడి వేషధారణతో కండలు తిరిగిన దేహంతో ట్రంప్ కనిస్తున్న ఫొటోను వైట్‌హౌస్ సోషల్ మీడియా వేదికపై షేర్ చేసింది.

గాజా ఆక్రమణకు పన్నాగం!

- నిరవధిక ప్రణాళికకు ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం
- హమాస్‌ను అంతం చేసి, బందీలను విడిపించే దిశగా చర్యలు
- రంగంలోకి దిగాలని వేలాది మంది రిజర్వ్ సైనికులకు పిలుపు

టెల్ అవీవ్: హమాస్ మిలిటెంట్ సంస్థను సమూలంగా నాశనం చేసి, గాజా స్ట్రిప్‌ను పూర్తిగా హస్తగతం చేసుకొనే దిశగా ఇజ్రాయెల్ అడుగులు వేస్తోంది. మొత్తం గాజా భూభాగాన్ని నిరవధికంగా ఆక్రమించే ప్రణాళికకు ఇజ్రాయెల్ మంత్రివర్గం సోమవారం ఆమోద ముద్ర వేసింది. ఇందుకోసం ఓటింగ్ నిర్వహించారు. గాజా ఆక్రమణకు కేబినెట్ సంపూర్ణ అంగీకారం తెలిపింది. ఇద్దరు సీనియర్ అధికారులు ఈ విషయం వెల్లడించారు. అక్కడి నుంచి ఎప్పుడు ఖాళీ చేయాలన్న దానిపై ఇజ్రాయెల్ కేబినెట్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అంటే గాజా స్ట్రిప్ రాబోయే కొన్ని దశాబ్దాల పాటు ఇజ్రాయెల్ ఆధీనంలోనే ఉండిపోయే అవకాశాలు లేకపోలేదు. హమాస్‌ను ఓడించి, బందీలను విడిపించడమే లక్ష్యంగా రంగంలోకి దిగాలని వేలాది మంది రిజర్వ్ సైనికులకు ఇజ్రాయెల్ సైన్యం పిలుపునిచ్చింది. పాలస్తీనా భూభాగంలో అతిత్వరలోనే భీకర స్థాయిలో సైనిక ఆపరేషన్ ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హమాస్‌ను ఖతం చేయాలన్న పట్టుదలతో ఇజ్రాయెల్ వ్యవహరిస్తోంది. ఇజ్రాయెల్ నిర్ణయంపై అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. గాజాను ఆక్రమించడం అంత సులభం కాదంటున్నారు.

అమల్లోకి ట్రంప్ ప్లాన్!

40 కిలోమీటర్లకుపైగా పొడవు, 20 కిలోమీటర్ల వెడల్పు ఉండే గాజాను ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పరిగణిస్తుంటారు. గాజాలోని పాలస్తీనా పౌరులను ఇతర దేశాలకు తరలించి, గాజాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ప్రకటించారు. దీనిపై ప్రపంచ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ మిత్రదేశాలు సైతం తప్పుపట్టాయి. ట్రంప్ ప్లాన్‌లో భాగంగానే గాజాను పూర్తిగా హస్తగతం చేసుకోవడానికి ఇజ్రాయెల్ ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 50 శాతం గాజా భూభాగం ఇజ్రాయెల్ అధీనంలోకి వచ్చింది. మిగిలిన ప్రాంతాన్ని సైతం త్వరలో ఆక్రమించబోతోంది. అయితే, గాజా ప్రజలను ఏం చేస్తారన్నది ఇంకా తెలియరాలేదు. వారందరినీ దక్షిణ గాజాకు తరలించనున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ కేబినెట్ తాజా నిర్ణయం పట్ల బందీల తీవ్రస్థాయిలో కుటుంబ సభ్యులు మండిపడ్డారు. హమాస్ మిలిటెంట్ల జోలికి వెళితే బందీలెవరూ ప్రాణాలతో మిగలరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాజాను ఆక్రమించాలన్న ఆలోచన మానుకోవాలని కోరుతున్నారు. హమాస్‌పై ఒత్తిడి పెంచడంలో భాగంగా గాజాకు అంతర్జాతీయ మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ అనుమతించడం లేదు.

స్వచ్ఛందంగా వెళ్లిపోతే వెయ్యి డాలర్లు

అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్

వాషింగ్టన్: అమెరికాలో పెద్ద సంఖ్యలో తిష్టవేసిన అక్రమ వలసదారులను బయటికి పంపడమే లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. సొంత దేశాలకు స్వచ్ఛందంగా వెళ్లిపోయే వలసదారులకు వెయ్యి డాలర్ల చొప్పున అందజేస్తామని సోమవారం హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్) విభాగం ప్రకటించింది. నిర్బంధానికి గురి కావడం, బలవంతంగా వెళ్లగొట్టడం కంటే స్వచ్ఛందంగా సొంత దేశాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా అంగీకారం తెలిపిన వారికి ప్రయాణ ఖర్చులను సైతం చెల్లిస్తామని డీహెచ్ఎస్ తెలిపింది. అమెరికాను వీడే అక్రమ వలసదారులకు ఇదే అత్యుత్తమ, సురక్షిత మార్గమని డీహెచ్ఎస్ సెక్రటరీ క్రిస్టీ నోమ్ తెలిపారు.

రక్షణ సైట్లపై పాక్ సైబర్ దాడులు

యూజర్ల వ్యక్తిగత సమాచారం తస్కరణ?

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత ప్రతీకార చర్యలపై ఆగ్రహంతో ఉన్న పాకిస్తాన్ తన సైబర్‌మూకలను రంగంలోకి దింపింది. దీంతో భారత రక్షణ రంగానికి సంబంధించిన వెబ్‌సైట్లపై పాక్ సైబర్ దాడుల ఉధృతి ఎక్కువైంది. అయితే రక్షణరంగంలోని వ్యక్తుల లాగిన్, పాస్‌వర్డ్ వంటి క్రెడెన్షియల్స్ తస్కరణకు గురయినట్లు భావిస్తున్నట్లు భారత సైన్యం తాజాగా ప్రకటించింది. ఇండియన్ ఆర్మీ సోమవారం తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో 'పాకిస్తాన్ సైబర్ ఫోర్స్' పేరిట ఈ వివరాలతో ఒక పోస్ట్ పెట్టింది. మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్, ది మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్ సంస్థల సిబ్బందికి చెందిన లాగిన్, పాస్‌వర్డ్‌లను పాక్ సైబర్ నేరగాళ్లు తమ వశంచేసుకున్నారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ అధికారిక వెబ్‌సైట్‌ను హ్యాకర్లు హ్యాక్‌చేశారు. వెబ్‌సైట్ హోం పేజీపై పాకిస్తాన్ జెండా, అల్ ఖలీద్ యుద్ధట్యాంక్ ఫొటోలను పెట్టారు. '' ఈ వెబ్‌సైట్ ఇప్పుడు పాకిస్తాన్ వశమైంది. ఇది పాకిస్తాన్ సైబర్‌ఫోర్స్ పని. పహల్గాం కేవలం ఆరంభం మాత్రమే'' అని సందేశాన్ని హ్యాకర్లు ఆ వెబ్‌సైట్‌లో పెట్టారు. దీంతో ముందుజాగ్రత్తగా భారత ఆర్మీ అధికారులు ఈ వెబ్‌సైట్‌ను ఆఫ్‌లైన్‌లో పెట్టేశారు. హ్యాకింగ్ కారణంగా వెబ్‌సైట్‌లోని సమాచారం ఏ స్థాయిలో చోరీకి గురైందన్న అంశాలపై విస్తృతస్థాయిలో ఆడిట్ చేశాకే వెబ్‌సైట్‌ను ఆన్‌లైన్‌లోకి తీసుకురానున్నారు.

సినిమాలకూ ట్రంప్ సెగ

- విదేశాల్లో తీస్తే 100 శాతం సుంకాలు
- అది దేశ భద్రతకు ముప్పు: అధ్యక్షుడు
- హాలీవుడ్ పునరుద్ధరణకేనని వెల్లడి

వాషింగ్టన్: ఇప్పటిదాకా విదేశీ వస్తువులపై సుంకాలు విధిస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు సేవలపైనా వడ్డింపులకు దిగారు. విదేశీ సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నట్లు ఆయన ఆదివారం ప్రకటించారు. ఇతర దేశాల నుంచి పెరుగుతున్న పోటీతో అమెరికా సినీ పరిశ్రమకు, జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉందన్నారు. అమెరికన్ ఫిల్మ్ మేకింగ్‌ను పునరుద్ధరించడమే తన లక్ష్యమని తెలిపారు. ''అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నాం. ఆ ప్రక్రియను ప్రారంభించడానికి వాణిజ్య శాఖ, యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్)కు అధికారం ఇచ్చాం'' అని తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ''అమెరికా సినీ స్టూడియోలను, ఫిల్మ్ మేకర్లను ఆకర్షించడానికి ఇతర దేశాలు లాభదాయక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ఈ పరిస్థితి ఆర్థిక, జాతీయ భద్రత ముప్పు. అమెరికా సినీ పరిశ్రమ శరవేగంగా మరణిస్తోంది. పరిశ్రమ దేశీయ చిత్ర నిర్మాణంలోకి తిరిగి రావాల్సిన అవసరం చాలా ఉంది. మళ్లీ అమెరికాలో విరివిగా సినీ నిర్మాణం జరగాలని కోరుకుంటున్నాం'' అని ప్రకటించారు. సినీ స్టూడియోలు తమ కార్యకలాపాలను అమెరికాలోనే కొనసాగించేలా ప్రోత్సహించడానికే కొత్త సుంకాలని ప్రకటించారు.

జస్టిస్ గవాయ్ ముందుకు 'వక్ఫ్' పిటిషన్లు

- జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం వెల్లడి
- తదుపరి విచారణ ఈ నెల 15కు వాయిదా

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ బాధ్యతను తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనానికి అప్పగిస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ నెల 13న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ పిటిషన్లపై ఈ నెల 15న నూతన సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ విచారణ చేపడతారని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. వీటిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. వక్ఫ్(సవరణ) చట్టంపై కేంద్రం నుంచి మరింత స్పష్టత అవసరమని అభిప్రాయపడింది. పిటిషన్లపై సుదీర్ఘంగా విచారణ చేపట్టాల్సి ఉందని పేర్కొంది. ఈ దశలో ఎలాంటి తీర్పు గానీ, ఉత్తర్వు గానీ ఇవ్వాలని భావించడం లేదని స్పష్టం చేసింది. కేంద్రం దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ విషయంలో మరింత లోతుగా వెళ్లదల్చుకోలేదని తెలిపింది. త్వరలో పదవీ విరమణ చేయబోతున్నాను కాబట్టి పిటిషన్లపై తదుపరి విచారణ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం చేపడుతుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా వివరించారు. తదుపరి విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు.

తీర్పుల ఆలస్యంపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో తీర్పులు ఏళ్ల తరబడి రిజర్వ్‌లో కొనసాగుతుండటంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తీర్పులు సకాలంలో వెలువరించకపోతే కక్షిదారులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంది. కేసుల విచారణ పూర్తయినప్పటికీ తీర్పు ప్రకటించకుండా సుదీర్ఘకాలం రిజర్వ్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించింది. ఈ విషయంలో జార్ఖండ్ హైకోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ ఏడాది జనవరి 31వ తేదీ దాకా తీర్పు రిజర్వ్‌లో ఉన్న అన్ని కేసుల వివరాలను అందజేయాలని దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. తీర్పులను సకాలంలో ఇవ్వకపోవడం అనేది ఆందోళనపరిచే అంశమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టులు తీర్పులను ఎక్కువకాలం రిజర్వ్‌లో పెట్టకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించింది.


సాక్షి హైదరాబాద్

మంగళవారం । 6 । మే । 2025



అర్ధరాత్రి..సరిహద్దు కంచె దాటి..

ట్రావెల్ ఏజెంట్ సహకారంతో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ యువతి వ్యభిచారం చేసేందుకు అర్ధరాత్రి ఆ దేశ సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించింది. చివరకు హైదరాబాద్‌కు చేరుకుంది. -8లో



పాతాళ గంగ స్వల్పంగా పైకి!

నగరంలో పాతాళ గంగ స్వల్పంగా పైకి ఎగబాకింది. మండు వేసవిలో కురిసిన అకాల వర్షం భూగర్భజలాలకు జీవం పోసింది. -10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0/26.0

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 36, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

రీల్ పంపండి... బహుమతి గెలవండి!

పోటీలు నిర్వహిస్తున్న సిటీ సెక్యూరిటీ కౌన్సిల్

సాక్షి, సిటీబ్యూరో: 'లైట్... కెమెరా... యాక్షన్ ఫర్ సేఫ్టీ' పేరుతో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) రీల్స్ పోటీలు నిర్వహిస్తోంది. మహిళల భద్రత, సైబర్ భద్రత అంశాలపై ఈ రీల్స్ రూపొందించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10 లోపు రిజిస్టర్ చేసుకోవాలని, 15వ తేదీలోగా రీల్స్‌ను పంపాలని అధికారులు స్పష్టం చేశారు. ముగ్గురు విజేతల్ని ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు ఇవ్వనున్నారు. రీల్స్‌ను (admin@hcsc.in)కు పంపాలని, ఇతర సమాచారం కోసం 7337551179 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాతబస్తీలో కొత్త పార్కింగ్

మల్టీ లెవెల్ కాంప్లెక్స్‌కు టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఏళ్ల తరబడి కార్యరూపం దాల్చని చార్మినార్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ కోసం కొత్త ప్రతిపాదనలతో జీహెచ్ఎంసీ మరోమారు సిద్ధమైంది. ఇందుకుగాను అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)విధానంలో అందుబాటులోకి తెచ్చే ఈ కాంప్లెక్స్ కోసం జీహెచ్ఎంసీ స్థలం అప్పగించడం మినహా ఎలాంటి వ్యయం చేయదు. వచ్చే ఆదాయంలో తగిన వాటా మాత్రం జీహెచ్ఎంసీకి ఇవ్వాల్సి ఉంటుంది. కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ డిజైన్ల నుంచి మొదలు పెడితే నిర్మాణం, నిర్వహణ అన్నీ ఎంపికయ్యే ప్రైవేటు ఏజెన్సీవే. ఈ కాంప్లెక్స్‌లో పార్కింగ్ సదుపాయంతోపాటు కొన్ని వ్యాపారాలు నిర్వహించుకునేందుకు కూడా అద్దెలకిస్తారు. పార్కింగ్, అద్దెల ద్వారా ఏజెన్సీకి లభించే ఆదాయంలో జీహెచ్ఎంసీకి నిర్ణీత శాతం చెల్లించాల్సి ఉంటుంది. నిర్మాణంలో సేఫ్టీ రెగ్యులేషన్స్, పర్యావరణ ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ర్యాంపులు, మెట్లమార్గాలు, లిఫ్టులు, లైటింగ్, సైనేజీలతో పాటు కిచెన్, వాష్‌రూమ్ సదుపాయాలు, ల్యాండ్‌స్కేపింగ్, తదితరమైనవి ఉండాలి.

అధిక ఆదాయం పొందాలి

ఆటోమేటిక్ సదుపాయాల్లో భాగంగా డిజిటల్ డిస్‌ప్లేలు, పార్కింగ్ సదుపాయం ఉన్నదీ లేనిదీ ఆన్‌లైన్‌లో తెలిసేలా రియల్‌టైమ్ అప్‌డేట్స్ ఉండాలి. ఫీజుల వసూళ్లకు డిజిటల్ చెల్లింపులతోపాటు నగదు కియోస్క్‌లు కూడా ఉండాలి. అద్దెల కిచ్చే దుకాణాల్లో విద్యుత్, నీరు, చెత్తనిర్వహణ ఏర్పాట్లుండాలి. నిర్వహణ లోపాలుండరాదు. పరిశుభ్రంగా ఉండాలి. రూఫ్‌టాప్ గార్డెన్ నిర్వహించాలి. ఫైర్‌సేఫ్టీ, సీసీటీవీ సర్వైలెన్స్, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ వంటివి సరేసరి. వీటితోపాటు సెక్యూరిటీ సిబ్బంది ఉండాలి. కస్టమర్ సర్వీస్ బాగుండాలి. పార్కింగ్ ఫీజులతోపాటు దుకాణాల అద్దెలు, వ్యాపార ప్రకటనల ద్వారా ఏజెన్సీ ఆదాయం పొందవచ్చు. పెట్టే పెట్టుబడి, దాని కయ్యే వడ్డీ, తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని జీహెచ్ఎంసీ ఆదాయంలో తన వాటాను నిర్ణయిస్తుంది. ఆదాయంలో మెజార్టీ భాగం ఏజెన్సీకే అయినా, తగిన వాటా జీహెచ్ఎంసీకి చెల్లించాలి. ఒప్పందం పరిమితి 10 లేదా 15 సంవత్సరాలుగా నిర్ణయించనున్నారు. ఆ గడువు ముగిశాక మల్టీ లెవెల్‌పార్కింగ్‌కాంప్లెక్స్‌ను జీహెచ్ఎంసీకి అప్పగించాల్సి ఉంటుంది. చార్మినార్ పాత బస్టాండ్ దగ్గర దీన్ని ఏర్పాటు చేయనున్నారు.



30% మోత!

భారీగా చార్జీలు పెంచిన ఎల్ అండ్ టీ మెట్రో

ప్రయాణికులపై రోజుకు రూ.కోటి భారం

ఈ నెల 10 నుంచి కొత్త చార్జీలు అమలు

- కనిష్ఠంగా రూ.12, గరిష్ఠంగా రూ.75
- బెంగళూరులో చార్జీల పెంపు ప్రభావంపైన అధ్యయనం
- అక్కడ 45 శాతం పెంచడంతో ప్రయాణికులు 7 శాతం తగ్గుముఖం
- ఆ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని 30 శాతానికి పరిమితం

సాక్షి, సిటీబ్యూరో:

మెట్రో చార్జీల పెంపు ఖరారైంది. ఈ నెల 10వ తేదీ నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న చార్జీలను 30 శాతం వరకు పెంచనున్నారు. దీంతో ప్రయాణికులపైన రోజుకు సుమారు రూ.కోటి భారం పడనుంది. ప్రస్తుతం సగటున ఒక ప్రయాణికుడు రోజుకు రూ.40 చొప్పున చార్జీలు చెల్లిస్తున్నట్లు భావిస్తే పెరుగనున్న చార్జీల వల్ల మరో రూ.20 భారం పడనున్నట్లు అంచనా. అంటే కొత్త చార్జీల వల్ల సగటు ప్రయాణికుడు సుమారు రూ.60 వరకు చెల్లించవలసి ఉంటుంది. ఈ లెక్కన ప్రతి రోజు సుమారు 4.8 లక్షల మంది ప్రయాణికుల నుంచి టిక్కెట్‌ల రూపంలో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైలుకు రూ.1.92 కోట్ల ఆదాయం లభిస్తుండగా, చార్జీల పెంపుతో రూ.2.88 కోట్ల వరకు లభించనున్నట్లు అంచనా. ఈ మేరకు ప్రతి నెలా సుమారు రూ.87 కోట్ల నుంచి రూ.90 కోట్ల వరకు ఆదాయం లభించవచ్చు.

కొంతమేర ఊరట..

ప్రస్తుతం నగరంలో మెట్రో రైళ్లు సుమారు రూ.6500 కోట్ల నష్టాలతో నడుస్తున్నాయి. మెట్రో రైళ్ల నిర్వహణ, విద్యుత్ వినియోగం, సిబ్బంది జీతభత్యాల చెల్లింపు, ఖర్చులను దృష్టిలో ఉంచుకొంటే టికెట్లపైన వచ్చే ఆదాయం తక్కువే అయినా చార్జీల పెంపు వల్ల కొంత మేరకు ఊరట లభించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 2 కిలోమీటర్ల కనిష్ఠ దూరానికి రూ.10 నుంచి 26 కిలోమీటర్లకు పైగా గరిష్ఠంగా రూ.60ల వరకు చార్జీలు ఉన్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి కనిష్ఠ చార్జీలు రూ.12 నుంచి గరిష్ఠంగా రూ.75 వరకు ఉంటాయని అధికారులు తెలిపారు. నగరంలోని మూడు కారిడార్‌లలో ప్రతిరోజు సుమారు 1200 ట్రిప్పులు నడుస్తున్నాయి. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఎంజీ బస్‌స్టేషన్ కారిడార్‌లో రద్దీ తక్కువగా ఉంటుంది. కానీ మిగతా రెండు కారిడార్‌లలోనే ప్రయాణికులు గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. నాగోల్–రాయదుర్గం, ఎల్‌బీనగర్–మియాపూర్ కారిడార్‌లలో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. 2017 నవంబర్‌లో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు చార్జీలను పెంచలేదు. ప్రతి సంవత్సరం వరుసగా నష్టాలు నమోదవుతూనే ఉన్నప్పటికీ చార్జీల పెంపుపైన ప్రభుత్వం నుంచి సానుకూలత లభించకపోవడం, 2023 అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా చార్జీలను పెంచాలనే ప్రతిపాదనను హైదరాబాద్ మెట్రోరైల్ ఎప్పటికప్పుడు వాయిదా వేయవలసి వచ్చింది. 'రవాణా ఆధారిత ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో లేదు. రైళ్ల నిర్వహణ భారంగా మారింది. దీంతో చార్జీలను పెంచకతప్పడం లేదు.' అని ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

30 శాతం ఎందుకంటే....

చార్జీల పెంపుపైన అన్ని విధాలుగా సమగ్ర అధ్యయనం చేసిన అనంతరమే 30 శాతం పెంచాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. కనిష్ఠ దూరానికి ఇది 25 శాతమే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు 4 నుంచి 6 కిలోమీటర్లకు ప్రస్తుతం రూ.15 ఉండగా ఇది రూ.20 వరకు పెరగనుంది. అలాగే ప్రస్తుతం 22 కిలోమీటర్ల నుంచి 26 కిలోమీటర్ల వరకు రూ.55 చార్జీ ఉంది. ఇది రూ.70 వరకు పెరుగనుంది. 26 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరానికి ఇప్పుడు రూ.60 ఉంటే రూ.75 వరకు చార్జీలు పెరగనున్నాయి. బెంగళూరు మెట్రో చార్జీలపైన ప్రత్యేకంగా అధ్యయనం చేసిన అనంతరం నగరంలో 30 శాతం కంటే ఎక్కువ పెంచరాదని భావించినట్లు అధికారులు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ నుంచి ఆ నగరంలో మెట్రో చార్జీలను 45 శాతానికి పెంచారు. కొన్ని స్టేజీల మధ్య ఇది 50 శాతం వరకు ఉంది. దీంతో అక్కడ 4 కిలోమీటర్లకు రూ.20లు, గరిష్ఠంగా 26 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరానికి రూ.90 వరకు చార్జీలు పెరిగాయి. ఈ అనూహ్యమైన పెంపుపైన ప్రయాణికుల నుంచి విముఖత వ్యక్తమైంది. దీంతో సుమారు 7 శాతం వరకు ప్రయాణికులు తగ్గారు. ఆ నగరంలో ఎదురైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌లో కొత్త చార్జీలను ఖరారు చేశారు.



ఎఫెక్ట్ ఎలా ఉంటుంది..?

నగరంలో ప్రస్తుతం ప్రతి రోజు 4.8 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో మాత్రం 5 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత మహిళా ప్రయాణికుల సంఖ్య కొంత మేరకు తగ్గింది. చార్జీల పెంపు ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపైన కూడా సీరియస్‌గా దృష్టి సారించారు. కొత్త చార్జీలు అమల్లోకి వచ్చిన తరువాత ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకోనున్నట్లు అధికారులు చెప్పారు. బెంగళూరులో 45 శాతం పెంచడం వల్ల కొంత వ్యతిరేకత వచ్చిందని, హైదరాబాద్‌లో అలాంటి వ్యతిరేకత వ్యక్తం కాకపోవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు. పైగా నగరంలో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు చార్జీలను పెంచలేదనే అంశాన్ని ప్రధానంగా పేర్కొంటున్నారు.

ఇదిగో కబ్జా.. అదిగో కబ్జా!

హైడ్రా ఆవిర్భావం తర్వాత ప్రజల్లో పెరిగిన చైతన్యం

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ముందుకు
- ప్రజావాణిలో స్వచ్ఛందంగా పలువురి ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న హైడ్రా అధికారులు


సాక్షి, సిటీబ్యూరో: జలవనరులతో పాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలతో ప్రజల్లో చైతన్యం వస్తోంది. 'గ్రేటర్' వ్యాప్తంగా ఈ భూముల కబ్జాలపై ఎవరికి వారు స్వచ్ఛందంగా ఫిర్యాదులు చేస్తున్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలకూ కేవలం రోజుల వ్యవధిలో హైడ్రా పరిష్కారం చూపడంతో ప్రజావాణికి ఫిర్యాదుదారులు పోటెత్తుతున్నారు. తమ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, చెరువులు, నాలాల కబ్జాలను గమనిస్తూ...హైడ్రా దృష్టికి తీసుకువస్తున్నారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల్లో వ్యక్తిగత అంశాల కంటే సామాజిక కోణానికి సంబంధించినవే అత్యధికంగా ఉండటమే దీనికి నిదర్శనం. ఇలా మొత్తం 54 ఫిర్యాదులు ప్రజావాణి ద్వారా హైడ్రాకు వచ్చాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా ఫైర్ విభాగం అదనపు సంచాలకులు వర్ల పాపయ్య పరిశీలించారు. వాటిలో కొన్ని..

- గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలోని సర్వే నం.136లో 23 గుంటల ప్రభుత్వ స్థలం కబ్జా అయ్యిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించడంతో పాటు భవన నిర్మాణానికి పిల్లర్లు కూడా వేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నం. 692, 693, 701, 717ల్లో హెచ్ఎండీఏ లే ఔట్‌లోని పార్కులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సర్వే నం. 713 నుంచి 727 వరకూ ఉన్న రోడ్డు 20 అడుగుల వరకు ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు.
- ఉప్పల్ మండలం కొత్తపేట గాయత్రిపురం కాలనీతో పాటు మరో ఐదు కాలనీల్లో ప్రజావసరాలకు ఉద్దేశించిన 3.12 ఎకరాల భూమి కబ్జా అయ్యిందంటూ ఆయా కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- ఫతుల్‌గూడలో తన ప్రైవేటు భూమికి సంబంధించిన సర్వే నంబరు 1, 65లను వాడుకుని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందింది.
- కీసర మండలం నాగారం మున్సిపాలిటీలోని జాలుబాయి కుంటలో ఏడు ఎకరాల స్థలం కబ్జాకు గురి అవుతోందని ఫిర్యాదు అందింది.
- మణికొండ మున్సిపాలిటీ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వరద నీటిని తీసుకెళ్లే బుల్కాపూర్ నాలా 55 కిలోమీటర్ల మేర నామరూపాలు లేకుండా కబ్జాకు గురయ్యిందని, ఈ నాలా సజీవంగా ఉంటే ఆ మేర వరద నీరు కాలనీలను ముంచెత్తదని, దీనిని పునరుద్ధరించాలని హైడ్రాకు పుప్పాలగూడ పరిసర ప్రజలు ఫిర్యాదు చేశారు.

'మిస్ వరల్డ్'కు ముస్తాబు

సర్వాంగ సుందరంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం

- అందాల పోటీలకు శరవేగంగా ఏర్పాట్లు
- ప్రధాన రహదారుల్లో ఆకర్షణీయంగా పచ్చదనం పెంపు



గచ్చిబౌలి: మిస్ వరల్డ్ పోటీలకు భాగ్యనగరం ఆతిథ్యమిస్తున్న వేళ చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభ వేడుకలకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ముస్తాబవుతోంది. ఇండోర్ స్టేడియంతో పాటు ఐటీ కారిడార్‌లో ప్రధాన రహదారులకు తుది మెరుగులు దిద్దుతూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంతర్జాతీయ అతిథులను ఆకర్షించే రీతిలో రాష్ట్ర పర్యాటక శాఖ, జీహెచ్ఎంసీతో పాటు ఆయా విభాగాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. బయో డైవర్సిటీ జంక్షన్ నుంచి హెచ్‌సీయూ డిపో వరకు ఇప్పటికే గ్రీనరీ పనులు చేపట్టారు. అర్బన్ ఫర్నిచర్, మీడియన్లు, రోడ్లకు రెండు వైపులా ఏర్పాటు చేసిన గ్రీనరీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్ల వెంబడి గోడలకు రంగురంగుల పెయింటింగ్స్ వేస్తున్నారు. గచ్చిబౌలి, ట్రిపుల్ ఐటీ, సైబర్ టవర్, హైటెక్స్ జంక్షన్లలో ఆహ్లాదంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మిస్ వరల్డ్ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, హైటెక్స్, శిల్పారామం, ట్రైడెంట్ హోటల్, శిల్పకళా వేదిక, టి–హబ్‌లలో ఈవెంట్లు నిర్వహించనున్నారు. వీటన్నింటిని కలుపుతూ ప్రధాన రహదారులు, జంక్షన్లలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పోటీల ప్రారంభ వేడుకలతో పాటు జానపద కళాకారుల కార్యక్రమం ఉంటుంది. దీంతో స్టేడియంలోని రోడ్లకు ఇరువైపులా మొక్కలు, పచ్చిక బయలు నాటి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. డెలిగేట్స్‌కు భోజన ఏర్పాట్లకోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు.
- గాలి, వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా భారీ వాటర్‌ప్రూఫ్ గుడారాలను అమర్చారు.
- స్టేడియానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- గచ్చిబౌలి జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్‌తో పాటు సైబర్ టవర్ నుంచి హైటెక్స్, బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి సైబర్ టవర్, గచ్చిబౌలి నుంచి కొత్తగూడ, గచ్చిబౌలి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు ప్రధాన రహదారుల వెంట చిందరవందరగా ఉన్న కేబుల్స్‌పై టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు దృష్టి సారించారు. ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేసే విధంగా మరమ్మత్తులు చేపట్టారు.

క్రీడాకారుల పెయింటింగ్స్

2002లో జరిగిన 32వ జాతీయ క్రీడల నిర్వహణతో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చింది. దాదాపు 23 ఏళ్ల నుంచి స్టేడియం రంగులకు కూడా నోచుకోలేదు. మిస్ వరల్డ్ ఈవెంట్‌తో ఇప్పుడు స్టేడియానికి రంగులు వేస్తున్నారు. గోడలపై రాష్ట్ర క్రీడాకారులు వీవీఎస్ లక్ష్మణ్, పుల్లెల గోపీచంద్, గగన్‌నారంగ్, మిథాలీరాజ్, సైనా నెహ్వాల్, సానియా మీర్జా, ముఖేష్ కుమార్‌తో పాటు పలువురు క్రీడాకారుల చిత్రాలు వేశారు.




స్టేడియం ప్రధాన ద్వారానికి మరమ్మతులు



గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం పరిసరాలలో గ్రీనరీ ఇలా..

ముంబైలోనూ లోకేంద్ర గ్యాంగ్ పంజా



లోకేంద్ర



దీపేంద్ర

అక్కడ ఓ బడా వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- ఐదు కేజీల బంగారం ఎత్తుకుపోయిన గ్యాంగ్
- కాచిగూడలో నేరం చేయడానికి 6 నెలల ముందు..
- ఈ కేసులో బిమ్లను అరెస్టు చేసిన నగర పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో:

కాచిగూడకు చెందిన కార్టన్స్ ఫ్యాక్టరీ యజమాని హేమ్‌రాజ్ దుగ్గర్ ఇంట్లో భారీ చోరీ చేసిన నేపాలీ గ్యాంగ్ సూత్రధారి లోకేంద్ర బహదూర్ షాహి నేతృత్వంలోని ముఠా చేసిన మరో నేరం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ పంజా విసరడానికి ఆరు నెలల ముందు ముంబైకి చెందిన ఓ బడా వ్యాపారి ఇంట్లో ఇదే పంథాలో 5 కేజీల బంగారం తస్కరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఆ నేరంలో లోకేంద్ర పాత్ర ఖరారు చేశామని, మిగిలిన వారి పాత్ర తేలాల్సి ఉందని నగర అధికారులకు మహారాష్ట్ర పోలీసుల తెలిపారు. కాచిగూడ కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి వివిధ రాష్ట్రాల పోలీసులతో పాటు భారత్–నేపాల్ సరిహద్దుల్లో ఉండే బలగాలతోనూ సంప్రదింపులు జరుపుతున్నారు.

వ్యవస్థీకృతంగా లోకేంద్ర వ్యవహారాలు

కొన్నేళ్ల క్రితం నేపాల్ నుంచి వసలవచ్చిన లోకేంద్ర వ్యవస్థీకృతంగా ఈ చోరీలు చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడి వ్యాపారుల ఇళ్లల్లో పని చేస్తున్న నేపాలీల్లో కొందరితో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. వారి ద్వారా ఆయా వ్యాపారుల కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు తెలుసుకుంటున్నాడు. అప్పటికే పని చేస్తున్న వారి ద్వారానే, ఆ స్థానంలో మరో నేపాలీని పనిలో పెట్టిస్తున్నాడు. ఆపై అదును చూసుకుని తన ముఠాతో రంగంలోకి దిగి ఆ ఇంటిని కొల్లగొట్టిస్తున్నాడు. ముంబైకి చెందిన వ్యాపారి ఇంట్లో ఇదే పంథాలో ఐదు కేజీల బంగారం తస్కరించారు. ఈ నేరంలోనూ లోకేంద్రతో పాటు కాచిగూడ కేసులో వాంటెడ్‌గా ఉన్న దీపేందర్, చతుర్భుజ్ పాత్రల్నీ అక్కడి పోలీసులు అనుమానిస్తున్నారు. లోకేంద్ర అరెస్టు తర్వాతే దీనిపై క్లారిటీ కానుండటంతో అతడి కోసం గాలిస్తూ ఓ బృందాన్ని నేపాల్‌కు పంపారు. నగర పోలీసులకు చెందిన మూడు బృందాలు సైతం ఈ ముఠా కోసం వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి.

దళారిగా మాట్లాడిందీ దేవేంద్రే అని గుర్తింపు...

ఇక్కడ చోరీ చేసిన సొత్తుతో నేపాల్ వెళ్లిపోయే లోకేంద్ర అక్కడ ఉన్న ఓ వ్యాపారి ద్వారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఆ మొత్తం నుంచి తన అనుచరులకు, నేరం చేయడానికి సహకరించిన వారిని వాటాలు ఇస్తున్నాడు. అనుచరులకు నేరుగా ఇస్తుండగా... సహకరించిన వారి కుటుంబీకులకు నేపాల్‌లోనే అందిస్తున్నాడు. ఆపై మరో నేరం చేయడానికి ఇంకో నగరాన్ని ఎంచుకుని లోకేంద్ర గ్యాంగ్ రంగంలోకి దిగుతోంది. ఇలానే హేమ్‌రాజ్ ఇంట్లో పని చేస్తున్న బిమ్లను సంప్రదించిన లోకేంద్ర ఆమె ద్వారా అర్పితను ఆ ఇంట్లో పనికి పెట్టాడు. మరో పనివాడు కావాలంటూ హేమ్‌రాజ్ ఆమెను కోరడంతో ఇంద్రన్ బహదూర్ అనే ఏజెంట్‌తో మాట్లాడించింది. అతడి ద్వారానే దీపేంద్ర హేమ్‌రాజ్ ఇంట్లో పనికి చేరాడు. ఆపై కేవలం వారం రోజుల్లోనే మిగిలిన వారితో కలిసి ఈ చోరీ చేశాడు. ఈ కేసు దర్యాప్తు నేపథ్యంలో కాచిగూడ పోలీసులు ఇంద్రన్ పేరుతో మాట్లాడింది కూడా దీపేంద్రే అని గుర్తించారు. లోకేంద్ర గ్యాంగ్‌కు సహకరించిన బిమ్లను పట్టుకున్నారు. ఆమెను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు.

వాచ్‌మెన్ పేరుతో సిమ్‌కార్డు తీసుకుని...

హేమ్‌రాజ్ ఇంట్లో చోరీ చేయడానికి నగరానికి వచ్చిన లోకేంద్ర గ్యాంగ్ సైదాబాద్ ప్రాంతంలో షెల్టర్ తీసుకుంది. తన ఖాళీ స్థలంలో కొన్ని గదులు నిర్మించిన దాని యజమాని వాచ్‌మెన్ ఆధీనంలో ఉంచారు. ఆ వాచ్‌మెన్ ద్వారానే ఓ గదిని అద్దెకు తీసుకున్న ఈ గ్యాంగ్ షెల్టర్ ఏర్పాటు చేసుకుంది. ఈ నేపథ్యంలో వీరికి సంబంధించిన ఎలాంటి గుర్తింపు పత్రాలు వారి వద్దా అందుబాటులో లేవు. నేరం చేయడానికి ముందు వినియోగించడానికి ఓ సెకండ్ హ్యాండ్ ఫోన్‌ను నగరంలోనే ఖరీదు చేసిన లోకేంద్ర.. ఆ స్థలం వాచ్‌మెన్ పేరుతో సిమ్‌కార్డు తీసుకున్నాడని పోలీసులు గుర్తించారు. కాచిగూడలో నేరం తర్వాత హేమ్‌రాజ్ కారులో సంతోష్‌నగర్ వరకు వెళ్లిన ఈ ముఠా ఆ వాహనం అక్కడ వదిలేసింది. అక్కడ నుంచి ట్యాక్సీలో షోలాపూర్‌కు... అట్నుంచి మరో ట్యాక్సీలో పుణేకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి ఎటు వెళ్లారనేది ఆరా తీస్తున్నారు. ఈ నేరంలో ఐదుగురి పాత్ర ఉన్నట్లు పోలీసులు తొలుత భావించారు. అయితే నేరుగా పాల్గొన్న నలుగురితో పాటు మరికొందరి పాత్ర ఉన్నట్లు ఆధారాలు సేకరించారు. వీరిలో బిమ్లతో సహా నలుగురిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించట్లేదు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: ఈతకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్ చెందిన చిన్ననోళ్ల మహేశ్(32) తెల్లాపూర్ మున్సిపాలిటీలో ప్రైవేటుగా ఉద్యోగి. సోమవారం మధ్యాహ్నం తన స్నేహితుడు శ్రీనివాస్‌తో కలిసి మిర్జాగూడ సమీపంలోని బతుకమ్మ కుంటలో ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మహేశ్ కుంటలో పడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తనకు అడ్డు వస్తున్నాడని..

బావను హత్య చేసిన బావమరిది

బంజారాహిల్స్: తనకు అడ్డు వస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తి సొంత బావనే దారికాచి కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఫస్ట్‌లాన్సర్‌కు చెందిన మహ్మద్ ఇలియాస్ (47) సెంట్రింగ్ పని చేసేవాడు. అతడి బావమరిది అబ్దుల్ సత్తార్ మాసబ్‌ట్యాంక్ సమీపంలో ఓ చికెన్ షాపులో తండ్రి షేక్ అబ్దుల్ వాహెబ్, సోదరుడు గౌస్‌తో కలిసి పని చేసేవాడు. మద్యానికి బానిసైన సత్తార్ కొంత కాలంగా డబ్బుల కోసం తండ్రి, సోదరుడితో తరచూ గొడవపడటమేగాక డబ్బులు లాక్కెళ్లేవాడు. ఈ నేపథ్యంలో తండ్రిని, సోదరుడిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నావని, మద్యం తాగడం మానేయాలని అతడి బావ మహ్మద్ ఇలియాస్ పలుమార్లు సత్తార్‌కు హితవు పలికాడు. డబ్బులు ఇవ్వకుండా తండ్రిని నియంత్రించాడు. ఈ విషయమై ఆదివారం రాత్రి ఇలియాస్, సత్తార్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబ్బుల కోసం తండ్రిని వేధించవద్దని, మరోమారు ఇబ్బందులకు గురిచేస్తే బాగుండదని బావమరిదిని హెచ్చరించిన ఇలియాస్ ఫస్ట్‌లాన్సర్‌లోని తన ఇంటికి వచ్చాడు. దీంతో ఆగ్రహానికి లోనైన సత్తార్ పథకం ప్రకారం చికెన్ షాపులోని కత్తిని జేబులో పెట్టుకుని బావను వెంబడించాడు. ఇంట్లోకి వెళ్తున్న ఇలియాస్‌ను బయటికి లాగి పొత్తి కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఇలియాస్‌ను కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఇంతియాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు సత్తార్‌పై కేసు నమోదు చేశారు. నాలుగు గంటల్లోనే పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఇలియాస్ మృతదేహం


నిందితుడు అబ్దుల్ సత్తార్..

ఫేక్ కాల్ చేసిన వ్యక్తి రిమాండ్

నిందితుడు మేడ్చల్ జిల్లాకు చెందిన శ్రీమంత్ గౌడ్‌గా గుర్తింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫేక్ కాల్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ నెల 2న రాత్రి రైల్వేస్టేషన్‌లో బాంబు పెట్టినట్లు డయల్ 100కు కాల్ వచ్చిందన్నారు. వెంటనే డాగ్ స్క్వాడ్, బీడీ టీం, సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో అన్ని ప్రాంతాలను పరిశీలించి ఫేక్ కాల్‌గా నిర్ధారించామన్నారు. డయల్ 100కి కాల్ చేసిన వ్యక్తిని మేడ్చల్ జిల్లా, కీసర మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన శ్రీమంత్ గౌడ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో అతను ప్రజలను భయాందోళనకు గురిచేసి హింసను ప్రేరేపించాలనే దురుద్దేశంతో కాల్ చేశాడని విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

రూ.10 కోట్ల విలువైన గంజాయి దహనం



సికింద్రాబాద్: సికింద్రాబాద్ జిల్లా రైల్వే పోలీసులు వివిధ కేసుల్లో పట్టుకున్న రూ.10 కోట్ల విలువైన 2 వేల కిలోల గంజాయిని సోమవారం దహనం చేశారు. యాదాద్రి జిల్లా, తొక్కాపూర్ గ్రామంలోని రోమో ఇండస్ట్రీస్ సహకారంతో గంజాయిని దహనం చేసినట్లు రైల్వే ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. సికింద్రాబాద్ అర్బన్ డివిజన్‌లో 49 కేసుల్లో పట్టుబడిన 1419 కిలోలు, రూరల్ డివిజన్‌లో 5 కేసుల్లో పట్టుబడిన 100 కిలోలు, కాజీపేట డివిజన్ పరిధిలో పట్టుబడిన 490 కిలోల గంజాయిని దహనం చేశామన్నారు. గంజాయి ఉత్పత్తి చేసే ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే అన్ని రైళ్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించడం ద్వారా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. 74 కేసుల్లో నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసిన మీదట న్యాయ సలహాలు తీసుకుని గంజాయిని దహనం చేశామన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ అర్బన్ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, రూరల్ డీఎస్పీ శ్రీనివాస్, కాజీపేట డీఎస్పీ టి.కృపాకర్ పాల్గొన్నారు.

బయోచార్ ఉత్పత్తులతో నేలలు సారవంతం

కొత్తూరు: బయోచార్ ఉత్పత్తులతో వ్యవసాయ పొలాలు, నేలలు మరింత సారవంతంగా మారుతాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. నందిగామ మండలం, కన్హా శాంతివనంలో హార్ట్ ఫుల్‌నెస్, పాపెల్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయోచార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తున్నారన్నారు. దీంతో పొలాలు, వాతావరణం కలుషితమవుతోందని తెలిపారు. దీనికి తోడు రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. బయోచార్ ఉత్పత్తులతో పొలాలు మరింత సారవంతంగా మారడంతో పాటు పంటల దిగుబడి సైతం పెరుగుతుందన్నారు. గ్రామీణ స్థాయిలో చిరు వ్యాపారులు, రైతులే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా ఉన్నారన్నారు. వారికి బయోచార్ ఉత్పత్తులు మరింత ఆర్థికంగా బలోపేతం చేయడానికి తోడ్పడతాయన్నారు. గ్రామీణ స్థాయిలో బయోచార్ ప్లాంట్లను నెలకొల్పడానికి యువ పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. తక్కువ ఖర్చు, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం, లాభసాటిగా ఉండే పంటలసాగుపై రైతులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో ఏటా పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారని, దీంతో కాలుష్యంతో పాటు ఇతర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. బయోచార్ ఉత్పత్తులతో పంటల వ్యర్థాలను పొలాలకు బలం చేకూర్చే ఎరువులను తయారు చేసే అవకాశం ఉందన్నారు. బయోచార్ ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా రైతులు వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్లాంట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ వ్యవస్థాపకుడు కమ్లేష్ జీ పటేల్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


బయోచార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

ఎస్‌బీఐ అగ్ని ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై బ్యాంకు అధికారులు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు కార్యాలయంలోని నాలుగో అంతస్తులో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో కొన్ని డాక్యుమెంట్లతో పాటు ఫర్నిచర్ కూడా కాలిపోయిన సంగతి తెలిసిందే. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చునని ఎస్‌బీఐ హోం లోన్ సెంటర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీ కృష్ణ సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి పలువురు బ్యాంకు అధికారులు అగ్ని ప్రమాద నష్టంపై ఆరాతీశారు. ఉన్నతాధికారులు సైతం సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జంటనగరాల్లోని హోంలోన్స్‌కు సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ఇక్కడే ఉండటంతో రుణాలు తీసుకున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎంత మేరకు ఆస్తినష్టం జరిగింది, ఏఏ రికార్డులు కాలిపోయాయి అనేది మాత్రం బ్యాంకు అధికారులు వెల్లడించడం లేదు.

ఉప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

యువకుడి దుర్మరణం


గోపీ కృష్ణా రెడ్డి (ఫైల్)

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, కోదాడకు చెందిన తుమాటి గోపీకృష్ణా రెడ్డి (27 అనే యువకుడు హాస్టల్ నిర్వహిస్తూ అన్నోజి గూడ ప్రేమలత అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆదివారం సాయంత్రం స్నేహితుడిని కలిసేందుకు చైతన్యపురి వెళ్లిన అతను సోమవారం తెల్లవారుజామున ఇంటికి బయలుదేరాడు. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఉప్పల్ నుంచి నాగోల్ వైపు వేగంగా వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. లారీ చక్రాల కింద పడిన అతడిని దాదాపుగా 10 మీటర్లు లాక్కెళ్లింది. ఈ ఘటనలో అతని శరీరం నుజ్జు నుజ్జుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మూటగట్టి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీకోసం గాలిస్తున్నారు.

గంజాయి పట్టివేత

కుత్బుల్లాపూర్: ఎస్‌టీఎఫ్‌బీ సిబ్బంది దాడి చేసి ఓ వ్యక్తి నుంచి రూ.1.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌టీఎఫ్‌బీ ఎస్ఐ బాలరాజు నేతృత్వంలో సోమవారం శివారెడ్డినగర్‌లో దాడులు నిర్వహించిన సిబ్బంది షరీఫ్ అనే వ్యక్తి నుంచి 1.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడి నుంచి బైక్, సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో అఖిల్ అనే మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం..

లంగర్ హౌజ్ ప్రాంతంలో హెచ్‌డీఎఫ్‌బీ బృందం దాడులు నిర్వహించి 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. మహమ్మద్ సులేమా అనే వ్యక్తి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు అతడి నుంచి డ్రగ్స్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడికి డ్రగ్స్ సరఫరా చేసిన బెంగళూరుకు చెందిన షకీల్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

మీటర్ల 'గోల్'మాల్ వ్యవహారంలో ఏఈ సహా మరో ఇద్దరిపై వేటు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ మీటర్ల గోల్‌మాల్ వ్యవహారంలో బాధ్యులపై వేటు పడింది. ఏఈ సహా లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్లను సస్పెండ్ చేసింది. మంజూరైన మీటర్లను సంబంధిత వినియోగదారుల నివాసాలకు అమర్చకుండా గుట్టుగా నిల్వ చేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో చేర్చింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సైబర్‌సిటీ సర్కిల్ ఇబ్రహీంబాగ్ డివిజన్ చిత్రపురి కాలనీలోని ఓ కాంట్రాక్టర్ ఇంట్లో 42 విద్యుత్ మీటర్లు లభ్యమైన విషయం తెలిసిందే. దుండిగల్, ఇబ్రహీంబాగ్, సరూర్‌నగర్‌లో విద్యుత్ మీటర్లు పక్కదారి పట్టిన విషయంపై మూడు రోజుల క్రితం సాక్షిలో 'మీటర్ల గోల్‌మాల్' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ అంశంపై సీఎండీ ముషారఫ్ ఫా రూఖీ సీరియస్ కావడంతో పాటు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రంగారెడ్డిజోన్ సీజీఎం పాండ్యానాయక్ అంతర్గత విచారణ చేపట్టి సీఎండీకి సమగ్ర నివేదిక అందజేశారు. 'తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటీవ్ సొసైటీ' పేరున జనవరి 25న 42 విద్యుత్ మీటర్లు జారీ చేసినట్లు గుర్తించారు. డిస్కం మంజూరు చేసిన ఈ మీటర్లను వినియోగదారుల ఇంటికి అమర్చకుండా కాంట్రాక్టర్ చెన్నకేశవ రెడ్డి తన ఇంట్లోనే నిల్వ చేయడంతో పాటు ఏప్రిల్ నెలలో వీటికి బిల్లులు కూడా జారీ చేశారు. ఈ అంశంపై స్థానిక ఏఈ భాస్కర్‌రావు సహా లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్ల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయింది. మీటర్ల గోల్‌మాల్‌కు కారణమవడంతో పాటు సంస్థ ఆర్థిక నష్టాలకు కారణమైన ఏఈ సహా మీటర్ రీడర్, లైన్ ఇన్‌స్పెక్టర్లను డిస్కం యాజమాన్యం సోమవారం సస్పెండ్ చేసింది. అంతేకాకుండా సదరు కాంట్రాక్టర్‌పై ఇప్పటికే రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించింది. బ్లాక్ లిస్ట్‌లో చేర్చడంతో పాటు లైసెన్సును రద్దు చేయాల్సిందిగా కోరుతూ సీఈఐ జీకి లేఖ రాసింది.

భార్య అనుమానించిందని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

సనత్‌నగర్: భర్త వేరే యువతితో కలిసి ఉన్న ఫొటోను చూసిన భార్య అనుమానంతో నిలదీయగా మనస్తాపం చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట అన్నానగర్‌లో సాయికుమార్ (23), పూజ దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే సాయికుమార్ తరచూ తమ పక్కింటి యువతితో మాట్లాడుతుండేవాడు. ఈ క్రమంలో అతను సదరు యువతితో కలిసి ఉన్న ఫొటోను చూసిన పూజ అతడిని నిలదీసింది. దీంతో మనస్తాపం చెందిన సాయికుమార్ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి..సరిహద్దు కంచె దాటి..

వ్యభిచారం కోసం బంగ్లాదేశ్ నుంచి నగరానికి వచ్చిన యువతి

బంజారాహిల్స్: ట్రావెల్ ఏజెంట్ సహకారంతో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ యువతి వ్యభిచారం చేసేందుకు అర్ధరాత్రి ఆ దేశ సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించింది. మొదట పశ్చిమబెంగాల్ చేరుకున్న ఆమె అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లి, చివరకు హైదరాబాద్‌కు చేరుకుంది. జూబ్లీహిల్స్ పోలీసులు వ్యభిచార గృహంపై చేసిన దాడిలో పోలీసులకు చిక్కింది. వివరాల్లోకి వెళితే..బంగ్లాదేశ్, మాణిక్‌గోంజ్ జిల్లాకు చెందిన యువతి (23) 2024లో రకీబ్ అనే ట్రావెల్ ఏజెంట్ సహాయంతో అర్ధరాత్రి దేశ సరిహద్దు దాటి పశ్చిమబెంగాల్‌లోకి ప్రవేశించింది. కొంతకాలం పాటు అతను ఆమెకు ఆ రాష్ట్రంలోనే ఆశ్రయం కల్పించాడు. ఆమెకు సిమ్‌కార్డు సైతం సమకూర్చి బెంగళూరుకు తీసుకెళ్లి అక్కడ మూజమ్ అనే వ్యక్తికి అప్పగించాడు. నెల రోజుల పాటు గదిలో ఉంచిన మూజమ్ ఆమెతో వ్యభిచారం చేయించాడు. ఆ తర్వాత ఆమె బెంగళూరులోని కోరమంగళకు పారిపోయి, బంగ్లాదేశ్‌కు చెందిన మిస్తి అనే స్నేహితుడిని కలుసుకుంది. అతని వద్ద రెండు నెలల పాటు తలదాచుకుంది. మిస్తి ఆమెను అఖిల్ అనే వ్యక్తికి అప్పగించగా, వ్యభిచారం చేస్తే ఎక్కువ జీతం ఇస్తానని అఖిల్ హామీ ఇచ్చాడు. ఈ క్రమంలో అఖిల్ సూచన మేరకు గత నెల 21న బస్సులో హైదరాబాద్ చేరుకున్న ఆమె అతని ఇంట్లో 10 రోజులు ఉంది. ఆ తర్వాత సదరు యువతి మరిన్ని డబ్బులు సంపాదించేందుకు నాయక్ అనే వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించింది. నాయక్ ఆమెను గత నెల 30న జూబ్లీహిల్స్‌లోని మింట్ లీవ్స్ సర్వీస్డ్ అపార్ట్‌మెంట్ రూం నెంబర్-112లో దింపేందుకు క్యాబ్ ఏర్పాటు చేశాడు. కస్టమర్లను సంప్రదించి గదికి పంపుతానని నాయక్ ఆమెకు చెప్పాడు. అయితే వ్యభిచార దందాపై పోలీసులకు సమాచారం అందడంతో సదరు అపార్ట్‌మెంట్‌లోని గదిపై సోమవారం దాడులు నిర్వహించిన పోలీసులు బంగ్లాదేశ్ యువతితో పాటు కస్టమర్లను అరెస్టు చేశారు. యువతిని పునరావాస కేంద్రానికి తరలించిన జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రవణ్‌రావు బెయిల్ రద్దు చేయండి

- సుప్రీం కోర్టులో నగర పోలీసుల పిటిషన్
- ఈ నెల 9న విచారించనున్న న్యాయస్థానం

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఎ.శ్రవణ్‌కుమార్ రావుకు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ నగర పోలీసులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 9న విచారణకు రానుంది. 2023లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి, ప్రభుత్వం మారిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలతో శ్రవణ్‌రావు విదేశాలకు పారిపోయారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న అతడిపై దర్యాప్తు అధికారులు ఇంటర్‌పోల్ ద్వారా రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయించారు. ఈ లోగా సుప్రీం కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందిన శ్రవణ్‌రావు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బెయిల్ పొందే సమయంలోనే శ్రవణ్ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తునకు సహకరిస్తానని కోర్టుకు తెలిపాడు. అయితే ఇతడిని సిట్ అధికారులు మూడుసార్లు విచారించినా ఎలాంటి సమాచారం వెల్లడించ లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వినియోగించిన రెండు సెల్‌ఫోన్లను ఇవ్వాలని దర్యాప్తు అధికారులు శ్రవణ్‌రావును కోరారు. అయితే వాటికి బదులు వేరే ఫోన్లు ఇచ్చే ప్రయత్నం చేశాడని, ఆపై డేటా మొత్తం డిలీట్ చేసినవి అందించారని దర్యాప్తు అధికారులు అంటున్నారు. ఇలా సిట్ విచారణకు సహకరించట్లేదని పోలీసులు చెబుతున్నారు. ఇతడిని అరెస్టు చేసి, కస్టడీలోకి తీసుకుని విచారిస్తేనే కీలక విషయాలు తెలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రవణ్‌రావుకు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే 2023 ఎన్నికల సమయంలో కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు మాజీ, ప్రస్తుత అధికారుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ట్యాపింగ్‌తో పాటు ఉపకరణాల ఖరీదుకు అనుమతులు ఇచ్చిన నాటి ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీ, డీజీపీ, నిఘా విభాగం అధిపతి తదితరుల నుంచి సిట్ వాంగ్మూలాలు సేకరించనుంది. వీరి హోదా తదితరాలను దృష్టిలో పెట్టుకుని వారిని సిట్ కార్యాలయానికి పిలవకుండా, వారికి అనుకూలమైన సమయంలో, వారి వద్దకే వెళ్లి వీటిని రికార్డు చేయనుంది. ఇప్పటికే ఒకరిద్దరి నుంచి వాంగ్మూలాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో వీళ్లు సాక్షులుగా మారనున్నారు.

ఔటర్‌పై రెండు లారీలు ఢీ

లారీ క్లీనర్ దుర్మరణం

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డుపై శంషాబాద్ నుంచి పటాన్‌చెరువు వైపు వెళుతున్న ఓ లారీ ముందు వెళుతున్న మరో లారీని ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం శంషాబాద్ నుంచి పటాన్‌చెరువు వైపు వెళుతున్న లారీ దాని ముందు వెళుతున్న మరో గుర్తు తెలియని లారీని ఢీ కొట్టింది. ఢీకొట్టిన లారీలో ఉన్న క్లీనర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ముందు వెళుతున్న లారీ డ్రైవర్ వాహనంతో సహా అక్కడినుంచి పరారు కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ క్లీనర్ మృతదేహాన్ని లారీలోనే వదిలి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రెండు లారీల డ్రైవర్లను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఉపముఖ్యమంత్రికి టీజీపీఈఏ కృతజ్ఞతలు



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 2012 బ్యాచ్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు అసిస్టెంట్ డివిజనల్/ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించడం హర్షనీయమని టీజీపీఈఏ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ప్రజాభవన్‌లో ఆ సంఘం అధ్యక్షుడు పి.రత్నాకర్‌రావు, కార్యదర్శి పి.సదానందం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 15 ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోకుండా ఉన్న 209 మందికి ప్రభుత్వం పెద్ద ఊరట కల్పించిందన్నారు.

షారోన్ చర్చిలో సమ్మర్ క్యాంప్ షురూ


క్యాంపులో విద్యార్థులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో యేటా నిర్వహించే సమ్మర్ క్యాంపు సోమవారం ప్రారంభమైంది. వీబీఎస్ (ఒకేషనల్ బైబిల్ స్కూల్) పేరిట 3 రోజుల పాటు కొనసాగే శిబిరంలో ప్రైమరీ స్కూళ్లకు చెందిన 200 మంది విద్యార్థులు చిత్రలేఖనం, పాటలు, ఆటలు, డ్యాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నేర్చుకుంటారని పాస్టర్ ఎం. ప్రభుదాస్ తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



శ్రీనగర్‌కాలనీ: బిస్పోర్టీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లో సోమవారం నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్–13, అండర్–16 విభాగాల్లో బాలురు, బాలికలు సత్తా చాటారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్ విశాల్‌కుమార్, బిస్పోర్టీ ఎండీ వెంకటరామిరెడ్డి, ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ దినేశ్‌కుమార్ బహుమతులు అందించి అభినందించారు.

ఈనెల 11న 'రన్'


కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: వృక్షధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న మదర్స్ డే పురస్కరించుకుని గచ్చిబౌలి స్టేడియంలో 5కే, 3కే, 2కే రన్స్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్యాణి బెల్లంకొండ తెలిపారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమెరికాలో ఫౌండేషన్ స్థాపించి 4 దేశాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వృక్ష సంపదను కాపాడేందుకు, ప్రజల్లో పర్యావరణం, వృక్ష సంపద వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తూ ఏటా కనీసం లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రన్‌కు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్‌బాబును ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు దక్షిత, నిత్య సంతోషి, ప్రణిత దేవరెడ్డి, మురళి చదలవాడ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాపై స్పందించిన అధికారులు


మ్యాన్‌హోళ్లు పరిశీలిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–13 లోని ఎమరాల్డ్ స్వీట్స్ సమీపంలోని నివాసాలకు కొద్ది రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుందని అందిన ఫిర్యాదుల మేరకు బంజారాహిల్స్ తట్టికాన వాటర్ సెక్షన్ అధికారులు స్పందించారు. ఆయా నివాసాలకు సమీపంలో ఉండే తాగునీటి వాల్వ్‌లతో పాటు స్థానికంగా ఉన్న మ్యాన్‌హోళ్లను సోమవారం పరిశీలించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామని సెక్షన్ మేనేజర్ రాంబాబు తెలిపారు.

బీజేఆర్‌నగర్‌లో అధికారుల పర్యటన


బీజేఆర్‌నగర్ బస్తీలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఫిలింనగర్: బీజేఆర్‌నగర్ బస్తీలో 'తాగునీరు సరిపోతలేవ్' అని 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సోమవారం బస్తీలో పర్యటించి తక్కువగా నీరు వస్తున్న వీధులను పరిశీలించారు. 2 రోజులు పరిశీలించిన తర్వాత సరిపడా తాగునీరు సరఫరా చేస్తామని బస్తీవాసులకు హామీనిచ్చారు. అలాగే తక్కువ నీరు వచ్చే వీధులకు బుష్‌ల ఏర్పాటు చేసేందుకు కూడా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

బయట చెత్త వేస్తే జరిమానే!

స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా బయటవేస్తున్న వారిపై నిఘా

- మహిళా సమాఖ్యలకు బాధ్యతల అప్పగింత
- పైలట్ ప్రాజెక్టు కింద 4 బస్తీల ఎంపిక
- ఇంటింటికీ తిరుగుతూ ఆర్పీల అవగాహన
- వివరాల సేకరణ కూడా..


ఇందిరానగర్‌లో అవగాహన కల్పించి వివరాలు సేకరిస్తున్న రిసోర్స్ పర్సన్లు

బంజారాహిల్స్: రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేసేవారిపై చర్యలు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ సన్నద్ధమయ్యింది. ఈ మేరకు ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లో కాకుండా బయట చెత్త వేసేవారిని గుర్తించి వారికి జరిమానాలు విధించే బాధ్యతను మహిళా పొదుపు సంఘాలు రిసోర్స్ పర్సన్ల (ఆర్పీలు)కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 4 బస్తీలను ఎంపిక చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10 లోని ఉదయ్‌నగర్, సింగాడబస్తీ, రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్, రోడ్డునంబర్–2లోని ఇందిరానగర్ బస్తీల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఇప్పటికే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించిన అధికారులు వచ్చే వారం నుంచే జరిమానాలు విధించనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా స్వచ్ఛ ఆటోలకే తప్పనిసరిగా ఇవ్వాలని ఆర్పీలు ఇప్పటికే ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఎంతమంది చెత్తను ఆటో టిప్పర్‌లో వేస్తున్నారు..? ఎవరూ రోడ్లపై వేస్తున్నారు..? అనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే సరిపడా స్వచ్ఛ ఆటోలు ఉన్నాయా..? లేవో..? కూడా ఈ సర్వేలో తేలుస్తున్నారు. చెత్తను ఆటో టిప్పర్‌లో వేయకుంటే రూ.500 నుంచి రూ.2,000 ల వరకు ఫైన్ విధిస్తారు. జరిమానా డబ్బులను పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేస్తారు. ఈ నగదును సదరు పొదుపు సంఘాల వారు పర్యావరణ పరిరక్షణ కోసం వినియోగించాలని అధికారులు ఆదేశించారు.

చదరంగంలో ప్రతిభ


కోచ్ ఇచ్చిన గ్రాండ్ మాస్టర్ వాచ్‌లతో అమాయా, అనయ్

పంజగుట్ట: నగరానికి చెందిన ట్విన్స్ అమాయా అగర్వాల్, అనయ్ అగర్వాల్ 10 ఏళ్ల వయస్సులోనే అంతర్జాతీయ చదరంగంలో విజయాలు సాధించారు. ఈ సందర్భంగా సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో వీరు శిక్షణ పొందే ఏకాగ్రా చెస్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ సురేశ్ చైతన్య వీరికి గ్రాండ్ మాస్టర్ వాచీలను సోమవారం బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ .. నగరంలోని ఇండస్ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న వీరు ఆటల్లోనే కాదని పోటీల్లో పాల్గొని వచ్చిన వారంలోపే పరీక్షలు ఉంటే అందులోనూ క్లాస్ టాపర్లుగా నిలిచారని కొనియాడారు. అమాయా, అనయ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల సహకారంతో ఈ ఘనత సాధించామని, మున్ముందు మరిన్ని అద్భుతాలు సృష్టిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ ట్విన్స్ తల్లిదండ్రులు పనాషా అగర్వాల్, వరుణ్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఘనంగా కార్ల్‌మార్క్స్ జయంతి


కార్ల్ మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీఎస్.బోస్

హిమాయత్‌నగర్ : ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో కార్మిక వర్గ దిక్సూచి కార్ల్‌మార్క్స్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్.బోస్ హాజరై కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొడ్డుపల్లి కిషన్, కె.రమేశ్, పి.రాజేశ్, జి.ధర్మపురి, పి.కల్యాణ్ బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీతో నిరుపేదలకు మేలు


లబ్ధిదారుడి నివాసంలో భోజనం చేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్ : సన్నబియ్యం పంపిణీతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతున్నదని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని హెచ్‌ఎఫ్‌నగర్‌లో లబ్ధిదారుడు బాబర్ నివాసంలో పార్టీ నాయకులతో కలిసి సోమవారం సహపంక్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ షరీఫ్, మన్సూర్, ఎక్బాల్, నందునాయక్, అహ్మద్, షేక్ సాబేర్, విష్ణు, నయూంఖాన్, పల్లె సాయిలు, రామకృష్ణ, పరిమి సంజీవ్‌రావు, గొలుసుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

లక్డీకాపూల్ : వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎం. పావని మాట్లాడుతూ.. జీతాలు చెల్లించడంలో ఓపీడీఎస్ కాంట్రాక్టు సంస్థ, నిమ్స్ యాజమాన్యం తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. జీతాలు సమయానికి ఇవ్వకపోతే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే వేతనాలు చెల్లించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు యాజమాన్యంతో చర్చలు జరిపి వారికి న్యాయం చేయాలని కోరారు.

ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి తరలిన బీజేపీ శ్రేణులు


తరలిన జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు

బంజారాహిల్స్: అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి జూబ్లీహిల్స్ డివిజన్‌కు చెందిన బీజేపీ శ్రేణులు సోమవారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, నాయకులు సీతల అనిల్‌కుమార్, దండుగుల శ్రీనివాస్, దండగుల శేఖర్, శిరేఖ, డోంగరి రాజకళ, మంజలి నరసింహ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎంఐఎం నాయకులు


అభినందనలు తెలుపుతున్న నేతలు

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ ఎమ్మెల్సీగా గెలుపొందిన మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎంఐఎం నేతలు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. నేతలు షేక్ అన్వర్, శ్రీనగర్‌కాలనీ బ్రాంచ్ ప్రెసిడెంట్ షేక్ జాఫర్, ఎర్రగడ్డ నేత అజహర్, నదీమ్, ఎర్ర నగేశ్, యూసుఫ్, షరీఫ్, ఖలీమ్, రఫీక్, ఫిరోజ్, నవీద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'బస్తీ బాట'

రహమత్‌నగర్ : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నగర కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా పేర్కొన్నారు. వినాయకనగర్ బస్తీలో సోమవారం పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ నాయకులు కాసుల మహేశ్ కుమార్‌గౌడ్, బస్తీ అధ్యక్షుడు ఆనంద్, గోగుల్ల వెంకటేశ్, జాన్‌వెస్లీ, భరత్, మహేందర్‌గౌడ్, నాగమణి, మహేశ్వరిగౌడ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న హబీబా సుల్తానా

ఎంపీ చొరవతో నిమ్స్‌లో రోగికి శస్త్రచికిత్స

లక్డీకాపూల్ : ఖమ్మం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త, దళిత నాయకుడు చెంగలి నరసింహారావు కొంతకాలంగా మెదడులో కణితితో బాధపడుతున్నాడు. చెంగలి పరిస్థితిని ఆయన కుటుంబసభ్యులు స్థానిక ఎంపీ వద్దిరాజు దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన ఆయన నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో మాట్లాడి తక్షణ వైద్యం అందించాలని సూచించారు. దీంతో వైద్యులు కణితిని విజయవంతంగా తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో చికిత్స పొందుతున్న నరసింహారావును సోమవారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట సీనియర్ హైకోర్టు అడ్వకేట్ ఉప్ప రఘు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్, వైరా నియోజకవర్గ నాయకులు లాకావత్ గిరిబాబు, సీనియర్ జర్నలిస్ట్ బాపట్ల మురళి ఉన్నారు.

విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలి

లిబర్టీ: కళాశాలల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియామకమైన ప్రొఫెసర్ బాలభాస్కర్‌ను పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సి.హెచ్.బాలకృష్ణ సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కళాశాయి స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎన్నిక

లిబర్టీ: తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా మారగోని ప్రవీణ్‌కుమార్ గౌడ్‌ను ఇటీవల జరిగిన రాష్ట్ర మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో 25 లక్షల మంది పని చేస్తున్నారని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా కార్మిక శాఖలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని సంక్షేమ బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ

హిమాయత్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జి.శంకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు నర్సింగ్, సంపత్, స్వరూప, ఎం.సురేఖ, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

హిమాయత్‌నగర్ : ప్రభుత్వ (గౌట్) టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) రాష్ట్రస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు చెందిన కేసులు, సుప్రీంకోర్టులో ఉన్న ఎస్‌ఎల్‌పీలపై చర్చించారు. అనంతరం 17 జిల్లాల నుంచి హాజరైన జిల్లాల బాధ్యులు రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికకు తీర్మానం చేశారు. ఇందులో భాగంగా జరిగిన ఎన్నికలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.కిశోర్ (మహబూబ్‌నగర్ జిల్లా), ప్రధాన కార్యదర్శిగా జె.సైదులు రెడ్డి (యాదాద్రి జిల్లా), కోశాధికారి శ్రవణ్ కుమార్(యాదాద్రి జిల్లా), ఉప కోశాధికారి సి.హరిశంకర్(హైదరాబాద్ జిల్లా), రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కాసం ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు చేపట్టాలి


మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

హిమాయత్‌నగర్ : 1991లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బృందం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ డి.శ్రీధర్ బాబును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇళ్లను నిర్మించుకోలేదనే నెపంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థలాలను స్వాధీనం చేసుకుందన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు అశోక్ రెడ్డి, గోట్ల సూర్యకళ, జె.ఝాన్సీ రాణి, కటకం జానకీబాయి, దానగల్ల పవన్ కుమార్, కోరుకొండ లక్ష్మణ రావు, పి.కమలాకర్ రావు, ఎం.నర్సయ్య, మహమ్మద్ బేగ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పరంపర థీమ్'


వేడుకల్లో ఐఏఎస్ అధికారి జయేశ్‌రంజన్

శ్రీనగర్‌కాలనీ: గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అలుమినీ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన 'పరంపర థీమ్' వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే ఆటపాటలు, జానపద, సాంప్రదాయ, ఆధునిక నృత్యాలు, ఆలోచింపజేసే నాటక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆఫ్ తెలంగాణ ఐఏఎస్ జయేశ్ రంజన్ హాజరై మాట్లాడుతూ.. తాము చదివిన స్కూల్‌ని మర్చిపోకుండా ఓ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అలుమిని అసోసియేషన్ సభ్యులు ఆదిత్య మందన, అనూప్ యామ, డాక్టర్ రోహిత్ తపాడియా, కుష్ లుల్ల, కుష్ అగర్వాల్, రోహిత్ బమ్మి, త్రిషచంద్ర పాల్గొన్నారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి'


కరపత్రం ఆవిష్కరిస్తున్న వరప్రసాద్

పంజగుట్ట: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ దళిత జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాద్ తెలిపారు. సోమాజీగూడలోని దిల్‌కుశ గెస్ట్‌హౌస్‌లో కార్యక్రమ కరపత్రాన్ని క్రిస్టియన్ సంఘాల నాయకుడు జారుషలెం మత్తయ్యతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1956లో సిక్కు మతం తీసుకున్న దళితులకు, అలాగే 1990లో బౌద్ధమతం తీసుకున్న దళితులకు ఎస్సీ హోదా కల్పించారని అదేతరహాలో దళిత క్రైస్తవులకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు బగడం శ్రీనివాసరావు, ఆనంద కిరణ్ కుమార్, నరసింగరావు, పాస్టర్ ఎవరెన్ డేవిడ్ పాల్, పాల్గొన్నారు.

'చరిత్రవాహినిలో ఉత్తరాంధ్ర కాపులు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో కాపు సంఘం ప్రముఖులు

శ్రీనగర్‌కాలనీ: పంజగుట్టకాలనీలోని సెస్‌భవన్ బీపీఆర్ విఠల్ ఆడిటోరియంలో రచయిత, చరిత్రకారుడు చిల్లగట్టు శ్రీకాంత్‌కుమార్ రచించిన 'చరిత్రవాహినిలో ఉత్తరాంధ్ర కాపులు' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కాపు ప్రముఖులు లోలుగు మదన్, మాజీ కేంద్రమంత్రి పుంజాల శివశంకర్ కుమారుడు డాక్టర్ వినయ్, సీనియర్ జర్నలిస్ట్ విజయ్‌బాబు, ఏపీ తూర్పు కాపు కార్పొరేషన్ పాలవలస యశస్విని, జస్టిస్ భానుప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర కాపుల గురించి ఎన్నో తెలియని విషయాలు, ఉద్యమాలు, సాంఘిక, సామాజిక, సాహిత్య, రాజకీయాల్లో విశేషంగా రాణించిన మహారథుల జీవితవిశేషాలను రచయిత వివరించిన తీరు అద్వితీయమన్నారు. పూర్ణోదయ పిక్చర్స్ చైర్మన్ ఏడాద రాజాను రఘుపతి వెంకటరత్నంనాయుడు అవార్డుతో ఘనంగా సత్కరించారు. కాపు నేతలు గురాన అయ్యలు, తాడ్డి ప్రకాశ్, రౌతు గోపి, లోలుగు రాజశేఖర్, శ్యామ్‌సుందర్, శివప్రసాద్, జెమిని సురేశ్, కమెడియన్ భద్రం నిర్వాహకులు శ్రీనవయుగ ఈవెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జీమిర్చి.40, క్యాప్సికం.47, పచ్చికాకర.35, పందిరిబీర.35, క్యాబేజీ.9, క్యారెట్.21, దొండకాయ.28, గుండు బిన్నీస్.105, గింజచిక్కుడు.45, గోకరకాయ.35, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.19, ఉల్లిగడ్డ.14, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.15, కందగడ్డ.75, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ.7, పొట్లకాయ.18, అరటికాయ.9, మునగకాయ.4, మామిడికాయ.35, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.28. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



బంజారాహిల్స్: జలమండలి డివిజన్–6 కార్యాలయంలో జీఎం హరిశంకర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని వాటర్ సెక్షన్ల మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన 8 మంది అధికారులకు వినతులు అందజేశారు. ఇందులో 4 బిల్లులకు సంబంధించినవి కాగా, మిగితావి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఉన్నాయి. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అక్కడే ఉన్న మేనేజర్లను జీఎం ఆదేశించారు.

ఎర్లీబర్డ్ @రూ.160 కోట్లు !

- ఆస్తి పన్ను వసూళ్లకు అనూహ్య స్పందన
- జూబ్లీహిల్స్‌లో రూ.89 కోట్లు, ఖైరతాబాద్‌లో రూ.71 కోట్లు


ఎర్లీబర్డ్ స్కీం కింద చెక్కు తీసుకుంటున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: ముందస్తు ఆస్తి పన్ను వసూళ్ల కోసం ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ స్కీంకు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో అనూహ్య స్పందన వచ్చింది. గతేడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరం భారీగా ఆస్తి పన్ను వసూలైంది. ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో గతేడాది రూ.64 కోట్లు వసూలు కాగా, ఈ యేడు రూ.71 కోట్లు వసూలైనట్లు డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో గతేడాది రూ.84 కోట్లు వసూలు కాగా ఈ యేడు రూ.89 కోట్లు వసూలయ్యాయి. గతేడాది ఈ స్కీంను 27,294 మంది వినియోగించుకోగా, ఈ ఆర్థిక సంవత్సరం 28,723 మంది వినియోగించుకున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ప్రకటించగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో వినియోగదారులు పెద్ద ఎత్తున పన్నులు చెల్లించారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో స్కీం పై అవగాహన కలిగించి చెల్లింపుదారులను ఆకట్టుకున్నారు. దీంతో చాలామంది చెల్లింపులకు ముందుకువచ్చారు.

రోబోటిక్స్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రారంభం


ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించిన ప్రొ.కిషన్‌కుమార్ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్, జేఎన్‌టీయూహెచ్ టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యుబేటర్ సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్స్‌లో డిజైన్, ఫ్యాబ్రికేషన్, కంట్రోల్ ఆఫ్ రోబోటిక్ ఆర్మ్ అనే సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. జూన్ 5వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రోగ్రాంను ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తున్నారు. దీనికిగాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి హాజరై విద్యార్థులకు రోబొటిక్స్ సిద్ధాంత జ్ఞానాన్ని ప్రయోగాత్మంగా ఎలా అన్వయించాలో వివరిస్తూ కీలక ప్రసంగం చేశారు. 3డి మోడలింగ్, 3డి ప్రింటింగ్ ద్వారా ఫ్యాబ్రికేషన్, కంట్రోల్ సిస్టమ్స్, ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్, పైథాన్ ఆధారిత సీయూఐల వరకు మొత్తం ప్రాజెక్టు ప్రయాణాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.వెంకటనరసింహారెడ్డి, డాక్టర్ కె.అనితా శీలా, డాక్టర్ ఎం.ఆశారాణి, డాక్టర్ టి.మాధవి కుమారి తదిరతులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాలతో కదిలిన కేంద్రం: జాజుల



పంజగుట్ట: బీసీ ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం స్పందించి జనగణనలో కులగణన చేస్తామని నిర్ణయించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గత నెల 2వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీల పోరుగర్జన మహాధర్నాలో 42 మంది పార్లమెంట్ సభ్యులు, 18 రాజకీయ పార్టీలు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనడంతో దేశవ్యాప్తంగా బీసీల రిజర్వేషన్ల అంశం చర్చనీయాంశంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఎలాంటి సవరణలు లేకుండా ఆమోదించి రాష్ట్రపతికి పంపిన సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జాజుల కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గవర్నర్ 20 నిమిషాలకుపైగా బీసీల సమస్యలు, రిజర్వేషన్లు అమలైతే బీసీలకు కలిగే లాభాల గురించి చర్చించారని తెలిపారు. గవర్నర్‌ను కలిసినవారిలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజ్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యామ్ కురుమ, బి.మణిమంజరి, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పేటెంట్ ఎగ్జామినర్ల శిక్షణ ప్రారంభం


పేటెంట్ ఎగ్జామినర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాంతికుమారి

బంజారాహిల్స్: వరల్డ్ ఇంటెలెక్చువల్ ఆర్గనైజేషన్, రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్, కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్ మార్క్స్(సీజీపీడీటీఎం) సంయుక్తంగా పేటెంట్ ఎగ్జామినర్ల కోసం అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించాయి. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి సీజీపీడీటీఎం నుంచి 25 మంది పేటెంట్ అధికారులతోపాటు బంగ్లాదేశ్, ఈజిప్ట, జార్జియా, లావో పీపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్, మంగోలియా, మొరాకో, నైజీరియా, సౌదీ అరేబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, ఉగాండా దేశాల నుంచి కూడా పేటెంట్ ఎగ్జామినర్లు పాల్గొన్నారు. ఈ శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ సీఎస్, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్ అండ్ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి మాట్లాడుతూ భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పేటెంట్ ఎగ్జామినర్ల సామర్థ్యాలు, ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, సస్టేనబుల్ డెవలప్‌మెంట్‌ను సాధించే దిశగా నైపుణ్యాభివృద్ధి పెంపొందింపజేసేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీజీపీడీటీఎం ప్రొఫెసర్ ఉన్నత్ పి.పండిట్, కార్యక్రమ కౌన్సెలర్ విక్టర్ ఒవాడే, అనూప్ కె.జాయ్, డాక్టర్ డీటీ చారి, ఐపీఓ నుంచి త్రిప్తి పాండే, మనీషా లఖేరా తదితరులు పాల్గొన్నారు.

'మనూ'కు జాతీయస్థాయి గుర్తింపు


ఉర్దూ విశ్వవిద్యాలయం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాల్లో మనూ అసాధారణ పనితీరును ప్రదర్శించడం విశేషం. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) డేటా ప్రకారం 'మనూ'లోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ) ప్రోగ్రామ్ కింద బహుళ శిక్షణా కార్యక్రమాల్లో 'మనూ'అద్భుతమైన విజయాన్ని పొందింది. ఈ విశ్వవిద్యాలయం నాలుగు ప్రధాన శిక్షణా విభాగాలకుగాను మూడింటిలో ముందంజలో ఉంది. ఎన్‌ఈపీ ఓరియంటేషన్, ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్, షార్ట్ టర్మ్ ప్రోగ్రామ్‌లో రాష్ట్ర చార్టులలో విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలిచింది. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ తర్వాత రెండో స్థానం పొందడం విశేషం. ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో జాతీయ స్థాయిలో మనూ ఏడో స్థానంలో నిలిచింది. షార్ట్ టర్మ్ ప్రోగ్రామ్‌లలో 13వ స్థానాన్ని, రిఫ్రెషర్ కోర్సులలో 12వ స్థానం పొందింది. ఈ విజయం పట్ల ఎంఎంటీటీసీ 'మనూ'డైరెక్టర ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్ ముబార్కి హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్ కింద 3,954 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.

7 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె


ధర్నాలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ వెంకన్న, హనుమంతు ముదిరాజ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే అనివార్యంగా ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె చేస్తామని టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఈ. వెంకన్న, కో చైర్మన్లు కె.హనుమంత్ ముదిరాజ్, ఎం. థామస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్సు భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ సమ్మె నోటీసు ఇచ్చి మూడు నెలలైనా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించాలని, రెండు పీఆర్సీలను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆర్టీసీ సంస్థలో పదోన్నతులు, నియామకాలు లేవని, కార్మికులపై విపరీతమైన పనిభారం పెరుగుతోందని అన్నారు. 'మాకు సమ్మె చేయాలనే ఆలోచన లేదు, చర్చలు జరిపి 23 డిమాండ్లు పరిష్కరించాలి. లేదంటే ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎండి.మౌలానా, కె.యాదయ్య, ఎస్.సురేష్, బి.యాదగిరి, ఎస్.బాబు, డీవీకే రావు, కమలాకర్ గౌడ్, కె.సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి



దరఖాస్తులను స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, అనురాగ్ జయంతి

లక్డీకాపూల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని విన్నపాలను స్వీకరించారు. పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి పలు సమస్యలను సాధ్యమైన మేరకు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 171 దరఖాస్తులు వచ్చాయని, అందులో టౌన్ ప్లానింగ్, విద్యుత్ దీపాలు తదితర సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారని చెప్పారు. ప్రధాన కార్యాలయంలో మొత్తం 75, అన్ని జోన్లలో కలిపి 96 విన్నపాలు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో అధికారులు రఘుప్రసాద్, వేణుగోపాల్ చంద్రకాంత రెడ్డి, పంకజ గీతా రాధిక, టౌన్ ప్లానింగ్ అడిషనల్ సీసీపీ వీరన్న ప్రదీప్ పాల్గొన్నారు.

పాతాళ గంగ స్వల్పంగా పైకి!

సాధారణం కంటే రెండు సెంటీమీటర్ల అధిక వర్షపాతం

- ప్రస్తుతం నగటున 9 నుంచి 20 మీటర్ల లోతున భూగర్భ జలాలు
- ఈ నెలలో సాధారణ వర్షం నమోదు కాకుంటే ప్రమాద ఘంటికలే..



గ్రేటర్ పరిధిలో భూగర్భ జల మట్టం ఇలా(మీటర్ల లోతులో..)	
కూకట్‌పల్లి	21.45
ఎస్ఆర్ నగర్	20.08
మల్కాజిగిరి	19.50
మారేడుపల్లి	18.45
దుండిగల్	17.85
హస్మత్‌పేట్	17.58
ఎంసీపల్లి	17.26
అమీర్‌పేట్	17.26
ఉప్పల్	15.10
మేడ్చల్	13.35
కుల్సుంపురా	13.11
కుత్బుల్లాపూర్	12.88
గుడిమల్కాపూర్	12.83
కీసర	12.18
అల్వాల్	11.73
బాలానగర్	10.27



సాక్షి, సిటీబ్యూరో:

పాతాళ గంగ స్వల్పంగా పైకి ఎగబాకింది. మండు వేసవిలో కురిసిన అకాల వర్షం భూగర్భజలాలకు జీవం పోసింది. గత నెలలో సాధారణం కంటే సగటున రెండు సెంటీమీటర్ల వర్షపాతం అధికంగా నమోదైంది. దీంతో భూగర్భజల సమస్యకు కొంత మేరకు ఉపశమనం కలిగించినట్లయింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం నమోదు కానట్లయితే భూగర్భజలాల సమస్య జఠిలమయ్యే ప్రమాదం లేకపోలేదు. గత నెలలో సగటున సాధారణ వర్ష పాతం కంటే అధికంగా 25 శాతం, అంతకు ముందు నెలల్లో సైతం వరసగా అధిక వర్షపాతం నమోదైంది. అయితే ఈ నెలలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో భూగర్భ జలమట్టం మరింత పడిపోయే ప్రమాదం ఉందని భూగర్భ జల శాఖ అంచనా వేస్తోంది.

నీటి సంరక్షణలో నిర్లక్ష్యమే...

మహానగర పరిధిలో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైనా కాంక్రీట్ జంగిల్ కారణంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. మరోవైపు విచ్చలవిడిగా బోర్ల తవ్వకం, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికావడమే అవరోధాలుగా నిలుస్తున్నాయి. మరోవైపు వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం ఫలితంగా భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. సగటు భూగర్భజలమట్టం 11.94 మీటర్లు కాగా, అది 20 మీటర్లకు పడిపోయింది. ఆసిఫ్‌నగర్, బండ్లగూడ, చార్మినార్, సైదాబాద్, నాంపల్లి, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, గోల్కొండ, అంబర్‌పేట, అమీర్‌పేట, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, ఎస్సార్ నగర్, ఎర్రగడ్డ, చాంద్రాయణగుట్ట, మారేడుపల్లి, డబీర్‌పురా, గండిపేట, మేడిపల్లి, చంగిచర్ల, హస్మత్‌పేట, గాజుల రామారం, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, ఉప్పల్, రాజేంద్రనగర్, పటాన్‌చెరు, దూలపల్లి ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోయాయి.

వర్షం కురిసినా..

హైదరాబాద్ పరిధిలో సాధారణ వర్షపాతం 799.3 మిల్లీమీటర్లు కాగా ఏప్రిల్ చివరి నాటికి 1001.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సుమారు 25 శాతం అధికంగా వర్షం కురిసినా అంతంత గానే నీరు భూమిలోకి ఇంకింది. మార్చి నెలలో సాధారణ వర్షపాతం 780.9 మిల్లీమీటర్ల వర్షపాతానికిగాను 906.3 మిల్లీ మీటర్లు కురిసింది. ఇక్కడ కూడా 16 శాతం అధికంగా నమోదైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో గత నెలలో 769.4 మిల్లీమీటర్లకుగాను 865.9 ఎంఎం కురిసింది. సుమారు 13 శాతం అధికంగా నమోదైంది. కురిసిన నీరంతా వరద కాలువల ద్వారా మూసీలోకి చేరి అక్కడి నుంచి నదుల్లో కలుస్తోంది. వృథాగా పోతున్న వర్షం నీటిని ఒడిసి పడితే తప్ప నీటిమట్టాలు పెరిగే అవకాశం లేదని నిపుణలు అభిప్రాయపడుతున్నారు.

హెచ్‌టీ కనెక్షన్లకు సింగిల్ విండో

విద్యుత్ శాఖలో సరికొత్త సేవలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌టీ కనెక్షన్ల జారీలో పారదర్శకత, మంజూరులో మరింత వేగవంతం కోసం సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ యత్నిస్తోంది. వినియోగదారులు రోజుల తరబడి సంస్థ చుట్టూ తిరగాల్సిన అవసరం ఇక ఉండకపోవచ్చు. దరఖాస్తు నేరుగా సంబంధిత సెక్షన్ అధికారికి చేరుతుందని, నిర్దిష్ట గడువులోగా సర్వీసు కనెక్షన్ మంజూరు అవుతుందని, తద్వారా సిబ్బంది అక్రమ వసూళ్లకు, పనిలో జాప్యానికి ఆస్కారం లేకుండా పోతోందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఇప్పటికే ఏఎంఆర్ ఆన్‌లైన్, ఈ మెయిల్ ద్వారా హెచ్‌టీ బిల్లులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి కనెక్షన్ల జారీ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 13,099 హెచ్‌టీ కనెక్షన్లు ఉండగా, ఇప్పటికే వెయ్యి మంది వినియోగదారులకు ఎలాంటి మానవ ప్రమేయం లేకుండానే నేరుగా బిల్లుల జారీ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు నాటికి అన్ని హెచ్‌టీ కనెక్షన్లను ఈ సేవల పరిధిలోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. గతంలో ఆయా సర్వీసులకు కాంట్రాక్ట్/ లోడ్ సామర్థ్యాన్ని బట్టి ఎస్ఈ, డీఈ, ఏడీఈలు బిల్లులు జారీ చేసేవారని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రక్రియకు స్వస్తి చెప్పామన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి


ప్రభుత్వ సదనంలో మాట్లాడుతున్న సీతా దయాకర్‌రెడ్డి

సైదాబాద్: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె కమిషన్ సభ్యులు మరిపల్లి చందన, వందనగౌడ్, వచన్ కుమార్, ప్రేమలత అగర్వాల్, అపర్ణ, సరితలతో కలిసి సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనం, పరిశీలన గృహం, డీ-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. బాలుర గృహం, పరిశీలన గృహంలో కల్పిస్తున్న వసతులు, అక్కడున్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలలకు అందిస్తున్న విద్య, ఉపాధి శిక్షణ కార్యక్రమాల గురించి ఆరా తీశారు. ప్రత్యేక అవసరాలున్న బాలురను గుర్తించి త్వరితగతిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్, సూపరింటెండెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల పనితీరు మెరుగుకు 'ర్యాంప్'


మాట్లాడుతున్న మధుకర్ బాబు

కుషాయిగూడ: ఎంఎస్ఎంఈల పనితీరును వేగవంతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం 'ర్యాంప్'కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంఎస్ఎంఈ కమిషనరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ కె.మధుకర్ బాబు తెలిపారు. రాష్ట్రంలోని మధ్య, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలకు కావాల్సిన ఆధునాతన పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫర్ఫామెన్స్(ఆర్ఏఎంపీ)ని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) ఆధ్వర్యంలో సోమవారం చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సీఐఏ ఆడిటోరియంలో టూలింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సాంకేతిక అంతరాలను అంచనా వేయడం, బెంచ్ మార్కింగ్ అధ్యయనంలో భాగంగా చేపట్టిన ర్యాంప్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఐటీడీ ఆధ్వర్యంలో పది క్లస్టర్లు, మరో సంస్థ సిపెట్ ఆధ్వర్యంలో పది క్లస్టర్లలో ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ల పరిధిలోని పారిశ్రామికవేత్తలతో తమ బృందాలు అనుసంధానమై వారి స్థితిగతులు, అందుబాటులో ఉన్న టెక్నాలజీ, కావాల్సిన సౌకర్యాలు, ఆర్థిక తోడ్పాటు వంటి అంశాలపై క్షుణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సీఐఏ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీడీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడతాం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్


సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ శ్రవణ్

గచ్చిబౌలి: రేవంత్‌రెడ్డి సర్కారులోని మంత్రులు పగటి కలలు కంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారంపై గచ్చిబౌలిలోని సీసీఎస్‌లో సోమవారం బీఆర్ఎస్ బృందం ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలు ఎలా ఇవ్వాలో ప్రభుత్వం నేర్చుకోవాలని ఆయన సూచించారు. సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వారు బీఆర్ఎస్ నేతలపై చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వీటిని తప్పకుండా తిప్పికొడతామన్నారు. సీఎంకు పని చేయడం చేతకాదని, వాగ్దానాలు నెరవేర్చే ఆలోచన లేదని, అన్ని వర్గాల ప్రజలు సతమతమవుతుంటే మొద్దు నిద్ర నటిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మీటింగ్ అయిన రెండో రోజు నుంచి ప్రజా నాయకుడైన హరీశ్‌రావు మీద పెద్దఎత్తున విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే హరీశ్‌రావుపై సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ కుట్రలు చేస్తుండటం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. ఫేక్ పేపర్ క్లిప్పింగ్‌లు సృష్టించి షేర్ చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారాలపై కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, వై.సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధిలో మహిళలే కీలకం



రాయదుర్గం: మహిళా వ్యాపారవేత్తలు పట్టణ అభివృద్ధితోపాటు ఇతర అన్ని రంగాల సమగ్ర అభివృద్ధిలో తమదైన పాత్ర పోషిస్తున్నారని ఐపీఎస్ అధికారి శిరీష రాఘవేంద్ర అన్నారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీవర్క్స్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(సీఓడబ్ల్యూఈ) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కూడా కృషి చేస్తోందన్నారు. సీఓడబ్ల్యూఈ జాతీయ అధ్యక్షురాలు నిధి తోష్నివాల్ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించేందుకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు చైర్‌పర్సన్ శైలజారెడ్డి, నూతన అధ్యక్షురాలు కల్పనారావు, కార్యదర్శి నీరజ గోదావర్తి, జాతీయ ఉపాధ్యక్షురాలు నీరజారెడ్డి, మాజీ అధ్యక్షురాలు లలితా, పలువురు సభ్యులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

సీఓడబ్ల్యూఈ తెలంగాణ చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలుగా కల్పనారావు, కార్యదర్శి-1 నీరజ గోదావర్తి, కార్యదర్శి-2 అనురాధా కరాటి, సంయుక్త కార్యదర్శిగా నిసా అగర్వాల్, కోశాధికారిగా కీర్తి చీకోటి ఎన్నికయ్యారు.

టీజీఎఫ్‌డీసీ పదేళ్ల పండగ ప్రారంభం

గచ్చిబౌలి: ఆర్థికంగా బలోపేతమైన ప్రభుత్వ రంగ సంస్థగా అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) నిలిచిందని ఆ సంస్థ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం బొటానికల్ గార్డెన్‌లో టీజీఎఫ్‌డీసీ పదేళ్ల పండగను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ఆధారిత పరిశ్రమలు, ప్రకృతి పర్యాటకం, పునరుత్పాదక ఇందనం, సీఎస్ఆర్ కార్యక్రమాలతో టీజీఎఫ్‌డీసీ విశిష్టతను చాటుకుందన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించి, వివిధ అంశాలలో పర్యావరణ ప్రియులను భాగస్వాములను చేశామని పేర్కొన్నారు. పదేళ్ల పండుగను ఈ నెల 14 వరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎకోటూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ సైకిలాబ్, ఏడీ తనూజ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్-2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ప్రజావాణికి 99 అర్జీలు


ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ ముకుంద రెడ్డి

లక్డీకాపూల్: ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుందరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 99 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. హౌసింగ్ 35, పెన్షన్ 21, రెవెన్యూ 20, ఇతర శాఖలకు సంబంధించి 23 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఈ.వెంకటాచారి, ఆర్డీఓ రామకృష్ణ, జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్. కోటాజీ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం శాంతి చర్చలు ప్రారంభించాలి

పౌర హక్కుల సంఘం

సుల్తాన్‌బజార్: మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య చర్చలు జరగాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, న్యాయవాదులు, పత్రికా సంపాదకులు కోరుతున్నారని, కేంద్రం వెంటనే చర్చలు ప్రారంభించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్య భారతంలో జనవరి 2024 నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. శాంతిచర్చలకు సిద్ధమని, కాల్పుల విరమణ పాటిస్తామని నెల క్రితమే మావోయిస్టు పార్టీ ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా నరసంహారాన్ని ఎన్‌కౌంటర్ రూపంలో కొనసాగిస్తోందని విచారం వ్యక్తం చేశారు. గత 16 నెలల్లో 52 ఎన్‌కౌంటర్లలో 480 మందిని పోలీసు బలగాలు హత్య చేశాయని ఆరోపించారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, సురేష్ కుమార్, బాలయ్య పాల్గొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయండి: సంధ్య



ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ నగరంలో జరగనున్న ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యఅన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట 72వ మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న హింస, విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల వినియోగం, ఇతర సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా అందాల పోటీలు నిర్వహించడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. వేసవిలో నీటి కోసం ఇబ్బంది పడుతున్న మహిళల గురించి ప్రభుత్వం ఆలోచించాలని బీఆర్ఎస్ నాయకురాలు డా.సత్యవతి, కార్పొరేటర్ డా.సామల హేమ అన్నారు. అందాల పోటీలను విరమించుకోవాలని మహిళ, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు అనసూయ, స్వరూప, లక్ష్మీబాయి, ఆశాలత, మహేష్, నాగరాజు, ఆసిఫ్, నవీన్, మౌనిక, కవిత, రాధ, మంజుల, సుమిత్రా, ఆనంద్ పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 6, మే, 2025





ఆత్మవిశ్వాసం ఉండాలే గానీ అసాధ్యం అంటూ ఏదీ ఉండదు? అరుదైన సాహసాలు చేయాలనే తపన ఉండాలే గానీ..అద్భుతాలు సృష్టించవచ్చు.. ఘనమైన ప్రతిభను పొందవచ్చు.. అంటున్నారు నగరానికి చెందిన అడ్వెంచర్ టూరిస్టులు. నగరంలో సాహసికులు పెరుగుతున్న కొద్దీ వైవిధ్య భరిత సాహసాలు కూడా వెలుగు చూస్తున్నాయి. ఇదే క్రమంలో నగరానికి చెందిన నలుగురు భిన్న రంగాలకు చెందిన ఔత్సాహికులు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వతంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించిన పాంగోంగ్ ఫ్రోజెన్ లేక్‌లో హాఫ్ మారథాన్‌లో పాల్గొని నగరం నుంచి ఆ ఘనతను దక్కించుకున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

పాంగోంగ్ హాఫ్ మారథాన్‌లో..



రతన్


నగరవాసుల ఘనప్రతిభ

- గడ్డ కట్టిన మంచుపై పరుగు పందెం
- నగరానికి చెందిన నలుగురు వ్యక్తుల సాహసం
- గిన్నిస్ రికార్డ్ ఈవెంట్‌లో భాగస్వామ్యం
- ప్రపంచపు ఎత్తయిన ప్రదేశంలో హాఫ్ మారథాన్


లద్దాఖ్, ఫిబ్రవరి 24–25, **2025: ప్రపంచంలోనే** అత్యంత ఎత్తులో జరిగే **మంచు సరస్సు మారథాన్**గా ప్రసిద్ధి పొందిన **పాంగోంగ్ ఫ్రోజెన్ సరస్సు** మారథాన్ ఈ ఏడాది కూడా లద్దాఖ్‌లో ఘనంగా జరిగింది. ఇది కేవలం రన్నింగ్ ఈవెంట్ మాత్రమే కాకుండా, హిమాలయాల్లో వేగంగా కరుగుతున్న హిమనీనదాలపై మరియు వాతావరణ మార్పుల ప్రభావంపై చైతన్యాన్ని పెంచే ప్రయత్నం కూడా.

రన్ విశేషాలివీ..

హిమాలయాల్లో కరుగుతున్న హిమనీనదాలు, తగ్గుతున్న మంచు సరస్సుల వల్ల భవిష్యత్తు మార్పులపై అవగాహన కల్పించటం కోసం లద్దాఖ్‌లోని పాంగోంగ్ సరస్సులో 4,273 మీటర్ల ఎత్తులో 2023లో మొదటిసారి ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ మారథాన్, గిన్నిస్ వరల్డ్ రికార్డులో 'అత్యంత ఎత్తులో జరిగే మంచు సరస్సు మారథాన్'గా గుర్తింపు పొందింది. తాజా రన్‌లో అమెరికా, నేపాల్, కొరియా, ఆస్ట్రేలియా, భారత్‌కు చెందిన అంతర్జాతీయ రన్నర్లు పాల్గొన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఇలాంటి ఈవెంట్లు జరగకపోవచ్చని హెచ్చరిస్తూ, పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరాన్ని చాటుతూ నిర్వహించే ఈ మారథాన్‌ను 'ది లాస్ట్ రన్' అని కూడా పిలుస్తారు.



రాజేష్



రంగాలు వేరైనా.. 'రన్'లో ఒక్కటై..

నగరానికి చెందిన ప్రవీణ్ గోయెల్, నవీన్ సింకా, బిక్కినా వెంకట రాజేష్ రతన్ నలుగురూ వేర్వేరు రంగాలకు చెందిన వారు. అయితే వీరంతా.. సమవయస్కులు కూడా కాదు. అయితేనేం .. అభిరుచి వారిని కలిపింది. ఆత్మవిశ్వాసం వారిని విజయ శిఖరాన నిలిపింది. 'ఇంట్లో వాళ్ల వద్దనే చెప్పారు. కానీ.. అప్పటికే సైక్లింగ్, రన్నింగ్ వంటివి అలవాటయ్యాయి. అందుకే దీన్ని ప్రయత్నించడం భయం అనిపించలేదు' అని చెప్పారు వ్యాపారి ప్రవీణ్‌గోయెల్. '16 డిగ్రీల చలిని పట్టించుకోకుండా కదులుతూ ఉండటానికి చేసిన మానసిక ప్రయత్నం ..ఫలించింది. భయాన్ని అధిగమించడానికి సహాయపడింది' అని భారత నావికాదళంలో అధికారిగా పనిచేసే రతన్ (29) చెప్పారు. 'గత 15 సంవత్సరాలుగా మారథాన్ రన్నర్, బ్యాడ్మింటన్ ఆటగాడిగా అనుభవం ఉంది. అయినప్పటికీ ఇది పూర్తిగా ప్రత్యేకం అంటున్నారు ఐటీ నిపుణులు నవీన్ సింకా (45). పరుగులో మా ముఖాలు మొద్దుబారిపోయాయి. మా దగ్గర ఉన్న నీరు కూడా పరుగు మధ్యలో గడ్డకట్టుకుపోయింది' అంటూ గుర్తు చేసుకున్నారు. 'గ్లోబల్ వార్మింగ్ కారణంగా, పాంగోంగ్ త్వరలో గడ్డకట్టడం ఆగిపోవచ్చు' అని మరో ఐటీ ప్రొఫెషనల్ (50) రాజేష్ చెప్పారు. 'తనకు ఇది వ్యక్తిగత రికార్డ్ కన్నా ఎక్కువ అని, ఈ రన్‌లో ఇమిడి ఉన్న సందేశమే తనకు ముఖ్యమని అంటున్నారాయన. లాస్ట్ రన్ పేరు ఆకర్షణీయంగా అనిపించవచ్చు కానీ.. దాని వెనుక అంతరార్థం మాత్రం ఆందోళనకరం' అని చెప్పారు.

విభిన్న నేపథ్యాల నుంచి..

నావికాదళ అధికారి, కార్పొరేట్ వ్యవస్థాపకుడు, సాఫ్ట్‌వేర్ నిపుణుడు, ఐటీ మారథానర్ – వంటి విభిన్న నేపథ్యాలున్నప్పటికీ, ఈ నలుగురూ అవరోధాలను అధిగమించి అనూహ్యమైన రికార్డు సాధించారు. నగరానికి తిరిగి వచ్చిన వారి ప్రయాణం కొత్త లక్ష్యాల దిశగా సాగనుంది. ఐరన్ మ్యాన్ గోవా అనే ఈవెంట్‌పై రతన్ తన దృష్టి పెట్టారు. కిలిమంజారోను అధిరోహించాలని నవీన్ యోచిస్తుంటే, రాజేష్ 6000+ మీటర్ల హిమాలయ శిఖరంపై సూపర్ రాండన్నూర్ సైక్లింగ్ హోదాను గురిపెట్టారు. పాంగోంగ్ నుంచి కొత్తగా ప్రేరణ పొందిన ప్రవీణ్ మరిన్ని సాహసాలను అన్వేషిస్తున్నారు.



▶ ప్రవీణ్ గోయెల్



హైదరాబాద్ వేదికగా మరికొద్ది రోజుల్లో 72వ మిస్ వరల్డ్ - 2025 పోటీలు జరగనుండటం విధితమే. దీనిలో దాదాపు 120 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంటులు భాగస్వాములు కానున్నారు. ఇందులో భాగంగా నగరానికి చేరుకున్న మిస్ వరల్డ్ థాయిలాండ్ 2025 'ఓపాల్ సుచాత చువాంగ్ శ్రీ' నగరంలో సోమవారం సందడి చేశారు. బంజారాహిల్స్‌లోని సింఘానియాస్ వస్త్ర దుకాణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్న 'ఓపాల్ ఫర్ హర్'కు మద్దతుగా సింఘానియాస్ చీరలు, లెహంగాలను ధరించారు. తన ఫ్యాషన్ ప్రయాణంతో పాటు తన వ్యక్తిగత విషయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..!! - సాక్షి, సిటీబ్యూరో

క్యాన్సర్ బాధితులకు అండగా..

- కేవలం 15 రోజుల్లో మిస్ వరల్డ్ పోటీలకు సిద్ధమయ్యా
- 16 ఏళ్ల వయసులో బ్రెస్ట్ క్యాన్సర్ సర్జరీ జరిగింది
- నాలాంటి మరికొందరు మహిళలకు మద్దతు అందిస్తున్నా
- మిస్ వరల్డ్ విజేతగా నా దేశానికి గుర్తింపు తేవడమే లక్ష్యం
- సాక్షితో 'మిస్ థాయ్‌లాండ్' ఓపాల్

గ్లోబల్ వేదికగా ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుండటం సంతోషంగా ఉంది. అనూహ్యంగా.. మిస్ థాయ్‌లాండ్‌గా మిస్ వరల్డ్ వేదికకు సిద్ధం కావడానికి కేవలం 15 రోజులు మాత్రమే పట్టింది. నా జీవితంలో ఇదొక మిరాకిల్. తక్కువ సమయంలో ఈ అవకాశం రావడం నా అదృష్టం. ప్రోత్సాహాన్ని అందించిన థాయ్ ప్రజలకు, అంతర్జాతీయ అభిమానులకు ఎప్పుడూ రుణపడి ఉంటా. ఈ వేదికపై విజేతగా నిలవడమే నా దేశానికిచ్చే రిటర్న్ గిఫ్ట్. పుట్టి పెరిగిందంతా థాయ్‌లాండ్ పుకెట్లో. విద్యాభ్యాసం అక్కడే చేశాను. ఉన్నత చదువులకు బ్యాంకాక్ వచ్చాను. అక్కడి నుంచి నా ఫ్యాషన్ ప్రయాణం మొదలైంది.

ఆ బాధ నాకు తెలుసు..

సామాజిక బాధ్యతలో భాగంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నాను. 16 ఏళ్ల వయసులో నాకు బ్రెస్ట్ క్యాన్సర్ సర్జరీ జరిగింది. ఇందులో భాగంగా నాన్ క్యాన్సరస్ లంప్‌ను తీసేశారు. ఆ అవస్థలు, వేదన నాకు భాగా తెలుసు. అందుకే.. రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటాను. ముందస్తు చికిత్స–గుర్తింపు అవసరముంది. మహమ్మారిపైన అవగాహన కల్పించడమే జీవిత లక్ష్యం. మిస్ థాయ్‌లాండ్‌గా నా స్వరాన్ని వినిపిస్తున్నాను. ఇలాంటి సామాజిక బాధ్యతల్లో భాగంగా 'ఓపాల్ ఫర్ హర్'లో పాలుపంచుకున్నా. థాయ్ ప్రజలకు స్ఫూర్తినిస్తూ.. ప్రపంచానికి సేవచేస్తాను. ఈ విషయాల్లో మా అమ్మే నాకు స్ఫూర్తి.

ఆతిథ్యం అదుర్స్..

ఎయిర్ పోర్ట్‌లో లభించిన స్వాగతం సత్కారాలు చూసి ఆశ్చర్యపోయాను. ఇంతటి ఘనమైన ఆతిథ్యం జీవితంలో ఇదే మొదటిసారి. హైదరాబాద్ విశిష్టతల గురించి విన్నాను.. ఇది పెరల్ సిటీ అని ఇక్కడికి వచ్చాక తెలిసింది. నాకు ఆభరణాలంటే ఎంతో ఇష్టం. ప్రత్యేకంగా ఓల్డ్ సిటీ వెళ్లి ఆభరణాలు కొనుక్కుంటాను. చార్మినార్, పెద్దమ్మతల్లి టెంపుల్‌కు కూడా వెళతాను.

సాక్షి, సిటీబ్యూరో: గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్, యుకే విజువల్ మర్చండైజింగ్ నిపుణురాలు సారా మానింగ్ నగరంలో సందడి చేశారు. హిమాయత్ నగర్ 'న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్' (ఎన్ఐఎఫ్ గ్లోబల్) ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్న సారా, నగరంలోని ఫ్యాషన్ ఔత్సాహికులకు ఫ్యాషన్, డిజైన్ రంగాల్లో అంతర్జాతీయ విద్యా నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. దేశంలో ఈ తరహా వర్క్‌షాప్ సిరీస్ నిర్వహించడం ఇదే మొదటిసారి కాగా.. హారోడ్స్, సెల్ఫ్ రిడ్జెస్ వంటి ప్రముఖ రిటైలర్లతో పనిచేసిన విశేష అనుభవం కలిగిన సారా మానింగ్ ఈ వర్క్‌షాప్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. విజువల్ స్టోరీ టెల్లింగ్, స్పేస్ ప్లానింగ్, కన్స్యూమర్ సైకాలజీ, అధునాతన ఫ్యాషన్ ఎగ్జిబిషన్స్‌పై అవగాహన కల్పించారు. భారత్‌లో డిజైన్ నైపుణ్యాలు పుష్కలంగా ఉన్నాయని, వారికి ఎన్ఐఎఫ్ గ్లోబల్ వేదికగా అభ్యాస ప్రయాణం తోడ్పాటునందిస్తుందని అన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు సృజనాత్మక ఆలోచనలకు, వ్యాపార వ్యూహాలకు సన్నద్ధం చేస్తాయన్నారు. తమ కేంద్రానికి సారా రావడం సంతోషకరమని ఎన్ఐఎఫ్ గ్లోబల్ సెంటర్ డైరెక్టర్ అన్నారు. వర్క్‌షాప్ అనంతరం విద్యార్థులకు మానింగ్ సంతకం చేసిన పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందించారు.





డిజైన్ నైపుణ్యాలు పుష్కలం

- ఎన్ఐఎఫ్ గ్లోబల్ వర్క్‌షాప్‌లో ఫ్యాషన్ ఐకాన్ సారా మానింగ్

ఘన స్వాగతం

- శంషాబాద్ ఎయిర్ పోర్టులో సుందరీమణుల సందడి
- సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికిన పర్యాటక శాఖ

శంషాబాద్ : హైదరాబాద్‌కు ప్రపంచ దేశాల అందగత్తెలు క్యూ కడుతున్నారు. నగరంలో ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ సుందరి పోటీల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆయా దేశాల సుందరీమణులు భాగ్యనగరిలో అడుగుపెడుతున్నారు. ఇప్పటికే పలుదేశాలకు చెందిన సుందరీమణులు నగరానికి చేరుకుని మన ఆతిథ్యం స్వీకరిస్తుండగా మిస్ పోర్చుగల్ మారియా అమెలియా ఆంటోనియో, మిస్ ఘనా జుట్టా అమా పోకుహో అడ్డో, మిస్ ఐర్లాండ్ జాస్మిన్ జెర్హార్డ్‌లు శంషాబాద్ విమానాశ్రంలో సోమవారం అడుగుపెట్టగానే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు.



ప్రత్యేక ఏర్పాట్లు..

శంషాబాద్ విమానాశ్రయానికి 120 దేశాలకు చెందిన ప్రతినిధుల రాక సందర్భంగా పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మరో రెండు రోజుల పాటు విదేశీ ప్రతినిధుల రాక నేపథ్యంలో వారి కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసింది. విదేశీ ప్రతినిధుల కోసం ప్రత్యేక లాంజ్ కూడా ఏర్పాటు చేశారు. పర్యాటక శాఖ స్వాగతం పలికే తోరణాలు, ఆయా దేశాల జెండాలను ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేశారు. మంగళ, బుధవారాల్లో పెద్ద సంఖ్యలో అందాల భామలు అడుగుపెట్టనున్నారు.





మల్కాజిగిరికి చెందిన శ్రీవల్లి శైలజ 2024లో నిర్వహించిన జ్యుడీషియరీ పరీక్షల్లో జనరల్ కేటగిరిలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 24 ఏళ్ల వయసులో చదువు పూర్తయిన అనతి కాలంలోనే న్యాయమూర్తిగా ఎంపిక కావడం పట్ల ఇంటా బయటా ప్రశంసల జల్లు కురుస్తోంది. విద్యావంతుల కుటుంబంలో పుట్టిన తాను చిన్ననాటి నుంచే సామాజిక సేవ చేయాలన్న తండ్రి ఆశయంతో పెరిగారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడు అయినా న్యాయమూర్తి కాలేకపోయారు. దీంతో తండ్రి ఆశయాన్నే తన ఆశయంగా చేసుకుని లక్ష్యం చేరుకున్నారు శ్రీవల్లి. ఇంటర్ అవగానే ఎంసెట్, లా ప్రవేశపరీక్షలు రెండూ రాశారు. రెంటిలోనూ మంచి ర్యాంకులు సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో జ్యుడీషియరీ మెయిన్స్ వైపు అడుగులువేశారు.

చిన్న వయసు నుంచే సామాజిక సేవ చేయాలనే తపన, న్యాయవాది కావాలన్న తన తండ్రి ఆశయాన్ని గమనించారు.. లా పూర్తి చేసినా న్యాయవాదిగా స్థిరపడాలన్న తండ్రి లక్ష్యం నెరవేరలేదు.. అందుకే తండ్రి కలను పట్టుదలతో తాను సాధించారు.. న్యాయవాది కాదు.. ఏకంగా న్యాయమూర్తిగానే ఎంపికయ్యారు.. మొదటి ప్రయత్నంలోనే.. ఉన్నత స్థానాన్ని అధిరోహించారు.. స్ఫూర్తిమంతమైన ఆమె ప్రయాణం ఆమె మాటల్లోనే..
- సికింద్రాబాద్

- తండ్రి కల నెరవేర్చిన తనయ
- పట్టుదలతో మొదటి ప్రయత్నంలోనే విజయం
- న్యాయమూర్తి శ్రీవల్లి శైలజ స్ఫూర్తిమంతమైన ప్రయాణం

ప్రభుత్వాధికారుల కుటుంబం నుంచి..

అమ్మ నాన్న ఇద్దరూ ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వాధికారులు. నాన్న రమేష్ నరసింహం హైదరాబాద్‌లో సీజీఎస్‌టీ సూపరింటెండెంట్. తల్లి లక్ష్మీసురేఖ దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో అసిస్టెంట్ ఆఫీసర్. ఓయూలో ఎల్ఎల్‌బీ, నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. అనంతరం జ్యుడీషియరీ మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ సివిల్ జడ్జి వరకూ ఎదిగారు. శ్రీవల్లి సోదరి సహితం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాలో ఐపీఎం (మూడో సంవత్సరం) చదువుతున్నారు.

24 ఏళ్లకే న్యాయమూర్తిగా



నాన్న కల నెరవేరింది..

జ్యుడీషియరీ మెయిన్స్ తరువాత ఏప్రిల్ నెల్లో ఇంటర్వ్యూ జరిగింది. ఫలితాలు కొద్ది రోజుల క్రితమే వచ్చాయి. చిన్న వయసులోనే జూనియర్ సివిల్ జడ్జి వంటి ఉన్నత ఉద్యోగం లభించడం సంతోషించదగ్గ విషయం. నాన్న కల నెరవేరింది. నా శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. సామాజిక న్యాయం కోసం కృషి చేయగలనన్న నమ్మకం కలిగింది. జ్యుడీషియరీలో అత్యున్నత స్థానం వరకూ వెళ్లేందుకు సాధన చేస్తా.
– శ్రీవల్లి శైలజ, జూనియర్ సివిల్ జడ్జి



సిరాజ్‌కు టి20 వరల్డ్‌కప్ విక్టరీ రింగ్...


ముంబై: భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్‌కు... టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టి20 ప్రపంచకప్ విజేత ఉంగరాన్ని అందించాడు. గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు విజేతగా నిలవగా... ఆ జట్టులోని సభ్యులకు ఇటీవల బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో ప్రత్యేక ఉంగరాలు బహూకరించింది. ముంబై వేదికగా జరిగిన ఈ వేడుకకు సిరాజ్ గైర్హాజరు కాగా... సోమవారం వాంఖడే స్టేడియంలో సిరాజ్‌కు రోహిత్ శర్మ దాన్ని అందించాడు. ఐపీఎల్‌లో భాగంగా మంగళవారం గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న సిరాజ్‌కు రోహిత్ ఈ ఉంగరాన్ని అందించాడు. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. ఈ రింగ్‌లో ఆటగాడి పేరు, జెర్సీ నంబర్‌తో పాటు జాతీయ చిహ్నం అశోక చక్రను పొందుపరిచింది.



సన్‌రైజర్స్ అవుట్

అరెంజ్ ఆర్మీ ఆశలను ఆవిరి చేసే వార్త! హైదరాబాద్ 'ప్లే ఆఫ్స్' ఆశలకు హైదరాబాద్‌లోనే తెరపడింది. దీంతో ఈ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ముందుకా... వెనక్కా అని ఈ నెల 18న లక్నోలో సూపర్‌జెయింట్స్‌తో జరిగే మ్యాచ్ వరకు నిరీక్షించాల్సిన పని లేకుండానే వరుణుడు తేల్చేశాడు. కమిన్స్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో మొదలైన మ్యాచ్‌పై విరామంలో నీళ్లతో నింపేశాడు. చినుకులా కురిసిన వాన... వరదలా మారింది. మైదానం మొత్తాన్ని చిత్తడి చిత్తడి చేసింది. దీంతో తెరిపినిచ్చినా... తేరుకొని ఆడే అవకాశమే లేకపోయింది. ఇక చేయాల్సిందల్లా మిగిలిపోయిన ఆ మూడు మ్యాచ్‌లు ఆడటం తప్ప గత ఏడాది రన్నరప్ 'రైజర్స్'కు ఇంకేం మిగల్లేదు!

'ప్లే ఆఫ్స్' దశకు దూరమైన హైదరాబాద్
- ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ వర్షార్పణం
- ఇరు జట్లకు చెరో పాయింట్
- సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ స్పెల్ వృథా


కమిన్స్



సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట ఈసారి ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలుండగానే ముగిసింది. సొంతగడ్డపై సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ రద్దు కావడంతో ముందుకెళ్లే మార్గాలన్నీ మూసుకుపోయాయి. ఇక మిగతా మ్యాచ్‌లను గెలిచి పాయింట్ల పట్టికలో కాస్త మెరుగైన స్థానంలో నిలవడమే మిగిలుంది. సన్‌రైజర్స్ మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచినా 13 పాయింట్ల వద్దే నిలిచిపోతుంది. టాప్-4లో నిలిచే జట్లే 'ప్లే ఆఫ్స్' దశకు చేరుతాయి. ఇప్పటికే నాలుగు జట్లు కనీసం 14 పాయింట్ల సంఖ్యను అందుకున్నాయి.

ఢిల్లీతో మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అశుతోష్ శర్మ (26 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (36 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు), ధాటిగా ఆడారు. ప్యాట్ కమిన్స్ 3 వికెట్లు తీశాడు. ఇన్నింగ్స్ విరామానికి ఇరుజట్ల ఆటగాళ్లు వెళ్లగానే మైదానంలోకి అనుకోని అతిథిగా వచ్చిపడిన వాన స్టేడియాన్ని ముంచెత్తింది. భారీ వర్షం చాలా సేపటికి తగ్గినా... అవుట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో చేసేదేమీ లేక అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

ఢిల్లీ (సి) కిషన్ (బి) కమిన్స్

బంతి పడటంతోనే క్యాపిటల్స్‌కు కష్టాలు మొదలయ్యాయి. తొలి బంతికే కరుణ్ నాయర్ (0) డకౌట్ అయ్యాడు. కాసేపటికే డుప్లెసిస్ (3), అభిషేక్ పొరెల్ (8)లు కూడా వికెట్లను పారేసుకున్నారు. దీంతో క్యాపిటల్స్ 15 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది. ఈ మూడు వికెట్లూ కమిన్స్ ఖాతాలోనే పడ్డాయి. క్యాచ్‌లన్నీ కీపర్ ఇషాన్ కిషన్ చేతికే అందాయి. ఢిల్లీ ఈ షాక్ నుంచి తేరుకోకముందే హర్షల్ మరోదెబ్బ తీశాడు. కెప్టెన్ అక్షర్ పటేల్ (6)ను అవుట్ చేశాడు. ఆఫ్ స్టంప్ మీదుగా వేసిన స్లో డెలివరీని షాట్ ఆడే ప్రయత్నం చేయగా అదికాస్తా కమిన్స్ చేతికి చిక్కింది. దీంతో పవర్ ప్లేలో ఢిల్లీ నాలుగో వికెట్‌ను కోల్పోయింది. అప్పటికి క్యాపిటల్స్ స్కోరు 26/4. ఆ తర్వాత కూడా క్యాపిటల్స్ పరిస్థితిలో ఏమార్పు లేదు. ఇక ఢిల్లీ అండదండా కేఎల్ రాహులే అనుకునేలోపే ఈ స్టార్ మురిపెం కూడా అంతలోనే ముగిసింది. ఉనాద్కట్ తెలివైన బంతితో ఈ విలువైన వికెట్ తీసి ఢిల్లీని కోలుకోకుండా చేశాడు. ఆఫ్ స్టంప్ ఆవల దూసుకొచ్చిన బంతి రాహుల్ (10) బ్యాట్‌ను తాకుతూ ఇషాన్ కిషన్ చేతుల్లోకి వెళ్లింది. అప్పటివరకు పెవిలియన్ చేరిన ఐదుగురిలో అతనొక్కడిదే రెండంకెల స్కోరు కాగా... కనీసం మూడు పదుల స్కోరైన కాకముందే (29 పరుగులకే 5) ఢిల్లీ సగం వికెట్లను కోల్పోయింది. వికెట్ల జోరులో మెరుపుల్లేని మ్యాచ్‌లో ఎట్టకేలకు పదో ఓవర్లో ఒక సిక్స్ నమోదైంది. స్పిన్నర్ జీషాన్ బౌలింగ్‌లో విప్రాజ్ నిగమ్ భారీ సిక్సర్ బాదాడు. సగం ఓవర్లు ముగిశాక గానీ 11వ ఓవర్లో జట్టు స్కోరు కష్టంగా 50 పరుగులకు చేరింది.

అశుతోశ్ వచ్చాకే...

స్టబ్స్, విప్రాజ్ కుదురుకునే అవకాశాన్ని కూడా సన్‌రైజర్స్ ఫీల్డర్లు ఇవ్వలేదు. కొద్దిసేపటికే విప్రాజ్ (17 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) రనౌట్ కాగా... అశుతోష్ రాకతో స్కోరులో కాస్త వేగం పెరిగింది. అవతలి ఎండ్‌లో ఉన్నది హిట్టర్ స్టబ్సే అయినా జోరు పెంచింది మాత్రం అశుతోషే! మొదట్లో సింగిల్స్‌తో పరుగు... పరుగు పేర్చిన ఈ జోడీ తర్వాత ధాటిని ఆడింది. జీషాన్ 15వ ఓవర్లో అశుతోష్ రెండు భారీ సిక్సర్లతో అలరించాడు. తర్వాత హర్షల్ 17వ ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. స్టబ్స్ కూడా ఫోర్లతో వేగం అందుకోగా, డెత్ ఓవర్లో మరో సిక్స్ కొట్టిన అశుతోష్ ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు. ఇద్దరు కలిసి ఏడో ఓవర్‌కు 66 పరుగులు జోడించారు. ఈ జోడీ ఆడటం వల్లే ఢిల్లీ ఆలౌట్ నుంచి తప్పించుకుంది. లేదంటే 7.1 ఓవర్లోనే 5వ వికెట్ కోల్పోయిన క్యాపిటల్స్ తర్వాత 12.5 ఓవర్ల పాటు ఆడి కేవలం రెండే వికెట్లను కోల్పోయింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: కరుణ్ నాయర్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 0; డుప్లెసిస్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 3; పొరెల్ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 8; రాహుల్ (సి) ఇషాన్ (బి) ఉనాద్కట్ 10; అక్షర్ (సి) కమిన్స్ (బి) హర్షల్ 6; స్టబ్స్ (నాటౌట్) 41; విప్రాజ్ (రనౌట్) 18; అశుతోష్ (సి) మనోహర్ (బి) మలింగ 41; స్టార్క్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 133.** వికెట్ల పతనం: 1-0, 2-6, 3-15, 4-26, 5-29, 6-62, 7-128. బౌలింగ్: కమిన్స్ 4-0-19-3, ఉనాద్కట్ 4-0-13-1, హర్షల్ పటేల్ 4-0-36-1, ఎషాన్ మలింగ 4-0-28-1, జీషాన్ అన్సారి 3-0-30-0, అభిషేక్ శర్మ 1-0-5-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లక్నో	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్తాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	11	2	9	0	4	-1.117

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు


ముంబై × గుజరాత్
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రబడపై నిషేధం ఎత్తివేత

ఐపీఎల్‌లో ఆడనున్న దక్షిణాఫ్రికా పేసర్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడపై విధించిన నిషేధాన్ని ఎత్తివేశారు. రిక్రియేషనల్ (సరదా కోసం తీసుకునే) డ్రగ్స్ వాడటం వల్ల అతడిపై ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) తాత్కాలిక నిషేధం విధించగా... సస్పెన్షన్ సమయంలో 'సబ్‌స్టాన్స్ అబ్యూస్' చికిత్స పూర్తి చేయడంతో అతడిపై నిషేధాన్ని తొలగించారు. దీంతో రబడ ఐపీఎల్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌కు అందుబాటులోకి వచ్చాడు. ఈ మేరకు దక్షిణాఫ్రికా ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రగ్ ఫ్రీ స్పోర్ట్ (ఎస్ఏఐడీఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. 'రబడ డోపింగ్‌కు పాల్పడినట్లు ఏప్రిల్ 1న నిర్ధారణ అయింది. దీంతో అతడిపై తాత్కాలిక నిషేధం విధించారు. ఆ సమయంలో ఐపీఎల్ ఆడుతున్న రబడ తక్షణమే దక్షిణాఫ్రికాకు తిరిగి వచ్చాడు. దక్షిణాఫ్రికా డోపింగ్ నిరోధక నియమాల ప్రకారం ప్రత్యేకంగా నిర్వహించే సబ్‌స్టాన్స్ అబ్యూస్ చికిత్స తీసుకున్నాడు. రెండు సెషన్‌లు పూర్తి కావడంతో అతడిపై విధించిన తాత్కాలిక నిషేధం ముగిసింది. అతడు నెల రోజుల పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. రబడ ఇప్పుడు నిరభ్యంతరంగా మ్యాచ్‌లు ఆడొచ్చు' అని ఎస్ఏఐడీఎస్ వెల్లడించింది. 'ఈ సంఘటనతో కుంగిపోను. ముందుకు సాగడమే నా లక్ష్యం. నిరంతరం కష్టపడుతూ నా వృత్తిపై గౌరవం భక్తితో ఉంటాను' అని రబడ అన్నాడు. క్రీడల్లో మెరుగైన ప్రదర్శనకు ఉపయోగపడే డ్రగ్స్ తరహాలో కాకుండా కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి వాటిని రిక్రియేషనల్ డ్రగ్స్‌గా వ్యవహరిస్తారు. ఆటగాళ్లు వీటిని వాడితే నిబంధనల ప్రకారం గరిష్టంగా నాలుగేళ్ల నిషేధం పడే అవకాశం ఉన్నా... సరదా కోసమే వాటిని వాడినట్లు... ఆ సమయంలో ఎలాంటి మ్యాచ్‌లు లేకపోవడంతోనే అలా చేసినట్లు ప్లేయర్ నిరూపించగలిగితే స్వల్ప నిషేధంతో తప్పించుకోవచ్చు. 30 ఏళ్ల రబడ ఈ ఏడాది జనవరిలో ఎస్ఏ20 సందర్భంగా ఈ డ్రగ్ తీసుకున్నట్లు టెస్టుల్లో తేలింది. ఇప్పుడు సస్పెన్షన్ ఎత్తివేయడంతో వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరగనున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు రబడ అందుబాటులో ఉండనున్నాడు.



సాక్షి సినిమా

త్రీడీలో జగదేక వీరుడు... అతిలోక సుందరి


చిరంజీవి, శ్రీదేవి

జగదేక వీరుడు... అతిలోక సుందరి ఈసారి త్రీడీలో కనిపించి, అలరించనున్నారు. 1990లో ఈ ఇద్దరూ చేసిన సందడిని అప్పటి ప్రేక్షకులు అంత సులువుగా మరచిపోలేరు. నేటి తరం ప్రేక్షకులనూ ఈ ఇద్దరూ ఆకట్టుకుంటారని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. చిరంజీవి, శ్రీదేవి జంటగా కె. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వనీదత్ నిర్మించిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' 1990 మే 9న విడుదలై, బ్లాక్ బస్టర్ విజయం సాధించింది. ఈ ఏడాది ఈ సినిమా 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9న మళ్లీ థియేటర్లలో విడుదలకు సిద్ధం చేశారు. 2డీ ఫార్మాట్‌తో పాటు 3డీ లోనూ ఈ చిత్రం విడుదల కానుంది. నిజానికి ఈ చిత్రాన్ని మళ్లీ విడుదల చేయాలని దాదాపు ఏడేళ్ల క్రితమే అనుకున్నారట. 2018లో ఈ చిత్రం నెగటివ్ రీల్ కోసం వెతకడం మొదలుపెట్టిందట చిత్రనిర్మాణ సంస్థ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఏదైనా థియేటర్లో ఈ రీల్ ఉందేమో అని వాకబు చేశారు. కొన్ని చోట్ల లభ్యమైనా నాణ్యత లోపించింది. చివరికి 2021లో విజయవాడలోని అప్పారావు అనే వ్యక్తి వద్ద ఉపయోగపడే ప్రింట్ రీల్ ఒకటి దొరికిందని చిత్రబృందం పేర్కొంది. అయితే అది కూడా దుమ్ము... దూళితో నిండిపోయి మసకబడిపోయిన స్థితిలో ఉండగా.. చిత్రయూనిట్ ఎంతో కష్టపడి పునరుద్ధరణ ప్రారంభించింది. రీల్ కట్ అయిన చోట మరమ్మతు చేసి, జాగ్రత్తగా స్కాన్ చేయించి, ఫ్రేమ్ వారీగా ఉన్న డిజిటల్ స్క్రాచెస్‌ను తొలగించారు. తర్వాత ఈ చిత్రాన్ని 8కె రెజల్యూషన్‌లో డిజిటలైజ్ చేసి, 4కె అవుట్‌పుట్‌గా మార్చారు. భారతీయ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ ప్రయత్నించని విధంగా, ఈ చిత్రాన్ని 3డీ రూపంలోకి మార్చే సాహసం చేశామని యూనిట్ అంటోంది. ప్రసాద్ కార్పొరేషన్ సహకారంతో, ప్రైమ్ ఫోకస్ సాయంతో 3డీలోకి మార్చారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నాటి తరంలో ఈ చిత్రాన్ని చూసిన ప్రేక్షకులకు, ఈ తరం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చేలా ఈ చిత్రాన్ని పునరుద్ధరించారు. అన్నట్లు... ఈ చిత్రాన్ని ఈ విధంగా మలచడానికి 'మహానటి, కల్కి' చిత్రాల ఫేమ్ దర్శకుడు నాగ్ అశ్విన్ కృషి చాలా ఉందని సమాచారం.

మా కొత్త సినిమా కథ మా వంటబ్బాయి చెప్పాడు!

- దర్శకుడు శేఖర్ కపూర్



ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్' (వేవ్స్)-2025' ని ఈ నెల 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. నాలుగురోజుల పాటు జరిగిన ఈ సమ్మిట్ ఆదివారంతో ముగిసింది. 'వేవ్స్' సమ్మిట్‌కి హాజరైన ప్రముఖ దర్శకుడు, 'మిస్టర్ ఇండియా' చిత్రం ఫేమ్ శేఖర్ కపూర్ మాట్లాడుతూ–''నా దృష్టిలో ఏఐ అనేది పెద్ద డెమొక్రటిక్ టూల్. వినోదరంగ పురోగతి కోసం దాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది చూడాలి కానీ, అతిగా భయపడడం అనవసరం. ఉదాహరణకు, నా 'మిస్టర్ ఇండియా-2' కోసం కథ ఆలోచిస్తూ ఉంటే, ఒకరోజు మా వంటబ్బాయి అద్భుతమైన కథ చెప్పాడు. ఏ అనుభవం లేని అతనికి ఆ ఆలోచన ఎలా వచ్చిందని ఆశ్చర్యపోతూ అడిగా. 'చాట్ జీపీటీలో అడిగితే చెప్పింద'ని మా కుక్ జవాబు ఇచ్చేసరికి ఆశ్చర్యపోవడం నా వంతు అయింది'' అని తన వ్యక్తిగత అనుభవం పంచుకున్నారు. ''అయితే ఏఐ, చాట్ జీపీటీలు ఎంత గొప్పవైనా, మనం వాటి మీద అతిగా ఆధారపడితే బద్ధకం పెరుగుతుంది. ఎందుకూ కొరగాకుండా పోతాం. ఎన్ని టెక్నాలజీలు వచ్చినా మానవ మేధనూ, ఒరిజినాలిటీనీ అవి అధిగమించలేవు'' అని నమ్మకం వ్యక్తం చేశారు.

ప్రపంచంలోని అన్ని రంగాలనూ కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావితం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వెండితెరపై కథ, కథనం ఎలా మారనుంది? అనే ఆసక్తికరమైన ప్రశ్నకు శేఖర్ కపూర్ దగ్గర ఉన్న జవాబు ఏంటి? 'వేవ్స్'కు హాజరైన ఆయన 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడుతూ–''ఏ కొత్త టెక్నాలజీ వచ్చినా దాన్ని అందిపుచ్చుకోవాలి. లేదంటే మనం వెనకబడిపోతాం'' అన్నారు. ''మారుతున్న కాలంతో పాటు వస్తున్న అనేక కొత్త టెక్నాలజీలు, మాధ్యమాలు తమవైన ఆడియన్స్‌ను సృష్టించుకుంటాయి. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో వెండితెరపై వినోదం చూడడం తక్కువ అవుతోంది. మహా అయితే 2 శాతం ఉంటుందేమో! ఇతరేతర మాధ్యమాల్లో చూస్తున్నారు, వినోదం పొందుతున్నారు. ఇది గమనించి దానికి తగ్గట్టుగా మనమూ మారాలి'' అని అభిప్రాయపడ్డారు. ఇంకా ఆయన మాట్లాడుతూ–''ఏఐ అనేది అప్పటికే అందుబాటులో ఉన్న అపరిమిత సమాచారం ఆధారంగా నడుస్తుంది. కానీ మానవ జీవితం రేపు ఎలా ఉంటుందో ముందే తెలియకుండా మిస్టరీగా అనునిత్యం ముందుకు సాగుతుంది. జీవితంలోని విశేషం అదే'' అని అంతర్జాతీయంగా గోల్డెన్ గ్లోబ్ అవార్డ్‌కు సైతం నామినేటైన ఈ దర్శకుడు విశ్లేషించారు.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి

అడవిలో థామా

'థామా' సినిమా కోసం దాదాపు నెల పాటు అడవిలో జరిగే షూటింగ్‌లో పాల్గొంటున్నారట హీరోయిన్ రష్మికా మందన్నా. ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా జంటగా నటిస్తున్న హిందీ చిత్రం 'థామా'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ హారర్ కామెడీ ఫిల్మ్ ఈ దీపావళికి రిలీజ్ కానుంది. కాగా ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఊటీతో పాటు అక్కడి ఫారెస్ట్‌లో జరుగుతోందట. ఆయుష్మాన్, రష్మికలపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ సన్నివేశాల తర్వాత ఆయుష్- రష్మిక- నవాజుద్దీన్ సిద్దిఖీలపై క్లైమాక్స్ సన్నివేశాలను కూడా ఇదే షెడ్యూల్‌లో చిత్రీకరిస్తారని బాలీవుడ్ టాక్. ఈ షెడ్యూల్‌తో 'థామా' షూటింగ్ టాకీ పార్ట్ దాదాపు పూర్తవుతుందని, పాటలు మాత్రమే బ్యాలెన్స్ ఉంటాయని సమాచారం. ఇక మడాక్ ఫిల్మ్స్(నిర్మాత దినేష్ విజన్) హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా 'థామా' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే.


రష్మిక

కావాలని అలా చేయలేదు

- కార్తీక్ రాజు



''నేను తమిళ డైరెక్టర్‌ని కావడంతో 'సింగిల్' సినిమాకు తెలుగు నేటివిటీ ఉండాలని 'సామజ వరగమన' సినిమాకు పని చేసిన భాను-నందు తెలుగు డైలాగ్స్ రాశారు. ఈ మూవీ ట్రైలర్‌లోని కొన్ని డైలాగ్స్‌పై అభ్యంతరాలు ఎదురయ్యాయి. అయితే ఆ డైలాగులు కేవలం వినోదం కోసం పెట్టినవే.. కావాలని అలా చేయలేదు.. ట్రోల్ అవ్వాలని కాదు'' అని డైరెక్టర్ కార్తీక్ రాజు అన్నారు. శ్రీవిష్ణు హీరోగా నటించిన చిత్రం 'సింగిల్'. కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో 'వెన్నెల' కిశోర్ కీలక పాత్ర చేశారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ–''వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా 'పోకిరి, ఒక్కడు, వర్షం, అతడు' సినిమాలకు పని చేశాను. దర్శకత్వంపై ఆసక్తితో సూపర్ వైజర్‌గా రాజీనామా చేశాను. దర్శకుడిగా నా తొలి సినిమా 'తిరు డాన్ పోలీస్'ను ఎస్పీ చరణ్‌గారు నిర్మించారు. తెలుగులో సందీప్ కిషన్‌తో నా తొలి మూవీ 'నిను వీడని నీడను నేనే'. శ్రీవిష్ణుగారికి 'సింగిల్' కథను 2022 వినిపించగా ఓకే అన్నారు. 2023లో గీతా ఆర్ట్స్ వారు ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. స్కూల్ డేస్ నుంచి లవ్‌లో పడాలనుకునే అబ్బాయికి, 28 ఏళ్ల వయసు వచ్చినా లవ్‌లో పడలేకపోతాడు. దీంతో తన చుట్టూ ఉన్నవాళ్లు ఎవరూ ప్రేమలో పడకూడదనుకుంటాడు. ఆ తర్వాత ఏమైంది? అన్నదే ఈ సినిమా కథ. అల్లు అరవింద్‌గారితో వర్క్ చేయడం నా అదృష్టం. విశాల్ చంద్రశేఖర్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. శ్రీవిష్ణుగారి కోసం నా వద్ద మరో రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అని తెలిపారు.

మాస్ తెరచాప

నవీన్ రాజ్ శంకరప్ప, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించిన చిత్రం 'తెరచాప'. జోయెల్ జార్జ్ దర్శకత్వంలో అనన్య క్రియేషన్స్‌పై కైలాష్ దుర్గం నిర్మించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో హీరో కార్తీక్ రత్నం, 'హరికథ' మూవీ దర్శకుడు మ్యాగి చేతుల మీదగా ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. జోయెల్ జార్జ్ మాట్లాడుతూ–''మంచి మాస్ నేపథ్యంలో 'తెరచాప' తీశాం. ఇందులో కొంచెం తమిళ నేపథ్యం ఉంటుంది. మంచి ఔట్‌పుట్ వచ్చిన మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''సినిమా రంగం నాకు కొత్త. నా తొలి చిత్రం 'తెరచాప'తో హిట్ కొడతాం'' అని కైలాష్ దుర్గం చెప్పారు. ''చాలా మంచి ఔట్ పుట్ వచ్చింది.. ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు నవీన్ రాజ్. ఈ కార్యక్రమంలో నటులు పృథ్వీ, కార్తీక్ రత్నం మాట్లాడారు.


పూజ, నవీన్ రాజ్, శ్రీలు

యాక్షన్ డ్రామా


సుహాస్

సూరి, సుహాస్, మహిమా నంబియార్ ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'మండాడి'. తెలుగులో తనకంటూ మంచి గుర్తింపు పొందిన సుహాస్ ఈ సినిమా ద్వారా తమిళ పరిశ్రమలో ఎంట్రీ ఇస్తున్నారు. 'సెల్ఫీ' మూవీ ఫేమ్ మతిమారన్ పుగళేంది 'మండాడి'కి దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్ ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ సమర్పణలో ఎల్రెడ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి సుహాస్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'మండాడి'. ఈ సినిమాలో సుహాస్ బలమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. క్రీడా నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని బలమైన భావోద్వేగాలు, సంఘర్షణలతో కూడిన ఈ సినిమా జీవన పోరాటం, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. అన్ని భాషల్లోని ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రం రూపొందుతోంది'' అని మేకర్స్ ప్రకటించారు. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: వి.మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: జి. మహేష్.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
295	114
80,797	24,461

విదేశీ సూచీలు

నాస్‌డాక్	17,928	▽	50
డోజోన్స్	41,360	▲	42
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,596	▲	100
డాక్స్ (శుక్రవారం ముగింపు)	23,345	▲	258
పాంఘై (బుధవారం ముగింపు)	3,279	▽	8
నికాయ్ (శుక్రవారం ముగింపు)	36,831	▽	378

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	84.42	86.01
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	109.67	114.60
€	యూరో	ధామస్‌కుక్	93.30	97.93
¥	జపాన్ యెన్ (100)	ధామస్‌కుక్	69.00	47.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	52.17	57.06
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	63.04	67.77
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.57	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	22.05	23.83
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.71	12.53

ఆర్‌బీఐ ఖజానాలో పసిడి మెరుపులు

- 2024–25లో 57 టన్నుల కొనుగోలు
- ద్వితీయార్ధంలో 25 టన్నులు
- మొత్తం నిల్వలు 879 టన్నులు



ముంబై: పసిడిపై ఆర్‌బీఐ మోజు కొనసాగుతూనే ఉంది. గత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో 25 టన్నుల పసిడిని ఆర్‌బీఐ కొనుగోలు చేయగా.. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 57 టన్నుల బంగారాన్ని అదనంగా సమకూర్చుకుంది. దీంతో ఆర్‌బీఐ వద్ద బంగారం నిల్వలు మార్చి నాటికి 879.59 టన్నులకు చేరినట్లు అధికారిక డేటా తెలియజేస్తోంది. ఈ కాలంలో పసిడి ధరలు 30 శాతం ర్యాలీ చేయడం గమనార్హం. గత ఏడేళ్లలోనే ఆర్‌బీఐ అత్యధికంగా పసిడిని గత ఆర్థిక సంవత్సరంలోనే కొనుగోలు చేసింది. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగిపోయిన తరుణంలో సురక్షిత సాధనమైన బంగారానికి ఆర్‌బీఐ ప్రాధాన్యం పెంచినట్టు తెలుస్తోంది.

ఇక ఆర్‌బీఐ పసిడి నిల్వల్లో 512 టన్నులు స్థానిక ఖజానాల్లో ఉంటే, 348.62 టన్నులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ (బీఐఎస్) వద్ద, మరో 18.98 టన్నులు గోల్డ్ డిపాజిట్ల రూపంలో కలిగి ఉంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఆర్‌బీఐ తన బంగారం నిల్వల్లో కొంత మొత్తాన్ని స్థానిక ఖజానాలకు మళ్లించడం గమనార్హం. 2024 మార్చి నాటికి స్థానిక నిల్వలు 408 టన్నులే కాగా, గత సెప్టెంబర్ నాటికి 510.46 టన్నులకు పెంచుకుంది.

ఫారెక్స్ నిల్వల్లో 11.70 శాతం..

ఇక విదేశీ మారక నిల్వల్లో (ఫారెక్స్) బంగారం వాటా 2024 మార్చి నాటికి 9.32% కాగా, 2025 మార్చి నాటికి 11.70 శాతానికి పెరిగింది. ఇక 2024 సెప్టెంబర్ నాటికి 706 బిలియన్ డాలర్ల ఫారెక్స్ నిల్వలు ఉంటే, ఈ ఏడాది మార్చి నాటికి 668.33 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఇవి 10.5 నెలల దిగుమతుల అవసరాలకు సరిపోతాయి.

భారీ ఐపీవోకి అవాడా గ్రూప్

రూ. 5 వేల కోట్ల ఇష్యూపై కసరత్తు



న్యూఢిల్లీ: పునరుత్పాదక విద్యుత్ రంగానికి చెందిన అవాడా గ్రూప్‌లో భాగమైన సోలార్ మాడ్యూల్స్ తయారీ విభాగం భారీ ఐపీవో సన్నాహాల్లో ఉంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 4,000–5,000 కోట్ల వరకు సమీకరించడంపై కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐపీవోని నిర్వహించేందుకు పలు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, న్యాయసేవల సంస్థలతో గ్రూప్ సంప్రదింపులు జరిపినట్లు వివరించాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను 5 గిగావాట్ ఇంటిగ్రేటెడ్ సోలార్ మాడ్యూల్, సెల్ తయారీ ప్లాంటు నిర్మాణం సహా ఇతరత్రా పెట్టుబడుల కోసం సంస్థ వినియోగించనుంది. అవాడా గ్రూప్‌లో బ్రూక్‌ఫీల్డ్‌కి చెందిన ఎనర్జీ ట్రాన్సిషన్ ఫండ్, థాయ్‌ల్యాండ్‌కి చెందిన జీపీఎస్‌సీ మొదలైనవి 1.3 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేశాయి. సోలార్ మాడ్యూల్స్ తయారీ, పునరుత్పాదక విద్యుదుత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్, అమోనియా మొదలైన విభాగాల్లో గ్రూప్ కార్యకలాపాలు ఉన్నాయి. 2024లో పలు సోలార్ ప్యానెళ్ల తయారీ సంస్థలు ఐపీవో ద్వారా నిధులు సమీకరించగా, మరిన్ని ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కి చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ రూ. 2,830 కోట్లు, అక్టోబర్‌లో వారీ ఎనర్జీస్ రూ. 4,321 కోట్లు సమీకరించాయి.

ఈ ఏడాది గరిష్టానికి సూచీలు

- దిగివచ్చిన క్రూడాయిల్ ధరలు
- ఎఫ్ఐఐల కొనుగోళ్ల దన్ను
- సెన్సెక్స్ లాభం 295 పాయింట్లు



ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో స్టాక్ సూచీలు సోమవారం ఈ ఏడాది(2025) గరిష్టంపై ముగిశాయి. సెన్సెక్స్ 295 పాయింట్లు పెరిగి 80,797 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు బలపడి 24,461 వద్ద నిలిచింది. అంతర్జాతీయ వాణిజ్య ఆందోళనలు తగ్గుముఖం పట్టడంతో ఉదయం స్టాక్ సూచీలు సానుకూలంగా మొదలయ్యాయి. బ్యాంకులు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 547 పాయింట్లు బలపడి 81,049 వద్ద, నిఫ్టీ 179 పాయింట్లు ఎగసి 24,526 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 27 పైసలు బలపడి 84.30 వద్ద స్థిరపడింది. సెలవు కారణంగా ఆసియాలో ప్రధాన మార్కెట్లు పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. అమెరికా సూచీలు స్వల్పలాభాల్లో ట్రేడవుతున్నాయి.

→ బీఎస్‌ఈలో రంగాల వారీగా సూచీల్లో సర్వీసెస్ 3%, ఆయిల్అండ్‌గ్యాస్ ఆటో 2%, కన్జూమర్ డిస్క్రెషనరీ, యుటిలిటీ, ఇంధన ఇండెక్సులు ఒకటిన్నర శాతం రాణించాయి. మిడ్‌క్యాప్ 1.50%, స్మాల్ క్యాప్ సూచీ 1.25 శాతం లాభపడింది.

→ అదానీ గ్రూప్‌పై నమోదైన లంచం కేసులో క్రిమినల్ చార్జ్‌షీట్ కొట్టివేయాలని కోరుతూ, గౌతమ్ అదానీ ప్రతినిధులు అమెరికా పరిపాలన అధికారులను కలిసినట్లు వార్తలు వెలుగులోకి రావడంతో గ్రూప్ కంపెనీ షేర్లు దూసుకెళ్లాయి. అదానీ టోటల్ గ్యాస్ 11%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 7%, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.50%, అదానీ పోర్ట్స్, అదానీ పవర్ 6% దూసుకెళ్లాయి. ఈ గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13.33 లక్షల కోట్లకు చేరింది.

→ మార్చి క్వార్టర్ నికరలాభం 7.50% క్షీణతతో కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు నాలుగున్నర శాతం నష్టపోయి రూ.2,085 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.19,867 కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.4.14 లక్షల కోట్లకు దిగివచ్చింది.

→ నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఎస్‌బీఐ షేరు 1.26% నష్టపోయి రూ.790 వద్ద నిలిచింది.

→ అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగరావడంతో దేశీయ ఆయిల్ రిఫైనరీ మార్కెటింగ్ కంపెనీల షేర్లకు డిమాండ్ నెలకొంది. హెచ్‌పీసీఎల్ 7%, ఐఓసీ 4%, బీపీసీఎల్ 3% రాణించాయి. ఎయిర్‌లైన్ సంస్థలైన ఇండిగో షేరు 4% స్పైస్‌జెట్ షేరు ఒకశాతం పెరిగాయి. అలాగే బెర్జర్ పెయింట్స్ 2%, అక్జోనోబెల్ 1% లాభపడ్డాయి.

మహీంద్రా కొత్త ప్లాంట్

2028 నాటికి ఏర్పాటు ప్రణాళిక

- క్యూ4లో నికర లాభం రూ. 3,542 కోట్లు; 13 శాతం అప్
- షేరుకు రూ. 25.30 తుది డివిడెండ్



రాజేష్ జెజూరికర్

ముంబై/న్యూఢిల్లీ: దేశీ వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (2024–25, క్యూ4)లో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 13.3% ఎగబాకి రూ.3,542 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,125 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.35,373 కోట్ల నుంచి రూ.42,586 కోట్లకు పెరిగింది. 20% వృద్ధి చెందింది. వాహన, వ్యవసాయ పరికరాల విభాగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదం చేసినట్లు మహీంద్రా గ్రూప్ ఎండీ, సీఈఓ అనీష్ షా చెప్పారు. కాగా, క్యూ4లో కంపెనీ 18 శాతం పెరుగుదలతో మొత్తం 2.53 లక్షల వాహనాలను విక్రయించింది. ఇందులో ఎస్‌యూవీలు 1.49 లక్షలుగా ఉన్నాయి.

కొత్త ప్లాంట్...

ప్యాసింజర్ వాహనాల (పీవీ) తయారీ కోసం కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. 2028 మార్చి నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించవచ్చని అంచనా. 'మేము భవిష్యత్తు తరం వాహనాల నిమిత్తం ఒక కొత్త ప్లాంట్‌ను నెలకొల్పనున్నాం. ప్రధానంగా పీవీల కోసం ప్రణాళిక రూపొందిస్తున్నప్పటికీ.. అవసరాన్ని బట్టి కొన్ని ఇతర ప్రత్యేక వాహనాలను కూడా జత చేసే అవకాశం ఉంది. ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలనేది ఇంకా నిర్ణయించలేదు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాం' అని మహీంద్రా సీఈఓ (ఆటోమోటివ్, వ్యవసాయ పరికరాలు) రాజేష్ జెజూరికర్ పేర్కొన్నారు. కాగా, చకన్ (పుణే)లో అదనంగా 1.2 లక్షల వార్షిక తయారీ సామర్థ్యాన్ని జత చేసేలా కొత్త ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఏడాది ఆగస్ట్ 15న దీన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. ఎక్స్‌యూవీ3ఎక్స్‌ఓ, థార్ రాక్స్ తయారీ సామర్థ్యాన్ని 2025–26లో 3,000 మేర పెంచుతామని వెల్లడించారు.

పూర్తి ఏడాదికి...

మార్చితో ముగిసిన 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.14,073 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది లాభం రూ.12,270 కోట్లతో పోలిస్తే 15 శాతం ఎగసింది. మొత్తం ఆదాయం కూడా 15 శాతం వృద్ధితో రూ.1,38,279 కోట్ల నుంచి రూ.1,58,750 కోట్లకు చేరింది. కాగా, ఒక్కో షేరుకు రూ.25.30 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు బీఎస్‌ఈలో 3 శాతం ఎగసి రూ.3,021 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 11,322 కోట్లు ఎగసి రూ.3,72,720 కోట్లకు చేరింది.

3జీ క్యాపిటల్ చేతికి స్కెచర్స్

9 బిలియన్ డాలర్ల భారీ డీల్



న్యూయార్క్: షూస్ తయారీ సంస్థ స్కెచర్స్‌ను ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం 3జీ క్యాపిటల్ కొనుగోలు చేయనుంది. ఇందుకోసం 9 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది. కొనుగోలు తర్వాత ప్రైవేట్ సంస్థగా మార్చనుంది. ఈ ఒప్పందానికి స్కెచర్స్ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో డీల్ పూర్తయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కొనుగోలు అనంతరం కూడా కంపెనీకి స్కెచర్స్ చైర్మన్, సీఈవో రాబర్ట్ గ్రీన్‌బర్గ్, ఆయన మేనేజ్‌మెంట్ బృందం సారథ్యం వహిస్తుంది. సంస్థ హెడ్‌క్వార్టర్స్ కూడా మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన చోటే (కాలిఫోర్నియా) కొనసాగుతుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

భారత్‌లో యాపిల్ విక్రయాలు 25% అప్ | మారుతీ మార్కెట్ వాటా డౌన్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

ఇంటర్‌తోనే.. టీచింగ్ కెరీర్

- ఏపీ డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల
- డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశం
- ఈ కోర్సు ఉత్తీర్ణతతో టెట్, ఎస్‌జీటీ పోస్టులకు అర్హత

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులకు మరో చక్కటి అవకాశం.. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈ సెట్)! ఇందులో ర్యాంకు సాధిస్తే.. రెండేళ్ల వ్యవధిలోని డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది! ఈ కోర్సు ఉత్తీర్ణులు టెట్ పేపర్-1కు అర్హత పొందొచ్చు! ఆ తర్వాత డీఎస్సీ నియామకాల్లో ఎస్‌జీటీ పోస్టులకు పోటీ పడొచ్చు! తాజాగా.. ఏపీలో డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. డీఈఈ సెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



డీఎస్సీ నియామకాల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పోల్చితే.. డీఈడీ అర్హతగా ఉండే సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. కాబట్టి టీచింగ్ కెరీర్‌పై ఆసక్తి ఉన్న ఇంటర్ ఉత్తీర్ణులు.. డీఈఈసెట్‌లో ర్యాంకు ద్వారా డీఈడీలో చేరి కోర్సు పూర్తి చేసుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

ఏపీలో నోటిఫికేషన్

రెండేళ్ల వ్యవధిలో ఉండే డీఈఎల్ఈడీ కోర్సులో ప్రవేశానికి ఏపీలో తాజాగా డీఈఈ సెట్–2025 నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ పరిధిలోని డైట్ కళాశాలలతో పాటు.. ప్రైవేట్ పరిధిలోని టీచర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఏపీలో ప్రభుత్వ పరిధిలోని 18 డైట్ కళాశాలలు, ప్రైవేట్ పరిధిలోని దాదాపు 900 ఇన్‌స్టిట్యూట్స్‌లో ఈ కోర్సు ఉంది.

అర్హతలు

- కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్, లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** సెప్టెంబర్ 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

ఉమ్మడి కౌన్సెలింగ్

డీఈఈ సెట్ స్కోర్ ఆధారంగా ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు. ప్రభుత్వ కళాశాలల్లోని అన్ని సీట్లను, ప్రైవేట్ కళాశాలల్లోని కన్వీనర్ కోటా సీట్లను, అదే విధంగా బి కేటగిరీ సీట్లను కూడా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. ప్రైవేట్ కళాశాలల్లోని మొత్తం సీట్లలో 80 శాతం సీట్లను ఏ కేటగిరీ (కన్వీనర్ కోటా)గా, 20 శాతం సీట్లను బి కేటగిరీగా నిర్దేశించారు.

రెండు విభాగాలు.. 100 మార్కులు

- డీఈఈ సెట్ పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో పార్ట్ ఏ, పార్ట్ బీగా 100 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు లభించే సమయం రెండున్నర గంటలు.
- పార్ట్–ఎ(60 ప్రశ్నలు–60 మార్కులు)లో.. టీచింగ్ ఆప్టిట్యూడ్(5 ప్రశ్నలు–5 మార్కులు), జనరల్ నాలెడ్జ్ (5 ప్రశ్నలు–5 మార్కులు), ఇంగ్లిష్(5 ప్రశ్నలు–5 మార్కులు), తెలుగు (5 ప్రశ్నలు–5 మార్కులు), లాంగ్వేజ్(10 ప్రశ్నలు–10 మార్కులు, మ్యాథమెటిక్స్(10 ప్రశ్నలు–10 మార్కులు), జనరల్ సైన్స్ (10 ప్రశ్నలు–10 మార్కులు), సోషల్ స్టడీస్(10 ప్రశ్నలు–10 మార్కులు) ఉంటాయి. పార్ట్–ఎలోని లాంగ్వేజ్‌కు సంబంధించి తెలుగు/తమిళం/ఉర్దూ/ఇంగ్లిష్‌లను ఎంచుకోవచ్చు. ఈ సబ్జెక్ట్‌లను పదో తరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా లేదా ఇంటర్మీడియెట్‌లో సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఆయా మీడియంలలో కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది.
- పార్ట్–బీ(40 ప్రశ్నలు–40 మార్కులు)లో.. మ్యాథమెటిక్స్(40 ప్రశ్నలు–40 మార్కులు) లేదా ఫిజికల్ సైన్స్ (40 ప్రశ్నలు–40 మార్కు లు) లేదా బయో సైన్స్ (40 ప్రశ్నలు–40 మార్కులు) లేదా సోషల్ స్టడీస్ (40 ప్రశ్నలు– 40 మార్కులు) ఉంటాయి. పార్ట్–బిలో అభ్యర్థులు తమకు ఆసక్తి, తమ అర్హతలకు సరితూగే సబ్జెక్ట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎంపీసీ విద్యార్థులు ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ విభాగాలను ఎంచుకోవచ్చు. బైపీసీ విద్యార్థులు బయో సైన్స్ సబ్జెక్ట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. హెచ్ ఈసీ విద్యార్థులు సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌ను ఎంచుకోవాలి.

బెస్ట్ స్కోర్ సాధించేలా

టీచింగ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి బోధన పద్ధతులు, బోధనపై ఆసక్తి, క్లాస్ రూం ఎన్విరాన్ మెంట్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

జనరల్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి సమకాలీన అంశాలు, స్టాక్ జీకే అంశాల (ముఖ్యమైన అవార్డులు, వ్యక్తులు, ఘటనలు, హిస్టరీ, జాగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్)పై దృష్టి పెట్టాలి.

లాంగ్వేజ్

లాంగ్వేజ్ విభాగాలకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకున్న భాష, అదే విధంగా లాంగ్వేజ్–2గా పేర్కొన్న ఇంగ్లిష్‌లో భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు ప్రశ్నలు అడుగుతారు. అయిదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉండే కాన్సెప్ట్‌లపైనే ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది. కాబట్టి ఇంటర్మీడియెట్ స్థాయిలోని మ్యాథమెటిక్స్‌నూ అధ్యయనం చేయాలి.

సైన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. అదే విధంగా ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

సోషల్ స్టడీస్

హై స్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను చదవాలి. అదే విధంగా ఒక అంశానికి సంబంధించి అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సివిక్స్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్స్, సవరణలతోపాటు రాజ్యాంగ రూపకల్పనకు దారితీసిన పరిస్థితులు మొదలు తాజా సవరణలు, వాటికి సంబంధించిన ఆర్టికల్స్‌ను సమన్వయం చేసుకుంటూ చదవాలి.

పార్ట్-బి కోసం ఇలా

పార్ట్–బిలో అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌లలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఇంటర్మీడియెట్ స్థాయిలోని అన్ని అంశాలను చదవాలి. ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సిలబస్‌కు 50 శాతం, రెండో సంవత్సరం సిలబస్‌కు 50 శాతం వెయిటేజీ ఉంటుంది. కాబట్టి ఏ టాపిక్‌ను కూడా విస్మరించకుండా చదవాల్సి ఉంటుంది.

ప్రాక్టీస్ టెస్ట్

డీఈఈ సెట్ అభ్యర్థులు.. గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం, అదే విధంగా మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల పరీక్షలో ప్రశ్నలు అడుగుతున్న శైలిపై అవగాహనతోపాటు స్వీయ బలాలు, బలహీనతలను తెలుసుకుని.. వాటిని సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, మే 8
- ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2025, మే 7
- హాల్ టికెట్ డౌన్‌లోడ్: 2025, మే 20
- పరీక్ష తేదీలు: 2025, జూన్ 2, 3
- ఫలితాల వెల్లడి: 2025, జూన్ 10
- వివరాలకు వెబ్‌సైట్: https://apdeecet.apcfss.in/

తెలంగాణ డీఈఈ సెట్ 2025

తెలంగాణలో రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, రెండేళ్ల డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ డీఈఈ సెట్ 2025 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్, లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు పొంది ఉండాలి. అర్హత కోర్సు ఫైనల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** సెప్టెంబర్ 1 నాటికి కనీసం 17ఏళ్లు ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

ఎంపిక విధానం

రాత పరీక్షలో ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష వంద ప్రశ్నలు–వంద మార్కులకు ఉంటుంది. అభ్యర్థులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంల్లో పరీక్ష రాసుకోవచ్చు. ఇందులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. పార్ట్1లో జనరల్ నాలెడ్జ్, టీచింగ్ ఆప్టిట్యూడ్‌పై పది ప్రశ్నలు వస్తాయి. పార్ట్ 2లో జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, జనరల్ తెలుగు/ ఉర్దూ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. పార్ట్ 3లో మ్యాథమెటిక్స్ 20 ప్రశ్నలు, ఫిజికల్ సైన్సెస్ 10 ప్రశ్నలు, బయలాజికల్ సైన్సెస్ 10 ప్రశ్నలు, సోషల్ స్టడీస్ 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరి తేదీ: 15.05.2025
- దరఖాస్తుల సవరణ : మే 17, 18 తేదీల్లో
- హాల్ టికెట్‌ల డౌన్‌లోడ్ : 20.05.2025 నుంచి
- టీజీ డీఈఈ సెట్ పరీక్ష తేది: 25.05.2025
- వివరాలకు వెబ్‌సైట్ : https://deecet.cdse.telangana.gov.in/TSDEECET/TSDEECET_HomePage.aspx

విద్య, ఉద్యోగ సమాచారం

ఇస్రోలో 63 సైంటిస్ట్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 63.
- **వేతనం:** నెలకు రూ.56,100.
- **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్)–22, సైంటిస్ట్/ ఇంజనీర్ (మెకానికల్)–33, సైంటిస్ట్/ఇంజనీర్(కంప్యూటర్ సైన్స్)–08.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సీఎస్), గేట్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 19.05.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.isro.gov.in/

డీఆర్‌డీవో, న్యూఢిల్లీలో 30 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని డీఆర్‌డీవో–డిఫెన్స్ సైంటిఫిక్ ఇన్ఫర్మేషన్ అండ్ డాక్యుమెంటేషన్ సెంటర్ (డీఆర్‌డీవో–డీఈఎస్ఐడీవోసీ).. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 30.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–20, డిప్లొమా అప్రెంటిస్(కంప్యూటర్ సైన్స్)–07, డిప్లొమా అప్రెంటిస్(వీడియో అండ్ ఫోటోగ్రఫీ)–02, డిప్లొమా అప్రెంటిస్(ప్రింటింగ్ టెక్నాలజీ)–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ తేదీ నాటికి 28 ఏళ్లు ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా..
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, డీఈఎస్ఐడీవోసీ, మెట్‌కాల్ఫ్ హౌస్, ఢిల్లీ–110054 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
- **వెబ్‌సైట్:** https://drdo.gov.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– మార్కెటింగ్ అవేర్‌నెస్

ఆడుతు.. పాడుతు.. చెమటోడుస్తాం!

శ్రమించేందుకు సై అంటున్న భారతీయులు

వారంలో 61-70 గంటల పనికీ సై

అత్యధికులకు మెరుగ్గా ఉన్న వర్క్‌-లైఫ్‌ బ్యాలెన్స్‌

పనిచేయడాన్ని ఆనందిస్తామన్న 73% మంది

'ఆమ్‌రో పార్ట్‌నర్‌షిప్‌' తాజా నివేదికలో వెల్లడి

8 దేశాల్లో 20-60 ఏళ్ల మధ్య వయస్కులపై సర్వే

సాక్షి, స్పెషల్‌ డెస్క్‌: చెమటోడ్చే విషయంలో భారతీయులు వెనక్కి తగ్గరని మరోసారి రుజువైంది. 51-70 గంటలు పనిచేయడానికైనా సిద్ధమని అంటున్నవారు భారత్‌లోనే ఎక్కువగా ఉండటం విశేషం. 'కష్టపడి పనిచేసే వ్యక్తిగా ఉండటం ప్రతి ఒక్కరికీ ఉండవలసిన లక్షణం'అని 75% మంది భారతీయులు నమ్ముతున్నారట. ఇలా ఏకీభవిస్తున్నవారు అమెరికా, చైనా, ఫ్రాన్స్‌ వంటి దేశాల్లో తక్కువగా ఉండటం గమనార్హం. లీడర్‌షిప్‌ రిక్రూట్‌మెంట్‌ సేవల్లో ఉన్న 'ఆమ్‌రో పార్ట్‌నర్‌షిప్‌'సంస్థ 'పనికి అర్థం'పేరుతో చేసిన సర్వేలో తేలిన విషయాలివి. భారత్‌తోపాటు బ్రెజిల్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, యూఎస్, యూకేలలో.. కనీసం డిగ్రీ చదివి, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్న 20-60 ఏళ్ల మధ్య వయసున్న 8,000 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు.



పనికి సై అంటున్నారు

→ వారంలో 51-60 గంటలు శ్రమించేందుకు సై అని 11% మంది భారతీయులు తెలిపారు. ఈ విషయంలో యూకేలో 7.1% మంది, యూఎస్‌ 6.9%, చైనా 5.4%, జర్మనీలో 5.4% మంది ముందుకొచ్చారు. 61-70 గంటలు పని చేసేందుకు 2.7% మంది భారతీయులు ఓకే చెబితే.. జర్మనీలో 1.4%, యూకే 1.3%, చైనాలో 1.2% మంది సరేనన్నారు. వారంలో 41-50 గంటలు పనిచేసేందుకు చైనీయుల్లో 38.7%, భారతీయుల్లో 27.2%, యూఎస్‌లో 26.9% మంది ఆసక్తి చూపారు. తమ పని-జీవిత సమతుల్యత మెరుగ్గా ఉందని (వర్క్‌-లైఫ్‌ బ్యాలెన్స్‌) అత్యధికంగా 73.3% మంది భారతీయులు నమ్ముతున్నారు. ఆ తరవాతి స్థానంలో బ్రెజిల్‌ (65.2%), యూకే (59.9%), యూఎస్‌ (59.2%), చైనాలో (59.1%) ఉన్నాయి.

'41-50 గంటలు పనిచేస్తాం'

వారంలో ఎన్ని గంటలు పని చేసేందుకు సిద్ధం అంటే..

దేశం	41-50	51-60	61-70
చైనా	38.7	5.4	1.2
భారత్	27.2	11	2.7
యూఎస్	26.9	6.9	1
పోలండ్	22.7	2.9	0.9
జర్మనీ	20.3	5.4	1.4
యూకే	19	7.1	1.3
బ్రెజిల్	16.4	2.9	0.9



పనిలోనే ఆనందం

→ పని చేయడాన్ని ఆనందిస్తామని మొత్తంగా 73% మంది తెలిపారు. భారత్‌లో ఈ సంఖ్య అత్యధికంగా 92% ఉంది. 87% మందితో బ్రెజిల్‌ రెండవ స్థానంలో నిలిచింది. 'చేస్తున్న పని వ్యక్తులను ప్రతిబింబిస్తుంది'అని 73% భారతీయులు, 57% బ్రెజిల్‌ వాసులు, 55% మంది చైనీయులు, 48% అమెరికన్లు విశ్వసిస్తున్నారు. 'ప్రతి ఒక్కరూ తగినంతగా ప్రయత్నిస్తే విజయం సాధించగలరు. కెరీర్లో విజయానికి, మంచి జీవితానికి దగ్గరి సంబంధం ఉందని భారతీయులు ప్రగాఢంగా నమ్ముతున్నారు.

నిరంతర అభ్యాసం, నైపుణ్యం..

→ అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం, వృద్ధి చెందడం అనేది పని చేయడానికి ప్రేరణగా చైనా, భారతీయులు నమ్ముతున్నారు. జర్మనీ, ఫ్రాన్స్‌తో పోలిస్తే చైనా, భారత్‌లలో కెరీర్‌ అవకాశాల ద్వారా వ్యక్తిగత అభివృద్ధిపై అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ రెండు దేశాల్లో నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి వృత్తిలో విజయానికి కీలకంగా నిలిచింది. కెరీర్లో విజయం సాధిస్తేనే జీవితమూ సంతృప్తికరంగా ఉంటుందని 84% మంది భారతీయులు నొక్కి చెబుతున్నారు.ఈ భావన చైనాలో 71%, బ్రెజిల్‌లో 70% మందిలో బలంగా ప్రతిధ్వనించింది.

సొంతంగా వ్యాపారం..

→ గ్లోబల్‌ సౌత్‌ దేశాల్లో నాయకత్వ స్థానం, సొంతంగా వ్యాపారం పట్ల అధిక ఆకాంక్షను ప్రదర్శిస్తున్నారు. భారత్‌లో 76% మంది కంపెనీని నడపాలని లేదా నిర్వహించాలన్న కోరికను వ్యక్తం చేస్తున్నారు, బ్రెజిల్‌లో 66%, చైనాలో 54% మంది ఈ జాబితాలో ఉన్నారు. యూకేలో 52%, యూఎస్‌ఏ 49%, ఫ్రాన్స్‌ 37%, జర్మనీలో 36% మందికి ఈ ఆకాంక్ష ఉంది. నాయకత్వం లేదానిర్వహణ పాత్రలను చేపట్టాలనే బలమైన కోరిక జనరేషన్‌-జడ్‌ (1997-2012 మధ్య పుట్టినవారు)లో ఉంది.

పని - జీవితాల మధ్య సమతౌల్యం — దేశాలవారీగా వర్క్‌-లైఫ్‌ బ్యాలెన్స్‌ ఎంత మెరుగ్గా ఉందంటే..

భారత్	బ్రెజిల్	యూకే	యూఎస్	చైనా	జర్మనీ	ఫ్రాన్స్
73.3	65.2	59.9	59.2	59.1	49.3	44.7

క్లుప్తంగా...

నర్సింగ్‌ ఆఫీసర్‌ పోస్టుల రాత పరీక్ష ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్‌: నర్సింగ్‌ ఆఫీసర్‌ పోస్టులకు సంబంధించిన రాత పరీక్షల ఫలితాలను ఆరోగ్య శాఖ విడుదల చేసింది. 2,322 నర్సింగ్‌ ఆఫీసర్‌ పోస్టుల కోసం 2024, నవంబర్‌ 23న పరీక్ష నిర్వహించారు. 42,244 మంది నర్సులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 40,423 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే నెల 28న ప్రిలిమినరీ 'కీ'విడుదల చేశారు. కాగా, అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను మెడికల్‌ అండ్‌ హెల్త్‌ సర్వీసెస్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు సోమవారం విడుదల చేసింది. బోర్డు వెబ్‌సైట్‌లో (https:// mhsrb. telangana.gov.in/MHSRB/home.htm) మార్కులను అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు తమ మార్కుల వివరాలను చెక్‌ చేసుకోవాలని మెడికల్‌ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. త్వరలోనే ప్రొవిజినల్‌ మెరిట్‌ లిస్టు విడుదల చేస్తామని వెల్లడించింది.

టీజీఎఫ్‌డీసీకు ఫారెస్ట్‌ స్టివార్డ్‌ షిప్‌ కౌన్సిల్‌ సర్టిఫికేషన్‌

సాక్షి,హైదరాబాద్‌: ఫారెస్ట్‌ స్టివార్డ్‌ షిప్‌ కౌన్సిల్‌ సర్టిఫికేషన్‌తో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ)కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అటవీప్రాంతాల్లో 'ఫారెస్ట్‌ ప్లాంటేషన్‌ మేనేజ్‌మెంట్‌'లో పర్యావరణపరంగా, సామాజికంగా చేపట్టిన చర్యలకుగాను ఈ సర్టిఫికేషన్‌ లభించింది. భారత్‌లోని ప్రభుత్వరంగ సంస్థల్లో ఎఫ్‌ఎస్‌సీ ఎఫ్‌ఎం సర్టిఫికేషన్‌ సాధించిన మొట్టమొదటి సంస్థగా టీజీఎఫ్‌డీసీ ఘనతను సాధించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా అటవీ ఉత్పత్తులకు ఎఫ్‌ఎస్‌సీ సర్టిఫికేషన్‌ 'గోల్డ్‌ స్టాండర్డ్‌'గా పరిగణిస్తారు. కాగా, ఎఫ్‌ఎస్‌సీ సర్టిఫికేషన్‌తో బాధ్యతాయుతమైన అటవీ నిర్వహణ, యాజమాన్యంలో తమ సంస్థ గ్లోబల్‌ లీడర్‌గా నిలుస్తోందని టీజీఎఫ్‌డీసీ వీసీ, ఎండీ డా.జి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సర్టిఫికేషన్‌ లభించడం తెలంగాణకు గర్వకారణమే కాకుండా భవిష్యత్‌లో సుస్థిర అభివృద్ధి నమూనాగా నిలిచేందుకు దోహదపడుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంజనీరింగ్‌ సెట్‌ ప్రాథమిక 'కీ' విడుదల

20 వేల మంది రెస్పాన్స్‌ షీట్స్‌ డౌన్‌లోడ్‌

సాక్షి, హైదరాబాద్‌: ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన ఇంజనీరింగ్‌ కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ (టీజీఈఏపీసెట్‌) ప్రాథమిక 'కీ'ని జేఎన్టీయూహెచ్‌ సోమవారం సాయంత్రం విడుదల చేసింది. ఈనెల 7వ తేదీ వరకు అభ్యంతరాలు నమోదు చేసేందుకు అవకాశం ఇచ్చారు. ఏప్రిల్‌ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెట్‌ 'కీ'ని ఆదివారం విడుదల చేశారు. ఇప్పటి వరకు అగ్రి, ఫార్మా సెట్‌కు సంబంధించిన రెస్పాన్స్‌ షీట్స్‌ను 12 వేల మంది డౌన్‌లోడ్‌ చేసుకున్నారని, ఇంజనీరింగ్‌ సెట్‌కు సంబంధించిన రెస్పాన్స్‌ షీట్స్‌ను 20 వేల మంది డౌన్‌లోడ్‌ చేసుకున్నట్టు సెట్‌ కన్వీనర్‌ దీన్‌ కుమార్‌ తెలిపారు. ఈసారి ప్రతీ అభ్యంతరానికి రూ.500 చెల్లించాలనే నిబంధన విధించారు. లేవనెత్తిన అభ్యంతరం రుజువైతే ఈ మొత్తాన్ని తిరిగి ఇస్తారు. అభ్యంతరాల గడువు ముగిసిన తర్వాత ఫైనల్‌ 'కీ'ని నాలుగు రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

క్రిస్టినా చోంగ్తూకు అదనపు బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్‌: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్‌ చోంగ్తూకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన సంగీత సత్యనారాయణ అధికారిక శిక్షణ కోసం సెలవుల్లో వెళ్లడంతో ఆమె స్థానంలో క్రిస్టినా జెడ్‌ చోంగ్తూను నియమించారు. సోమవారం నుంచి జూన్‌ 13 వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సమ్మె యోచన విరమించుకోండి

ఆర్టీసీ సంఘాలకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

మంత్రిని కలసిన ఓ వర్గం జేఏసీ నేతలు


సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళతానని పొన్నం హామీ



సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన ఆర్టీసీ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్‌: ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. సమ్మె ఆలోచనను విరమించుకోవాలని ఆయన కార్మిక సంఘాలను కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈనెల ఏడో తేదీ తొలి సర్వీసు నుంచి బస్సులను నిలిపేసి సమ్మె ప్రారంభించాలని కార్మిక సంఘాలతో కూడిన ఓ జేఏసీ సమాయత్తమైన నేపథ్యంలో ఆయన ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది. కార్మిక సంఘాల నేతలతో చర్చలకు తాను సిద్ధమని, సంఘాలు చర్చకు రావచ్చని ఆయన ప్రకటించారు. మంత్రుల గృహసముదాయంలో సోమవారం ఆర్టీసీలోని మరో జేఏసీకి చెందిన నేతలు ఆయనతో భేటీ అయ్యారు. దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్న అశ్వత్థామరెడ్డి, నరేందర్, ఎర్ర స్వామికుమార్, పున్నా హరికృష్ణ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. సంస్థలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వారు మంత్రి దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్థిక వెసులుబాటు ఆధారంగా దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. పదేళ్లుగా ధ్వంసమవుతూ వచ్చిన సంస్థను తమ ప్రభుత్వం చక్క దిద్దుతోందని, ఇప్పుడిప్పుడే గాడిలోకి వస్తున్న సమయంలో మళ్లీ సమ్మె పేరుతో నష్టం చేయవద్దని ఆయన కోరారు. సంస్థతోపాటు ప్రజలు కూడా సమ్మె వల్ల ఇబ్బందులకు గురవుతారని, సీఎం సూచనల మేరకు సమస్యలను పరిష్కరించనున్నందున సమ్మె యోచన విరమించుకోవాలని పొన్నం సూచించారు.

మరోవైపు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని సంస్థ.. కార్మికులకు ఓ ప్రకటన రూపంలో వెల్లడించింది. గతంలో పేరుకుపోయిన బకాయిలను చెల్లించటంతోపాటు ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించింది. ఆర్థికంగా ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మె యోచనను విరమించుకోవాలని కోరింది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెపై నిషేధం ఉన్న విషయాన్ని గుర్తించాలని, సమ్మె పేరుతో ఉద్యోగులను బెదిరించినా, వారి విధులకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కాగా, సమ్మె నోటీసు ఇచ్చి.. సన్నాహాలు నిర్వహిస్తున్న జేఏసీ మాత్రం మంత్రితో జరిగిన చర్చల్లో పాల్గొనలేదు. తాము సమ్మెకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.




ధరలు పెంచేనా?

ఎక్సైజ్‌ శాఖలో మరోమారు లిక్కర్‌ కంపెనీలకు బేసిక్‌ ధర పెంపు అంశం తెరపైకి.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన భారతీయ మద్య పానీయాల పరిశ్రమల సంఘం

సాక్షి, హైదరాబాద్‌: మద్యం సరఫరా చేసే కంపెనీలకు బేసిక్‌ ధర పెంపు అంశం మరోమారు తెరపైకి వచ్చింది. 2023, మే నెలలో బేసిక్‌ ధరలను తెలంగాణ ప్రభుత్వం సవరించిందని, ఆ తర్వాత మళ్లీ పెంచకపోవడంతో మద్యం పరిశ్రమ ఇబ్బంది పడుతోందని, వెంటనే బేసిక్‌ ధరలను పెంచాలని కోరుతూ భారతీయ మద్య పానీయాల పరిశ్రమల సంఘం (సీఐఏబీసీ) తాజాగా రాసిన లేఖ ఎక్సైజ్‌ శాఖలో చర్చనీయాంశమవుతోంది. లిక్కర్‌ కంపెనీల బేసిక్‌ ధరలను పెంచే అవకాశముందని, 10 శాతం మేర ఈ ధరలు పెంచితే అదే స్థాయిలో బహిరంగ మార్కెట్‌లో లిక్కర్‌ ధరలు కూడా పెరుగుతాయనే చర్చ జరుగుతోంది.

వార్షిక సమీక్ష లేక...

సీఐఏబీసీ డైరెక్టర్‌ జనరల్‌ అనంత్‌.ఎస్‌.అయ్యర్‌ పేరిట విడుదలైన ఈ లేఖలో తెలంగాణలో మద్యం కంపెనీల పరిస్థితి గురించి వివరించారు. మద్యం ఉత్పత్తి ఖర్చులు భారీగా పెరగడం, ధరల సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వార్షిక సమీక్షలు జరపని నేపథ్యంలోనే ఈ అభ్యర్థనకు కారణమని ఆ లేఖలో పేర్కొన్నారు. 2023, మే తర్వాత ఎక్స్‌ట్రా న్యూట్రల్‌ ఆల్కహాల్‌ (ఈఎన్‌ఏ), మాల్ట్‌ స్పిరిట్, ప్యాకేజింగ్‌ సామగ్రి, కూలీల ఖర్చులు, రవాణా, ఇతర సేవల ధరలు పెరిగాయని, ఈ పరిస్థితుల్లో ద్రవ్యోల్బణానికి అనుగుణంగా బేసిక్‌ ధరలను సవరించాలని కోరారు. లిక్కర్‌ ఎమ్మార్పీలో 70 శాతం కంటే ఎక్కువ ప్రభుత్వానికే ఆదాయంగా వెళుతోందని, రిటైలర్లకు 15-18 శాతం వస్తుండగా, తయారీదారులకు కేవలం 12-15 శాతం మాత్రమే వస్తోందని తెలిపారు. బేసిక్‌ ధరల వార్షిక సమీక్ష లేకపోవడంతో పెరిగిన ఖర్చులను తయారీదారులే భరిస్తున్నారని, ఈ నేపథ్యంలో లిక్కర్‌కు కనీసం కేస్‌కు 100-200 రూపాయలు, వైన్‌ ఉత్పత్తులకు 5 శాతం పెంచాలని డిమాండ్‌ చేశారు.



సీఎం వద్ద పెండింగ్‌లో

కాగా, మద్యం బేసిక్‌ ధరల పెంపు వ్యవహారం సీఎం రేవంత్‌రెడ్డి వద్ద పెండింగ్‌లో ఉందని తెలుస్తోంది. లిక్కర్‌ ధరల సవరింపు ఫైల్‌కు ఆయన అనుమతి ఇవ్వాల్సి ఉందని సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే ఇందుకు గ్రీన్‌సిగ్నల్‌ వస్తుందని, దాదాపు 10% కంటే ఎక్కువ మద్యం బేసిక్‌ ధర పెరిగే అవకాశముందని, ఆ మేర కు మందుబాబుల జేబులకు చిల్లు పడుతుందనే చర్చ ఎక్సైజ్‌ వర్గాల్లో జరుగుతోంది.

డిగ్రీ అడ్మిషన్లు పూర్తయ్యే వరకు హెల్ప్‌లైన్‌ సెంటర్లు

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: డిగ్రీ అడ్మిషన్లు పూర్తయ్యే వరకు దోస్త్‌ హెల్ప్‌లైన్‌ సెంటర్లు చురుకుగా పనిచేస్తాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌ వి.బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్, కోఆర్డినేటర్లతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి పలుసూచనలు చేశారు. దోస్త్‌-2025 కౌన్సెలింగ్‌ ప్రక్రియ, తీసుకుంటున్న చర్యలపై విస్తృత ప్రచారం కల్పించాలని, నిర్దేశించిన కోర్సుల్లో నూరుశాతం అడ్మిషన్లు జరిగేలా పనిచేయాలని సూచించారు. ఇంటర్మీడియట్‌ ఉత్తీర్ణత సాధించిన పిల్లలందరికీ దోస్త్‌-2025 సమాచారం పంపించాలని, ఇందుకు ఇంటర్మీడియట్‌ బోర్డు సహకారం తీసుకోవాలన్నారు. దోస్త్‌ హెల్ప్‌లైన్‌ డెస్క్‌ ఫోన్‌ నంబర్‌ 040-23120416కు ఫోన్‌ చేసి సమాచారాన్ని తెలుసుకోవచ్చని సూచించారు.

కోర్టుకే అబద్ధాలు చెబుతారా..?

పోలీసులపై ఏపీ హైకోర్టు ధర్మాసనం మండిపాటు

సాక్షి, అమరావతి: ''మాకే అబద్ధాలు చెబుతారా? కోర్టు ముందు ఉంచిన అఫిడవిట్లన్నీ తప్పుడువే. దీనిపై వివరణ ఇవ్వండి. ఈ మొత్తం వ్యవహారంలో తుది విచారణ జరుపుతాం. అప్పుడు అన్నీ తేలుస్తాం''అని హైకోర్టు ధర్మాసనం ఏపీ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్‌ మీడియా యాక్టివిస్ట్‌ వర్రా రవీంద్రరెడ్డి అక్రమ నిర్బంధంపై వ్యాజ్యం దాఖలై ఐదు నెలలు అవుతోందని, అందువల్ల తుది విచారణ జరుపుతామని పేర్కొంది. రవీంద్రరెడ్డిని గత ఏడాది నవంబరు 8వ తేదీనే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపించడంతో పోలీసుల తీరుపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో కోర్టుకు పోలీసులు తప్పుడు అఫిడవిట్లు సమర్పించారని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూన్‌ 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్‌ రావు రఘునందన్‌రావు, డాక్టర్‌ జస్టిస్‌ కుంభజడల మన్మథరావులతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వర్రా రవీంద్రరెడ్డి అక్రమ నిర్బంధంపై ఆయన భార్య కళ్యాణి గతంలో హైకోర్టులో హెబియస్‌ కార్పస్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. తాజాగా ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. కళ్యాణి న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ, రవీందర్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. గత ఏడాది నవంబరు 8న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రవీంద్రరెడ్డి, మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చాలా స్పష్టంగా ఉందన్నారు. పోలీసులు మాత్రం 11న అరెస్ట్‌ చూపారన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ సహాయ న్యాయవాది వాదిస్తూ.. ఫుటేజీకి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులతో మాట్లాడిన తరువాత కోర్టు ముందు ఉంచుతామని చెప్పారు. కాగా, ఇంతకాలం వర్రా రవీంద్రరెడ్డిని అక్రమంగా అరెస్ట్‌ చేయలేదంటూ బుకాయిస్తూ వచ్చిన పోలీసులు ఇప్పుడు హైకోర్టుకు అడ్డంగా దొరికిపోయారు. రవీంద్రరెడ్డిని గత ఏడాది నవంబరు 10న మాత్రమే అదుపులోకి తీసుకున్నామంటూ ఇన్ని రోజులుగా హైకోర్టును నమ్మిస్తూ వచ్చిన పోలీసులు అబద్ధం చెప్పినట్లు తేలిపోయింది.

పగలు ఎండ.. సాయంత్రం వాన

నడి వేసవిలో భిన్న వాతావరణ పరిస్థితులు..



సోమవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	42.2
ఆదిలాబాద్	41.3
నల్లగొండ	41.0
మహబూబ్‌నగర్	40.9
మెదక్	40.6
రామగుండం	40.2
ఖమ్మం	39.8
హైదరాబాద్	39.2
దుండిగల్	39.0
హకీంపేట్	39.0
హనుమకొండ	39.0
భద్రాచలం	37.2

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ప్రస్తుత వేసవి సీజన్‌లో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటిపూట ఎండలు, ఉక్కపోత ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే సాయంత్రాలు హైదరాబాద్‌ సహా పలు జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు మొదలు వడగళ్ల వానలతో వాతావరణం చల్లబడుతోంది. సాధారణంగా మార్చి మొదలు మే నెలాఖరు వరకు రాష్ట్రంలో సగటున 4.87 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా మార్చి నుంచి ఈ నెల 5వ తేదీ వరకు ఇప్పటికే సగటున 4.06 సెం.మీ. వర్షం కురిసింది. ఇందులో నెలవారీ వర్షపాతం గణాంకాలను పరిశీలిస్తే మార్చిలో సగటున 0.66 సెం.మీ. వర్షం కురవగా (సాధారణ వర్షపాతం 0.82 సెం.మీ.) ఏప్రిల్‌లో 2.66 సెం.మీ. వర్షపాతం (సాధారణం 1.26 సెం.మీ.) నమోదైంది. ఈ నెలలో తొలి ఐదు రోజులకుగాను 0.74 సెం.మీ. మేర (సాధారణం 2.85 సెం.మీ.) వర్షం కురిసింది. ఏప్రిల్‌లో సాధారణం కంటే ఏకంగా 171 శాతం అధిక వర్షపాతం నమోదవడం గమనార్హం. మరోవైపు ఈ ఏడాది వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని.. సాధారణం కంటే అధికంగా 106 శాతం మేర వర్షపాతం నమోదు కావొచ్చని ఐఎండీ ఇప్పటికే ప్రాథమికంగా అంచనా వేసింది.

రెండ్రోజులు తేలికపాటి వానలు



రాష్ట్రంలో వచ్చే రెండ్రోజులపాటు తేలికపాటి వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఉత్తర తెలంగాణ, మధ్య ప్రాంత జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని.. ఒకట్రెండు చోట్ల ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. రానున్న మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. సోమవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే నిజామాబాద్‌లో అత్యధికంగా 42.2 డిగ్రీల సెల్సియస్‌ ఉష్ణోగ్రత నమోదైంది.

తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



గవర్నర్‌ ఆమోదంతో ఉత్తర్వులు జారీ

పెండింగ్‌లోనే సమాచార కమిషనర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్‌ఎస్‌ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మూడేళ్ల పాటు లేదా 65 ఏళ్ల వయసు వచ్చేవరకు రెండింటిలో ఏది ముందు అయితే అప్పటి వరకు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వులో తెలిపారు. ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, సమాచార కమిషనర్లుగా సీనియర్‌ జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్‌రావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, కప్పర హరిప్రసాద్, న్యాయవాది పీఎల్‌ఎస్‌ ప్రసాద్‌తో పాటు రాములు, వైష్ణవి, మొహిసినా పర్వీన్‌ పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మకు సిఫారసు చేసింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి నియామకానికి గవర్నర్‌ ఆమోదించడంతో సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుతం సీఎం కార్యదర్శిగా సీఎంఓలో పనిచేస్తున్నారు. మరో రెండు నెలల్లో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. సమాచార కమిషనర్లుగా ప్రభుత్వం సిఫారసు చేసిన వారిలో కొందరు రాజకీయ పార్టీల్లో క్రియాశీలకంగా పనిచేసినట్టు ఫిర్యాదులు రావడంతో వారి నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను గవర్నర్‌ ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు. ముఖ్యమంత్రికి సీపీఆర్వోగా పనిచేస్తున్న బోరెడ్డి అయోధ్యరెడ్డి పీసీసీ అధికార ప్రతినిధిగా వ్యవహరించడం, కప్పర హరిప్రసాద్‌.. గాంధీభవన్‌ పీఆర్వోగా పనిచేస్తుండటం, రాములు కొడంగల్‌లో కాంగ్రెస్‌ పార్టీ కౌన్సిలర్‌గా పనిచేసి ఉండటంతో వారి పేర్లను గవర్నర్‌ పక్కనపెట్టినట్టు తెలిసింది. సమాచార కమిషనర్లుగా మిగిలిన నలుగురి పేర్లను గవర్నర్‌ ఆమోదించే అవకాశం ఉంది.

తెలంగాణకే ఐపీఎస్‌ అభిలాష బిస్త్‌

ఏపీకి వెళ్లాలన్న క్యాట్‌ ఉత్తర్వులపై హైకోర్టు స్టే..

తీర్పు ఇచ్చే వరకు తెలంగాణలోనే కొనసాగించాలి



సాక్షి, హైదరాబాద్‌: కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో చేరాలని సీనియర్‌ ఐపీఎస్‌ అభిలాష బిస్త్‌కు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌ (క్యాట్‌) జారీ చేసిన ఉత్తర్వులను తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేసింది. క్యాట్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో తీర్పు వెలువడే వరకు తెలంగాణలోనే కొనసాగించాలని ఆదేశించింది. 2014 నుంచి ఆమె ఇక్కడే కొనసాగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే తాము ఎలాంటి మెరిట్స్‌లోకి వెళ్ల డం లేదని, క్యాట్‌ ధర్మాసనం స్వేచ్ఛగా విచారణ చేపట్టొచ్చని సూచించింది. అభిలాష 19 94 బ్యాచ్‌ ఐపీఎస్‌ అధికారిణి. ఆమెను మొదట పశ్చిమ బెంగాల్‌ కేడర్‌కు కేటాయించారు. ఆమె ఏపీ కేడర్‌ ఐపీఎస్‌ అధికారిని వివాహం చేసుకొని 1997లో తన కేడర్‌ను ఏపీకి మార్చుకున్నారు. విభజన సమయంలో ఆమెను ఏపీకి కేటాయించారు. కేటాయింపుల అంశంపై గతంలో క్యాట్‌ ఇచ్చిన ఆర్డర్‌ సాయంతో ఆమె 11 సంవత్సరాలుగా తెలంగాణలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్‌ అధికారులు డీజీ అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్‌ మహంతి వెంటనే ఏపీకి వెళ్లేలా రిలీవ్‌ చేయాలని ఫిబ్రవరి 21న తెలంగాణను ఆదేశించింది. దీంతో ఫిబ్రవరి 22న తెలంగాణ సర్కార్‌ అంజనీకుమార్, అభిలాష బిస్త్‌ను రిలీవ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విచారణ పూర్తయ్యే వరకు..

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను సవాల్‌ చేస్తూ అభిలాష బిస్త అదే నెల క్యాట్‌ను ఆశ్రయించారు. వాద నలు విన్న క్యాట్‌ బెంచ్‌.. ఆంధ్రప్రదేశ్‌లో చేరాలని అభిలాష బిస్త్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏపీలో చేరిన ఆమె.. తెలంగాణ హైకోర్టులో క్యాట్‌ ఉత్తర్వులను సవాల్‌ చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ శ్యామ్‌కోషి, జస్టిస్‌ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది జె.సుధీర్‌ వాదనలు వినిపిస్తూ.. క్యాట్‌ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని కోరారు. ఐపీఎస్‌ అధికారుల సీనియారిటీకి సంబంధించిన వివాదం ఉందన్నారు. అభిలాష సీనియారిటీ వాదనను గతంలో క్యాట్, హైకోర్టు సమర్థించిన విషయాన్ని గుర్తు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం తెలంగాణలోనే ఆమెను కొనసాగించాలని చెప్పింది.



యుద్ధట్యాంకుల తరలింపు

చౌటుప్పల్‌ రూరల్‌: హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారి గుండా సోమవారం నాలుగు యుద్ధ ట్యాంకులు పెద్ద ట్రాలీ లారీలపై వెళ్తూ కనిపించాయి. ఈ లారీలు విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తూ చౌటుప్పల్‌ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద కొద్దిసేపు ఆగాయి. వాటిని నాగాలాండ్‌ నుంచి తీసుకొస్తున్నట్లు సిబ్బంది చెప్పారు. ఎక్కడికి తరలిస్తున్నారనే వివరాలు చెప్పేందుకు వారు నిరాకరించారు. వీటిని జాతీయ రహదారి వెంట ప్రజలు, వాహనదారులు ఆసక్తిగా చూశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఉరిమితే రైతన్నకు కోతే..





దొంగతుర్తి గ్రామ ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు కుప్పగా పోస్తున్న రైతులు



బొట్ల వనపర్తి గ్రామంలో..



పాలితం గ్రామం వద్ద ..



నందిమేడారం గ్రామంలో రైతుల తిప్పలు

సాయంకాలం ఆకాశంలో మేఘాలు కమ్ముకుని ఒక్కసారి ఉరిమితే రైతుల్లో వణుకు పుడుతోంది. అప్పుడే ఎండ, ఆ తర్వాతే వాన.. ఇలా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో అన్నదాత గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. యాసంగిలో వరి పండించిన రైతులు కోతలు తీవ్రతరం చేశారు. అయితే ఆకాశంలో కమ్ముకుంటున్న మబ్బులతో కొనుగోలు కేంద్రాల్లో తేమకోసం వడ్లు ఆరబోసిన రైతులు.. ఇళ్ల నుంచి కొనుగోలు కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి, బొట్లవనపర్తి, ధర్మారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి 'సాక్షి'కెమెరాకు ఇలా చిక్కాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఏడాదిన్నరలోనే ఆర్థిక వ్యవస్థ నాశనం

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఏడాదిన్నరలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, రాష్ట్రం దివాలా తీసిందంటూ తక్కువ చేసి మాట్లాడితే పెట్టుబడులు ఎక్కడ నుంచి వస్తాయో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పరిపాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఉద్యోగులను అవమానించేలా, బెదిరించేలా సీఎం మాట్లాడుతున్నారని సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా సీఎం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటా అని చెప్పిన రేవంత్.. నమ్మించి వారి గొంతు కోశాడని ఆరోపించారు. అధికారంలోకి రాగానే పీఆర్‌సీ, డీఏలు, జీవో 317 బాధితులకు 48 గంటల్లో న్యాయం, పెన్షనర్ల బకాయిలు చెల్లిస్తానని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ, మూసీ ప్రాజెక్టు, స్కిల్ యూనివర్సిటీ, అందాల పోటీలకు డబ్బులు ఉంటాయి కానీ, ఉద్యోగులకు పెండింగ్ బకాయిలకు డబ్బులు లేవా అని నిలదీశారు. సీఎం, మంత్రులు ప్రతి కార్యక్రమానికి హెలికాప్టర్లు వాడుతుంటే దుబారా ఖర్చు కావడం లేదా అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

ఎస్టీ కమిషన్ విచారణకు హాజరైన కార్పొరేటర్ సుజాత

సాక్షి, న్యూఢిల్లీ: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్టీ)ను హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ కోరారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన విషయంలో వాగ్వాదం జరగ్గా, సుధీర్‌రెడ్డి కులం పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సుజాత ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆయనపై అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్యేపై పోలీసులు చర్య తీసుకోలేదని ఆరోపిస్తూ సుజాత ఎన్‌సీఎస్టీని ఆశ్రయించారు. సోమవారం ఢిల్లీలోని కమిషన్ మెంబర్ హుస్సేన్ సమక్షంలో దీనిపై విచారణ జరిగింది. ఈ విచారణకు హాజరైన సుజాత.. ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో, వీడియో టేప్స్, ఎఫ్ఐఆర్ వివరాలను కమిషన్‌కు అందజేశారు. అనంతరం తెలంగాణభవన్‌లో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్‌తో కలిసి సుజాత మీడియాతో మాట్లాడారు. గిరిజన బిడ్డకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని వెంకటేశ్ చౌహాన్ హెచ్చరించారు.

కులగణన నిర్ణయంతో బీసీల శకం మొదలైంది

బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్త కులగణనపై మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీసీల శకం మొదలైందని బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. కులగణన చేపట్టడం చరిత్రాత్మకమని, దీంతో బీసీలకు మంచి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. ముప్పై ఏళ్లుగా కులగణన కోసం పోరాటాలు, వందల సార్లు ఢిల్లీలో ధర్నాలు చేశామని కృష్ణయ్య గుర్తుచేశారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశాన్ని అరవై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఎందుకు కులగణన చేయలేకపోయిందని ప్రశ్నించారు. కుల గణనపై ప్రతిపక్షాలు సన్నాయి నొక్కులు నొక్కుతూ, తప్పుడు ప్రచారాలు చేస్తున్నందున బీసీ సమాజమంతా మోదీ వైపున నిలబడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు.

పేలుడు పదార్థాల ఘటనపై ఎన్‌హెచ్చార్సీ ఆరా

- కర్మాగారంలో కార్మికుల మృతి ఘటనపై స్పందించిన ఎన్‌హెచ్చార్సీ
- సుమోటోగా కేసు స్వీకరించినట్లు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలోని ప్రొపెల్లెంట్ మిక్సింగ్ యూనిట్లో సంభవించిన పేలుడు ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) స్పందించింది. ఘటనను తాము సుమోటోగా స్వీకరిస్తున్నట్లు తెలిపింది. ముగ్గురు కార్మికులు మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలైన ఘటనపై ఆందోళన వ్యక్తంచేసింది. రెండు వారాల్లో ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సోమవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీచేసింది. పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలోని ప్రొపెల్లెంట్ మిక్సింగ్ యూనిట్లో జరిగిన పేలుడుపై మీడియాలో వచ్చిన వార్తలను ఎన్‌హెచ్చార్సీ సుమోటోగా స్వీకరించి, కేసు నమోదు చేసింది. వార్తా కథనంలోని అంశాలు నిజమైతే బాధితుల మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన తీవ్రమైన అంశాలను లేవనెత్తుతాయని కమిషన్ అభిప్రాయపడింది.


ఛత్తీస్‌గఢ్ యాంటీ నక్సల్స్ దళాలకు

అలవెన్సుల్లో వివక్ష

బిలాస్‌పూర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు

దళాల్లో ఆదివాసీ జవాన్లే అధికం







బచావో కర్రి గుట్టలు ఆపరేషన్ మొదలై రెండు వారాలు దాటినా భద్రతా దళాలకు కనీస విజయం దక్కలేదు. మరోవైపు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలంటూ తెలంగాణ పౌర సమాజం నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పుడు కొత్తగా యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో పాల్గొంటున్న జవాన్లకు సరైన వేతనాలు ఇవ్వడం లేదంటూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంపై బిలాస్‌పూర్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఆరో పే కమిషన్ సిఫార్సుల మేరకే...

మావోయిస్టుల ఏరివేత విషయంలో ఛత్తీస్‌గఢ్, కేంద్ర సర్కార్ బస్తర్ అడవుల్లో సంయుక్త ఆపరేషన్లు చేపట్టాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తరఫున సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) వంటి బలగాలు ఉండగా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ), బస్తర్ ఫైటర్స్ వంటి దళాలు పని చేస్తున్నాయి. అయితే యాంటీ నక్సలైట్స్ ఆపరేషన్లలో పాల్గొంటున్న కేంద్ర ప్రభుత్వ బలగాలతోపాటు ఐపీఎస్ స్థాయి (కేంద్ర సర్వీసులు) అధికారులకు ఏడవ పే కమిషన్ సిఫార్సుల ప్రకారం యాంటీ నక్సలైట్ ఆపరేషన్స్ అలవెన్స్ అందుతుండగా, ఛత్తీస్‌గఢ్ బలగాలకు ఇప్పటికీ ఆరో పే కమిషన్ సిఫార్సుల మేరకే అలవెన్సులు ఇస్తున్నారు.

న్యాయం దక్కడం లేదంటూ...

నక్సలైట్ ఆపరేషన్స్ స్పెషల్ అలవెన్సుల విషయంలో ఛత్తీస్‌గఢ్ బలగాలకు న్యాయం దక్కడం లేదంటూ పోలీస్ ఎంప్లాయీస్, ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉజ్వల్ దివాన్ ఏప్రిల్ 30న బిలాస్‌పూర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. '2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. అందుకు తగ్గట్టే రాత్రీపగలు తేడా లేకుండా ఛత్తీస్‌గఢ్ బలగాలు అడవుల్లో నిర్విరామంగా పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో అనేకమంది గాయపడుతున్నారు, కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఇలాంటి సందర్భాల్లో జవాన్లను త్యాగధనులు అని కొనియాడటం తప్పితే, వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం అందించడంలో ఇటు పోలీస్ ఉన్నతాధికారులు, అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గడిచిన తొమ్మిదేళ్లుగా ఈ అన్యాయం కొనసాగుతోంది'అని పిటిషన్‌లో ఉజ్వల్ పేర్కొన్నారు.

ఆదివాసీలే అధికం

ఇటు మావోయిస్టులు, అటు భద్రతా దళాలకు జరుగుతున్న పోరులో ఇరు వర్గాలు ఆదివాసీల ప్రయోజనాలే తమకు ముఖ్యమని ప్రకటిస్తున్నాయి. ఆదివాసీలపై నిర్బంధం పెరిగినందునే శాంతి చర్చల ప్రతిపాదన తెచ్చామని మావోయిస్టులు చెప్పారు. మావోయిస్టులను నిర్మూలించి ఆదివాసీ ప్రాంతాలకు అభివృద్ధిని పరిచయం చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. తాజా పిటిషన్‌తో మరోసారి బస్తర్ ఆదివాసీల వికాసం అనే అంశం తెర మీదకు వచ్చింది. ఎందుకంటే ఛత్తీస్‌గఢ్ సర్కార్ నియమించిన యాంటీ నక్సల్స్ దళాల్లో ఆదివాసీ యువకులు, మాజీ మావోయిస్టులే పెద్ద సంఖ్యలో ఉన్నారు. మృతుల్లోనూ వీరే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. ముఖ్యంగా మావోయిస్టులు జరిపే దాడిలో డీఆర్‌జీ బలగాలకు చెందిన ఆదివాసీలే పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన సీఎస్ రామకృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావు శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్.. రామకృష్ణారావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నల్లగొండ జేసీగా 25 ఏళ్ల కింద చేసినప్పటి నుంచి రామకృష్ణారావు తనకు తెలుసని అన్నారు. 1999లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని ఆయన చేతుల మీద నుంచే స్వీకరించినట్టు మంత్రి గుర్తుచేసుకున్నారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి సైతం పాల్గొన్నారు.

పక్కాగా రోజువారీ తాగునీటి సరఫరా

- అధికారులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశాలు
- మిషన్ భగీరథ ఇంజనీర్ల టెలీకాన్ఫరెన్స్‌కు హాజరై ఆశ్చర్యపరిచిన సీఎస్

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలోని సమస్యాత్మక గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఆదివాసీ గూడేలు, లంబాడీ తండాలు అధికంగా ఉండే ఆదిలాబాద్, ఖమ్మం, కొమురంభీం, భద్రాద్రి తదితర జిల్లాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని, రోజువారీ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించాలని, జలాశయాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. నీటికొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై సోమవారం ఆయన మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతీరోజు తాగు నీటి సరఫరాపై క్షేత్రస్థాయి ఇంజనీర్లతో మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తుండగా, ఈ సమావేశానికి రామకృష్ణారావు హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు నిర్వహిస్తున్న విధంగానే ప్రతీరోజూ టెలీకాన్ఫరెన్స్ కొనసాగించి సంబంధిత ఇంజనీర్లు సమన్వయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాల్లో తాగునీటి సరఫరాను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సీఎస్ ఆదేశించారు. పీఆర్‌ఆర్‌డీ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, ప్రజారోగ్య విభాగం ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డి, మిషన్ భగీరథ, పబ్లిక్‌హెల్త్ సీఈలు, ఎస్ఈలు, ఈఈలు ఇందులో పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన చేయాలి

ఓబీసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు నిర్వహించ తలపెట్టిన కులగణనను పారదర్శకంగా చేయాలని ఓబీసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి కోరారు. కులగణన గురించి గతంలో బీజేపీ నాయకత్వం సుప్రీంకోర్టులో, బయట చేసిన వ్యాఖ్యలు దృష్టిలో ఉంచుకుని ఈ డిమాండ్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఓబీసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేశ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణనను పారదర్శకంగా నిర్వహించడమే కాకుండా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని వెంకటస్వామి డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థలోనూ రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారత్ జోడో యాత్రలో ప్రజల్లోకి వెళ్లిన రాహుల్‌గాంధీ చేసిన డిమాండ్‌తోనే కులగణన సాధ్యమైందని, దీంతో ఆయన రాకుమారుడు కాదని, ప్రజల కుమారుడని దేశ ప్రజలకు అర్థమైందని వెంకటస్వామి చెప్పారు. కేతూరి వెంకటేశ్ మాట్లాడుతూ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆహారం కోసం ఆరాటం

చెట్లపై రాత్రివేళ సేదతీరిన పక్షులు (నీటికొంగలు) ఉదయం ఆహారం కోసం వేటకు బయల్దేరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లోకి వందల సంఖ్యలో చేరుకున్నాయి. చిన్నచేపల వేట కొనసాగించి సాయంత్రానికి గూటికి చేరుకున్నాయి. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్‌లో సోమవారం ఉదయం కనిపించిన దృశ్యాలను 'సాక్షి'క్లిక్ చేసింది.


– కమాన్‌పూర్ (మంథని)



గుండారం రిజర్వాయర్‌లో ఆహారం కోసం పక్షుల వేట



శేషాచలంపై అద్భుత దృశ్యం



కలియుగ వైకుంఠుడు కొలువైన శేషాచలంపై స్వర్ణ వర్ణ మేఘం కనువిందు చేసింది. తిరుపతిలో సోమవారం సంధ్యా సమయాన శేషాచల కొండకు స్వర్ణ వర్ణ మేఘ కాంతుల సొగసులు విరజిల్లాయి. ఈ దృశ్యాలను తిలకించిన భక్తజనం పులకించి ఆధ్యాత్మిక భావాలలో ఆనంద పరవశులయ్యారు.

– మోహన్ కృష్ణ కేతారి, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

వావ్.. విశాఖ!



నిన్నటివరకు విశాఖలో ఎండ వేడికి ఇళ్లకే పరిమితమైన ప్రజలు..వాతావరణం ఒక్కసారిగా మారడంతో సోమవారం బీచ్ బాట పట్టారు. నగరంలో మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. నగరాన్ని నల్లని మబ్బులు కమ్మేయడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఆర్ కే బీచ్ వద్ద ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది.

– పీఎల్ మోహన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జీవన ‘ఛత్రం’



మండుటెండలు 43 డిగ్రీలు దాటుతున్న వేళ చిరు వ్యాపారులకు గొడుగులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటిని ఆసరా చేసుకొని వాటి నీడలో కడపలో పండ్ల వ్యాపారులు తమ వ్యాపారాలను సాగిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రతి సోమవారం లేఖరులు మండుటెండలో గొడుగుల నీడలో కూర్చొని ఇలా అర్జీలు రాసే పనిలో నిమగ్నమయ్యారు.

– రమేష్ తీట్ల, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

క్లుప్తంగా...

ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పాటించండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ప్రాథమిక తరగతులు నిర్వహిస్తున్న అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఒకేలా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలో ప్రైమరీ తరగతులు ఏర్పాటు చేసిన క్రమంలో మోడల్ ప్రైమరీ స్కూల్ అయితే 5 మంది టీచర్లను ఇస్తున్నారని పేర్కొన్నారు. అది కుదరని పరిస్థితుల్లో 1 నుంచి 10 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, 11 నుంచి 30 మందికి ముగ్గురు టీచర్లు, 31 నుంచి 40 వరకు నలుగురు, 45 పైబడితే మోడల్ ప్రైమరీ స్కూల్‌గా పరిగణించి 5 మంది ఉపాధ్యాయులను ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఉందని గుర్తుచేశారు. ఇదే ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలని కోరారు.

ప్రాథమిక విద్యలో అసంబద్ధత తొలగించాలి

ఆపస్ డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రాథమిక విద్యలో నెలకొన్న అసంబద్ధతను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ప్రభుత్వం జీవో 117కు ప్రత్యామ్నాయం పేరుతో ప్రాథమిక పాఠశాలలను నాలుగు రకాలుగా విభజించి ఒక్కో పాఠశాలలో ఒక్కో విధంగా ఉపాధ్యాయుల్ని కేటాయించడం అసంబద్ధమని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ విమర్శించారు. అన్ని రకాల ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ప్రాతిపదికన టీచర్లను కేటాయించాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆదివారం పడిన భారీ వర్షానికి పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మామిడి రైతుల్ని ఆదుకోవాలని కోరారు. జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి సరైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ)ఎండీ గిరిషా, గృహ నిర్మాణ సంస్థ ఎండీ శివప్రసాద్ వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. దీంతో గృహ నిర్మాణ సంస్థ ఎండీగా ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌కు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇచ్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

‘ఉపాధి’ పనిప్రదేశాల్లో వివిధ రకాల బాధితులకిచ్చే పరిహారం పెంపు

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాల్లో ప్రమాదాలు/ వివిధ కారణాల బాధితులకు అందజేసే పరిహారాన్ని పెంచుతూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ‘ఉపాధి’ పనులు జరిగే పని ప్రదేశాల్లో శ్రామికులు, వారి వెంట వచ్చిన చిన్న పిల్లలు గుండెపోటు, వడదెబ్బ, పాము కాటు తదితర కారణాలతో మరణిస్తే ఆ కుటుంబానికి ఇచ్చే పరిహారం రూ.2లక్షల పెంచుతున్నట్టు పేర్కొన్నారు. ప్రమాదం జరిగి దీర్ఘకాలిక వైకల్యానికిలోనైన శ్రామికులు/వారి ఆరేళ్లలోపు చిన్నారులకు రూ.లక్ష, పూర్తిగా కదలలేని స్థితిలో ఉంటే రూ.2లక్షల చొప్పున అందించనున్నారు.

చెట్టు.. వేసవిలో జత కట్టు



ఎక్కడో ఊరవతల ఓ మర్రి చెట్టు..
ఎండన పడి తిరిగే వారిని కాసేపు
కూర్చోండర్రా.. అని పిలుస్తూ ఉంటుంది.
ఊరి మధ్యన రావి చెట్టు.. ఎర్రటి ఎండకు
ఆకులతో గొడుగు పట్టి తన ఒడిలో
కూర్చున్న వారికి ప్రాణ వాయువు
అందిస్తూ ఉంటుంది. ఇంటివెనుక
జామ చెట్టు.. తీయటి ఫలాలు
అందించడంతో పాటు సందె వేళ కింద
కూర్చుకుంటే చల్లటి గాలిని కానుకగా
ఇస్తుంది. అందుకే వేసవిలో చెట్టుతో
జట్టు కట్టడం అత్యవసరం.

శ్రీకాకుళం జిల్లా దల్లవలసలో చెట్టు నీడలో సేదతీరుతూ...

- పచ్చని చెట్లే వేసవి విడిదులు
- పల్లెటూళ్లలో వృక్షాల కిందనే సేద దీరుతున్న ప్రజలు

పొందూరు: పల్లెటూరు.. సందె వేళ..

మర్రి చెట్టు కింద మకాం.. కాసిన్ని కబుర్లు.. కావాల్సినంత చల్లని గాలి. అంతే వేసవి ఇట్టే గడిచిపోతుంది. చుట్టూ ఎండ తాండవం చేస్తున్నా చెట్టు నీడలో మాత్రం ఏసీ పెట్టినట్టే చల్లటి గాలి వీస్తుంది. అదే ఇప్పుడు పల్లెవాసులను రక్షిస్తోంది.

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని దళ్లవలస, కోటిపల్లి, మజ్జిలిపేట, గంఁ్రేడు, మలకాం, వీఆర్ గూడెం గ్రామాల్లో పెద్ద మర్రి చెట్లు వేసవి విడిదులుగా దర్శనమిస్తున్నాయి. ఈ చెట్లు సుమారు 60 ఏళ్ల నుంచి 200 ఏళ్ల వయస్సు ఉన్నవి. విశాలంగా వ్యాపించిన ఊడలతో నీడ అల్లుకుంటుంది. దీంతో ఎండకు దొరకకుండా పిల్లలు, పెద్దలు వాటి కిందనే సేద దీరుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో చెట్ల కిందకు వచ్చి ముచ్చటించుకునేవారు కొందరు, నిద్రపోయే వారు మరికొందరు, ఆడుకునే పిల్లలు, వలస కూలీలు అక్కడే ఉంటున్నారు.



మలకాంలోని మర్రిచెట్టు కింద సేద తీరుతూ..



గంఁ్రేడులోని మర్రి చెట్టు కింద కూర్చున్న ప్రజలు



మజ్జిలిపేటలో మర్రి చెట్టు కింద కూర్చున్న ప్రజలు, పనులు చేసుకుంటున్న కూలీలు

ఎండ నుంచి ఉపశమనం



మాది మలకాం గ్రామం. చిన్న పల్లెటూరు. వేసవి కాలం వచ్చిందంటే గ్రామంలోని ప్రజలు ఈ మర్రి చెట్టుకిందకే కూర్చునేందుకు వస్తుంటారు. ఇక్కడే సేద దీరుతుంటారు. మర్రిచెట్టు వయస్సు సుమారు 200 ఏళ్లు ఉంటుంది. బయట నుంచి వచ్చేవారంతా కచ్చితంగా ఇక్కడ కూర్చొని ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

– జాడ అసిరినాయుడు, మలకాం, పొందూరు మండలం

విశాలమైన ప్రాంగణం



మాది గంఁ్రేడు. శివారు గ్రామం. నాగావళి నది ఒడ్డున ఉంది. నది నుంచి వచ్చే చల్లని గాలి మర్రి చెట్టు కిందకు వచ్చి మరింత కూల్‌గా మారిపోతుంది. దీంతో పెద్దలు ఇక్కడే నిద్రపోయేందుకు, సేద దీరేందుకు వస్తుంటారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు అనువుగా చెట్టు నీడ ఉంది. ఈ చెట్టు మా గ్రామానికి వరం.

– చింతాడ సూర్యారావు, గంఁ్రేడు, పొందూరు మండలం

పక్షి జాతులు పదిలం



తాజా సర్వేలో పక్షిజాతుల సంఖ్య...	
జిల్లా	పక్షి జాతుల సంఖ్య
చిత్తూరు	169
అనంతపురం	145
విశాఖపట్నం	139
తూర్పుగోదావరి	108
వైఎస్సార్ జిల్లా	106
విజయనగరం	84
పశ్చిమగోదావరి	84

- 147 పక్షి జాతులతో మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 145 పక్షి జాతులు
- రాష్ట్రంలో అత్యధిక పక్షిజాతులున్న జిల్లాల్లో రెండో స్థానం
- ద గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్ సర్వేలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యాన పంటలకే కాదు పశుపక్ష్యాదులకూ ఆలవాలమని తేలింది. ఇప్పటికే జింకల వృద్ధిలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. చిరుత పులుల సంతతి పెరుగుదలలోనూ అంతే స్థాయిలో ఉంది. తాజాగా పక్షి జాతుల విషయంలోనూ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడి చిట్టడవులు, గుట్టలు, నీటికుంటలు, చెరువులు వంటివి కొన్ని రకాల పక్షులకు అత్యంత ఇష్టంగా ఉన్నట్టు తేలింది. జీబీబీసీ (ద గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్) సర్వేలో ఈ విషయాలు తేలాయి.

145 జాతులు అనంతపురంలోనే..

తాజాగా జీబీబీసీ దేశవ్యాప్తంగా పక్షిజాతుల సమూహాలపై సర్వే చేసింది. 1,084 పక్షి జాతులు ఉన్నట్టు తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, తిరుపతి, మంత్రాలయం, హిందూపురం, శింగనమల వంటి ప్రాంతాల్లో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 245 పక్షి జాతులు ఉన్నట్టు తేల్చగా.. అందులో 145 పక్షిజాతులు అనంతపురంలో ఉన్నాయని తేల్చారు. హిందూపురం ప్రాంతంలో స్వదేశీ పక్షులతో పాటు ఏటా విదేశీ పక్షులు కూడా వచ్చి సంతానం వృద్ధి చేసుకుని వెళుతున్నట్టు గుర్తించారు. పక్షి జాతుల హాట్‌స్పాట్‌గా తిరుపతి సమీపంలోని ఏర్పేడును గుర్తించారు.

వాతావరణ పరిస్థితులే కారణం..

అనంతపురం జిల్లాలో ఎక్కువ పక్షిజాతులు ఉండటానికి కారణం ఇక్కడి వాతావరణ పరిస్థితులేనని జీబీబీసీ చేసిన డాక్యుమెంటులో పొందుపరిచారు. వేసవిలో మూడు మాసాలు మినహా మిగతా రోజుల్లో సమశీతోష్ణస్థితి పరిస్థితులు ఉంటున్నాయి. గడిచిన పదేళ్లుగా నీటి లభ్యత కూడా కావాల్సినంత ఉండటంతో పక్షుల సంతానం ఏటికేటికీ పెరుగుతూ ఉందని గుర్తించారు. హనీ బజార్డ్, వైట్ బెల్లీడ్, సీ ఈగల్, ఎజైల్ ఫాల్కన్, పెరెగ్రైన్ వంటి జాతులు రాష్ట్రంలో బాగా ఉన్నట్టు సర్వేలో తేలింది.

భారీగా పెరుగుతున్న జింకలు.. చిరుతలు

అనంతపురం జిల్లాలో ఇటీవలి కాలంలో బట్టమేక జింకలు, చిరుత పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పెనుకొండ, మడకశిర, కదిరి ప్రాంతాల్లో జింకల సంతతి ఎక్కువైంది. చిరుత పులుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. ఎలుగుబంట్లు, నక్కలు తమ సంతానాన్ని వృద్ధి చేసుకుంటుండగా, తోడేళ్ల సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గినట్టు అటవీ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

ఐదేళ్ల ప్రాయం.. జాతీయ ప్రస్థానం



- ఆర్చరీలో జాతీయ స్థాయి అండర్–10 విభాగంలో ప్రాతినిధ్యం
- ఐదేళ్ల చిన్నారి నిత్యశ్రీ విశేష ప్రతిభ

పిఠాపురం: మాటలు నేర్చుకునే వయసులో ఆటబాటపట్టింది. ఐదేళ్ల ప్రాయంలో విల్లుఎక్కుపెట్టి అలవోకగా లక్ష్యాన్ని ఛేదిస్తోంది. చిన్నారి కాదు చిచ్చర పిడుగు అనిపించుకుంటోంది. ఆర్చరీలో గురి తప్పని బాణంగా పేరు తెచ్చుకుంటోంది కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి సూర్య సాయి నిత్యశ్రీ. విలువిద్యలో ఆ చిన్నారి అద్భుత ప్రదర్శన ఔరా అనిపిస్తోంది. అతి పిన్న వయసులో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికై సత్తా చాటింది.

నాలుగేళ్లకే సాధన .. ఐదేళ్లకే జాతీయస్థాయికి

నిత్యశ్రీ తండ్రి స్వామి గణేశ్. ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి. తల్లి విజయ గృహిణి, చెల్లి సాయి కృతిక. యూకేజీ చదువుతోన్న నిత్యశ్రీ గత ఏడాది వేసవి సెలవుల్లో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో ఆటలను వీక్షించేందుకు తండ్రితో కలిసి వెళ్లింది. విలువిద్యలో సాధన చేస్తున్న వారి చెంతకు వెళ్లి ఆసక్తిగా గమనించింది. సాధన చేస్తున్న వాళ్లంతా ఏకాగ్రతతో బాణం వేయడాన్ని ఆసక్తిగా గమనించింది. తానూ ఓ విల్లుతో లక్ష్యం వైపు గురిపెట్టింది. అది గమనించిన కోచ్ లక్ష్మణరావు ఆ చిట్టి చేతులకు సరిపడా పరిమాణంలో ఉన్న విల్లు, బాణం ఇచ్చి సంధించమని చెప్పారు. ఆ సమయంలో నిత్యశ్రీ బాణం సంధించడంలో ఎక్కడా పొరపాటు లేకుండా లక్ష్యాన్ని ఛేదించడాన్ని ఆశ్చర్యపోయారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. అలా ఐదో ఏటకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అందరినీ అబ్బురపరిచింది. నిత్యశ్రీ ఈ ఏడాది మార్చి 5న పిఠాపురంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని, తొలి ప్రయత్నంలోనే స్వర్ణం సాధించింది. అదేరోజు రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఎంపిక ట్రయల్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

గురి తప్పని బాణం

బాణం వేస్తానని నాతో అన్నప్పుడు సరేఅంటూ విల్లు ఇచ్చాను. మొదటి సారే గురి తప్పకుండా వేసింది. యాదృచ్ఛికమని మరోసారి ప్రయత్నించమన్నా. అలా పలుమార్లు చేయించినా గురి తప్పలేదు. ఆశ్చర్యపోయాను. నిత్యశ్రీ నాన్నతో చెప్పాను. ఆయన అంగీకరించారు. ప్రత్యేక శిక్షణలో ఏడాదికే ఇతరులతో పోటీ పడే స్థాయికి చేరుకుంది. తనకంటే పెద్దవారైనా సరే ఆమెతో పోటీ అంటే భయపడే స్థాయికి ఎదిగింది. ఇంత చిన్న వయసులో జాతీయ స్థాయికి ఎంపికవడం గర్వకారణం.

– పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ అత్యంత కీలకం

సాక్షి, అమరావతి: నేర పరిశోధనలో అత్యంత కీలకమైన ఫోరెన్సిక్ సైన్స్‌ను పోలీసు శాఖకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తెస్తామని అదనపు డీజీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఫోరెన్సిక్ సైన్స్‌పై మరింత అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని విచారణాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సోమవారం నుంచి ఈనెల 10 వరకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫోరెన్సిక్ ఆధారాల నిర్వహణ, సేకరణ, చైన్ ఆఫ్ కస్టడీ మార్గదర్శకాలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన శాస్త్రీయ ప్రమాణాలపై విస్తృత అవగాహన కల్పించేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి చెందిన నిపుణులు డీఎన్ఏ, బయాలజీ, టాక్సికాలజీ, నార్కోటిక్స్, సైబర్ ఫోరెన్సిక్, డాక్యుమెంట్స్, బాలిస్టిక్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐజీ పాల రాజు పాల్గొన్నారు.

వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

9న నిర్ణయం వెలువరిస్తామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: భూ ఆక్రమణ కేసులో గన్నవరం పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు... వంశీ పిటిషన్‌పై ఈ నెల 9వ తేదీన నిర్ణయం వెలువరిస్తామని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పూర్తికావచ్చిన స్మార్ట్‌సిటీ పనులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రూ.5,701 కోట్లతో చేపట్టిన స్మార్ట్ సిటీ పనులు 84 శాతం పూర్తయినట్లు పీబీ డీజీ (రిటైర్డ్) రాజీవ్ జైన్ తెలిపారు. అమరావతి, విశాఖ, కాకినాడ, తిరుపతిలో స్మార్ట్ సిటీ కింద చేపట్టిన ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. విజయవాడలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రం రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. రాష్ట్రంలో 750 ఎలక్ట్రిక్ బస్సులను ఇవ్వడం జరిగిందన్నారు. చిరు వ్యాపారులకు ఆత్మనిర్భర్ నిధి కింద రుణాలు మంజూరులో ఏపీ ముందు వరుసలో ఉందన్నారు. లక్ష్యానికి మించి 3.3 లక్షల మంది చిరువ్యాపారులకు రుణాలను మంజూరయ్యాయన్నారు. అమృత్ పథకం ఇప్పటికే రూ.589 కోట్లు విడుదల చేయగా రూ.6,200 కోట్ల విలువైన మరో 367 ప్రాజెక్టులను ఆమోదించడం జరిగిందన్నారు.

20న తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమ్మె

సాక్షి, అమరావతి: తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలపై ఈనెల 20న ఒకరోజు సమ్మె చేయనున్నట్టు ఏపీ తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అధ్యక్షుడు ఎం.బసవ రాజు సోమవారం తెలిపారు. ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్టు పేర్కొన్నారు. నిర్వహణ సంస్థ అరబిందో యాజమాన్యం సీటీసీ పేరిట యాజమని కట్టాల్సిన పీఎఫ్ వాటాను కూడా ఉద్యోగుల నుంచి కట్టిస్తూ చట్టాన్ని ఉల్లంఘించిందన్నారు. చట్ట ప్రకారం ఉద్యోగులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు అందేలా చూడటం ప్రభుత్వం బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రసూతి సెలవు నిబంధన తొలగింపు

ఎంత మంది పిల్లలకైనా ప్రసూతి సెలవు 180 రోజులు వర్తింపు

సాక్షి, అమరావతి: మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవు నిబంధనను ప్రభుత్వం తొలగించింది. పూర్తి వేతనంతో కూడిన ప్రసూతి సెలవు 180 రోజులను ఇకపై ఎంత మంది పిల్లలకైనా వర్తించేలా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలకు మాత్రమే ఉన్న ఈ నిబంధనను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో జనాభా నిర్వహణలో భాగంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రసూతి సెలవుల వినియోగంపై పరిమితులను ఎత్తివేయడంపై ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

ఆస్తమా అనేది ఓ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య. నిజానికి దీన్ని ఓ ఆరోగ్య సమస్యగా చెప్పడం కంటే ఏదైనా సరిపడని వస్తువు దేహంలోకి వెళ్లినప్పుడు... మన వ్యాధినిరోధక వ్యవస్థ చూపే ప్రతిచర్యగా చూడటం సబబు. ఇలా ఏదైనా సరిపడని వస్తువు శ్వాస వ్యవస్థలోకి వెళ్లినా లేదా ఒక్కోసారి కడుపులోకి వెళ్లినా... మన సొంత వ్యాధినిరోధక వ్యవస్థ దాన్ని పరాయి వస్తువుగానూ (ఫారిన్‌బాడీ), లేదా దేహానికి హాని చేసే అంశంగానూ భావించినప్పుడు శ్వాస నాళాలు సన్నబడిపోతాయి. దాంతో శ్వాస అందని పరిస్థితి ఏర్పడుతుంది. ఊపిరి చాలా బలంగా తీసుకోవాల్సిరావడం, శ్వాసనాళాలు సన్నబారడంతో పిల్లికూతలు వినిపించడం ఇవన్నీ ఆస్థమాలో కనిపిస్తుంటాయి. ఆస్తమా ఉన్నవారిలో ఊపిరితిత్తులకు ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట) వస్తుంది. ఈ ఎటాక్ రావడన్నమది దీర్ఘకాలం బాధించే (క్రానిక్) సమస్యగా ఎపిసోడ్స్‌గా వస్తూ ఇబ్బంది పెడుతుంది. ప్రపంచంలోని ఆస్తమా కేసుల్లో కేవలం 12శాతం మాత్రమే భారత్‌లో ఉన్నప్పటికీ ప్రపంచ ఆస్థమా మరణాల్లో 40%కి పైగా మనదేశంలోనే సంభవిస్తున్నాయి. మనదేశ ప్రజల్లో ఆస్తమా పట్ల అంతగా అవగాహన లేకపోవడం, ఇన్‌హేలర్ల పట్ల అనేక రకాల అపోహలూ... ఇలాంటి అంశాలన్నీ కలసి మన దేశవాసుల్లో ఆస్తమా కేసుల్లో మరణాలను పెంచుతున్నాయి. నేడు (మే 6న) ప్రపంచ ఆస్తమా దినం సందర్భంగా ఈ సమస్యపై అవగాహన కోసం ఇస్తున్న కథనమిది.



శ్వాసకు ఊపిరి పోద్దాం

ఆస్తమాను అర్థం చేసుకోవాలంటే మన ఊపిరితిత్తుల్లోని వాయు నాళాల పనితీరును అవగతం చేసుకోవాలి. మన దేహానికి అవసరమైన ఆక్సిజన్‌ను ఊపిరితిత్తుల్లోకి తీసుకెళ్లి, అక్కడి కాలుష్య కార్బన్ డై ఆక్సైడ్‌ను మళ్లీ బయటకు వదలడానికి అంచెలంచెలుగా అనేక నాళాలు ఉంటాయి. ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట, ఎర్రబారడం) కారణంగా అవి ఉబ్బుతాయి. దాంతో సెన్సిటివ్‌గా మారిపోతాయి. అంటే ఉదాహరణకు చర్మంపై ఏదైనా గాయమైనప్పుడు అది ఎర్రబారి, వాచి, ముట్టుకుందామంటేనే ముట్టనివ్వని విధంగా మారడాన్ని ఇన్‌ఫ్లమేషన్ అని చెప్పవచ్చు. కొంత జాగ్రత్తతో జీవితాంతం ఆస్తమాను అదుపులో ఉంచుకోని, పూర్తిస్థాయి సాధారణ జీవితం, నిండు ఆయుర్దాయం కలిగి ఉండవచ్చు. కానీ పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మన దేశవాసుల్లో ఆస్తమా పట్ల అవగాహన కొంత తక్కువగానే ఉండటంతో... పూర్తిగా అదుపులో ఉంచగలిగే ఈ సమస్య వల్ల కలిగే దుష్ప్రభావాలు మన దేశంలో ఎక్కువే.



డా. విజయ్ కుమార్ చెన్నంచెట్టి,
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనలాజిస్ట్ – స్లీప్ స్పెషలిస్ట్.

ఉదాహరణ కోసం ఓ కేస్ స్టడీ...

హైదరాబాద్‌కు చెందిన 26 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ స్నేహ (ఇది అసలు పేరు కాదు) కేవలం ఐదు నెలల వ్యవధిలో మూడోసారి తీవ్రమైన ఆస్తమా ఎటాక్‌తో ఆమెను ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌కు తీసుకురావల్సి వచ్చింది. ఆమె చెప్పే మాట ఏమిటంటే...

‘డాక్టర్, నేను టాబ్లెట్స్ తీసుకుంటున్నా. కానీ ఇన్‌హేలర్ తీసుకోవాలంటే భయంగా ఉంది. వాటికే అలవాటు పడతానేమో అనే అభిప్రాయంతో తీసుకోవడం లేదు’’ అని చెప్పింది. నిజానికి టాబ్లెట్ తీసుకోవడం వల్ల ఆ మందు రక్తంలో కలిసి దేహమంతా ప్రవహిస్తుంది. అది అప్పటి అవసరం కాబట్టి తీసుకోక తప్పదు. అయితే ప్రివెంటివ్ ఇన్‌హేలర్స్ క్రమం తప్పకుండా వాడటం... అలాగే మొదటి చికిత్సగా (ఫస్ట్ లైన్ ట్రీట్‌మెంట్‌గా) తీసుకోవాల్సిన ఇన్‌హేలర్స్ వాడితే అసలు ఎటాక్ రాకుండానే నివారించడానికి చాలావరకు ఆస్కారం ఉంటుంది. నిజానికి చాలా తక్కువ మోతాదులో (ఒక మాటలో చెప్పాలంటే టాబ్లెట్‌లో ఉండే దానికంటే 400వ వంతు తక్కువ మోతాదులో) మందు వెళ్లి... ఆస్తమా దుష్ప్రభావం చూపుతున్న నిర్దిష్ట ప్రదేశంలోనే ఇన్‌హేలర్స్‌లోని మందులు ప్రభావం చూపుతాయి. ఇవి ఎప్పటికీ అలవాటు కావు. అందువల్ల ఈ ఏడాది ఆస్తమా డే నినాదం ఏమిటంటే... ‘‘ఆస్తమా మీ జీవనానికి అడ్డంకి కాకూడదు. అంతేకాదు... ఇన్‌హేలర్స్ అందరికీ అందుబాటులో ఉంచుదాం... హాయిగా శ్వాస తీసుకుందాం... అన్నవి ఈ ఏడాది ఆస్తమా డే తాలూకు స్ఫూర్తి మాటలు.

ఆస్తమా ఎటాక్‌లో ఏం జరుగుతుందంటే...

ఆస్తమా ఎటాక్ వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లోని నాళాల కండరాలు ఉబ్బడం వల్ల వాటి మధ్యభాగంలోని స్థలం సన్నబడిపోయి, శ్వాస మార్గాలు మూసుకుపోయినట్లుగా అవుతాయి. ఫలితంగా ఆ నాళాల్లో గాలి ఫ్రీగా కదిలేందుకు సరిపడనంత స్థలం లేకపోవడంతో శ్వాస సరిగా అందదు. దాంతో మనకు ఆస్తమా అటాక్ వస్తుందన్నమాట. ఏవైనా మనకు సరిపడని వాటిని తిన్నా, పీల్చుకున్నా మన వాయు నాళాలు తీవ్రంగా ప్రతిస్పందించడం వల్ల ఇలా జరుగుతుంది. ఒక్కోసారి చలి సీజన్‌లోనూ ఆ వాతావరణంలో గాలిలో ఉండే మంచు సరిపడని కారణంగా వాయు నాళాలు ఉబ్బుతాయి. దాంతో పాటు వాయు నాళాల్లో కాస్త జిగురుగా ఉండే మ్యూకస్ అనే పదార్థం స్రవిస్తుంది. అసలే నాళాలు సన్నబడి ఉండటంతో పాటు... ఈ మ్యూకస్ కూడా అడ్డుపడటం వల్ల వాయువులు కదిలే ప్రాంతం మరింత మూసుకుపోతుంది. ఫలితంగా గాలి పీల్చడమూ, వదలడమూ... అంటే మొత్తంగా శ్వాస తీసుకోవడమే చాలా కష్టమవుతుంది.



కారణాలు...

జన్యుపరమైన అంశాలు ఆస్తమాకు ప్రధాన కారణమని చాలా అధ్యయనాల్లో తేలింది. దాంతో పాటు సరిపడని వాతావరణం లేదా ఆహారపదార్థాలతో పాటు కొన్నిసార్లు గాలిలో ఉండే పుప్పొడి వంటివి దీన్ని ట్రిగ్గర్ చేస్తాయి. శ్వాసించే సమయంలో ఏదైనా దేహానికి సరిపడని పదార్థాలు (వీటిని అలర్జెన్స్ అంటారు) మన ఊపిరితిత్తుల మార్గంలోకి ప్రవేశించి అవి అలర్జిక్ రియాక్షన్స్ కలిగిస్తాయి. ఇలా అలర్జిక్ రియాక్షన్ రావడానికి కారణమయ్యే అంశాల్లో ఇవి కొన్ని...

- గదుల్లోపల (ఇన్–డోర్స్‌లో) ఉండే అలర్జెన్స్ (ఉదాహరణకు పక్కబట్టల్లో, కార్పెట్స్‌లో, ఇరుగ్గా ఉండే ఫర్నిచర్‌లో ఉండే డస్ట్‌మైట్స్.
- కాలుష్యంలో చాలా ఎక్కువ సంఖ్యలో ఉండే దుమ్మూధూళి కణాలు.
- కొన్నిసార్లు పెంపుడు జంతువులనుంచి రాలిన వెంట్రుకలు.
- ఆరుబయట ఉండే అలర్జెన్స్: (ఉదాహరణకు పుప్పొడి, బూజు వంటి పదార్థాలు).
- పొగాకు కాలినప్పుడు / మండినప్పుడు వచ్చే ఘాటైన పొగ
- ఘాటైన రసాయనాలు, స్ప్రేలు.. వాటి తాలూకు ఘాటైన వాసనలు కొందరిలో ఆస్తమాకు కారణం కావచ్చు.
- వాయు కాలుష్యం (కాలుష్యంలో ఉండే అత్యంత సూక్ష్మమైన కాలుష్య కణాలు) ఇవేగాక ఇంకా చాలా అంశాలు ఆస్తమాను ప్రేరేపిస్తాయి. అవి... చలిగాలి, చాలా తీవ్రంగా చేసే వ్యాయామాలు. కొన్నిసార్లు మనకు సరిపడని మందుల వల్ల కూడా ఆస్తమా రావచ్చు.
- ఇటీవల విపరీతంగా పెరుగుతున్న పట్టణీకరణ (అర్బనైజేషన్) వల్ల పెచ్చరిల్లుతున్న అనేక అంశాలు ఆస్తమాను కలిగిస్తున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది.

పిల్లల్లో ఆస్తమాను గుర్తించడమిలా...

పిల్లల్లో పైన పేర్కొన్న లక్షణాల్లో ఏదో ఒకటి గాని లేదా కొన్ని లక్షణాలు కలగలిసి గాని కనిపించవచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు దాన్ని జలుబు లేదా బ్రాంకైటిస్‌గా భావించేందుకు అవకాశముంది. అయితే అవే లక్షణాలు పదే పదే కనిపిస్తుంటే అప్పుడు అది ఆస్తమా కావచ్చని అనుమానించాలి. ఆ పిల్లలకు ఆస్తమాను ప్రేరేపించే అంశానికి (ట్రిగరింగ్ ఫ్యాక్టర్‌కు) గురైన వెంటనే ఆస్తమా లక్షణాలు మొదలైపోయి తీవ్రంగా ఇబ్బందిపడుతుంటారు. పొగ, ఘాటైన వాసనలు, పుప్పొడి, పెంపుడు జంతువుల వెంట్రుకలు, డస్ట్‌మైట్స్... ఇవి సోకీ సోకగానే ఆస్తమాను తక్షణం ప్రేరేపిస్తాయి. పిల్లలను జాగ్రత్తగా, నిశితంగా పరిశీలించినప్పుడు పిల్లలు వేగంగా శ్వాస తీసుకోవడం, వాళ్లకు సరిగా శ్వాస అందకపోవడం, రొమ్ము తీవ్రంగా ఎగసిపడుతున్నట్లుగా మొదలుకాగానే... తల్లిదండ్రులు దాన్ని ఆస్తమాగా అనుమానించి తక్షణం డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లా.

పిల్లల్లో ఆస్తమా...

చిన్న పిల్లల్లో సాధారణంగా ఐదేళ్ల వయసు తర్వాత ఆస్తమా లక్షణాలు కనిపిస్తుంటాయి. అయితే అంతకంటే తక్కువ వయసున్న చిన్నారుల్లో ఆస్తమా వస్తుంటుంది. అయితే దీన్ని గుర్తించడం తల్లిదండ్రులకు కష్టమవుతుంది. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లినప్పుడు ఎగిసిపడుతున్న రొమ్మును పరిశీలించడం ద్వారా డాక్టర్లు ఆస్తమాను గుర్తిస్తారు. చిన్నపిల్లల్లో ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే బ్రాంకియల్ ట్యూబులు మొదటే చాలా సన్నగా, చిన్నగా ఉంటాయి. ఇక జలుబు, పడిశం వంటి వాటి కారణంగా ఆ మార్గాలు మామూలుగానే ఇన్‌ఫ్లమేషన్‌కు గురవుతుంటాయి. దాంతో అవి మరింత సన్నగా మారతాయి. అందువల్ల అవి ఆస్తమా వల్ల సన్నబడ్డాయా లేక పడిశం, జలుబు లక్షణాలా అన్నది గుర్తించడం కొంత కష్టమవుతుంది.

ఆస్తమా లక్షణాలు...

- దగ్గు, ఆయాసం... ప్రధానంగా రాత్రి వేళల్లో ఎక్కువగా ఉంటుంది. శరీరానికి శ్రమ కలిగే వ్యాయామం చేడం లేదా గట్టిగా నవ్వడం, ఏడ్వటం, పరుగెత్తడం వంటివి చేస్తే ఈ దగ్గు, ఆయాసాలు మరింతగా పెరుగుతాయి.
- ఛాతీ బిగుతుగా పట్టేసినట్లుగా ఉండటం.
- శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బంది.
- హాయిగా ఊపిరి తీసుకోలేకపోవడం... సాఫీగా శ్వాస సాగకపోవడం.
- పిల్లికూతలు (శ్వాస తీసుకునే సమయంలో... అందునా మరీ ముఖ్యంగా గాలి వదిలే సమయంలో సన్నటి పిల్లికూతలు వినిపిస్తుంటాయి).
- కొందరిలో ఆస్తమా వచ్చినప్పుడు ఒళ్లు (చర్మం) కూడా ఎర్రబారి పొడిగా మారుతుంది. మరికొందరిలో ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, గురక వంటి లక్షణాలు కనిపించవచ్చు.

నిర్ధారణ...


పెద్దవాళ్లతో పోలిస్తే పిల్లల్లో ఆస్తమా నిర్ధారణ కాస్త కష్టమైన ప్రక్రియ. లక్షణాలతో పాటు... అవి ఎంత వ్యవధిలో మళ్లీ మళ్లీ వస్తున్నాయనే అంశం ఆధారంగా అది ఆస్తమా కావచ్చేమోనని తొలుత అనుమానిస్తారు. దాంతో నిర్ధారణ కోసం కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. సాధారణంగా చిన్నప్పుడు వచ్చే మరికొన్ని సమస్యల లక్షణాలూ ఆస్తమా లక్షణాలతో కలసి కనిపిస్తుండవచ్చు. దాంతో ఆ లక్షణాలు కేవలం ఆస్తమా వల్లనే కనిపిస్తున్నాయా లేక ఇతర మరికొన్ని ఆరోగ్య సమస్యల వల్లనా అని నిర్ధారణ చేయడం కష్టమవుతుంది. ఉదాహరణకు ఆస్తమా లాంటి లక్షణాలే కనబరిచే మరికొన్ని కండిషన్లు.... ● రైనైటిస్ ● సైనసైటిస్ ● ఆసిడ్ రిఫ్లక్స్ లేదా గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్‌డీ) ● వాయునాళాలలో ఏమైనా తేడాలు (ఎయిర్ వే అబ్‌నార్మాలిటీస్) ● స్వరపేటిక సరిగా పనిచేయకపోవడం (వోకల్ కార్డ్ డిస్‌ఫంక్షన్) ● బ్రాంకైటిస్ వంటి శ్వాస మార్గంలో వచ్చే ఇన్ఫెక్షన్లు ● రెస్పిరేటరీ సింటాక్టికల్ వైరస్ (ఆర్ఎస్‌వి) వంటివి కొన్నిసార్లు ఆస్తమా లక్షణాలనే కనబరుస్తుంటాయి.

ఆస్తమా నిర్ధారణ ఇంత సంక్లిష్టం ఉండటం వల్ల కొన్నిసార్లు డాక్టర్లు కొన్ని ఇతర వైద్య పరీక్షలూ చేయించాల్సి రావచ్చు. అవి...

- ఐదేళ్ల లేదా అంతకంటే పైబడిన వయసు పిల్లల విషయానికి వస్తే పెద్దవాళ్లలోనూ నిర్ధారణ చేసేందుకు నిర్వహించే లంగ్ ఫంక్షన్ పరీక్షలు (స్పైరోమెట్రీ) వంటివి. ఇందులో పిల్లలు ఎంత సమర్థంగా గాలిని బయటకు వదలగలరో చూస్తారు. సాధారణ స్థితితో ఈ పరీక్ష చేయడంతో పాటు, కొద్దిపాటి వ్యాయామం తర్వాత, అటుపైన కొంత ఆస్తమా మందు ఇచ్చాకా... ఆ పరీక్షల్లో కనిపించే తేడాలను సునిశితంగా గమనించాకే డాక్టర్లు దాన్ని ఆస్తమా అని నిర్ధారణ చేస్తారు.
- ఇక ఐదేళ్ల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల్లో లంగ్ ఫంక్షన్ పరీక్షతో ఆస్తమా కాస్త కష్టమవుతుటుంది. పేషెంట్ చెప్పేవీ, తల్లిదండ్రులు గమనించినవీ... ఇలా అనేక లక్షణాలతో పాటు ఈ పరీక్షల సహాయంతో డాక్టర్లు ఆస్తమాను నిర్ధారణ చేస్తారు.

చికిత్స...

సాధారణంగా చిన్నపిల్లల్లో ఆస్తమా వస్తే చాలామందిలో వారు పెరుగుతున్న కొద్దీ... అంటే టీన్స్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడుగానీ లేదా యుక్తవయస్కులుగా మారుతున్నప్పుడుగానీ ఆ ఆస్తమా లక్షణాలు క్రమంగా తగ్గిపోవచ్చు. అయితే కొంతమందిలో కొన్నాళ్లు కనిపించకుండా పోయిన ఆ లక్షణాలు కొంత కాలం తర్వాత మళ్లీ వ్యక్తం కావచ్చు. ఇక చిన్నప్పుడు మరీ తీవ్రమైన ఆస్తమా ఉన్న పిల్లల్లో అది పెద్దయ్యాక కూడా తగ్గకపోవచ్చు.



ఆస్తమాకు రెండు రకాల చికిత్స అవసరమవుతుంది. అది...

- దీర్ఘకాలంలో మళ్లీ రాకుండా నివారించేందుకు అవసరమైన ప్రివెంటివ్ చికిత్స. వాయునాళాల ఇన్‌ఫ్లమేషన్ నివారణకు ఈ మందులను వాడాలి. దాదాపు వీటిని ప్రతిరోజూ తీసుకోవాల్సి ఉంటుంది.
- **తక్షణ ఉపశమనం కోసం తీసుకోవాల్సిన చికిత్స:** ఆస్తమా వచ్చినప్పుడు వాయునాళాల వాపు తగ్గించి, హాయిగా శ్వాస తీసుకోవడానికి దోహదపడేందుకు ఉపయోగించే మందులు వాడాల్సి ఉంటుంది. వీటినే రెస్క్యూ మెడికేషన్ అనీ, క్విక్ రిలీఫ్ మెడికేషన్ అని కూడా అంటారు. ఇది ఆస్తమా అటాక్ ఉన్నప్పుడు చేసే స్వల్పకాలిక చికిత్స. కొందరు పిల్లల్లో ఆటలు లేదా వ్యాయామానికి ముందు కూడా ఈ చికిత్సను డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు.
- మూడేళ్ల లోపు పిల్లలకు ఇన్‌హేలర్స్‌తో చికిత్స చేయాల్సి వచ్చినప్పుడు ఆ మందు పిల్లల ఊపిరితిత్తుల్లోకి సమర్థంగా వెళ్లడానికి స్పేసర్ డివైజ్ విత్ మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇందువల్ల ఉపయోగించే మందు వృథా కాకుండా ఉంటుంది. ఇక ఐదు సంవత్సరాలు దాటిన పిల్లల్లో స్పేసర్‌తో ఇన్‌హేలర్ ఉపయోగించాలి.



ఆస్తమాలో సరికొత్త మందులు బయాలాజిక్స్...

బయాలజిక్స్ అనే ఔషధాలు తీవ్రమైన ఆస్తమాకు ఒక వినూత్న ఆశారేఖ అని చెప్పుకోవచ్చు. ఒమలిజుమాబ్, మెపోలిజుమాబ్, బెన్‌రలిజుమాబ్ లాంటి బయాలాజిక్స్ తీవ్రమైన ఆస్థమా రోగులకు ఉపశమనం కలిగించేవిగా పరిశోధనల్లో వెల్లడైంది. వీటిని ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. వీటివల్ల ఆస్తమా తీవ్రత బాగా తగ్గిపోతుంది. ఇవి కొన్ని నిర్ణీత ‘ఇమ్యూన్ పాత్‌వే’లను లక్ష్యంగా చేసుకుని పనిచేయడం ద్వారా ఆస్తమా తీవ్రతనూ, దాని ఉద్ధృతినీ తగ్గిస్తాయి. అలా అవి ఇమ్యూన్ పాత్–వే లను అడ్డగించడం (బ్లాక్ చేయడం) ద్వారా ఒక్కసారిగా పెచ్చరిల్లే (ఫ్లేరప్స్)ను తగ్గిస్తాయి. అంతేకాదు... ఈ సరికొత్త మందులు... పదే పదే హాస్పిటల్‌కు రావాల్సిన అవస్థను తగ్గించడంతో పాటు జీవన నాణ్యతను పెంచుతాయి. కాస్త ఖరీదైనవే అయినప్పటికీ ఆస్తమాతో కలిగే అవస్థలూ, ఇబ్బందులతో పోలిస్తే వీటిని తీసుకోవడం ఎంతో మేలు.

కేవలం కొన్నాళ్లు మందులు వాడటం లేదా చికిత్స తీసుకోవడంతో మాత్రమే ఆస్తమా తగ్గిపోతుంది. దీన్ని అనుక్షణం నియంత్రణలో ఉంచడం అవసరం. అలాగే ఆస్తమాను ప్రేరేపించే అంశాలకు రోగిని దూరంగా ఉంచడం, తమకు ఆస్తమాను ప్రేరేపించే అంశాలేమిటో క్రమంగా గుర్తించి, వాటినుంచి ఎల్లప్పుడూ దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ ఉండటం చేస్తుండాలి. గతంతో పోలిస్తే ఇప్పుడు ఆస్తమా నివారణ, నియంత్రణ చాలా సులభమే. అందుకే ఆందోళనకు గురికాకుండా తమ డాక్టర్‌తో నిత్యం ఫాలోఅప్‌లో ఉండాలి.

అలర్జిక్ ఆస్తమా కోసం... మరికొన్ని అలర్జీ పరీక్షలు...

- కొన్ని ట్రిగరింగ్ అంశాల కారణంగా పిల్లల్లో ఆస్తమా కనిపిస్తుంటే... అలాంటి పిల్లల్లో డాక్టర్లు అలర్జీ స్కిన్ టెస్ట్ చేయిస్తారు. ఇందులో ఏదైనా అలర్జీ కలిగించే పదార్థాన్ని (అంటే జంతువుల వెంట్రుకలో లేదా బూజునో) ఉపయోగించి చర్మంలోని కొంత భాగాన్ని సేకరిస్తారు. ఇలా చేయడం ద్వారా చర్మంపై ఏదైనా అలర్జిక్ రియాక్షన్ జరుగుతుందేమోనని గమనిస్తారు. కొన్నిసార్లు చర్మంపై లక్షణాలు కనిపిస్తూ ఉండేవారికి, యాంటీ హిస్టమైన్ మందులు తీసుకునే వారికి అలర్జీ బ్లడ్ టెస్ట్‌ల వల్ల ఉపయోగం ఉంటుంది.
- కొంతమందిలో వాళ్లు తీసుకున్న ఆహారం కారణంగా అలర్జీతో ఆస్తమా ప్రేరేపితమై ఉండవచ్చు. అలాంటప్పుడు ఏయే రోగులకు ఏయే ఆహారం వల్ల అలర్జీ కలుగుతుందని తెలుసుకోవడం కష్టమైన పని. అది వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంది. అందుకే పెద్దవారైతే తమకు తాము... పిల్లల విషయంలోనైతే తల్లిదండ్రులు... ఏయే పదార్థాలు తిన్న తర్వాత లక్షణాలు కనిపిస్తున్నాయో జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి. ఫలానా పదార్థాలతోనే ఆస్తమా లక్షణాలు కనిపిస్తున్నాయని ఒకటి రెండుసార్లు పరిశీలనల తర్వాత తెలిసిపోతుంది. అప్పుడు తమకు సరిపడనివీ, తమలో ఆస్తమాను ప్రేరేపించే సదరు ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. కొన్నిసార్లు డాక్టర్లు మరింత సూక్ష్మస్థాయి పరీక్షలూ చేయించాల్సి రావచ్చు.



ఇన్హేలర్ వాడే సమయంలో తప్పక చేయవలసినవి...

- ఇన్‌హేలర్ వాడే సమయంలో ఊపిరితిత్తుల్లో మందు పూర్తిగానూ... అంతటా సమంగానూ విస్తరించడానికి స్పేసర్‌ను ఉపయోగించడం.
- స్టెరాయిడ్ ఇన్‌హేలర్ వాడిన తర్వాత నోటిని శుభ్రంగా కడుక్కోవడం.
- తక్షణ ఎటాక్‌ను నివారించేందుకు ఫస్ట్‌లైన్ ట్రీట్‌మెంట్ కోసం వాడే రిలీవర్ ఇన్‌హేలర్‌ను ఎప్పుడూ దగ్గర ఉంచుకోవడం.
- ఇన్‌హేలర్ వాడే సరైన టెక్నిక్‌ను డాక్టర్ దగ్గర నేర్చుకోవడం. ఎప్పుడూ దాన్ని అనుసరించడం.
- అదుపులో ఉంచేందుకు వాడే ఇన్‌హేలర్‌ను ఇంట్లో ఉంచుకుని క్రమం తప్పకుండా వాడటం.

ఇన్‌హేలర్ వాడకంలో చేయకూడని పనులు...

- లక్షణాలు తగ్గిన తర్వాత ఇక ఇన్‌హేలర్ వాడకానికి దూరంగా ఉండటం.
- మీ ఇన్‌హేలర్‌ను ఇతరులతో షేర్ చేసుకోవడం....
- డాక్టర్ చెప్పిన మోతాదుకు మించి రిలీవర్ ఇన్‌హేలర్‌ను ఎక్కువగా వాడటం.
- ఒకవేళ రాత్రుళ్లు దగ్గు, ఆయాసం లాంటి ఆస్తమా హెచ్చరికలను పట్టించుకోకపోవడం... ఇవన్నీ చేయకూడని పనులు.

బిజినెస్ రీల్

వడ్డీ చెల్లింపులో ఎంటీఎన్ఎల్ డిఫాల్ట్



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న ప్రభుత్వ రంగ టెలికం సంస్థ ఎంటీఎన్ఎల్ రూ. 6,100 కోట్ల బాండ్లపై వడ్డీ చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. ప్రభుత్వ గ్యారంటీ ఉన్న ఈ బాండ్లను ఎంటీఎన్ఎల్ 2022 నవంబర్లో జారీ చేసింది. ఎంటీఎన్ఎల్, టెలికం శాఖ, బీకన్ ట్రస్టీషిప్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం గడువు తేదీకి 10 రోజులు ముందుగా సెమీ–యాన్యువల్ ప్రాతిపదికన కంపెనీ వడ్డీని ఎస్క్రో ఖాతాలో జమ చేయాలి. అయితే, తమ వద్ద చాలినన్ని నిధులు లేనందున ఎస్క్రో అకౌంటులో జమ చేయలేకపోయినట్లు సంస్థ తెలిపింది.

షెల్-రిలయన్స్-ఓఎన్జీసీ జేవీ ప్రాజెక్ట్ డీకమిషనింగ్ పూర్తి



న్యూఢిల్లీ: అరేబియా సముద్రంలో తపతి గ్యాస్ ఆఫ్షోర్ ప్రాజెక్టు డీకమిషనింగ్ విజయవంతంగా పూర్తయ్యింది. ఇంధనాల వెలికితీత కోసం ఏర్పాటు చేసిన పైప్లైన్లు, ప్లాట్ఫామ్లు మొదలైన వాటిని సురక్షితంగా తొలగించినట్లు షెల్–రిలయన్స్ ఇండస్ట్రీస్–ఓఎన్జీసీ జాయింట్ వెంచర్ తెలిపింది. ఆయిల్, గ్యాస్ క్షేత్రాల్లో నిక్షేపాల వెలికితీతను నిలిపివేసిన తర్వాత, అక్కడ ఉపయోగించిన వాటిని తొలగించే ప్రక్రియను డీకమిషనింగ్గా వ్యవహరిస్తారు. 2016లో తపతి క్షేత్రంలో ఉత్పత్తి నిల్చిపోగా, 2017లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

లైట్హౌస్ ఫండ్స్తో కల్కి ఫ్యాషన్ జట్టు



ముంబై: దుస్తుల బ్రాండ్ కల్కి ఫ్యాషన్ తాజాగా లైట్హౌస్ ఫండ్స్తో వ్యూహాత్మక పెట్టుబడుల ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా లభించే నిధులతో రిటైల్ కార్యకలాపాలను దేశ, విదేశాల్లో మరింతగా విస్తరించనుంది. అలాగే తమ డిజిటల్ మౌలిక సదుపాయాలను పటిష్టపర్చుకోనుంది. కల్కి ఫ్యాషన్కు కీలక మెట్రోపాలిటన్ మార్కెట్లలో ఎనిమిది ఫ్లాగ్షిప్ స్టోర్స్ ఉన్నాయి. డిజిటల్ ఆదాయాల్లో సింహభాగం ఉత్తర అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యం, ఆసియా–పసిఫిక్ మార్కెట్ల నుంచి ఉంటోంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-5-2025

విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	475–00
వరంగల్	477–00
రిటైల్ ధర	5.35

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,465.00	7.44
ADANIPORTS	1,346.50	6.27
TRENT	5,380.00	4.51
SHRIRAMFIN	629.8	4.24
BAJAJFINSV	2,029.00	3.63

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	2,085.00	-4.59
JSWSTEEL	955.2	-1.85
ONGC	239.88	-1.45
SBIN	790.6	-1.18
TITAN	3,315.00	-0.78

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,770
ఎన్ఎస్ఈ	89,885
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,51,322
ఎఫ్ఐఐ	+ 498
డీఐఐ	+ 2,789

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	57.13	$ 58.29
బ్రెంట్	60.24	$ 61.29

అనిశ్చితులున్నా బలమైన వృద్ధి

- ద్రవ్యోల్బణం దిగిరావడం, అధిక దేశీ వినియోగం కూడా...
- ప్రైవేటు రంగం పెట్టుబడులు కీలకం
- కేంద్ర ఆర్థిక శాఖ తాజా నివేదికలో వెల్లడి

సంస్కరణలు, మౌలిక సదుపాయాల దన్ను..



న్యూఢిల్లీ: సరైన వ్యూహాలు, క్రమబద్ధమైన సంస్కరణలకుతోడు మౌలిక సదుపాయాలు, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత్ బలమైన వృద్ధి సాధించడానికి దోహదం చేస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ మార్చి ఎడిషన్ నివేదిక పేర్కొంది. స్థూల ఆర్థిక స్థిరత్వం, ద్రవ్యలోటు తగ్గుతుండడం, ద్రవ్యోల్బణం ఉపశమించడం, ఉపాధి అవకాశాల విస్తృతి, అధిక వినియోగ వ్యయాలు ఇవన్నీ దీర్ఘకాల వృద్ధికి మేలు చేస్తాయని తెలిపింది. ఈ అనుకూలతలు కొనసాగాలంటే ప్రైవేటు రంగం నుంచి మూలధన వ్యయాలు కీలకమని అభిప్రాయపడింది. విధానాలు, నియంత్రణ చర్యలతో ఈ అంతరాన్ని పూడ్చొచ్చని తెలిపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారత్కు సవాళ్లు విసురుతున్నప్పటికీ.. అంతర్జాతీయ వాణిజ్యం, తయారీలో భారత్ స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్టు పేర్కొంది. కొన్ని వస్తు, సేవల్లో భారత్కు ప్రత్యేక అనుకూలతలున్నట్టు గుర్తు చేసింది. వ్యూహాత్మకమైన వాణిజ్య చర్చలు, దేశీ సంస్కరణలు, తయారీపై పెట్టుబడులతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను అధిగమించొచ్చని వివరించింది. ''అంతర్జాతీయ పరిణామాల కారణంగా ఏర్పడుతున్న అనిశ్చితులు 2025–26లో వృద్ధి అంచనాలకు కీలక రిస్క్గా కనిపిస్తున్నాయి. కేవలం వాణిజ్యమే కాదు, దీర్ఘకాలం పాటు అనిశ్చితి ప్రైవేటు రంగ మూలధన ప్రణాళికలు నిలిచిపోయేందుకు దారితీయవచ్చు. ప్రైవేటు రంగం, విధాన నిర్ణేతలు ఈ రిస్క్ను దృష్టిలో పెట్టుకుని అనిశ్చితులను తొలగించుకునేందుకు వెంటనే కృషి చేయాల్సి ఉంది''అని ఆర్థిక శాఖ నివేదిక తెలిపింది.

అవకాశాన్ని విడుచుకోరాదు..

పెట్టుబడులు-వృద్ధి-డిమాండ్ పెరుగుదల-అదనపు సామర్థ్యం ఏర్పాటు అనే పరస్పర ప్రయోజన సైకిల్కు మూలధన వ్యయాలు దారితీస్తాయని ఆర్థిక శాఖ పేర్కొంది. ''సాధారణ సమయాలతో పోల్చి చూస్తే ప్రస్తుతం కార్యాచరణ, నిర్వహణ ఎంతో ప్రభావం చూపిస్తాయి. ఇదొక అవకాశం. దీన్ని కోల్పోరాదు''అని తెలిపింది. పెట్టుబడుల కార్యకలాపాలు ఊపందుకున్నాయని.. ఇవి ఇంకా బలపడనున్నట్టు అంచనా వేసింది. ప్రైవేటు రంగ పెట్టుబడులకు నిధులు సమకూర్చేందుకు వీలుగా దేశీ పొదుపులు మెరుగుపడినట్టు పేర్కొంది. ఇక్కడి నుంచి జీడీపీలో ప్రభుత్వ రుణ భారాన్ని క్రమంగా తగ్గించుకోవడం ద్వారా ప్రైవేటు పెట్టుబడులకు అదనపు నిధులు లభించేలా చూడొచ్చని.. రాష్ట్రాలు సైతం తమ రుణ భారాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని సూచించింది.

వ్యవసాయ వృద్ధి ఆశావహం

వ్యవసాయరంగంలో వృద్ధి అవకాశాలు ఆశావహంగా ఉన్నట్టు ఆర్థిక శాఖ నివేదిక వెల్లడించింది. రిజర్వాయర్లలో తగిన నీటి నిల్వలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాగు దిగుబడి బలంగా ఉంటుందని తెలిపింది. ఇది గ్రామీణ వినియోగాన్ని పెంచుతుందని.. పట్టణ డిమాండ్ స్థిరంగా మెరుగుపడుతున్నట్టు వివరించింది. తయారీ కార్యకలాపాలు కోలుకుంటున్నట్టు.. సేవల రంగం కార్యకలాపాలు సైతం బలంగా ఉన్నట్టు తెలిపింది. రానున్న సంవత్సరంలో ఉపాధి అవకాశాల పట్ల పలు సర్వేలు వెల్లడించిన సానుకూల అంచనాలను గుర్తు చేసింది.

అంతర్జాతీయ అనిశ్చితులతో ఎగుమతులు సవాళ్లు ఎదురుకావొచ్చని ఈ నివేదిక అంచనా వేసింది. సేవల ఎగుమతులు బలంగానే ఉంటాయని పేర్కొంది. అంతర్జాతీయ వాణిజ్యంలో రిస్క్లను జాగ్రత్తగా గమనిస్తూ..

వస్తు ఎగుమతులకు సవాళ్లు..

కొత్త మార్కెట్లలోకి అవాకాశాలను వైవిధ్యం చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. భిన్నమైన ఉత్పత్తులు, నాణ్యతపై పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఇదంటూ ప్రైవేటు రంగానికి సూచించింది.

మరో 1.25 శాతం కోత

- 2025–26లో ఆర్బీఐ రేట్లు తగ్గొచ్చు..
- ఎస్బీఐ అధ్యయనం అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ మొత్తం మీద 125 బేసిస్ పాయింట్ల మేర (1.25–1.5 శాతం) రేట్లను తగ్గించొచ్చని ఎస్బీఐ అధ్యయన నివేదిక అంచనా వేసింది. దీంతో మొత్తం మీద రేట్ల తగ్గింపు 150 బేసిస్ పాయింట్లుగా ఉంటుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ అంచనాలకు వచ్చింది. 0.25 శాతం స్థానంలో 0.50 శాతం చొప్పున జంబో రేటు తగ్గింపు చేపడితే అది మరింత ప్రభావవంతంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో 3.34 శాతానికి పరిమితం కావడం తెలిసిందే. ఇది 67 నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆహార ద్రవ్యోల్బణం శాంతించడంతో 2025–26 సంవత్సరంలో సగటు సీపీఐ ద్రవ్యోల్బణం 4 శాతం లోపు ఉంటుందని ఈ నివేదిక తెలిపింది. మరీ ముఖ్యంగా ప్రస్తుత త్రైమాసికంలో ఇది 3 శాతంలోపునకు దిగివస్తుందని పేర్కొంది. నామినల్ జీడీపీ (ద్రవ్యోల్బణం మినహాయించని) 9–9.5 శాతం స్థాయిలో 2025–26 సంవత్సరానికి ఉంటుందని (బడ్జెట్ అంచనా 10 శాతం) అంచనా వేసింది. తక్కువ వృద్ధి రేటు, కనిష్ట ద్రవ్యోల్బణం నేపథ్యంలో రేట్ల తగ్గింపునకు అనుకూల తరుణంగా వివరించింది. ఎస్బీఐ ఆర్థిక పరిశోధన విభాగం ఈ నివేదికను రూపొందించింది.

ఆగస్ట్ నాటికి 0.75 శాతం..

''మార్చిలో కనిష్ట స్థాయికి ద్రవ్యోల్బణం దిగిరావడం.. రానున్న కాలంలోనూ పరిమిత స్థాయిలోనే ఉంటుందన్న అంచనాలతో వచ్చే జూన్, ఆగస్ట్ పాలసీ సమీక్షల్లో ఆర్బీఐ 75 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చు. తిరిగి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో మరో 50 బేసిస్ పాయింట్ల రేట్లను చేపట్టొచ్చు. దీంతో మొత్తం మీద 125 బేసిస్ పాయింట్ల తగ్గింపునకు అవకాశం ఉంది. ఇప్పటికే ఫిబ్రవరి సమీక్షలో 25 బేసిస్ పాయింట్లను తగ్గించడం జరిగింది''అని ఈ నివేదిక వెల్లడించింది. కాకపోతే ఒకేసారి 25 బేసిస్ పాయింట్లకు బదులు 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపును చేపట్టడం వల్ల ఎక్కువ ఫలితం ఉంటుందని భావిస్తున్నట్టు వివరించింది. ద్రవ్యోల్బణం ఆర్బీఐ నియంత్రిత స్థాయి అయిన 2–6 శాతం పరిధిలోనే ఉండడాన్ని గుర్తు చేసింది. ఆర్బీఐ ఇప్పటికే రెండు విడతల్లో 50 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా, రెపో అనుసంధానిత రుణాలపై ఈ మేరకు ప్రయోజనాన్ని బ్యాంకులు బదిలీ చేసినట్టు తెలిపింది. ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలపై రేటు తగ్గింపు ఇంకా ప్రతిఫలించాల్సి ఉందని పేర్కొంది.

భారత్లో యాపిల్ విక్రయాలు 25% అప్

స్మార్ట్ఫోన్ మార్కెట్లో అగ్రస్థానంలో వివో

- మార్చి త్రైమాసికంపై సైబర్మీడియా రీసెర్చ్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా మార్చి త్రైమాసికంలో టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 25 శాతం పెరిగాయి. దీంతో కంపెనీ 8 శాతం మార్కెట్ వాటా దక్కించుకుంది. ప్రీమియం స్మార్ట్ఫోన్లకు డిమాండ్ పెరుగుతుండటం, రిటైల్ స్టోర్స్ను కంపెనీ విస్తరించడం, ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు ఇందుకు గణనీయంగా దోహదపడ్డాయి. దీంతో సూపర్ప్రీమియం సెగ్మెంట్లో (రూ. 50,000–రూ. 1 లక్ష వరకు ధర ఉండే ఫోన్లు) యాపిల్ వాటా 28 శాతానికి, ఉబర్–ప్రీమియం విభాగంలో (రూ. 1 లక్ష పైగా రేటు ఉండే ఫోన్లు) 15 శాతానికి చేరింది. జనవరి–మార్చ్ త్రైమాసికంలో భారత్లో స్మార్ట్ఫోన్ల సరఫరాపై సైబర్మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) ఇండియా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దేశీయంగా మొత్తం స్మార్ట్ఫోన్ల మార్కెట్లో 21 శాతం వాటాతో చైనా సంస్థ వివో అగ్రస్థానంలో నిలవగా, 19 శాతం షేర్తో కొరియన్ దిగ్గజం శాంసంగ్ రెండో స్థానంలో ఉంది. షావోమీ వాటా ఏకంగా 37 శాతం పడిపోయింది. 13 శాతం మార్కెట్ షేర్తో మూడో ర్యాంక్లో నిల్చింది. ఒప్పో స్మార్ట్ఫోన్ అమ్మకాలు 8 శాతం పెరగ్గా, మార్కెట్ వాటా 12 శాతంగా నమోదైంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- మార్చి త్రైమాసికంలో భారత్లో సరఫరా అయిన మొత్తం ఫోన్లలో 5జీ స్మార్ట్ఫోన్ల వాటా 86 శాతంగా నమోదైంది. వార్షికంగా 14 శాతం పెరిగింది. రూ. 8,000 నుంచి రూ. 13,000 వరకు ఖరీదు చేసే 5జీ స్మార్ట్ఫోన్ల విక్రయాలు 100 శాతం పెరిగాయి.
- ఫీచర్ ఫోన్ సెగ్మెంట్లో చైనాకు చెందిన ఐటెల్ మార్కెట్ వాటా వార్షికంగా చూస్తే 6 శాతం తగ్గినప్పటికీ, మొత్తం మీద 41 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది.
- స్మార్ట్ఫోన్ చిప్సెట్ మార్కెట్లో మీడియాటెక్ 46 శాతం వాటాతో టాప్లో నిల్చింది. ప్రీమియం స్మార్ట్ఫోన్ సెగ్మెంట్లో (రూ. 25,000 పైగా రేటు ఉన్నవి) 35 శాతం వాటాతో క్వాల్కామ్ అగ్రస్థానం దక్కించుకుంది.

సెజ్ల పాక్షిక రద్దుకు నాలుగు సంస్థల వినతి

లిస్టులో టాటా స్టీల్, ఇన్ఫీ

న్యూఢిల్లీ: నాలుగు సంస్థలు తమకు కేటాయించిన ప్రత్యేక ఆర్థిక మండళ్లను (సెజ్) పాక్షికంగా రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. టాటా స్టీల్, ఇన్ఫోసిస్ మొదలైనవి వీటిలో ఉన్నాయి. వాణిజ్య శాఖ కార్యదర్శి సారథ్యంలోని అంతర్-మంత్రిత్వ శాఖల అనుమతుల బోర్డు (బీవోఏ) ఈ అభ్యర్థనలపై మే 9న జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది. ఒరిస్సాలోని గోపాల్పూర్లో కేటాయించిన 588.65 హెక్టార్లలో 282.73 హెక్టార్లను డీ–నోటిఫై చేయాలని టాటా స్టీల్ సెజ్ కోరింది. మధ్యప్రదేశ్లోని ఇండోర్లో తమ ఐటీ జోన్కి కేటాయించిన 52.64 హెక్టార్లలో 20.23 హెక్టార్లు రద్దు చేయాలంటూ ఇన్ఫోసిస్ దరఖాస్తు చేసుకుంది. ఇక తమిళనాడు గంగైకొండన్ గ్రామంలో ఐటీ జోన్కి కేటాయించిన 80.88 హెక్టార్ల నుంచి 2.4 హెక్టార్లను డీనోటిఫై చేయాలని ఎల్కాట్ లిమిటెడ్ కోరింది. నిబంధనల ప్రకారం బీవోఏ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం సెజ్లను సవరించాలన్న డెవలపర్ల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవచ్చు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతుల్లో సెజ్ల వాటా మూడింట ఒక వంతు నమోదైంది.

మారుతీ మార్కెట్ వాటా డౌన్

- ఏప్రిల్లో 40 శాతం దిగువకు...
- రెండో స్థానంలో ఎంఅండ్ఎం
- ఫాడా గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా వాటా ఏప్రిల్లో 40 శాతం లోపునకు పడిపోయింది. 1,38,021 వాహన విక్రయాలతో 39.44 శాతానికి పరిమితమైంది. గతేడాది ఏప్రిల్లో 1,39,173 యూనిట్ల అమ్మకాలతో కంపెనీ 40.39 శాతం మార్కెట్ వాటా నమోదు చేసింది. ఆటోమోటివ్ డీలర్ల అసోసియేషన్ల సమాఖ్య ఫాడా విడుదల చేసిన గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం భారీ స్థాయిలో ఎస్యూవీ విక్రయాలతో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) ఏప్రిల్లో అత్యధికంగా లబ్ధి పొందింది. నాలుగో స్థానం నుంచి రెండో స్థానానికి ఎగబాకింది. కంపెనీ అమ్మకాలు 38,696 యూనిట్ల నుంచి 48,405 యూనిట్లకు ఎగియగా, మార్కెట్ వాటా 11.23 శాతం నుంచి 13.83 శాతానికి పెరిగింది. ఇక సుదీర్ఘకాలంగా రెండో స్థానంలో కొనసాగుతూ వస్తున్న హ్యుందాయ్ మోటార్స్ (హెచ్ఎంఐఎల్) 43,642 యూనిట్ల అమ్మకాలు, 12.47 శాతం మార్కెట్ వాటాతో నాలుగో స్థానానికి పడిపోయింది. టాటా మోటార్స్ 44,065 వాహన విక్రయాలతో మూడో స్థానంలో కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్లో దేశీయంగా మొత్తం వాహన విక్రయాలు 3,44,594 యూనిట్ల నుంచి 1.55 శాతం వృద్ధితో 3,49,939 యూనిట్లకు చేరాయి.

2024-25 పూర్తి సంవత్సర వివరాలు ..

- గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 16,71,559 యూనిట్ల అమ్మకాలతో మారుతీ సుజుకీ 40.25 శాతం మార్కెట్ వాటా దక్కించుకుంది. 2023–24లో 16,08,041 వాహనాలు విక్రయించగా, మార్కెట్ షేర్ 40.6 శాతంగా నమోదైంది.
- హెచ్ఎంఐఎల్ 5,59,149 యూనిట్లు, 13.46 శాతం మార్కెట్ వాటాతో 2024–25లో మారుతీ తర్వాత రెండో స్థానంలో ఉంది. 2023–24లో 5,62,865 వాహన విక్రయాలు, 14.21 శాతం వాటాను సాధించింది.
- టాటా మోటార్స్ 5,35,960 యూనిట్లు విక్రయాలు, 12.9 శాతం వాటాతో మూడో స్థానంలో కొనసాగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు 5,39,567 యూనిట్లు కాగా, మార్కెట్ వాటా 13.62 శాతం.
- 5,12,626 యూనిట్ల అమ్మకాలు, 12.34 శాతం మార్కెట్ వాటాతో ఎంఅండ్ఎం నాలుగో స్థానంలో నిల్చింది. 2023–24లో కంపెనీ రిటైల్ అమ్మకాలు 4,27,390 యూనిట్లు కాగా, మార్కెట్ వాటా 10.79 శాతంగా ఉంది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

రాణించిన ఇండియన్ హోటల్స్

క్యూ4 లాభం రూ.562 కోట్లు



న్యూఢిల్లీ: టాటా గ్రూపులో భాగమైన ఆతిథ్య సేవల కంపెనీ ఇండియన్ హోటల్స్ గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (జనవరి–మార్చి/క్యూ4) మెరుగైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 28 శాతం పెరిగి రూ.563 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.438 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం 27 శాతం పెరిగి రూ.2,425 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.1,905 కోట్లుగా ఉంది. మొత్తం వ్యయాలు సైతం ఈ కాలంలో రూ.1,417 కోట్ల నుంచి రూ.1,764 కోట్లకు చేరాయి. హోటళ్లతో పాటు ఎయిర్, ఇనిస్టిట్యూషనల్ కేటరింగ్ సేవలను సైతం ఇండియన్ హోటల్స్ నిర్వహిస్తోంది. హోటళ్ల విభాగం ఆదాయం 13 శాతం వృద్ధిని చూసిందని.. వరుసగా 12వ త్రైమాసికంలోనూ బలమైన పనితీరు నమోదైందని ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ ఎండీ, సీఈవో పునీత్ ఛత్వాల్ తెలిపారు. వసతుల నవీకరణ, అస్సెట్ నిర్వహణపై రూ.1,200 కోట్లు వ్యయం చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో డబుల్ డిజిట్ వృద్ధిని నమోదు చేస్తామన్న అంచనాను వ్యక్తం చేశారు. కొత్తగా 30 హోటళ్లను ప్రారంభించడంతోపాటు, ప్రస్తుత వసతుల నుంచి సైతం మెరుగైన పనితీరు రాబడతామని చెప్పారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు స్వల్ప లాభంతో రూ.802 వద్ద ముగిసింది.

బజాజ్ కన్జ్యూమర్ లాభం డౌన్

ఆదాయంలో మాత్రం వృద్ధి



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ బజాజ్ కన్జ్యూమర్ కేర్ మార్చితో ముగిసిన త్రైమాసికానికి మిశ్రమ పనితీరు చూపించింది. రూ.31 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.35.58 కోట్లతో పోల్చి చూస్తే 13 శాతం తగ్గింది. ఆదాయం 4.38 శాతం వృద్ధితో రూ.251 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.221 కోట్లుగా ఉంది. మొత్తం వ్యయాలు 6.4 శాతం ఎగసి రూ.221 కోట్లుగా ఉన్నాయి. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కంపెనీ పనితీరు బలంగా నమోదైంది. కన్సాలిడేటెడ్ లాభం 19 శాతం వృద్ధితో రూ.125 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం మాత్రం అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 2 శాతం తగ్గి రూ.965 కోట్లకు పరిమితమైంది. బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్, బ్రాహ్మి ఆమ్ల హెయిర్ ఆయిల్ తదితర ప్రముఖ ఉత్పత్తులను ఈ కంపెనీ విక్రయిస్తుంటుంది.

బీఎస్ఈలో బజాజ్ కన్జ్యూమర్ షేరు సోమవారం 1 శాతానికి పైగా పెరిగి రూ.169 వద్ద ముగిసింది.

కోఫోర్జ్ లాభం జంప్

- 16 శాతం వృద్ధితో రూ.261 కోట్లు
- 2.1 బిలియన్ డాలర్ల కొత్త ఆర్డర్లు



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో (క్యూ4) అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 16.5 శాతం పెరిగి రూ.261 కోట్లకు చేరింది. ఆదాయం సైతం ఇదే కాలంలో 47 శాతం వృద్ధితో రూ.3,410 కోట్లకు మెరుగుపడింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.224 కోట్లుగా ఉంటే, ఆదాయం రూ.2,318 కోట్ల చొప్పున ఉన్నాయి. సీక్వెన్షియల్గా చూసినా (గత డిసెంబర్ త్రైమాసికంతో పోల్చి చూస్తే) లాభం 21 శాతం, ఆదాయం 4.6 శాతం చొప్పున పెరిగాయి. క్యూ4లో కొత్తగా 2.1 బిలియన్ డాలర్ల ఆర్డర్లను సొంతం చేసుకుంది. ముఖ్యంగా నార్త్ అమెరికా, యూకే, ఏపీఏసీ ప్రాంతాల నుంచి ఐదు పెద్ద డీల్స్పై సంతకాలు చేసింది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.812 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో (2023–24) లాభం రూ.808 కోట్లతో పోల్చితే పెద్దగా వృద్ధి కనిపించలేదు. ఆదాయం మాత్రం 34 శాతం పెరిగి రూ.12,051 కోట్లుగా నమోదైంది. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.19 చొప్పున మధ్యంతర డివిడెండ్ పంపిణీకి బోర్డు నిర్ణయించింది. రికార్డు తేదీగా ఈ నెల 12ని ఖరారు చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కోఫోర్జ్ షేరు ఒకటిన్నర శాతం లాభంతో రూ.7,499 వద్ద క్లోజయింది.

జీ మీడియా కార్పొరేషన్కు మరిన్ని నష్టాలు

తగ్గిన ప్రకటనల ఆదాయం



న్యూఢిల్లీ: జీ మీడియా కార్పొరేషన్ లిమిటెడ్ నష్టం మార్చి త్రైమాసికంలో మరింత పెరిగిపోయింది. రూ.37 కోట్ల నష్టాన్ని సంస్థ నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నష్టం కేవలం రూ.6.51 కోట్లుగానే ఉంది. దీంతో పోల్చి చూస్తే ఆరు రెట్లు పెరిగినట్టు తెలుస్తోంది. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 13 శాతం తగ్గి రూ.156 కోట్లుగా ఉంది. మొత్తం వ్యయాలు 6 శాతానికి పైగా పెరిగి రూ.200 కోట్లుగా ఉన్నాయి. మార్చి క్వార్టర్లో ప్రకటనల ఆదాయం 13.5 శాతం తక్కువగా రూ.145 కోట్లకు పరిమితమైంది. సబ్స్క్రిప్షన్ ఆదాయం 6.9 శాతం తగ్గి రూ.10 కోట్లుగా ఉంది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీ మీడియా కార్పొరేషన్ రూ.119 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నష్టం రూ.98 కోట్లుగానే ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం 4 శాతానికి పైగా తగ్గి రూ.633 కోట్లుగా ఉంది.

బీఎస్ఈలో జీ మీడియా కార్పొరేషన్ షేరు ధర 3 శాతానికి పైగా ఎగసి రూ.14.38 వద్ద ముగిసింది.

‘టాప్’లో టీమిండియా

వన్డే, టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం

- టెస్టుల్లో నాలుగో స్థానంలో రోహిత్ బృందం
- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వార్షిక ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే, టి20 ర్యాంకింగ్స్‌లో భారత జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న టీమిండియా... తాజా ర్యాంకింగ్స్‌లో ‘టాప్’ ప్లేస్‌ను నిలబెట్టుకుంది. ఇటీవలి కాలంలో టెస్టుల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన భారత జట్టు... సుదీర్ఘ ఫార్మాట్లో నాలుగో స్థానంలో ఉంది. గత మూడేళ్ల ప్రదర్శన ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను సవరించారు. 2023లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు... ఈ ఏడాది ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కైవసం చేసుకోవడంతో పాటు... 50 ఓవర్ల ఫార్మాట్‌లో వరుస విజయాలు సాధించింది. దీంతో తాజా ర్యాంకింగ్స్‌లో రోహిత్ బృందం 124 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ క్రమంలో టీమిండియా రెండు రేటింగ్ పాయింట్లు పెంచుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ (109 పాయింట్లు) రెండో స్థానంలో ఉండగా... ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా (109 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇటీవల టీమిండియాపై వన్డే సిరీస్ గెలవడంతో పాటు స్వదేశంలో మంచి ప్రదర్శన కనబరుస్తున్న శ్రీలంక 104 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా... పాకిస్తాన్ 104 పాయింట్లతో ఐదో ‘ప్లేస్’లో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా (96 పాయింట్లు), అఫ్గానిస్తాన్ (91 పాయింట్లు), ఇంగ్లండ్ (84 పాయింట్లు) వరుసగా ఆరో, ఏడో, ఎనిమిదో స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ మాజీ చాంపియన్ వెస్టిండీస్ (83 పాయింట్లు) 9వ స్థానానికి పరిమితమైంది. బంగ్లాదేశ్ (76 పాయింట్లు) పదో ‘ప్లేస్’లో ఉంది.

టి20ల్లో ప్రపంచ చాంపియన్ భారత జట్టు 271 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (254) వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నాయి. న్యూజిలాండ్ (249; 4వ ర్యాంక్), వెస్టిండీస్ (246; 5వ ర్యాంక్) టాప్–5లో చోటు దక్కించుకున్నాయి. పాకిస్తాన్ జట్టు 228 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ఐసీసీ వార్షిక టి20 ర్యాంకింగ్స్‌లో తొలిసారి 100కు పైగా దేశాలకు స్థానాలు కల్పించింది. కనీసం 8 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన జట్లకు ర్యాంక్‌లు కేటాయించింది. 2019లో వార్షిక ర్యాంకింగ్స్‌ను ప్రవేశ పెట్టినప్పుడు 80 దేశాలు ఉండగా... ఇప్పుడా సంఖ్య వంద దాటింది.

టెస్టుల్లో ఆస్ట్రేలియాదే ఆధిపత్యం..

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విజేత ఆస్ట్రేలియా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తాజా ర్యాంకింగ్స్‌లో ఆసీస్ 126 పాయింట్లతో పట్టిక ‘టాప్’లో నిలిచింది. ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని ఆస్ట్రేలియా టెస్టు జట్టు ఇటీవల టీమిండియాపై ‘బోర్డర్–గావస్కర్ ట్రోఫీ’ గెలిచింది. ఇక బెన్ స్టోక్స్ కెప్టెన్సీలోని ఇంగ్లండ్ జట్టు రెండు స్థానాలు మెరుగు పరుచుకొని 113 పాయింట్లతో రెండో ప్లేస్‌కు చేరగా... దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌లో వైట్ వాష్‌కు గురవడంతో పాటు ఆస్ట్రేలియ పర్యటనలో సిరీస్ కోల్పోయిన టీమిండియా ఒక స్థానం కోల్పోయి 105 పాయిట్లతో నాలుగో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ (95), శ్రీలంక (87), పాకిస్తాన్ (78) వరుసగా ఐదో, ఆరో, ఏడో స్థానాల్లో ఉన్నాయి.

చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి ఉర్విల్ పటేల్



చెన్నై: దేశవాళీల్లో దంచికొడుతున్న గుజరాత్ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ ఉర్విల్ పటేల్‌ను చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ జట్టులోకి తీసుకుంది. గాయం కారణంగా వంశ్ బేడీ ఐపీఎల్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో చెన్నై ఫ్రాంచైజీ ఉర్విల్‌ను ఎంపిక చేసుకుంది. దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 28 బంతుల్లోనే సెంచరీ చేసిన ఉర్విల్... ఈ ఫార్మాట్‌లో వేగవంతమైన శతకం చేసిన భారత ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. 26 ఏళ్ల ఉర్విల్ ఇప్పటి వరకు 47 టి20లు ఆడి 1,162 పరుగులు చేశాడు. 2023లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఉర్విల్‌ను గతేడాది ఐపీఎల్ మెగా వేలంలో ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసుకోలేదు. అదే సమయంలో ఉర్విల్ చక్కటి ప్రదర్శన కనబర్చగా... ఇప్పుడు చెన్నై జట్టు అతడిని కనీస ధర రూ. 30 లక్షలకు కొనుగోలు చేసుకుంది. తాజా సీజన్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్న ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్... 11 మ్యాచ్‌ల్లో రెండింట మాత్రమే నెగ్గింది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్తాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్‌తో చెన్నై ఆడుతుంది.



స్మరణ్ స్థానంలో హర్ష్ దూబే

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) స్మరణ్ రవిచంద్రన్ స్థానంలో ఆల్‌రౌండర్ హర్ష్ దూబేను జట్టులోకి తీసుకుంది. గాయం కారణంగా స్మరణ్ మిగిలిన సీజన్‌కు దూరం కావడంతో సన్‌రైజర్స్ హర్ష్‌ను రూ. 30 లక్షలకు ఎంపిక చేసుకుంది. దేశవాళీల్లో విదర్భ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 22 ఏళ్ల దూబే... 16 టి20లు, 20 లిస్ట్ ‘ఎ’ మ్యాచ్‌లు, 18 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అన్నిట్లో కలిపి 127 వికెట్లు పడగొట్టడంతో పాటు 941 పరుగులు చేశాడు. ఈ ఏడాది రంజీ ట్రోఫీలో ‘ప్లేయర్ ఆఫ ద టోర్నమెంట్’గా నిలిచిన హర్ష్ దూబే 69 వికెట్లు తీయడంతో పాటు 476 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా గాయపడటంతో అతడి స్థానంలో కర్ణాటకకు చెందిన స్మరణ్‌ను ఎంపిక చేసుకోగా... ఇప్పుడతడూ గాయపడటంతో హర్ష్ దూబేకు చాన్స్ దక్కింది.



పియాస్ట్రిదే పైచేయి


మయామి గ్రాండ్‌ప్రి రేసులో టైటిల్ సొంతం

- ఈ సీజన్‌లో నాలుగో విజయం సాధించిన మెక్‌లారెన్ డ్రైవర్
- వెర్‌స్టాపెన్‌కు నాలుగో స్థానం

ఫ్లోరిడా: గత నాలుగేళ్లు ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించిన రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్‌కు ఈ సీజన్‌లో తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. క్వాలిఫయింగ్ సెషన్‌లో అదరగొడుతున్న వెర్‌స్టాపెన్‌ను ప్రధాన రేసులో మాత్రం మెక్‌లారెన్ డ్రైవర్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఫార్ములావన్ 2025 సీజన్‌లో భాగంగా జరిగిన ఆరో రేసు మయామి గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి విజేతగా నిలిచాడు. నిర్ణీత 57 ల్యాప్‌ల రేసును పియాస్ట్రి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 28 నిమిషాల 51.587 సెకన్లలో పూర్తి చేసి ఈ సీజన్‌లో నాలుగో గెలుపును, వరుసగా మూడో విజయాన్ని అందుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత ఏడాది ఈ రేసులో విజేతగా నిలిచిన నోరిస్ ఈసారి 1 గంట 28 నిమిషాల 56.217 సెకన్లలో రేసును పూర్తి చేశాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానాన్ని పొందగా... ‘పోల్ పొజిషన్’తో రేసును ఆరంభించిన ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నలుగురు డ్రైవర్లు లియామ్ లాసన్ (వీసా క్యాష్ రేసింగ్ బుల్స్), గాబ్రియెల్ బొర్టొలెటో (స్టేక్ టీమ్ కిక్ సాబెర్), ఒలివెర్ బియర్మన్ (మనీగ్రామ్ హాస్), జాక్ దూహాన్ (అల్పైన్ టీమ్) మధ్యలోనే వైదొలిగారు. లాసన్ 36వ ల్యాప్‌లో, బొర్టొలెటో 30వ ల్యాప్‌లో, బియర్మన్ 27వ ల్యాప్‌లో, దూహాన్ తొలి ల్యాప్‌లో తప్పుకున్నారు.

1997 తర్వాత...

నాలుగో స్థానం నుంచి రేసును మొదలుపెట్టిన పియాస్ట్రి ఆరంభంలో వెనుకబడ్డాడు. అయితే 14వ ల్యాప్‌లో వెర్‌స్టాపెన్‌ను వెనక్కి నెట్టి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని చివరిదాకా కాపాడుకొని చాంపియన్‌గా నిలిచాడు. తద్వారా 1997 తర్వాత ఫార్ములావన్‌లో వరుసగా మూడు రేసుల్లో నెగ్గిన మెక్‌లారెన్ డ్రైవర్‌గా పియాస్ట్రి గుర్తింపు పొందాడు. చివరిసారి మెక్‌లారెన్ తరఫున మికా హకినెన్ ఈ ఘనత సాధించాడు. 1997 సీజన్ చివరి రేసులో నెగ్గిన హకినెన్ 1998 సీజన్‌లోని తొలి రెండు రేసుల్లోనూ విజేతగా నిలిచాడు. 24 రేసుల తాజా సీజన్‌లో ఆరు రేసులు ముగిశాక ఆస్కార్ పియాస్ట్రి 131 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. 115 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 99 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో నిలిచారు. కన్‌స్ట్రక్టర్స్ చాంపియన్‌షిప్‌లో మెక్‌లారెన్ 246 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. సీజన్‌లోని తదుపరి రేసు ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి (ఇటలీ) ఈనెల 18న జరుగుతుంది.



మయామి గ్రాండ్‌ప్రి ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	పియాస్ట్రి	మెక్‌లారెన్	1:28:51.587 సెకన్లు	–	25
2	నోరిస్	మెక్‌లారెన్	1:28:56.217 సెకన్లు	4.630 సెకన్లు	18
3	రసెల్	మెర్సిడెస్	1:29:29.231 సెకన్లు	37.644 సెకన్లు	15
4	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:29:31.543 సెకన్లు	39.956 సెకన్లు	12
5	ఆల్బోన్	విలియమ్స్	1:29:39.654 సెకన్లు	48.067 సెకన్లు	10
6	ఆంటోనెలి	మెర్సిడెస్	1:29:47.089 సెకన్లు	55.502 సెకన్లు	8
7	లెక్‌లెర్క్	ఫెరారీ	1:29:48.623 సెకన్లు	57.036 సెకన్లు	6
8	హామిల్టన్	ఫెరారీ	1:29:51.773 సెకన్లు	60.186 సెకన్లు	4
9	సెయింజ్	విలియమ్స్	1:29:52.164 సెకన్లు	60.577 సెకన్లు	2
10	సునోడా	రెడ్‌బుల్	1:30:06.021 సెకన్లు	74.434 సెకన్లు	1



సినెర్ పునరాగమనం

రోమ్: ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్ (ఇటలీ)పై విధించిన నిషేధం పూర్తయింది. దీంతో స్వదేశంలో జరగనున్న ఇటాలియన్ ఓపెన్ ద్వారా సినెర్ పునరాగమనం చేయనున్నాడు. ఈ టోర్నీలో ఇటలీకి చెందిన ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు పాల్గొననుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సినెర్‌కు ‘బై’ దక్కగా... శుక్రవారం జరగనున్న రెండో రౌండ్‌లో సినెర్ ఆడనున్నాడు. వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) సినెర్‌పై విధించిన నిషేధం సోమవారంతో ముగియగా... ఈ ఇటలీ ఆటగాడు ప్రాక్టీస్ ప్రారంభించాడు. తమ అభిమాన ఆటగాడి సాధన చూసేందుకు వేలాదిగా ప్రేక్షకులు తరలివచ్చారు. ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అనంతరం సినెర్ కోర్టులో అడుగు పెట్టలేదు. ఈ నెల 25 నుంచి ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభం కానుండగా... దానికి ముందు ఇటాలియన్ ఓపెన్ సినెర్‌కు మంచి ప్రాక్టీస్ కానుంది. ఇటాలియన్ ఓపెన్‌లో చివరిసారిగా 1976లో ఇటలీకి చెందిన అడ్రియానో పనట్టా విజేతగా నిలిచాడు. ఆ తర్వాత ఇటలీ ప్లేయర్లు ఎవరూ ఇటాలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గలేదు.

సమఉజ్జీల సమరం

- నేడు గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ ‘ఢీ’
- రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఐపీఎల్ 18వ సీజన్‌లో వరుస విజయాలతో విజృంభిస్తున్న ముంబై ఇండియన్స్ జట్టు గుజరాత్ టైటాన్స్‌తో పోరుకు సిద్ధమైంది. ఆరంభంలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్కదాంట్లోనే నెగ్గిన హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై ఇండియన్స్ ఆ తర్వాత వరుసగా 6 మ్యాచ్‌లు గెలిచి ‘ప్లే ఆఫ్స్’కు చేరువైంది. మరోవైపు 10 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలతో 14 పాయింట్లతో ఉన్న గుజరాత్ కూడా ‘ప్లే ఆఫ్స్’ బెర్తు ఖరారు చేసుకోవాలని తహతహలాడుతోంది. ఈ నేపథ్యంలో సమ ఉజ్జీల మధ్య మంగళవారం వాంఖడే వేదికగా కీలక పోరు జరగనుంది. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో గుజరాత్ విజయం సాధించింది. అయితే ఆలస్యంగా రేసులోకి వచ్చిన ఐదుసార్లు చాంపియన్ ముంబై... గత ఆరు మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఫామ్‌లోకి రావడం ముంబైకి కొండంత బలం కాగా... రికెల్టన్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా మంచి ఫామ్‌లో ఉన్నారు. ముఖ్యంగా సూర్యకుమార్ 67.86 సగటుతో 475 పరుగులు చేసి ‘ఆరెంజ్ క్యాప్’ రేసులో ముందు వరుసలో ఉన్నాడు. తిలక్ వర్మ, విల్ జాక్స్, నమన్ ధీర్‌తో ముంబై బ్యాటింగ్ బలంగా ఉండగా... బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చహర్, కరణ్ శర్మ కీలకం కానున్నారు. ఈ సీజన్‌లో పాండ్యా బౌలింగ్‌లో 13 వికెట్లు తీయడంతో పాటు బ్యాట్‌తో 157 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. సాంట్నర్ అందుబాటులో లేకుంటే అతడి స్థానంలో కార్బిన్ బాష్ బరిలోకి దిగొచ్చు. మరోవైపు గుజరాత్ కూడా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. టాప్–3 ఆటగాళ్లు శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ భీకర ఫామ్‌లో ఉన్నారు. సాయి సుదర్శన్ 50.40 సగటుతో 504 పరుగులు చేయగా... జోస్ బట్లర్ 78.33 సగటుతో 470, గిల్ 51.67 సగటుతో 465 పరుగులు చేశారు. ఈ సీజన్‌లో గుజరాత్ జైత్రయాత్రకు ఈ ముగ్గురే ప్రధాన కారణం కాగా... వాషింగ్టన్ సుందర్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా రూపంలో టైటాన్స్‌కు నాణ్యమైన ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. నిషేధం అనంతరం రబడ తిరిగి అందుబాటులోకి రాగా... ఈ మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగుతాడా లేదా చూడాలి. బౌలింగ్‌లో ప్రసిధ్ కృష్ణ, మొహమ్మద్ సిరాజ్, సాయి కిషోర్, రషీద్ ఖాన్ కీలకం కానున్నారు. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ప్రసిధ్ కృష్ణ 19 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా... సిరాజ్ 14, సాయి కిషోర్ 12 వికెట్లు తీశారు.

తుది జట్లు (అంచనా)

ముంబై ఇండియన్స్: హార్దిక్ (కెప్టెన్), రోహిత్, రికెల్టన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, విల్ జాక్స్, నమన్ ధీర్, కార్బిన్ బాష్/సాంట్నర్, దీపక్, బౌల్ట్, బుమ్రా, కరణ్ శర్మ.

గుజరాత్ టైటాన్స్: గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, సుందర్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, కోట్జీ, సాయి కిషోర్, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్, ఇషాంత్ శర్మ/రబడ.

‘నీరజ్ చోప్రా క్లాసిక్’ ఈవెంట్ టికెట్ల విక్రయం షురూ


బెంగళూరు: భారత దేశంలో మొదటిసారి నిర్వహిస్తున్న ‘నీరజ్ చోప్రా క్లాసిక్’ జావెలిన్ ఈవెంట్‌కు సంబంధించిన టికెట్ల విక్రయం ప్రారంభమైంది. టోక్యో ఒలింపిక్స్ పసిడి పతక విజేత నీరజ్ చోప్రా పేరిట ఈ నెల 24న నిర్వహించనున్న ఈ ఈవెంట్‌లో నీరజ్‌తో పాటు థామస్ రోలెర్ (జర్మనీ), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) వంటి పలువురు అంతర్జాతీయ స్టార్ జావెలిన్ త్రోయర్లు పాల్గొంటున్నారు. ఈ ఈవెంట్‌కు సంబంధించిన టికెట్లను ‘డిస్ట్రిక్ట్’ యాప్‌లో అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు సోమవారం వెల్లడించారు. టికెట్ల ధర రూ. 199 నుంచి 9,999గా నిర్ణయించారు. రూ. 44,999 ధర గల ఐదు కార్పొరేట్ బాక్స్‌లు కూడా అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం స్టేడియంలో 12 వేల టికెట్లు అందుబాటులో ఉన్నాయి. దేశంలో నిర్వహిస్తున్న తొలి అంతర్జాతీయ జావెలిన్ ఈవెంట్ కావడంతో... కర్ణాటక ఒలింపిక్ సంఘం, క్రీడా మంత్రిత్వ శాఖ దీని నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయి. అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య కూడా దీనికి ‘గోల్డ్ ఈవెంట్’ స్థాయి కల్పించింది.



కాంస్యం నెగ్గిన పర్వ్

లిమా (పెరూ): భారత యువ వెయిట్ లిఫ్టర్ పర్వ్ చౌధరీ ప్రపంచ యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిశాడు. పురుషుల 96 కేజీల విభాగంలో పర్వ్ 315 కేజీల బరువెత్తి మూడో స్థానంలో నిలిచాడు. స్నాచ్‌లో 140 కేజీల బరువెత్తిన పర్వ్... క్లీన్ అండ్ జెర్క్‌లో మరో 175 కేజీల బరువు ఎత్తాడు. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే జ్యోష్న సబర్ (40 కేజీల), హర్షవర్ధన్ సాహూ (49 కేజీలు) కాంస్యాలు గెలుచుకోగా... ఇప్పుడు పర్వ్ ఆ సంఖ్యను మూడుకు పెంచాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఓవరాల్ లిఫ్టింగ్‌తో పాటు స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌లో వేర్వేరుగా పతకాలు ఇస్తారు.








లండన్‌లో సోమవారం జరిగిన 80వ విక్టరీ డే వేడుకలో ఉక్రెయిన్ సైనికుల మార్చ్ ఫాస్ట్..రాయల్ నేవీ సభ్యుల కవాతు.. సాయుధ బలగాల సభ్యుల పరేడ్.. బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న బ్రిటన్ రాజు చార్లెస్

ఉగ్రవాదులకు స్థానిక స్లీపర్‌సెల్స్ సాయం?

సెక్యూరిటీ వివరాలను ఉప్పందిస్తారు

- వివరాలు వెల్లడించిన ఉగ్రస్లీపర్ సెల్ మాజీ సభ్యుడు

శ్రీనగర్: పహల్గాంలోని బైసారన్‌లో ముష్కరుల కర్కశకాండ వెనుక స్థానిక స్లీపర్‌సెల్స్ హస్తం దాగుందని నిర్ధారణంగా ఉండే ఉగ్ర బృందంలోని మాజీ సభ్యుడు ఒకరు వెల్లడించారు. జాతీయ మీడియాకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఇలాంటి పలు విషయాలను పంచుకున్నాడు. ''స్థానికంగా ఉండే వాళ్ల నుంచి కనీస సహకారం లేకుండా ఇంతటి దాడి చేయడం అసాధ్యం. దాడిచేసిన లష్కర్ ఉగ్రవాదులతో కనీసం ఐదారుగురు స్థానిక స్లీపర్‌సెల్ సభ్యులు సాయపడి ఉంటారు. సాధారణంగా ఇలాంటి దాడుల్లో కనీసం నెల రోజుల ముందే స్లీపర్ సెల్ సభ్యులను దాడిచేయబోయే ఉగ్రవాదులు సంప్రదిస్తారు. దాడి ఎలా చేయాలి? ఎటువైపు తప్పించుకోవాలి?లాంటివన్నీ ముందే ప్లాన్ చేస్తారు''అని మాజీ స్లీపర్‌సెల్ సభ్యుడు చెప్పాడు. ''ఒకవేళ నేనే స్వయంగా శ్రీనగర్‌లో దాడిచేయాలనుకుంటే గుడ్డిగా శ్రీనగర్‌కు వెళ్లను. ముందుగా శ్రీనగర్‌లో దాడిచేయబోయే చోట తరచూ ఎంతమంది భద్రతా సిబ్బంది ఉంటారు అనే ఖచ్చితమైన అంచనా ఉండాలి. ఆ ప్రాంతంపై నాకు అవగాహన ఉండాలి. ఈ అవగాహన మనకు స్లీపర్‌సెల్స్ సభ్యులు కల్పిస్తారు. భద్రతా బలగాలు ఎంత మంది ఉండొచ్చు, దాడికి సఫలమయ్యే అవకాశాలు లాంటివన్నీ వాళ్లే చెప్తారు. తర్వాత ఉగ్రవాదులు రంగంలోకి దిగుతారు. బైసారన్‌లోనూ ఇదే జరిగి ఉంటుంది''అని అన్నాడు.

ఉగ్రవాదులతో పనిచేయడం 110 శాతం తప్పు

''స్లీపర్‌సెల్ సభ్యునిగా ఉంటూ చిట్టడవిలోకి వెళ్లి ఉగ్రవాదులకు ఆహారం అందించి రావడం నా తొలి పని. తర్వాతర్వాత ఒక చోట ఉన్న వస్తువును రహస్యంగా మరో చోటుకు చేర్చాల్సి వచ్చేది. నాకు ఈ పనులు పురమాయించే ఉగ్రవాదిని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. అయితే నేను నమ్మకస్తుడినా కాదా అని నిర్ధారించుకునేందుకు నాపై కూడా నిఘా కొనసాగేది. ఇప్పటికీ నా స్నేహితుల్లో ఇద్దరు ఉగ్రవాదులుగా కొనసాగుతున్నారు. మరో 13-14 మంది స్నేహితులు ఉగ్రవాదులుగా మారి భద్రతా బలగాల ఎన్‌కౌంటర్‌లలో చనిపోయారు. ఏ విధంగా చూసినా ఉగ్రవాదులతో కలిసి పనిచేయడం 110 శాతం తప్పు. నా పదేళ్లగతాన్ని చూసుకుంటే అసలు నేనింకా బతికే ఉండటం ఆశ్చర్యంగా అనిపిస్తుంది''అని అతను చెప్పాడు.

గతంలో జైలుకు వెళ్లి..

ఇతను గతంలో స్లీపర్‌సెల్‌లో పనిచేసిన నేరానికి కొన్నేళ్లు జైలులో గడిపి బయటికొచ్చాడు. ''స్లీపర్‌సెల్ సభ్యులు దాడి చేయరు. దాడి చేయబోయే ఉగ్రవాదులకు ఆర్మీ కదలికలపై నిఘా సమాచారం అందిస్తారు. ఉగ్రవాదులకు ఆహారం, ఇతర అత్యయిక అవసరాలు తీరుస్తారు. నేను కూడా గతంలో 2-4 ఏళ్లు స్లీపర్‌సెల్ సభ్యునిగా పనిచేశా. ఉగ్రవాదులకు కావాల్సినవి అందించా. రాత్రిళ్లు తిరిగి సమాచారం సంపాదించి ఇచ్చా. నేను ఇచ్చిన సమాచారంతో వాళ్లు ఎన్నో దాడులు చేశారు''అని చెప్పాడు. గ్రెనేడ్ దాడి ప్రయత్నంలో భద్రతా బలగాలు ఇతడిని అరెస్ట్‌చేశారు. నేరం నిరూపణ అయ్యాక కొంతకాలం జైలు శిక్ష అనుభవించి విడుదల అయ్యాడు. ''ఆనాడు నేను మైనర్‌గా ఉండబట్టే విడుదలయ్యా. అది నా అదృష్టం. లేదంటే ఎప్పటికీ నేను విడుదలకాకపోయేవాడినేమో''అని అతను అన్నాడు. ''2015 కాలంలో నన్ను ఉగ్రవాదులు రిక్రూట్ చేసుకున్నారు. అప్పట్లో ఫేస్‌బుక్, వాట్సాప్ యాప్‌లపై నిఘా అంతగా లేదు. అందుకే ఫేస్‌బుక్‌లో నాకు మెసేజ్‌లు పంపేవాడు. కొంతకాలానికి నిఘా పెరగడంతో బీబీఎం యాప్‌కు మారా. ఈ యాప్‌లో చేసే వీడియో, వాయిస్ కాల్స్‌ను ఎవరూ కనిపెట్టలేరు''అని అతను చెప్పాడు.

అబద్ధాల బురదలో పాక్

- భారత వ్యతిరేక తప్పుడు ప్రచారాన్ని పెంచిన పాకిస్తాన్
- ఇండియన్ ఆర్మీలో సిక్కులు తిరుగుబాటు తెస్తున్నారని ప్రేలాపన
- అవాస్తవాల ప్రచారం కోసం ఏఐతో నకిలీ వీడియోల సృష్టి
- ఖలిస్తానీ సానుభూతిపరుల ద్వారా విస్తృత ప్రచారం

న్యూఢిల్లీ: భారత ఆర్మీని నేరుగా ఎదుర్కొనే సత్తాలేని పాకిస్తాన్ దొడ్డిదారిన పాక్షికంగానైనా తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని కుట్ర పన్నింది. అందులోభాగంగా తప్పుడు వార్తలను ఆన్‌లైన్‌లో కుమ్మరిస్తోంది. భారత ఆర్మీలో సిక్కు సైనికులు, ఉన్నతాధికారులు, సైన్యాధికారులు పాకిస్తాన్‌తో పోరుకు విముఖత చూపుతున్నారని, వాళ్లంతా ఐక్యమై తిరుగుబాటు లేవదీస్తున్నారని ఇష్టమొచ్చిన తప్పుడు కథనాలు వండివార్చి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్‌చేస్తోంది. భారత సైన్యంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి ఆర్మీలో ఐక్యత దెబ్బతీయడమే లక్ష్యంగా పాకిస్తాన్ సోషల్‌మీడియా వేదికగా అహర్నిశలు పనిచేస్తోంది. ముఖ్యంగా సిక్కు సైనికులపై గురి పెట్టింది.

అన్ని రకాలుగా ప్రయత్నాలు

పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ అవాస్తవ కథనాల అల్లిక ఎక్కువైంది. పాకిస్తానీ సైనికులకు చెందిన సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి విపరీతంగా ఈ అబద్ధాల ఒరవడి ఊపందుకుంది. సంబంధంలేని, పాత, కృత్రిమమేధ సృష్టించిన విరుద్ధ నివేదికలతో అవాస్తవాలను అద్భుతంగా రచించి సోషల్‌మీడియాలో షేర్ చేస్తున్నారు. సరిహద్దు వెంట కీలకమైన స్థావరాల వద్ద సిక్కు సైనికులు, సిక్కు అధికారుల వ్యవహార శైలిపై ఓ కంట కనిపెట్టాలని ఇతర మతాలకు చెందిన అధికారులకు భారత ఆర్మీ రహస్య సూచనలు చేసిందని, లీక్ అయిన ఒక నిఘా నివేదికతో ఈ విషయాలు బహిర్గత అయ్యాయంటూ ఒక పెద్ద అసత్య కథనం ఇప్పుడు సోషల్‌మీడియాల్ షేర్ అవుతోంది. దీంతో ఆర్మీ పట్ల సిక్కు సైనికుల్లో విధేయత తగ్గి, సైన్యంలో ఐక్యత లోపిస్తుందని పాకిస్తాన్ భావిస్తోంది. ''భారత ఆర్మీలో ప్రస్తుతమున్న కఠోర వాస్తవం ఇది. సొంత సైనికులనే నమ్మని భారత ఆర్మీ.. పొరుగున పాక్‌తో ఏపాటి యుద్ధం చేయగలదు?''అని ఒక పాకిస్తాన్ సైన్యాధికారి వ్యాఖ్యానించినట్లు మరో తప్పుడు పోస్ట్ ఇప్పుడు అధికంగా షేర్ అవుతోంది. 'ఇండియా ఆజ్ తక్'వార్తాసంస్థ ప్రచురించినట్లుగా ఒక తప్పుడు, నకిలీ కథనాన్నీ పాకిస్తానీయులు ఆన్‌లైన్‌లో షేర్ చేస్తున్నారు.

ధమాకా ఏఐ పేరిట నకిలీ ఏఐ వీడియోలు

కృత్రిమమేధతో సృష్టించిన భారతవ్యతిరేక తప్పుడు వీడియోలు ః ధమాకాఏఐ ఖాతా నుంచి షేర్ అవుతున్నాయి. పాకిస్తాన్‌పై యుద్ధం చేయబోమని, ముందుగా ఖలిస్తాన్ విషయం తేల్చాలని, ఇందుకోసం రెఫరెండం నిర్వహించాల్సిందేనని సిక్కు సైనికులు పట్టుబడుతున్నారని ఒక తప్పుడు ఏఐ వీడియోను సృష్టించారు. ''సైన్యంలో వెలుగుచూసిన తిరుగుబాటుతో మోదీ షాక్‌కు గురయ్యారు. సిక్కు శక్తులన్నీ ఏకమయ్యాయి. యుద్ధం చేయబోమని తేల్చిచెప్పాయి''అని మరో అవాస్తవ వార్త ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. సిక్కు సంబంధ అసత్య వార్తలు, వీడియోలను ఖలిస్తానీ సానుభూతిపరుల ఖాతాల ద్వారా షేర్ చేయిస్తోంది. ఏప్రిల్ 25న సరిహద్దు వెంబడి భారత ఆర్మీలోని వేర్వేరు యూనిట్ల సైనికుల మధ్య ఘర్షణ జరిగిందని, ఆ ఘర్షణలో ఐదుగురు సైనికులు చనిపోయారని ఒక తప్పుడు వార్త సారాంశం. ఈ ఘటనలో ఒక అత్యున్నత స్థాయి సిక్కు సైన్యాధికారిని మాత్రమే అరెస్ట్‌చేశారని మరో పోస్ట్ ఆన్‌లైన్‌లో కనిపిస్తోంది. యుద్ధం చేయాల్సివస్తే మీరు మాత్రం రణక్షేత్రంలోకి కాలుపెట్టొద్దని సిక్కులకు ఖలిస్తానీ వేర్పాటువాది, సిఖ్స్ ఫర్ జస్టిస్ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూ పిలుపు ఇచ్చినట్లు మరో నకిలీ వీడియో షేర్ అవుతోంది. భారత వైమానిక స్థావరాల గుట్టుమట్లు చెప్పిన వాళ్లకు 1.1 కోట్ల డాలర్ల నజరానా ఇస్తానని గురుపత్వంత్ చెప్పినట్లు ఆ ఏఐ సృష్టించిన వీడియోలో ఉంది. ఇలాంటి వీడియోలు, కథనాలను షేర్‌చేస్తున్న చాలా సోషల్‌మీడియా ఖాతాలను భారత్ ఇప్పటికే నిషేధించి బ్లాక్‌చేసింది. అయితే విదేశాల్లో భారత్ పట్ల వ్యతిరేక భావనను పెంచే ఉద్దేశ్యంతో పలు తప్పుడు వెబ్‌సైట్ల ద్వారా ఈ కపట కథనాలపరంపర కొనసాగుతోంది.

పహల్గాం మృతుడి భార్యపై ట్రోలింగ్

ఖండించిన మహిళా కమిషన్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన నేవీ అధికారి వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి వ్యాఖ్యలపై ట్రోలింగ్ జరుగుతోంది. వాళ్లు హనీమూన్ కోసం కశ్మీర్ వెళ్లగా ముష్కరుల కాల్పులకు వినయ్ బలవడం తెలిసిందే. భర్త మృతదేహం పక్కన కూర్చొని హిమాన్షి విలపిస్తున్న హృదయవిదారక దృశ్యాలు యావద్దేశాన్నీ కదిలించాయి. దాంతో కశ్మీరీలు, ముస్లింలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. దానిపై హిమాన్షి స్పందించారు. ''వినయ్ ఆత్మకు శాంతి కలగాలని యావద్దేశం ప్రార్థించాలని కోరుకుంటున్నా. ముస్లింలు, కశ్మీరీలపై ద్వేషం ప్రదర్శిస్తున్నారు. అది సరికాదు. దాడి వెనక ఉన్నవారిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నా. శాంతిని మాత్రమే కోరుకుంటున్నా. ద్వేషాన్ని కాదు'' అని చెప్పారు. దీనిపై దూషణల పరంపర మొదలైంది. హిమాన్షి వ్యక్తిగత జీవితం గురించి కూడా కొందరు నీచమైన వ్యాఖ్యలు చేశారు. భర్త పింఛన్ కూడా ఆమెకు రాకూడదని మరికొందరన్నారు. చాలామంది మాత్రం హిమాన్షికి మద్దతుగా నిలిచారు. ఆమెపై ట్రోలింగ్‌ను జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది. ''హిమాన్షి నర్వాల్‌ను సోషల్ మీడియాలో టార్గెట్ చేసిన తీరు గర్హనీయం. అత్యంత దురదృష్టకరం. ఖండనీయం. అభిప్రాయాలు నచ్చనంత మాత్రాన ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత జీవితాన్ని ట్రోల్ చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. అసమ్మతిని మర్యాదగా, రాజ్యాంగ సరిహద్దులకు లోబడి వ్యక్తీకరించబడాలి''అంటూ ఎన్‌సీడబ్ల్యూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ''హిమాన్షి వ్యాఖ్యలు కొందరికి నచ్చకపోవచ్చు. కానీ ఆమెను ట్రోల్ చేయడం, వ్యక్తిగత వ్యాఖ్యలతో టార్గెట్ చేయడం సరికాదు''అని ఎన్సీడబ్ల్యూ చైర్ పర్సన్ విజయ రహత్కర్ ఎక్స్‌లో ప్రత్యేకంగా పోస్ట్ చేశారు.

అతిథుల్లా వ్యవహరించలేదో.. గ్రీన్‌కార్డ్ కోల్పోతారు

- ట్రంప్ సర్కారు తాజా హెచ్చరికలు
- రద్దుకు దారితీసే కారణాలతో జాబితా

వాషింగ్టన్: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన వలస విధానాలు భారతీయులతో సహా అమెరికాలోని వేలాది మంది గ్రీన్‌కార్డు హోల్డర్లలో గుబులు రేపుతున్నాయి. వలసదారులు అమెరికాలో అతిథుల్లా ప్రవర్తించాలని ట్రంప్ సర్కారు తాజాగా హితవు పలికింది. ''లేదంటే గ్రీన్‌కార్డ్ కోల్పోతారు. అంతేకాదు, దేశం నుంచి బహిష్కరణకు గురవుతారు''అంటూ హెచ్చరించింది. గ్రీన్‌కార్డుదారులు అమెరికా చట్టాలు, విలువలకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. శాశ్వత నివాస హక్కు రద్దుకు దారితీసే కారణాల జాబితాను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) విడుదల చసింది. విదేశీయులు చట్టాన్ని ఉల్లంఘిస్తే గ్రీన్ కార్డులు, వీసాలు రద్దు చేస్తామని తెలిపింది. ''అమెరికా చట్టాలను, విలువలను గౌరవించాలి. హింసను సమర్థిస్తే, ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతిస్తే, అలా చేయాల్సిందిగా ఇతరులను ప్రోత్సహిస్తే అమెరికాలో ఉండటానికి అర్హులు కాదు. గ్రీన్‌కార్డుదారులను కూడా కఠినంగా తనిఖీ చేయడానికి ఏజెన్సీలకు అధికారముంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీతో కలిసి దీనిపై నిరంతరం పనిచేస్తున్నాం. అమెరికాను మళ్లీ సురక్షితంగా తీర్చిదిద్దడానికి ఈ అప్రమత్తత చాలా అవసరం''అని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. ఈ విధానాలను ప్రకటించిన అనంతరం విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. అమెరికా ఔదార్యాన్ని దుర్వినియోగం చేసే శకం ముగిసిందన్నారు. ట్రంప్ సర్కారు తాజా హెచ్చరికలు గ్రీన్‌కార్డ్‌దారుల్లో ఆందోళనలను మరింత పెంచుతున్నాయి.

అమెరికాలోని భారతీయులకు అక్కడ గ్రీన్‌కార్డ్, శాశ్వత నివాసం పొందడం ఇప్పటికే క్లిష్టంగా మారింది. ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డుల కోసం ఏకంగా 50 ఏళ్లు, అంతకు మించి ఎదురు చూడాల్సిన పరిస్థితి! తీరా శాశ్వత నివాసాన్ని పొందినా అమెరికాలో భవిష్యత్తుకు భద్రత లేదని, చిన్న పొరపాటు చేసినా దేశ బహిష్కారానికి దారి తీయొచ్చని కొత్త నిబంధనలు సూచిస్తున్నాయి. పాత నిబంధనల ప్రకారం వీసా రద్దు తదితరాల విషయంలో వలసదారులకు చట్టపరమైన రక్షణ ఉంది. కొత్త విధానంలో దాన్ని తొలగించారు. అప్పీల్ కూడా లేకుండా వీసా రద్దుకు, బహిష్కరణకు వీలు కల్పించారు.



మూడోసారి పోటీ చేయను: ట్రంప్

- వాన్స్, రూబియో నా వారసులు
- మాగా ఉద్యమం కొనసాగుతుంది

వాషింగ్టన్: మూడో దఫా అధ్యక్ష బలోకి దిగకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించుకున్నారు. మళ్లీ పోటీ చేసే ప్రసక్తే లేదని అధికారికంగా ప్రకటించారు. ఆదివారం ఎన్‌బీసీ మీట్ ది ప్రెస్ మోడరేటర్ క్రిస్టెన్ వెల్కర్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. రెండో విడత అనంతరం వైట్‌హౌస్‌ను వీడనున్నట్లు ధ్రువీకరించారు. తాను మొదలు పెట్టిన మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ) ఉద్యమం మాత్రం కొనసాగుతుందన్నారు. దానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో వారసులని ప్రకటించారు. తాను పదవి నుంచి దిగిపోయాక వారికి అమెరికా సమాజం భారీగా మద్దతిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ''వాన్స్ అద్భుతమైన, తెలివైన వ్యక్తి. రూబియో గొప్ప వ్యక్తి''అని ప్రశంసించారు. 2028లో రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థిగా వాన్స్‌కు అవకాశం ఉంటుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ, ''ఆ విషయంలో ప్రస్తుత ఉపాధ్యక్షునికి కచ్చితంగా సానుకూలత ఉంటుంది. అతను గొప్పవాడైతే కచ్చితంగా అవకాశం దక్కుతుందనే అనుకుంటున్నా''అని బదులిచ్చారు. రూబియోను సైతం ట్రంప్ ప్రశంసించారు. ట్రంప్ రెండో హయాంలో పాలన వ్యవహారాల్లో రూబియో గణనీయ పాత్ర పోషిస్తున్నారు. రూబియో పనితీరు, ఇతర ఫెడరల్ ఏజెన్సీలతో ఆయన సమన్వయం చేసుకుంటున్న తీరు తదితరాలను ట్రంప్ ప్రస్తావించారు. గతంలో హెన్రీ కిస్సింజర్ కూడా ఏకకాలంలో పలు ఉన్నత పదవులను సమర్థంగా నిర్వహించారని గుర్తు చేశారు. అయితే తన వారసుడిని ఇప్పుడే ఎంపిక చేయడం తొందరపాటేనని అభిప్రాయపడ్డారు. ఐక్యతే రిపబ్లికన్ పార్టీ బలమని చెప్పుకొచ్చారు. ఒక వ్యక్తి రెండు కంటే ఎక్కువసార్లు అధ్యక్షుడు కావడాన్ని అమెరికా రాజ్యాంగం నిషేధిస్తోంది. అయినా మూడోసారీ అధ్యక్షుడు కావాలని ఉందని ట్రంప్ ఇటీవల పలుమార్లు చెప్పారు. 2028లో మళ్లీ పోటీ చేసేందుకు రిపబ్లికన్ సభ్యుల నుంచి తనకిప్పటికే ప్రోత్సాహం లభించిందని కూడా చెప్పుకున్నారు. తాను ఉపాధ్యక్ష పదవికి, వాన్స్ అధ్యక్ష పదవికి పోటీ చేసి, నెగ్గాక వాన్స్ తప్పుకుని తాను తిరిగి పగ్గాలు చేపట్టే అవకాశం కూడా ఉందని ట్రంపే చెప్పారు. దీనిపై పలు విమర్శలూ వచ్చాయి. చర్చోపచర్చలు జరిగాయి. ట్రంప్ సొంత ఆన్‌లైన్ సంస్థ ఇప్పటికే 'ట్రంప్ 2028'పేరుతో టోపీలు, టీ షర్టులను మార్కెట్లోకి తీసుకొచ్చింది.

కర్ణాటకలో ఎస్సీ ఉప కులాల ప్రత్యేక సర్వే

బెంగళూరు: షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కోసం కర్నాటక ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్త కుల గణన ప్రారంభించింది. మూడు దశల్లో ఈ సర్వే జరగనుంది. మే 5 నుంచి 17 వరకు ఇంటింటి సమాచార సేకరణ, 19 నుంచి 21 వరకు ప్రత్యేక శిబిరాలు, 19 నుంచి 23 దాకా ఆన్‌లైన్ సెల్ఫ్ డిక్లరేషన్ ప్రక్రియ ఉంటాయి. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్ దాస్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ దీన్ని పర్యవేక్షిస్తుంది. 60 రోజుల్లో కమిషన్ నివేదిక ఇవ్వనుంది. ప్రతి 10 నుంచి 12 మందికి ఒక సూపర్‌వైజర్ చొప్పున 65 వేల మందికి పైగా టీచర్లను ఎన్యూమరేటర్లుగా నియమించారు. ఉదయం 6.30 నుంచి సాయంత్రం 6.30 దాకా మొబైల్ అప్లికేషన్ ద్వారా డేటా సేకరణ జరుగుతుంది. ఇంటి దగ్గర అందుబాటులో లేనివాళ్లు క్యాంపుల్లో లేదా ఆన్‌లైన్‌లో వివరాలు వెల్లడించవచ్చు.

సీబీఐ నూతన డైరెక్టర్ ఎవరో?

మోదీ నేతృత్వంలో సమావేశమైన కమిటీ

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) నూతన డైరెక్టర్ నియామకంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అపాయింట్‌మెంట్ కమిటీ సోమవారం సమావేశమైంది. విపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ భేటీలో పాల్గొన్నారు. సీబీఐ ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలం ఈ నెల 25న ముగిసనుంది. ఆయన 2023 మే 25న సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కొత్త డైరెక్టర్‌గా పలువురు సీనియర్ అధికారుల పేర్లను అపాయింట్‌మెంట్ కమిటీ పరిశీలించినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం... ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు సీబీఐ నూతన డైరెక్టర్‌ను కేంద్రం నియమిస్తుంది.

నీట్-పీజీ రెండు షిఫ్ట్‌లపై సుప్రీంలో కేసు

స్పందన తెలపాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: వచ్చే నెల 15వ తేదీన రెండు షిఫ్ట్‌లలో నీట్-పీజీ,2025 పరీక్షను నిర్వహిస్తామంటూ వెలువడిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో ఈ విషయంలో మీ స్పందన తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. రెండు షిఫ్ట్‌లకు బదులు ఒకేసారి పరీక్ష నిర్వహించాలని, పరీక్షార్థులందరికీ ఏకరూప, పారదర్శక, నిష్పాక్షిక పరీక్షా వాతావరణం కల్పించాలని, పరీక్షకేంద్రాల సంఖ్యను దేశవ్యాప్తంగా పెంచాలని పిటిషన్లు అయిన ఏడుగురు వైద్యుల తరఫున న్యాయవాదులు సంస్కృతి భట్నాగర్, అభీష్ట హీలా వాదించారు. '' రెండు షిఫ్ట్‌లలో పరీక్ష పెడితే ఒక షిఫ్ట్‌వాళ్లకు కఠినమైన ప్రశ్నలు రావొచ్చు. నీట్-పీజీ,2024లో ఇలాగే జరిగింది. మరో షిఫ్ట్ వాళ్లకు కాస్త సులభ ప్రశ్నలు రావొచ్చు. అలాంటప్పుడు మొత్తం అభ్యర్థుల మధ్య ప్రశ్నల కఠినత్వ స్థాయిల్లో తేడాలు రావొచ్చు. దానికి బదులు ఒకే షిఫ్ట్‌లో అందరికీ పరీక్ష పెట్టాలి'' అని లాయర్లు వాదించారు.

హిందువులను వెళ్లగొట్టాల్సిందే

కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారుల డిమాండ్

టోరంటో/న్యూఢిల్లీ: కెనడాలోని హిందువులపై ఖలిస్తానీ మద్దతుదారులు విద్వేషం వెళ్లగక్కారు. హిందువులందరినీ బయటకు వెళ్లగొట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. వారిని స్వదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఆదివారం టోరంటో నగరంలో హిందూ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ దిష్టిబొమ్మలను జైలులాంటి నమూనాలో ఉంచి ప్రదర్శించారు. వేలాది మంది ఖలిస్తానీ మద్దతుదారులు, సానుభూతిపరులను ఈ ర్యాలీలో పాల్గొన్నారు. హిందువులకు, భారత్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కెనడాలో దాదాపు 8 లక్షల మంది హిందువులు నివసిస్తున్నట్లు అంచనా. ఖలిస్తానీ మద్దతుదారుల ర్యాలీని కెనడాలోని హిందూ సమాజం తీవ్రంగా ఖండించింది. హిందువులపై ద్వేషం ఎందుకని ప్రశ్నించింది. మరోవైపు కెనడాలో ఖలిస్తానీ అనుకూల శక్తుల ఆగడాల పట్ల భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది.

ఎర్రకోటను నాకు అప్పగించండి

సుప్రీంకోర్టులో మహిళ పిటిషన్ • తిరస్కరించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఎర్రకోటకు తానే చట్టబద్ధమైన వారసురాలినని పేర్కొంటూ సుల్తానా బేగం అనే మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎర్రకోటను తనకు అప్పగించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆమె వినతిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. మొఘల్ పాలకుడైన బహదూర్‌షా జాఫర్-2 మునిమనవడి భార్యగా చెప్పుకుంటున్న ఆ మహిళ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. తన భర్త చనిపోయాడని, కోటకు తానే అసలైన వారసురాలిని కాబట్టి అప్పగించాల్సిందేనని సుల్తానా బేగం తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. 2021 డిసెంబర్ 20న ఆమె అభ్యర్థనను హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టివేశారు. మరోసారి అప్పీల్ దాఖలు చేయగా 2024 డిసెంబర్ 13న హైకోర్టు డివిజన్ బెంచ్ సైతం కొట్టివేసింది. దాంతో సుల్తానా బేగం సుప్రీంకోర్టుకెక్కారు. ఆమె పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. ఆమె వాదనలో వాస్తవం లేదని, పిటిషన్ విచారణార్హం కాదని ధర్మాసనం స్పష్టంచేసింది. దాంతో పిటిషన్‌ను ఉపసహరించుకుంటామని సుల్తానా బేగం తరఫు న్యాయవాది చెప్పగా, ధర్మాసనం అనుమతి ఇవ్వలేదు. తామే తిరస్కరిస్తున్నామని వెల్లడించింది.

రాహుల్ 'పౌరసత్వం' పిటిషన్ కొట్టివేత

లక్నో: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతీయ పౌరసత్వాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని అలహాబాద్ హైకోర్టు సోమవారం కొట్టేసింది. అయితే ఈ అంశంలో చట్టపరమైన ఉపశమనం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను శోధించాలని ఈ పిల్ వేసిన పిటిషనర్‌కు జస్టిస్ ఏఆర్ మసూదీ, జస్టిస్ రాజీవ్ సింగ్‌ల ధర్మాసనం సూచించింది. రాహుల్ గాంధీకి బ్రిటన్ పౌరసత్వం ఉందని నిరూపించే డాక్యుమెంట్లు, బ్రిటిష్ ప్రభుత్వం ఈ-మెయిల్ సమాచారం తన వద్ద ఉందని పిటిషనర్, కర్ణాటకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్.విఘ్నేష్ శిశిర్ తరఫు న్యాయవాది చేసిన వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరసత్వం వాదనలతో వాస్తవాలు తెల్సుకునేందుకు యూకే సర్కార్‌కు మోదీ ప్రభుత్వం లేఖ రాసిందని హైకోర్టుకు గతంలో డెప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదనల సందర్భంగా తెలిపారు. దీంతో ఈ విషయంలో పురోగతిపై వివరాలను మే 5వ తేదీకల్లా తమకు తెలపాలని కోర్టు సూచించింది. దీంతో కేంద్రప్రభుత్వ స్పందనకు ఎలాంటి కాలపరిమితి లేని కారణంగా ఈ పిల్‌ను ఇంకా పెండింగ్‌లో ఉంచడంలో హేతుబద్ధత లేదంటూ పిల్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.

పడవలు మునిగి..10 మంది జల సమాధి

బీజింగ్: చైనాలోని గుయిఝౌ ప్రావిన్స్‌లో అకస్మాత్తుగా సంభవించిన తుపానుతో నాలుగు పడవలు తిరగబడిన ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి సౌందర్యానికి నెలవైన వూ నదిలో ఆదివారం పర్యాటకులు పడవల్లో విహరిస్తున్న సమయంలో ఆకస్మికంగా వర్షం, ఈదురు గాలులు మొదలయ్యాయి. గాలుల తీవ్రతకు నాలుగు పడవలు బోల్తాపడ్డాయి. సుమారు 80 మంది ప్రయాణికులు నీళ్లలో పడిపోయారు. వీరిలో పది మంది చనిపోగా, 70 మంది సురక్షితంగా బయటపడ్డారు. అందరినీ ఆస్పత్రులకు తరలించారు.

జడ్జి ఇంట్లో 'కాలిన కరెన్సీ'పై సీజేఐకు నివేదిక

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ హైకోర్టులో పనిచేసిన కాలంలో ఆయన ఇంట్లో కరెన్సీ కట్టలు కాలిన స్థితిలో వెలుగుచూసిన ఘటనపై సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య సంఘం ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు నివేదికను సమర్పించింది. నివేదికలోని అంశాలు జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా ఉంటే ఆయనపై సుప్రీంకోర్టు ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే ఉత్కంఠ నెలకొంది.

సింగపూర్ ప్రతిపక్ష నేతగా ప్రీతమ్ సింగ్

సింగపూర్: సింగపూర్‌లో ప్రతిపక్ష నేతగా భారత సంతతికి చెందిన ప్రీతమ్ సింగ్(48) కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నూతన పార్లమెంట్‌లో వర్కర్స్ పార్టీ సెక్రటరీ జనరల్ ప్రీతమ్ సింగ్ ప్రతిపక్ష నేతగా ఉంటారని ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్(52) సోమవారం ప్రకటించారు. ఈ నెల 3న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వాంగ్‌కు చెందిన పీపుల్స్ యాక్షన్ పార్టీ(పీఏపీ) ఘన విజయం సాధించింది. పార్లమెంట్‌లోని మొత్తం 97కు గాను 87 సీట్లను కైవసం చేసుకుంది. ప్రీతమ్ సింగ్ సారథ్యంలోని వర్కర్స్ పార్టీ 10 సీట్లు నిలబెట్టుకుంది. గత పార్లమెంట్‌లోనూ ప్రీతమ్ సింగే ప్రతిపక్ష నేతగా ఉన్నారు.

ఎయిమ్స్‌లలో ప్రత్యేక ఆయుష్ విభాగాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లలో ప్రత్యేక ఆయుష్ విభాగాలను ఏర్పాటు చేయాలన్న నీతి ఆయోగ్ ప్రతిపాదనపై కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ఆయుర్వేదం, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి విధానాలను అలోపతితో సమన్వయం చేసి సమగ్ర ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడమే లక్ష్యంగా కొత్తగా ఏర్పాటయ్యే ఈ విభాగాల ద్వారా ఎయిమ్స్‌లలో సంప్రదాయ వైద్య విధానాలు అందుబాటులోకి రానున్నాయి.

అందుబాటులో విద్యార్థి వీసా అపాయింట్‌మెంట్లు

ప్రకటించిన భారత్‌లోని అమెరికా ఎంబసీ

న్యూఢిల్లీ: అమెరికా విద్యార్థి వీసా పొందాలనుకునే వారికి భారతదేశవ్యాప్తంగా వేల సంఖ్యలో వీసా అపాయింట్‌మెంట్లు అందుబాటులో ఉన్నాయని భారత్‌లోని అమెరికా ఎంబసీ సోమవారం తెలిపింది. ఈ మేరకు భారత్‌లోని ఇండియా దౌత్యకార్యాలయం తన సామాజికమాధ్యమం 'ఎక్స్'లోని ఖాతాలో ఒక పోస్ట్‌చేసింది. ప్రతి ఏడాది అత్యధిక మంది భారతీయులకు విద్యార్థి వీసాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని గత ఏడాది ఏప్రిల్‌లో నాటి భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటీ వ్యాఖ్యానించడం తెల్సిందే.

లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం ఏమిటి?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయమూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది.

ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధితోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు-2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు-2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. ఇందులోని ముఖ్యాంశాలు.. ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.

సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.

న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడంగానీ చేయలేదు. ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు-2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశ వ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు:

క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో), ఆస్తి కొనుగోలు, భూమిని సాగు చేసుకోవడం, బోరు బావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం:

గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది. వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.

1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు.

సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం:

సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది. దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు:

మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి.

ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు.

ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు.

ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు.

సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు.


మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు
   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం
   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు
   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన
   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష
   బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు
   బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష
   డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
    ఎ) ఎం. హిదయతుల్లా
    బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
    సి) పి.ఎన్. భగవతి డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
    ఎ) సుప్రీంకోర్టు బి) హైకోర్టు
    సి) జిల్లా కోర్టు డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
    ఎ) క్యూరేటివ్ పిటిషన్
    బి) రివిజన్ పిటిషన్
    సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
    డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి;
5) డి; 6) డి; 7) సి; 8) బి;
9) సి; 10) సి; 11) డి; 12) సి.

చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి ఎవరి బిరుదు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యా య పదాలు, ప్రకృతి-వికృతులు, జాతీయాలు- సామెతలు, ప్రత్యక్ష కథనం- పరోక్ష కథనం, నామ్నీ కరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. గంగాపురం హనుమచ్ఛర్మ (1925-96):
   గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: ఋగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. డా. బిరుదురాజు రామరాజు (1925-2010):
   జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమ కారు లు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు .
3. నన్నయ (11వ శతాబ్దం):
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910-83):
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూల విరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ ప్రక్రియ: గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).
6. నార్ల వెంకటేశ్వరరావు (1908):
   పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త.
   పాఠ్యభాగం: అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. గౌరన (15వ శతాబ్దం):
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరి శ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. వట్టికోట ఆళ్వారుస్వామి (1915-61):
   గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, ఋతుచక్రం.
10. డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930-89):
    రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగుచుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):
    పాఠ్యభాగం: సముద్ర లంఘనం
    ప్రక్రియ: ప్రబంధం
    రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. నండూరి రామమోహన్‌రావు (1927-2011): పత్రికా సంపాదకులు.
    పాఠ్యభాగం: సంస్కరణ
    ప్రక్రియ: వార్తావ్యాఖ్య
    రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. ఎస్.టి. జ్ఞానానందకవి (1922-2011):
    బిరుదు: పద్మశ్రీ
    పాఠ్యభాగం: సందేశం
    ఇతివృత్తం: జాతీయ సమైక్యత
    రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు - రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) - సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) - శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) - వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) - భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) - దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) - సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) - సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం) - సభారంజన శతకం (అనువాద కర్త)

విద్య,ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో టెక్నీషియన్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్).. టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» అర్హత: బీఎస్సీ డిగ్రీ(ఫిజిక్స్, కెమిస్ట్రీలతో) ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 40 ఏళ్లు మించకూడదు.
» వేతనం: టెక్నీషియన్ పోస్టుకు రూ.26,649.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.05.2025.
» రాతపరీక్ష తేది: 24.05.2025.
» వెబ్‌సైట్: http://rites.com/

ఏపీసీఆర్‌డీఏ, విజయవాడలో మేనేజర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీసీఆర్‌డీఏ) ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్(లీగల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» పనిచేయాల్సిన ప్రదేశం: ఏపీసీఆర్‌డీఏ విజయవాడ, అమరావతి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.05.2025.
» వెబ్‌సైట్: https://crda.ap.gov.in/

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర 2) కృష్ణా
   3) మంజీర 4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎస్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం 2) ఇతిహాసం
   3) ప్రబంధం 4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం?
    1) మిత్రసాహస్రి
    2) సభారంజన శతకం
    3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
    1) పురాణాలు 2) ఇతిహాసాలు
    3) శతకాలు 4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
    1) అభ్యుదయ కవితా సంపుటి
    2) వచన కవితా సంపుటి
    3) విప్లవ కవితా సంపుటి
    4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టిన వారు?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) శ్రీశ్రీ
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
    1) పత్రికా సంపాదకుడు
    2) కవి, విమర్శకుడు
    3) నాటక కర్త
    4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) సామల సదాశివ
    3) నార్ల వేంకటేశ్వర రావు
    4) నండూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
    1) గౌరన
    2) అయ్యలరాజు రామభద్రుడు
    3) కొరవి గోపరాజు
    4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 1; 4) 2;
5) 3; 6) 1; 7) 2; 8) 3;
9) 4; 10) 1; 11) 3; 12) 4;
13) 2; 14) 4; 15) 3; 16) 1.

నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

గ్రామీణ వ్యవసాయ పరపతి

గ్రామీణాభివృద్ధి, భారత ఆర్థికాభివృద్ధికి చుక్కాని వంటిది. గ్రామాలు సుసంపన్నంగా ఉన్నప్పుడే భారత్ అన్ని రంగాల్లో వెలుగొందుతుంది. కానీ నేటి గ్రామీణ భారతం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అందుకు ప్రధాన కారణం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండడం. డబ్బుతో ముడిపడి ఉన్న ఆధునిక వ్యవసాయానికి సరిపడ పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. వ్యవసాయం ద్వారా సంపాదించిన ఆదాయం అధిక వడ్డీతో తీసుకున్న రుణాల చెల్లింపునకే సరిపోనప్పుడు రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది.

'రాయల్ కమిషన్' చెప్పినట్లుగా మనదేశంలో రైతు అప్పులతో పుడుతున్నాడు. అప్పులతో నివసిస్తూ చివరకు అప్పులతో మరణిస్తున్నాడు.

గ్రామీణ రుణగ్రస్థత

భారత గ్రామీణాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య వ్యవసాయ రుణగ్రస్థత. ఇది దేశ వ్యవసాయాభివృద్ధిని కుంటుపరుస్తుంది. గ్రామీణుల్లో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం ఎక్కువగా అప్పులు చేస్తుంటారు. వీటిలో కొంతభాగం కుటుంబ అవసరాలకు, మిగిలిన దాన్ని వ్యవసాయ పెట్టుబడికి వినియోగిస్తున్నారు. అనేక కారణాల వల్ల గ్రామీణులు ఆ అప్పులను పూర్తిగా తీర్చలేక రుణగ్రస్థులవుతున్నారు. ఈ పరిస్థితిని 'గ్రామీణ రుణగ్రస్థత' (Rural Indebtedness) అంటారు.

కారణాలు

పేదరికం, వారసత్వంగా వచ్చిన అప్పులు, పెరిగిన వ్యవసాయ ఖర్చులు, వ్యవసాయ రంగం వెనుకబాటుతనం, అల్ప ఉత్పాదకత, భూమి కౌలు రుసుం అధికంగా ఉండడం, సాంఘిక, మతపరమైన కట్టుబాట్లు, ఆచారాల కోసం చేసే వ్యయం, వడ్డీ వ్యాపారుల మీద అధికంగా ఆధారపడటం, ప్రభుత్వ పరపతి సదుపాయాలు తగినంతగా లేకపోవడం, అనారోగ్యం, దురలవాట్లు మొదలైనవి.

పరిణామాలు

అధిక రుణభారం వల్ల వ్యవసాయదారుడి పెట్టుబడి శక్తి క్షీణిస్తుంది. తద్వారా దిగుబడి తగ్గి, ఉత్పత్తి తక్కువై ఆహార కొరత ఏర్పడుతుంది. ఆహార సరఫరా తక్కువ అవడం వల్ల డిమాండ్ అధికమై ప్రజల ఆహార ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ప్రజల మిగులు ఆదాయం తగ్గడం వల్ల పారిశ్రామిక, సేవారంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. అపుడు ఆర్థిక వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అది ప్రజల విద్యా, వైద్య, ఆరోగ్య స్థితిగతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాల కోసం, రైతుల రుణాలు మాఫీ చేయాలని ఉద్యమాలు పుడతాయి. వీటికి ప్రభుత్వ స్పందన సానుకూలంగా లేకపోతే అవి హింసాత్మకంగా మారి సమాజ భద్రతకు సవాలుగా మారుతాయి.

నివారణ చర్యలు

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాలను గ్రామీణ రైతులకు అధికంగా అందించాలి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ప్రభుత్వం నియంత్రించి అధిక వడ్డీ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలి. కరువు పరిస్థితుల్లో రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు అందజేయాలి.

గ్రామీణ పరపతిపై ప్రభుత్వ చర్యలు



- గ్రామీణ రుణగ్రస్థతను నిర్మూలించడానికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) 'గోర్వాలా' అధ్యక్షతన 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం'(1954)ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రధానంగా సహకార పరపతి సంఘాలను ఎక్కువ సంఖ్యలో స్థాపించాలని, సహకార మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని సూచించింది.
- గోర్వాలా నివేదిక ప్రకారం ప్రభుత్వం 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్'ను జాతీయం చేసి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)'గా మార్చింది.
- ఈ కమిటీ సూచనల మేరకు 1956లో ఆర్‌బీఐ గ్రామీణ రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి - దీర్ఘకాలిక కార్యకలాపాల నిధి'ని ఏర్పాటుచేసింది. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకోవడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి స్థిరీకరణ నిధి'ని ప్రారంభించింది.
- ప్రభుత్వం వ్యవసాయ పరపతిని అధికం చేసే క్రమంలో 1969లో 14 వాణిజ్య బ్యాం కులు, 1980లో 6 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది.
- 1963లో 'వ్యవసాయ పునర్విత్త సంస్థ'ను స్థాపించారు.
- ప్రొఫెసర్ ఎమ్. నరసింహం కమిటీ సిఫారసు ఆధారంగా ప్రభుత్వం 1975 అక్టోబర్ 2న 'ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్' (RRB)లను స్థాపించింది.
- వ్యవసాయ గ్రామీణాభివృద్ధికి సంస్థా గతమైన ఏర్పాట్ల సమీక్షించడం కోసం క్రాఫికార్డ్ (CRAFICARD) కమిటీ (1979)ను ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1982 జూలై 12న 'జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్'(NABARD)ను ఏర్పా టు చేసింది. ఇది ఆర్‌ఆర్‌బీల విధానాలను పర్యవేక్షించే అత్యున్నత బ్యాంక్ (Apex Bank). దీన్ని ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా స్థాపించాయి. ఆర్‌ఆర్‌బీల కు, ఆర్‌బీఐకి మధ్య నాబార్డ్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంక్ (SCB)లకు, ఆర్‌ఆర్‌బీలకు ఇది ప్రత్యక్షంగా రుణ సహాయం అందిస్తుంది. రైతులకు నేరుగా రుణాలను అందించదు.
- గ్రామీణ పరపతిపై సూచనలిచ్చే ఉద్దేశం తో ఆర్.వి.గుప్తా నేతృత్వంలో 1997లో ఆర్‌బీఐ ఒక పరిశీలన సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ గ్రామ పరపతిని ప్రోత్సహించే మార్గదర్శక సూత్రాలను సూచించింది. రైతు క్లబ్‌లను స్థాపించి, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేలా వాణిజ్య బ్యాంకులు కృషిచేయాలని సిఫారసు చేసింది.
- రైతులకు అవసరమైన పరపతిని సకాలం లో అందించడానికి మనదేశంలో 1904 లోనే 'సహకార సంస్థలు' ఆవిర్భవించాయి. వీటిని మొదట 1961లో, ఆ తర్వాత 1976లోనూ పునర్వ్యవస్థీకరించారు. ఆ తర్వాత అమల్లోకి వచ్చిన 'ఏకగవాక్ష విధానం' (Single window system) సహకార పరపతి విధానంలో నూతన చైతన్యం కలిగించింది. ఇది రైతులకు పరపతి సౌకర్యాలను సులభతరం చేసింది.

వ్యవసాయ పరపతి- వర్గీకరణ

వ్యవసాయ ఉత్పాదకాల కొనుగోలుకు, వ్యవసాయ పనులు చేపట్టడానికి అవసరమైన పరపతిని వ్యవసాయ పరపతి అంటారు. రైతులు తమ పరపతి అవసరాలను వివిధ మార్గాల ద్వారా తీర్చుకుంటున్నారు. అవి రెండు రకాలు.

1. **సంస్థాగతమైన పరపతి మార్గాలు:** ప్రభుత్వం, సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి సౌకర్యాలు.
2. **సంస్థాగతం కాని పరపతి మార్గాలు:** ప్రభుత్వ నియంత్రణ లేని సంస్థలు, ఎలాంటి చట్ట పరమైన విధి విధానాలు లేని వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, స్నేహితులు, బంధువులు, భూస్వాముల నుంచి తీసుకునే అప్పులు. నేడు రైతులకు ఈ మార్గాల నుంచే అధికంగా పరపతి లభిస్తుంది. దీనికి వడ్డీ అధికంగా ఉండటం వల్ల రైతులు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం సంస్థాగతం కాని పరపతి సంస్థలను నియం త్రించడానికి ప్రయత్నిస్తోంది. 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం' కాలవ్యవధి ఆధారంగా సంస్థాగతమైన పరపతి మార్గాలను 3 రకాలుగా వర్గీకరించింది.

1. **స్వల్పకాలిక పరపతి:**
12 నుంచి 15 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన వ్యవసాయ రుణాలను 'స్వల్పకాలిక పరపతి' అంటారు. సాధారణంగా పంట చేతికి రాగానే రైతులు ఈ రుణాలను తీర్చేస్తారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల మేత కొనుగోలు, కూలీల వేతనాలు, పంట ను మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా వ్యయానికి ఈ స్వల్పకాలిక రుణా లను రైతులు ఉపయోగించుకుంటారు.

2. **మధ్యకాలిక పరపతి:**
15 నెలల నుంచి 5 ఏళ్ల వ్యవధిలో ఈ రుణాలను తిరిగి చెల్లించాలి. పశువులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు, బావుల తవ్వకం, భూమిని మెరుగుపర్చడం కోసం ఈ రుణాలను తీసుకుంటారు.

3. **దీర్ఘకాలిక పరపతి:**
5 నుంచి 20 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించే రుణాలు.ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల కొనుగోలు, శాశ్వతంగా భూమిని అభివృద్ధి చేయడం, అదనంగా భూమి కొనుగోలు చేయడా నికి... అధిక మొత్తంలో డబ్బు అవసరం అవుతుంది. దీన్ని తక్కువ కాలంలో తీర్చడం వీలుకాదు. ఎక్కువ వాయిదాల్లో రైతులు ఆ రుణాలను తీర్చడానికి అనువుగా ఈ పరపతి సౌకర్యం సహాయపడుతుంది.

- టి.డబ్ల్యూ. షుల్జ్ అభిప్రాయం ప్రకారం 'ఇండియాలో పరపతి కొరత మూలంగా వ్యవసాయాభివృద్ధి కుంటుపడడమే కాకుండా, వ్యవసాయాన్ని ఆధునికీకరించే ప్రక్రియలో వేగం తగ్గింది'. దీన్ని బట్టి వ్యవసాయంలో ప్రగతిని స్థిరీకరించడానికీ పరపతి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు.

తక్కావి రుణాలు

సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు, వాణిజ్య బ్యాంక్‌లు, రైతులకు పరపతి సౌకర్యాలను అందించక ముందు ప్రభుత్వమే నేరుగా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేది. ముఖ్యంగా కరువు కాట కాలు, వరదలు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఇచ్చే రుణాలను 'తక్కావి' రుణాలంటారు. రైతులు ఈ రుణాలను తక్కువ వడ్డీతో, ఎక్కువ వాయిదాల్లో తీర్చేటట్లుగా వెసులుబాటు ఉండేది. అయితే కఠినమైన నియమాలు ఉండటం, మంజూరు చేయడంతో జాప్యం వల్ల ఇవి ఆదరణ కోల్పోయాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరాగాంధీ ఏ బ్యాంక్‌లను జాతీయం చేశారు?
ఎ) గ్రామీణ బ్యాంక్‌లు
బి) వాణిజ్య బ్యాంక్‌లు
సి) భారతీయ స్టేట్ బ్యాంక్‌లు
డి) పైవన్నీ
2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1975 బి) 1978 సి) 1980 డి) 1982
3. గ్రామీణ రుణగ్రస్థతకు ప్రధాన కారణం
ఎ) రైతులు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణాలకు అధికంగా వడ్డీ చెల్లించడం
బి) వ్యవసాయ కమతాలు చిన్నవిగా ఉండీ దిగుబడి తక్కువై రైతుల ఆదాయం తగ్గటం
సి) పెళ్లిళ్లు, పుట్టుక, పండుగలు, చావులు కార్యక్రమాల కోసం గ్రామీణులు అధికంగా ఖర్చుచేసి అప్పుల పాలవడం
డి) పైవన్నీ
4. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్ ?
ఎ) RBI బి) SBI
సి) NABARD డి) DCB
5. 'తక్కావి రుణాలు' అంటే ఏమిటి?
ఎ) ప్రభుత్వం నామమాత్రపు వడ్డీతో రైతులకిచ్చే అతిస్వల్పకాలిక రుణాలు
బి) వ్యవసాయ పనిముట్ల కొనుగోలు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకిచ్చే రుణాలు
సి) ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో తీర్చేలా ప్రభుత్వం రైతులకిచ్చే రుణాలు
డి) సహకార సంస్థలు, గ్రామీణ బ్యాంక్‌లు అతి తక్కువ వడ్డీతో రైతులకిచ్చే స్వల్ప కాలిక దీర్ఘకాలిక రుణాలు
6. రామయ్య పశువులను కొనుగోలు చేయటానికి రుణం కోసం బ్యాంక్‌కు దరఖాస్తు చేశాడు. అపుడు బ్యాంక్ ఏ రకమైన రుణాన్ని అతడికి మంజూరు చేస్తుంది?
ఎ) స్వల్పకాలిక రుణం
బి) అతి స్వల్పకాలిక రుణం
సి) మధ్యకాలిక రుణం డి) దీర్ఘకాలిక రుణం
7. కిందివాటిలో రైతులకు ప్రత్యక్షంగా రుణాలివ్వని సంస్థ?
ఎ) ప్రాథమిక భూ అభివృద్ధి బ్యాంకులు
బి) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
సి) ఎస్‌బీఐ డి) నాబార్డ్
8. నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?
ఎ) క్రాఫికార్డ్ కమిటీ బి) సరయూ కమిటీ
సి) నరసింహం కమిటీ డి) గోర్వాలా కమిటీ

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి;
5) సి; 6) సి; 7) డి; 8) ఎ.

The technique of focus on advertising..

Bank Exams

Marketing Awareness



1. The fact that services are sold, produced and consumed at the same time refers to which of the following service characteristics?
a) Intangibility b) Inseparability
c) Variability d) Perishability
e) None of the above
2. Electronic shopping, TV shopping is related with:
a) Advertising
b) Personal Selling
c) Direct Marketing
d) In direct Marketing
e) Personal buying
3. The purpose of which of the following type of advertising is to create repeat purchases?
a) Reminder b) Reinforcement
c) Persuasive d) Informative
e) None of the above
4. ______ is the process of evaluating each market segment's attractiveness and selecting one or more segments to enter.
a) Mass marketing
b) Market segmentation
c) Market targeting
d) Market positioning
e) None of the above
5. The technique of focus on advertising of non-competitive brand with the other brand is called:
a) Cross-promotions
b) Tie-in promotions
c) Premiums d) All the above
e) None of the above
6. Labelling, packaging are associated with:
a) Price mix b) Product mix
c) Place mix d) Promotion mix
e) Cost mix
7. Entry of laggards is in which stage of PLC (Product Life Cycle)?
a) First b) Second
c) Third d) Fourth
e) Fifth
8. ______ factors are the most popular bases for segmenting customer groups.
a) Geographic b) Demographic
c) Psychographic d) Behavioural
e) None of the above
9. A method in which various products are combined at the same price is:
a) Promotional pricing
b) Product-bundle pricing
c) Captive product pricing
d) Optional product pricing
e) All the above
10. Differentiation in pricing for various geographical customers:
a) Price skimming
b) Psychological pricing
c) Pricing variations
d) Geographical pricing
e) None of the above
11. According to the American Marketing Association, which of the following is marketing of products that are presumed to be environmentally safe?
a) Gray Marketing
b) Green Marketing
c) Global Marketing
d) Social Marketing
e) Internet Marketing
12. One of the following is not included in the 7 Ps of Marketing. Find the same ______.
a) Placement b) Price
c) Production d) Promotion
e) Product
13. Innovation in marketing is same as ______
a) Motivation b) Perspiration
c) Aspiration d) Creativity
e) Team work
14. A call marketing terms means?
a) A newly introduced product
b) Territory allocation for salesperson
c) A Call Centers
d) A Sales meeting
e) To visit a prospect
15. Bank ATMs are______
a) Delivery outlets
b) Market plans
c) Personalized Products
d) Tools for overcoming buyers resistance
e) Motivating tools
16. The USP of current account is ____
a) High minimum balance
b) No restrictions on transactions
c) No internet payable
d) Restricted deposits
e) Easy credits
17. The target group for SME Loan is ______
a) All salaried persons
b) Govt. undertakings
c) All entrepreneurs
d) All students
e)All housewives
18. ______ is a principle of enlightened marketing that requires a company seek real product and marketing improvements.
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above
19. NAV is the price of______
a) Entire fund value
b) One unit of a fund
c) Surrender value
d) Average value of shares
e) Dividends paid in a year
20. A Master policy in the case of Life insurance indicates ______
a) Policy is sale
b) Policy is in the name of servant
c) Only one life is assured
d) There are several beneficiaries
e) Life assured should be a male
21. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
a) Exporting
b) Joint venturing
c) Licensing
d) Direct investment
e) None of the above
22. Financial inclusion needs canvassing the accounts of ______
a) Financial Institutions
b) NRIs
c) HNIs
d) Housewives
e) Persons below a specified income level
23. Facilities for sale and purchase of agricultural products are available in ______
a) Commodity exchange
b) Regulated market
c) Stock exchange
d) Unregulated market
e) None of the above
24. The company that overlooks new and better ways to do things will eventually lose customers to another company that has found a better way of serving customer needs is a major tenet of:
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above
25. All of the following would be ways to segment within the category of psychographic segmentation EXCEPT:
a) Social class
b) Occupation
c) Lifestyle
d) Personality
e) Creativity
26. In terms of execution styles, a family seated at the dinner table enjoying the advertised product would be an example of which of the following types of advertising?
a) Slice of life
b) Lifestyle
c) Mood or imagery
d) Personality symbol
e) Personality
27. A child in the United States is normally exposed to all of the following values EXCEPT:
a) Achievement and success
b) Activity and involvement
c) Material comfort
d) Collectivism
e) None of the above
28. ______ has contractual authority to sell a manufacturer's entire output.
a) Selling agents
b) Rack jobbers
c) Manufacturer's agents
d) Purchasing agents
e) None of these
29. Sellers that handle their own exports are engaged in:
a) Direct exporting
b) Indirect exporting
c) Licensing
d) Contract manufacturing
e) None of the above
30. More and more salespeople are being evaluated and compensated based on different measures than in the past. All of the following are illustrations of those measures EXCEPT:
a) Long-term customer satisfaction
b) Competitive predatory pricing performance
c) Full customer service
d) Retention rates
e) None of the above
31. ______ includes practices such as overstating the product's features or performance, luring the customer to the store for a bargain that is out of stock, or running rigged contests.
a) Deceptive promotion
b) Deceptive packaging
c) Deceptive pricing
d) Deceptive cost structure
e) None of the above
32. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is the:
a) Canned approach
b) Formula approach
c) Need-satisfaction approach
d) Critical-thinking approach
e) None of the above
33. In terms of special product life cycles, a ______ is a basic and distinctive mode of expression.
a) genre b) style
c) fashion d) fad
e) None

KEY

1) b	2) c	3) a	4) c	5) a
6) b	7) d	8) b	9) b	10) d
11) b	12) c	13) d	14) e	15) c
16) b	17) c	18) a	19) b	20) d
21) d	22) e	23) d	24) a	25) b
26) a	27) d	28) a	29) a	30) a
31) b	32) a	33) b		